
బుధవారం 11-1-2023


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 291

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



G SQUARE EPITOME
YOUR PLOT. YOUR HOME. YOUR WAY.

## ఈ సంక్రాంతి G SQUARE EPITOME INTEGRATED CITY లో జరుపుకోండి, అద్భుతమైన బహుమతులు గెలుచుకోండి!

G SQUARE EPITOME
YOUR PLOT. YOUR HOME. YOUR WAY.

## సంక్రాంతి సంబరాలు

11 - 22 జనవరి, 2023

సైటుకు విచ్చేసిన వారికి ప్రతి రోజు 100 ఎషూర్డ్ గోల్డ్ కాయిన్స్#

5 కార్లు 20 బైకులు గెలుచుకునే అవకాశం*

నేడే బుక్ చేసుకోండి. హాంగ్ కాంగ్, మలేషియా, సింగపూర్ లేదా దుబాయ్ ఫారెన్ ట్రిప్* లేదా 40 గ్రా|| గోల్డ్ కాయిన్* పొందండి.

విచ్చేసిన వారికోసం ప్రతి రోజు 1000 చీరలు, టి-షర్టులు*

TS RERA NO : P02000003057

*T&C APPLY

#ONE GOLD COIN FOR THE FIRST 10 VISITORS - EVERY HOUR OF THE DAY.



బ్రేక్ ఫాస్ట్ & లంచ్ కు ఫుడ్ స్టాల్స్ అందుబాటులో

కుటుంబ సమేతంగా సైటుకు విచ్చేసి పండుగ జరుపుకోండి.
కైట్ ఫెస్టివల్ | మెహంది | బొమ్మల కొలువు | గంగిరెద్దుల కోలాహలం | పాటరి | బ్యాంగిల్ స్టాల్స్ | టాటూ స్టాల్స్ | పిల్లల ఆటలు... ఇంకా మరెన్నో!

ఫేస్ 1 ప్రారంభం
G SQUARE EPITOME INTEGRATED CITY

దక్షిణ భారతదేశంలో 1242 ఎకరాలలో విస్తరించి ఉన్న మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ సిటీ. విజయవాడ హైవేలో ప్రీమియం విల్లా ప్లాట్లు

₹48L* నుండి (267 SQ.YD.)

ACTUAL SITE IMAGE


సైటుకు విచ్చేసి 100 ఎకరాల అభివృద్ధి చేసిన స్థలాన్ని చూడండి.
రామోజీ ఫిల్మ్ సిటీ నుండి కేవలం 10 ని||

### ఎన్నో లాభాలు, మరెన్నో ప్రయోజనాలు

- అతి పెద్ద ఇంటిగ్రేటెడ్ సిటీలో 368 ఎకరాలలో ప్రీమియం ప్లాట్లు
- 140+ ప్రపంచ స్థాయి సౌకర్యాలు
- 100 ఎకరాల గోల్ఫ్ కోర్స్, 279 ఎకరాల నాచురల్ లేక్, 30 ఎకరాల ఐటీ పార్క్, 40 ఎకరాల లగ్జరీ రిసార్ట్ ఉన్న ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ
- వెల్‌నెస్ సెంటర్, స్పోర్ట్స్ అకాడమీ, మాల్, స్కూల్, కాలేజీ వంటి ప్రత్యేక ఫీచర్లు
- పూర్తిగా అభివృద్ధి చెందిన మౌలిక సదుపాయాలు - బ్లాక్ టాప్ రోడ్లు, స్ట్రీట్ లైట్స్, అండర్‌గ్రౌండ్ EB, వాటర్ & డ్రైనేజ్
- HMDA & RERA ఆమోదం పొందిన ఏకైక అతి పెద్ద ప్లాట్ కమ్యూనిటీ
- ఖచ్చితమైన, వేగవంతమైన విలువ పెరుగుదల

89392 68000
www.gsquarehousing.com

G SQUARE EPITOME
YOUR PLOT. YOUR HOME. YOUR WAY.

**G SQUARE EPITOME**
YOUR PLOT. YOUR HOME. YOUR WAY.

# ఛానెల్ పార్ట్‌నర్స్‌కు ఆహ్వానం!

## దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ప్లాట్ ప్రమోటర్ G SQUARE EPITOMEతో

## సునాయాసంగా ప్లాట్లను విక్రయించండి.



**పూర్తిగా అభివృద్ధి చెందిన మౌలిక సదుపాయాలు**


- బ్లాక్ టాప్ రోడ్లు
- స్ట్రీట్ లైట్స్
- అండర్‌గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ, వాటర్ సప్లై & డ్రైనేజ్
- పేవ్‌మెంట్స్ & ల్యాండ్‌స్కేపింగ్
- పూర్తి ఆమోదం
- 100% లీగల్ డాక్యుమెంటేషన్
- రిజిస్ట్రేషన్‌కి సహాయం
- 7 రోజుల్లో కమిషన్ క్లియరెన్స్

ఆసక్తి గల ఛానెల్ పార్ట్‌నర్స్ కాల్ చేయగలరు:

**63797 88953 / 91500 99308**

**ప్రత్యేక ఆఫర్*:**

G SQUARE EPITOME INTEGRATED CITYలో ప్లాట్లను విక్రయించండి, ఫారెన్ ట్రిప్ (ఇద్దరికి) అవకాశం పొందండి:




హాంగ్ కాంగ్ | మలేషియా | సింగపూర్ | దుబాయ్ లేదా గోల్డ్ కాయిన్

G SQUARE EPITOME
INTEGRATED
CITY

## భవిష్యత్తులో విస్తరణకై మేము పెద్ద విస్తీర్ణం కలిగిన భూముల కోసం చూస్తున్నాము.

హైదరాబాదులో ORR లోపల లేదా ORRకు 5 కి.మీ రేడియస్ వరకు ఆమోదం పొందిన / ఆమోద ప్రక్రియలో ఉన్న / కన్వర్టెడ్ / ఒకే యజమాని ఉన్న భూములకై చూస్తున్నాము.

- పూర్తి కొనుగోలు లేదా ఉమ్మడి వెంచర్
- 5 నుండి 500 ఎకరాలు
- నివాస లేదా వాణిజ్య ప్లాట్లు

ఆసక్తి గల యజమానులు / మధ్యవర్తులు కాల్ చేయగలరు:

**91762 56001 / 89250 59991**

www.gsquarehousing.com


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కళ్లల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 | వెల: ₹ 5.50 | సంపుటి: 15 | సంచిక: 291

బుధవారం 11-1-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




### భారత్ 'టాప్' గేర్

కోహ్లి సెంచరీ. తొలి వన్డేలో శ్రీలంకపై టీమిండియా విజయం. -14లో



### ఆస్కార్ షార్ట్ లిస్టులో..

ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఇండియా నుంచి 10 సినిమాలు. -14లో



### మెట్రో పిల్లర్ కూలి..

బెంగళూరులో నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్ కూలిన దుర్ఘటనలో తల్లి, ఆమె రెండున్నరేళ్ల కొడుకు ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



### పాకిస్తాన్‌లో ఆహార సంక్షోభం

రాయితీపై ప్రభుత్వమిచ్చే గోధుమ పిండి కోసం పాక్ ప్రజానీకం ఎగబడుతున్నారు. పలుచోట్ల తొక్కిసలాటలు జరిగాయి.

వివరాలు 6లో ▸



### కాలిఫోర్నియాలో వరద బీభత్సం

అమెరికాలోని కాలిఫోర్నియాలో 90% మంది వరద ముప్పును ఎదుర్కొంటున్నారు. 25వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

వివరాలు 6లో ▸




### ఊరికి కాంతి.. సంక్రాంతి

'పండుగకు ఊరికి రా' అని పిలిచే ఏకైక పండుగ సంక్రాంతి. కారణం.. అది ఆకుపచ్చ పండుగ. పల్లీయుల పండగ.

వివరాలు 12లో ▸

# ఏపీకి వెళ్లాల్సిందే

## సీఎస్ సోమేశ్‌కుమార్‌కు తేల్చిచెప్పిన హైకోర్టు



- ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల కేటాయింపుల్లో కేంద్రానిదే తుది నిర్ణయం
- ఫలానా రాష్ట్రంలోనే పని చేస్తానని చెప్పడం సుప్రీం గత తీర్పులకు విరుద్ధం
- విభజన సమయంలో ఏపీకి కేటాయించినందున అక్కడికే వెళ్లాలి
- క్యాట్ ఉత్తర్వులు కొట్టివేత.. అప్పీల్‌కు సమయం ఇచ్చేందుకు నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు హైకోర్టు షాక్ ఇచ్చింది. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఆయనను ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించినందున అక్కడికే వెళ్లి విధులు నిర్వహించాలని తేల్చిచెప్పింది. తెలంగాణలో కొనసాగింపును రద్దు చేసింది. ఆయనను తెలంగాణకు కేటాయిస్తూ 2016లో కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. ఆ పరిధి క్యాట్‌కు లేదని స్పష్టం చేసింది. కేంద్రం జారీ చేసిన కేటాయింపులను సమర్థించింది. అఖిల భారత సర్వీసు అధికారుల కేటాయింపులు, కేడర్ నియంత్రణ, నిర్ణయాధికారం కేంద్రానిదేనన్న వాదనలతో ఏకీభవిస్తున్నట్లు తెలిపింది. చట్టపరమైన వాటితో పాటు ఇతర అన్ని అంశాలను క్యాట్ పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్.నందాతో కూడిన ధర్మాసనం 89 పేజీల తీర్పును వెలువరించింది. కాగా అప్పీల్ కోసం మిగతా 11వ పేజీలో ▶

### తెలంగాణలో సోమేశ్ 'ముద్ర'

- ప్రభుత్వానికి ఆదాయ మార్గాలను సృష్టించడంలో దిట్ట

### ఒక తీర్పు.. పలువురిలో కలవరం

11లో



శాంతికుమారి రామకృష్ణారావు అరవింద్‌కుమార్

### సీఎస్ రేసులో ముగ్గురు?

సోమేశ్‌ను తెలంగాణ నుంచి రిలీవ్ చేసిన కేంద్రం
హైకోర్టు తీర్పు అనంతరం సీఎం కేసీఆర్‌ను కలిసిన సోమేశ్ - 11లో

### రాష్ట్ర ఏర్పాటు నుంచే వివాదం..

రాష్ట్ర విభజన (2014) నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల విభజనలో భాగంగా సోమేశ్‌ను ఏపీకి కేటాయించారు. దీన్ని సవాల్ చేస్తూ ఆయన క్యాట్‌ను ఆశ్రయించగా, తెలంగాణకు కేటాయిస్తూ 2016లో ఉత్తర్వులు జారీ చేసింది. నాటి నుంచి తెలంగాణలోనే విధులు నిర్వహిస్తున్నారు. క్యాట్ ఉత్తర్వులను 2017లో కేంద్ర ప్రభుత్వం హైకోర్టులో సవాల్ చేస్తూ స్టే ఇవ్వాలని కోరింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ టి.సూర్యకరణ్‌రెడ్డి, సోమేశ్‌కుమార్ తరఫున సీనియర్ న్యాయవాది డీవీ సీతారాంమూర్తి, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, ఏపీ తరఫున పి.గోవింద్‌రెడ్డి వాదనలు వినిపించారు. కాగా సోమేశ్‌తో పాటు మరో 14 మంది అధికారులు క్యాట్ అనుమతి పొంది తెలంగాణలో పనిచేస్తున్నారు. వీరికి సంబంధించిన పిటిషన్లు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.



"తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గురించి పూర్తి అవగాహన ఉంది. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది డిసెంబర్‌లో తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో పార్టీని గెలిపించే టాస్క్ ఏఐసీసీ నాకిచ్చింది. తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకే నేను తెలంగాణకు వస్తున్నా. నేనేదో మ్యాజిక్ చేయాలనుకోవట్లేదు. కూర్చుని మాట్లాడుకుంటే అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయి. ఎవరెన్ని చెప్పినా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ లేకుండా ప్రత్యామ్నాయం లేదు.

## మ్యాజిక్ లేదు.. మాటలతోనే..

### తెలంగాణ కాంగ్రెస్‌ను డీల్ చేస్తానన్న మాణిక్‌రావ్ ఠాక్రే

- కూర్చుని మాట్లాడుకుంటే అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయి
- పీసీసీ చీఫ్, సీఎల్పీ నాయకుడితో విడివిడిగా భేటీ అవుతా..
- సీనియర్లతోనూ మాట్లాడతా.. అందరి మనసులో మాట తెలుసుకుంటా..
- వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించే టాస్క్ ఏఐసీసీ అప్పగించింది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి

2లో



"'విద్యుత్ ఉత్పత్తికి, కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడు భూములు తడిపేందుకు, ఇంటింటికీ మంచినీరు, ప్రజలకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అప్పులు చేసింది. డీజిల్, పెట్రోల్, సిలిండర్ ధరల పెంచుడు తప్ప ఒక్క మంచి పని కూడా చేయని కేంద్ర ప్రభుత్వం మాత్రం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేసిందని నిందిస్తోంది. బీజేపీ నేతలు ఇప్పటి వరకు ట్రయల్ మాత్రమే చూశారు. ముందుముందు సినిమా చూపిస్తాం'

## అప్పులు కావవి.. భవిష్యత్ పెట్టుబడులు

### సిరిసిల్లలో మంత్రి కేటీఆర్

- మేం ఉచిత కరెంట్ ఇవ్వొద్దట. రుణమాఫీ చేయొద్దట
- మోదీ ఎనిమిదేళ్లలో రూ.100 లక్షల కోట్ల అప్పులు చేశారు
- నేను చెప్పేది తప్పయితే ఏ శిక్షకైనా సిద్ధం.. పదవికి రాజీనామా చేస్తా

2లో

## న్యూస్‌రీల్

### ఊహలు వద్దు... ఆశకు పోవద్దు



2023–24 బడ్జెట్ తయారీ కోసం అన్ని శాఖలు 12లోగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. ఊహాజనిత అంచనాలు, లెక్కకు మిక్కిలి ప్రతిపాదనలు పంపవద్దని సూచించింది.

- వివరాలు 10లో▶

### కేసీఆర్‌పై నమ్మకంతోనే ఇన్నాళ్లూ భరించా!



గౌరవం ఇవ్వడమంటే గన్‌మెన్లు, సెక్యూరిటీ కల్పించడం కాదని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. 'నాకు కలిగిన కష్టాలను బయటకు చెబితే మీకు కష్టం కలిగింది. మరి నాలుగేళ్లుగా నాకు, నన్ను నమ్ముకున్న వారికి దక్కుతున్న గౌరవం మాటేమిటి' అని అధికార పార్టీని ప్రశ్నించారు.

- వివరాలు 2లో▶

### పోలీస్ కొలువుకు గట్టి పోటీ!



పోలీస్ కొలువులకు పోటీ తీవ్రంగానే ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రాథమిక రాత పరీక్ష, దేహదారుఢ్య పరీక్షల్లో విజయం సాధించిన వారంతా ఇప్పుడు తుది రాత పరీక్షపై దృష్టి సారించారు.

- వివరాలు 3లో▶

### కొత్త సచివాలయంలో.. సరికొత్త ఫౌంటెయిన్‌లు!



ఢిల్లీలోని పార్లమెంటు ముందు ధోల్పూర్ ఎర్ర రాతితో నిర్మించిన ఫౌంటెయిన్ ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుంది. ఇప్పుడు అచ్చుగుద్దినట్టు అలాంటి రెండు ఫౌంటెయిన్లు తెలంగాణ కొత్త సచివాలయంలో రూపుదిద్దుకున్నాయి.

- వివరాలు 10లో▶


NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkobb CHICKEN | Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

| Eggs Retail Rate | Ex Farm Live Bird | 117 kg | Dressed with Skin | 202 kg |
| --- | --- | --- | --- | --- |
| ₹ 72 per dozen | Retail Live Bird | 139 kg | Skin Less | 229 kg |

Issued in the interest of consumers


## ఇదండీ సంగతి




నేను రాహుల్‌ని కాను అనేసరికి అందరూ వెళ్లిపోయార్సార్!



కాలువలో పడిన కారు

## అతివేగానికి ఆరుగురు బలి

వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం మునిగడపలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని బలితీసుకుంది. అతివేగం వల్ల కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొని రోడ్డు పక్కనే ఉన్న కొండపోచమ్మసాగర్ డిస్ట్రిబ్యూటరీ కాలువలో పడిపోవడంతో ఈ దుర్ఘటన జరిగింది. మృతులంతా యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన వారు.

- వివరాలు 5లో▶

## వీసా చిక్కులు వేసవికల్లా చెల్లు

- విద్యార్థి వీసాలకు ప్రాధాన్యం.. సకాలంలో జారీ
- హైదరాబాద్‌లో కొత్త కాన్సుల్ జనరల్ భవనం త్వరలోనే అందుబాటులోకి..
- అమెరికా చార్జ్ డి అఫైర్స్ ఎలిజబెత్ జోన్స్ వెల్లడి



'అమెరికా వీసాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని త్వరలోనే అధిగమిస్తాం. వచ్చే వేసవికల్లా వీసాల జారీ ప్రక్రియ పుంజుకుంటుంది. తెలంగాణ ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారాన్ని అమెరికా పారిశ్రామికవేత్తలు ఎంతగానో ప్రశంసిస్తున్నారు. హైదరాబాద్‌లో కొత్త కాన్సుల్ జనరల్ భవనం త్వరలోనే అందుబాటులోకి రానుంది.'

- వివరాలు 3లో▶

## 28న రాష్ట్రానికి అమిత్ షా



### రెండ్రోజులు ఇక్కడే మకాం

- పార్టీ ఎన్నికల సన్నద్ధతను బేరీజు వేయనున్న షా
- ఫిబ్రవరిలో బీజేపీలో చేరనున్న పొంగులేటి?
- ఈ నెల 18న ఢిల్లీలో అమిత్‌షా, నడ్డాతో భేటీ అయ్యే అవకాశం

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అధినాయకత్వం 'మిషన్ తెలంగాణ'ను టాప్‌గేర్‌లోకి తీసుకెళ్లనుంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్న చిరకాల కోరికను సాధించేందుకు దృష్టి కేంద్రీకరిస్తోంది. అలాగే, రాష్ట్రంలో మెజారిటీ లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహ ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఈ నెల 19న ప్రధాని మోదీ రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతోపాటు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ నిష్క్రియాపరత్వాన్ని, వైఫల్యాలను ఎండగట్టనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. దీనికి కొనసాగింపుగా ఈ నెల 28న పార్టీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రానికి రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రపార్టీ సంస్థాగతంగా ఏ మేరకు ఎన్నికలకు సన్నద్ధమైందో పరిశీలించనున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ, 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని బూత్ కమిటీలు, మండల, ఇతరస్థాయిల కమిటీల నియామకం తదితర విషయాలపై సమీక్షిస్తారు. అవసరమైతే అమిత్‌షా 29వ తేదీ కూడా మిగతా 11వ పేజీలో ▶

### నడ్డా సమక్షంలో పొంగులేటి చేరిక

ఫిబ్రవరి తొలి వారంలో బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరనున్నట్టు పార్టీవర్గాల సమాచారం. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర ముఖ్యనేతల సమక్షంలో ఆయన బీజేపీలో అధికారికంగా చేరేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నాయకత్వంపై నేరుగా విమర్శలు గుప్పించడం, వచ్చే ఎన్నికల్లో తానే కాదు తన అనుయాయులంతా పోటీచేస్తారంటూ తాజాగా పొంగులేటి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ నెల 18న ఢిల్లీలో అమిత్‌షా, జేపీ నడ్డా ఇతర ముఖ్యనేతలను పొంగులేటి కలుసుకుంటారని చెబుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అధికారపార్టీతోపాటు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలతో పొంగులేటికి సత్సంబంధాలు ఉన్నందున ఆయన చేరికతో బీజేపీ పూర్తిస్థాయిలో బలం పుంజుకుని మెజారిటీ సీట్లలో గెలుపొందుతుందనే విశ్వాసాన్ని బీజేపీ ముఖ్యనేతలు వ్యక్తంచేస్తున్నారు.




## క్లుప్తంగా...

### బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తాం: తమ్మినేని

**బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు కేరళ సీఎం పినరయి విజయన్ రాక**



దురాజ్‌పల్లి (సూర్యాపేట): బీజేపీ మతోన్మాద విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు భవిష్యత్తులోనూ బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈనెల 18న బీఆర్ఎస్ పార్టీ ఖమ్మంలో తలపెట్టిన భారీ బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హాజరవుతున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఎలాంటి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావాలని బీజేపీ కంటున్న కలలను కల్లలు చేసే సత్తా కమ్యూనిస్టులకు ఉందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పాల్గొన్నారు.

### రేపు ముంబైకి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించే 'ఎబీబీఎఫ్ఐఏ ఫార్ములా ఈ వరల్డ్ చాంపియన్‌షిప్' ప్రచారం కోసం మంత్రి కేటీ రామారావు గురువారం ముంబైకి వెళ్లనున్నారు. గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద ఈ నెల 12న సాయంత్రం 6.30 గంటలకు జరిగే విలేకరుల సమావేశంలో కేటీఆర్ పాల్గొంటారు. ఫార్ములా ఈ వరల్డ్ చాంపియన్‌షిప్ వివరాలు, ప్రత్యేకతలను వివరిస్తారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, గ్రీన్ కో ఎండీ అనిల్ కుమార్ చలమలశెట్టితో కలిసి కేటీఆర్ విలేకరులతో మాట్లాడతారు.

### కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ, తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిలపై.. ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఒక ప్రకటనలో ఖండించారు. మోదీ, బీజేపీ నేతల గురించి పిచ్చిపిచ్చిగా వాగితే ఊరుకునేది లేదని, నోటిని హద్దుల్లో ఉంచుకుని మాట్లాడాలని ఆమె హెచ్చరించారు. రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన సాగిస్తున్న కేసీఆర్ సర్కార్‌కు.. మోదీ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని పేర్కొన్నారు. మోదీని విమర్శించేంత మొనగాడు కేటీఆర్ అయ్యారా? మోదీ కాలిగోటికి కూడా కేసీఆర్, కేటీఆర్ సరిపోరని స్పష్టం చేశారు. సీఎస్ సోమేశ్‌కుమార్ కొనసాగింపును రద్దు చేస్తూ హైకోర్టు ధర్మాసనం మొట్టికాయ వేసినా ఇంకా మార్పు రాకపోవడం సిగ్గుచేటని తెలిపారు.

### జీతాలివ్వలేని కేసీఆర్ సర్కార్



సాక్షి, హైదరాబాద్: ధనిక రాష్ట్రమని చెప్పుకొంటున్న కేసీఆర్ సర్కార్ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితిలో లేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి ఎద్దేవా చేశారు. నేటికీ పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు రాలేదని, దీంతో సంక్రాంతిని ఎలా చేసుకోవాలన్న ఆలోచనలో ఉద్యోగులు ఉన్నారన్నారు. ఆయన మంగళవారం విలేకరు లతో మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ రాజీనామా లేఖ పట్టుకొని వస్తే.. తాను ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చి కేంద్ర నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రాజీనామా చేయకుండా సీఎస్ సోమేశ్ కుమార్ ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకూడదన్నారు.



# మ్యాజిక్ లేదు.. మాటలతోనే..!

**తెలంగాణ కాంగ్రెస్‌ను డీల్ చేస్తానన్న మాణిక్‌రావ్ ఠాక్రే**

- కూర్చుని మాట్లాడుకుంటే అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయి
- పీసీసీ చీఫ్, సీఎల్పీ నాయకుడితో విడివిడిగా భేటీ అవుతున్నా..
- సీనియర్లతోనూ మాట్లాడతా..అందరి మనసులో మాట తెలుసుకుంటా..
- వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించే టాస్క్ ఏఐసీసీ అప్పగించింది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గురించి తనకు పూర్తి అవగాహన ఉందని, ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులైన మహారాష్ట్రకు చెందిన మాజీ మంత్రి మాణిక్‌రావ్ ఠాక్రే చెప్పారు. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుందని, తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న సమస్యలకు కూడా ఎక్కడోచోట పరిష్కారం లభిస్తుందని, ఆ పరిష్కారం కనుగొనేందుకే తాను తెలంగాణకు వస్తున్నానని అన్నారు. తాను రాష్ట్రానికి వచ్చి ఏదో మ్యాజిక్ చేయాలనుకోవడం లేదని, కూర్చుని మాట్లాడుకుంటే ఏదైనా సాధ్యమవుతుందనేది తన నమ్మకమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియామకమైన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా మంగళవారం ముంబై నుంచి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలుఠాక్రే మాటల్లోనే..

**కాంగ్రెస్ బలం తగ్గలేదు..**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది. క్షేత్రస్థాయిలో మా బలం ఏమాత్రం తగ్గలేదు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా ఇక్కడి ప్రజలు కాంగ్రెస్ పట్ల సానుభూతితో ఉన్నారు. నాకున్న అవగాహనకు తోడు పార్టీ నేతల ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకుని, డిస్కషన్స్ (చర్చలు)తోనే తెలంగాణ కాంగ్రెస్‌ను డీల్ చేయాలనుకుంటున్నా. కూర్చుని మాట్లాడుకుంటే అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయి. పీసీసీ అధ్యక్షుడితో పాటు సీఎల్పీ నాయకుడిని విడివిడిగా కలవాలని నిర్ణయం తీసుకున్నా. వచ్చీ రాగానే విడివిడిగా సమావేశం ఎందుకు పెట్టారన్నదానికి ప్రత్యేక సమాధానం ఏం లేదు.. కానీ ఒంటరిగా కలిసినప్పుడే కొంతమంది అన్ని విషయాలు మాట్లాడతారు. రాజకీయ పార్టీల్లో ఈ ఒరవడి ఇంకా ఎక్కువగా ఉంటుంది. అందుకే వేర్వేరుగా కలవాలని నిర్ణయం తీసుకున్నా. రాష్ట్రానికి చెందిన మరికొందరు సీనియర్ నేతలతో కూడా విడిగా భేటీ అవుతా. పార్టీ పటిష్టత, గెలుపు కోసం వారి మనసులో మాట ఏంటో తెలుసుకుంటా. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది డిసెంబర్‌లో తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో పార్టీని గెలిపించే టాస్క్ ఏఐసీసీ నాకిచ్చింది. ఆ టాస్క్‌ను విజయవంతం చేయడం కోసం నా శాయశక్తులా ప్రయత్నిస్తా.'

**రాష్ట్రంలో బీజేపీ గాలిబుడగలాంటిది**

జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీనే ప్రత్యామ్నాయం. ఎవరు ఎన్ని చెప్పినా కాంగ్రెస్ పార్టీ లేకుండా ప్రత్యామ్నాయం సాధ్యం కాదు. ప్రాంతీయ పార్టీల ప్రభావం కొంతమేర ఉన్నా మేం లేకుండా ఏమీ చేయలేరు. బీఆర్ఎస్ అయినా మరే కొత్త పార్టీ వచ్చినా అది సాధ్యం కాదు. తెలంగాణలో బీజేపీ గాలిబుడగ లాంటిది. కాంగ్రెస్ పార్టీని దాటి ముందుకెళ్లే పరిస్థితి ఇప్పట్లో జరిగేది కాదు. తెలంగాణలో ఈసారి మేం అధికారంలోకి వచ్చి తీరతాం.

**నేడు తొలిసారి తెలంగాణకు**

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియామకమైన తర్వాత మొదటిసారి మాణిక్‌రావ్ ఠాక్రే రాష్ట్రానికి వస్తున్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు గాంధీభవన్ చేరుకోనున్న ఆయన వరుసగా సమావేశాలు నిర్వహిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. పీసీసీ చీఫ్, సీఎల్పీ నేత, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులతో సమావేశమైన తర్వాత సీనియర్ నేతలు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లతో భేటీ అవుతారు. ఆ తర్వాత రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), రాష్ట్ర కార్యవర్గం (పీఈసీ)తో కూడా సమావేశం కానున్నారు. గురువారం ఉదయం డీసీసీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలతో సమావేశానంతరం ఢిల్లీ వెళతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

# అప్పులు కావవి.. భవిష్యత్ పెట్టుబడులు

**సిరిసిల్లలో మంత్రి కేటీఆర్**

- మేం విద్యుదుత్పత్తికి, బీడు భూములు తడిపేందుకు అప్పులు చేశాం
- మోదీ ఎనిమిదేళ్లలో రూ.100 లక్షల కోట్ల అప్పులు చేశారు
- తన కార్పొరేట్ దోస్తులకు రూ. 12 లక్షల కోట్ల రుణమాఫీ చేశారు
- మన నిధులన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలకు మళ్లిస్తున్నారు
- నేను చెప్పేది తప్పయితే ఏ శిక్షకైనా రెడీ, మంత్రి పదవికీ రాజీనామా చేస్తా



సిరిసిల్లలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: డీజిల్, పెట్రోల్, సిలిండర్ ధరలు పెంచుడు తప్ప ఒక్క మంచి పని కూడా చేయని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేసిందని నిందిస్తోందని రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు ధ్వజమెత్తారు. తాము చేసింది అప్పులు కాదని, అవి భవిష్యత్ పెట్టుబడులని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తికి, కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడు భూములు తడిపేందుకు, ఇంటింటికీ మంచినీరు, ప్రజలకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అప్పులు చేసిందని స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ప్రసంగించారు.

**పుట్టబోయే బిడ్డపైనా రూ.1.26 లక్షల అప్పు**

'దేశంలో 14 మంది ప్రధానులు మొత్తం 68 ఏళ్లలో రూ.56 లక్షల కోట్లు అప్పులు చేస్తే.. ప్రధాని నరేంద్రమోదీ 8 ఏళ్లలో రూ.100 లక్షల కోట్ల అప్పులు చేశారు. పుట్టబోయే బిడ్డపైనా రూ.1.26 లక్షల అప్పు మోపారు. మేం రైతులకు ఉచిత కరెంట్ ఇవ్వొద్దట.. రుణమాఫీ చేయొద్దట.. అవన్నీ అనుచిత పథకాలట..ఆయన మాత్రం తన కార్పొరేట్ దోస్తులకు రూ.12 లక్షల కోట్లు రుణమాఫీ చేశారు. ఇప్పటివరకు దేశానికి తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది రూ.3.68 లక్షల కోట్లు. అయితే రాష్ట్రానికి కేంద్రం ఇచ్చింది రూ.1.68 లక్షల కోట్లే. బీజేపీ దౌర్భాగ్యపు పాలిత రాష్ట్రాలకు మన నిధులు మళ్లుతున్నాయి. నేను చెప్పేది తప్పయితే ఏ శిక్షకైనా సిద్ధం. మంత్రి పదవికి కూడా రాజీనామా చేస్తా..' అని కేటీఆర్ సవాల్ విసిరారు.

**మోదీ కరోనా వ్యాక్సిన్ కనుక్కున్నారట!**

'ప్రభుత్వం 85 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తే.. యువతను బీజేపీకి దూరం చేసే కుట్ర చేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అంటున్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా ఇస్తే.. రైతులను దూరం చేసే కుట్ర, 46 లక్షల మందికి ఆసరా పెన్షన్లు ఇస్తే.. వృద్ధులను దూరం చేసే కుట్ర అంటున్నారు. అసలు బీజేపీ నేతలకు మెదడు ఉందా? కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏకంగా నరేంద్రమోదీ కరోనా వ్యాక్సిన్ కనుక్కున్నారని చెబుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని వంద గ్రామాలు సరిహద్దు వివాదంతో కొట్లాడుకుంటున్నా, ఆ రెండు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఉన్నా, పరిష్కరించలేని మోదీ.. రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపాడట. 'వీళ్లతో ఊదు కాలదు.. పీరీ లెవ్వదు..' అని మంత్రి ఎద్దేవా చేశారు. 'బండి సంజయ్ ప్రతిసారీ మోదీ దేవుడని అంటారు. ఎవరికి దేవుడు? గుజరాత్‌కు దేవుడా? నల్ల చట్టాలు తెచ్చి 700 మంది రైతుల ప్రాణాలు తీసిన దేవుడా? నేతన్నలపై జీఎస్టీ వేసిన దేవుడా? పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన దేవుడా? కార్పొరేట్ దోస్తులకు దేవుడా?..' అని ప్రశ్నించారు.

**బీజేపీ నేతలకు సినిమా చూపిస్తాం**

'దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శం. ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా, నేతన్నల బీమా, నేతన్న చేయూత లాంటి పథకాలను ఏ రాష్ట్రం అమలు చేయడం లేదు. దేశం మొత్తంగా 20 బెస్ట్ గ్రామాల్లో 19 మన రాష్ట్రంలోనే ఉన్నాయి. కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో మన 26 పట్టణాలకు అవార్డులు వచ్చాయి. 'సెస్' ఎన్నికలు రాష్ట్రంలోని 33 జిల్లాలకు స్ఫూర్తి. ఇప్పుడు ట్రయల్ మాత్రమే చూశారు. ముందు ముందు బీజేపీ నేతలకు సినిమా చూపిస్తాం..' అని కేటీఆర్ అన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మునిగిపోయే నావ

- ఉన్న నలుగురూ నాలుగు దిక్కులు!: : మంత్రి హరీశ్‌రావు
- త్వరలోనే సంగారెడ్డికి గోదావరి నీళ్లు
- మార్చిలో సిద్దిపేట ఐటీ టవర్ అంకితం
- 18న రూ.250 కోట్లతో ప్రారంభం కానున్న రెండో విడత కంటివెలుగు



హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యురాలు గౌరిరెడ్డి సంతోష

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావని, అందులో ఉన్న నలుగురు నాలుగు దిక్కులని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తొగిర్పల్లి కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యురాలు గౌరిరెడ్డి సంతోష, లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి యాదవరెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అంతకుముందు మంత్రి హరీశ్‌రావు కంటి వెలుగు జిల్లా సమీక్ష నిర్వహించడంతోపాటు చేర్యాల మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని, త్వరలో సంగారెడ్డికి గోదా వరి జలాలు వస్తాయని వెల్లడించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 ఎమ్మెల్యేలలో ఒక్కచోట కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో 10 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేటలో ఐటీ టవర్‌ను మార్చి నాటికి పూర్తి చేసి ఏప్రిల్‌లో అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

**ఖమ్మంలో మలివిడత కంటివెలుగు**

ఈనెల 18న ఖమ్మంలో కేరళ, పంజాబ్, ఢిల్లీ ముఖ్యమంత్రుల చేతుల మీద మలివిడత కంటివెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. రెండో విడత కంటివెలుగు కోసం రూ.250 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. మొదటి విడతలో కోటీ 50 లక్షల మందికి పరీక్షలు చేసి, 50 లక్షల మందికి కళ్ల అద్దాలు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద సామూహిక కంటి పరీక్షలు మన రాష్ట్రంలోనే కంటివెలుగు రూపంలో జరుగుతుందన్నారు.మంత్రి వెంట ఎంపీ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్యేలు సతీశ్, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ఎమ్మెల్సీలు ఫారూఖ్, యాదవ రెడ్డి ఉన్నారు.

# సీబీఐ దర్యాప్తునకు అనుమతించాలి

- సింగిల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేయాలి
- తుషార్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి
- ఎమ్మెల్యేలకు ఎర కేసులో కొనసాగిన వాదనలు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేలకు ఎర కేసులో సీబీఐ దర్యాప్తునకు అనుమతించాలని, సింగిల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని తుషార్ వెల్లపల్లి తరఫు సీనియర్ న్యాయవాది సంజయ్ ద్విసభ్య ధర్మాసనాన్ని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి నేరుగా మీడియా సమావేశం పెట్టి వివరాలు, సీడీలు వారికి ఇవ్వడమే కాకుండా.. అది పోలీస్ దర్యాప్తును ప్రభావితం చేసినట్లు ఎలా అవుతుందని ప్రభుత్వ న్యాయవాది పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యేలకు ఎర కేసును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం ముందు మంగళవారం కూడా వాదనలు కొనసాగాయి. 'సింగిల్ జడ్జి వద్ద కేసు విచారణ సమయంలో సుప్రీంకోర్టు, హైకోర్టుల సీజేలకు వీడియోలు పంపడం పట్ల ప్రభుత్వం తరఫు న్యాయవాది బేషరతుగా క్షమాపణలు చెప్పారు. అయినా అది దర్యాప్తును ఎలా ప్రభావితం చేస్తుంది అని పేర్కొనడం తప్పపట్టాల్సిన విషయం. సిట్ దర్యాప్తు చేసే ఏడుగురిలో ముగ్గురు ఐపీఎస్‌లు. వీరంతా ముఖ్యమంత్రి నేతృత్వంలోనే విధులు నిర్వహించాల్సి ఉంటుంది. వారి పోస్టింగ్‌లు, బదిలీలు, పదోన్నతుల వంటివి సీఎం ఆదేశాల మేరకే జరుగుతాయి. అంతకుముందు సైబరాబాద్ సీపీ కూడా మీడియాకు కేసు వివరాలు వెల్లడించారు. ఇలా చేయడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించడమే. సీఎం మీడియాకు వివరాలు లీక్ చేసే నాటికి చాలా మంది నిందితులుగా కూడా లేరు. ఆ తర్వాత, ఆయన చెప్పిన పేర్లను సిట్ నిందితుల జాబితాలో చేర్చింది. ఈ పరిస్థితుల్లో సిట్ దర్యాప్తు కొనసాగిస్తే కేసు ఏకపక్షంగా సాగుతుంది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల ప్రకారం సీబీఐ దర్యాప్తును కొనసాగించాలి'అని తుషార్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు.

**సంక్రాంతి తర్వాతకు వాయిదా వేయండి**

'ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చే కుట్రకు బీజేపీ బీజాలు వేసింది. ఎమ్మెల్యేల కొనుగోళ్ల తతంగం అంతా సాఫీగా సాగి సర్కార్ కుప్పకూలితే.. ప్రజా తీర్పుకు అర్థం లేకుండా పోయేది. సీఎం నవంబర్ 3న మీడియా సమావేశం నిర్వహించారు. అప్పటికే సిట్ లేదు. పోలీస్ దర్యాప్తుపై స్టే విధించి ఉంది. అలాంటప్పుడు దర్యాప్తును సీఎం ప్రెస్‌మీట్ ప్రభావితం చేస్తోంది అని చెప్పడం సరి కాదు'అని ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే పేర్కొన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదిస్తూ.. దర్యాప్తు అధికారులపై ఎలాంటి ఆరోపణలు లేనప్పుడు సిట్ నుంచి సీబీఐకి కేసును బదిలీ చేయరాదన్నారు. సిట్ దర్యాప్తు కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కాగా.. తనకు అనారోగ్యంగా ఉందని, విచారణను సంక్రాంతి సెలవుల అనంతరం కొనసాగించాలని దవే ధర్మాసనాన్ని విజ్ఞప్తి చేశారు. కేసు విచారణ ఆలస్యం అవుతున్న దృష్ట్యా.. బుధవారం ఆయన ఆరోగ్య పరిస్థితులను బట్టి తదుపరి విచారణ కొనసాగించాలో లేదో నిర్ణయిస్తామని ధర్మాసనం వెల్లడించింది.

## బీజేపీ నేత ఎర్రబెల్లికి గన్‌మెన్ల తొలగింపు



గన్‌మెన్లతో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు (ఫైల్)

కాశిబుగ్గ: బీజేపీ రాష్ట్ర నేత, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావుకు బీఆర్ఎస్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. అయనకు ఎనిమిదేళ్లుగా కల్పిస్తున్న భద్రతను మంగళవారం ఉపసంహరించుకుంది. ఎర్రబెల్లి ప్రదీప్‌రావు వద్ద పనిచేస్తున్న గన్‌మెన్లను (2+2) వెంటనే వెనక్కు రావాలని మంగళవారం సాయంత్రం వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి ఆదేశాలు రావడంతో వారు వెళ్లిపోయినట్లు తెలిసింది. దీనిపై ప్రదీప్‌రావు మాట్లాడుతూ తాను బీజేపీలో చేరినందుకే రాజకీయ కక్షతో గన్‌మెన్లను తొలగించారన్నారు. ఇది స్థానిక ఎమ్మెల్యే రాజకీయ కుట్రలో భాగమేనని ఆరోపించారు. తనకు ఏదైనా హాని జరిగితే, అందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నరేందర్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రదీప్‌రావు హెచ్చరించారు

## ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నవ చండీయాగం



సాక్షి, హైదరాబాద్: టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన దశ మహా విద్యాపూర్వక నవ చండీయాగంకి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. యాగపూర్ణాహుతిలో పాల్గొన్న చంద్రబాబును వేద పండితులు ఆశీర్వదించారు. తెలుగు ప్రజలందరికీ శుభం కలగాలని శుభాశీస్సులు అందజేశారు. కాసాని జ్ఞానేశ్వర్ తన సతీమణి చంద్రకళతో కలిసి పాల్గొన్నారు. యాగం నిర్వహించిన జ్ఞానేశ్వర్‌ను ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించారు. ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా ఈనెల 18న నిర్వహించనున్న ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీకి చంద్రబాబును ఆహ్వానిస్తూ అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు శ్రీపతి సతీష్ కుమార్ మొదటి ఆహ్వానపత్రికను అందజేశారు. మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబును కలిసి ర్యాలీ ప్రారంభానికి రావాలని కోరారు. రసూల్‌పురాలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ ఘాట్ వరకు జరిగే ర్యాలీని 18వ తేదీన ఉదయం చంద్రబాబు ప్రారంభిస్తారు.

## 17న నాగర్‌కర్నూల్‌లో దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ

- మార్కండేయ ప్రాజెక్టు దాడిపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు
- టీపీసీసీ ఎస్టీ సెల్ నేతలు జగన్‌లాల్, రాములునాయక్

సాక్షి, హైదరాబాద్: మార్కండేయ ప్రాజెక్టును పరిశీలించేందుకు వెళ్లిన గిరిజన నాయకులను కొందరు చంపే ప్రయత్నం చేశారని, బిల్యానాయక్ అనే వ్యక్తిపై కులహంకారంతో దాడి చేశారని టీపీసీసీ ఎస్టీ సెల్ నేతలు ఆరోపించారు. మంగళవారం గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, టీపీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్ జగన్‌లాల్ నాయక్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై దాడులు జరుగుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తనపై జరిగిన దాడి గురించి బయట మాట్లాడవద్దని అధికార పార్టీ నేతలు బిల్యానాయక్‌ను బెదిరిస్తున్నారని, వెంటనే దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ ఘటనపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు, హెచ్చార్సీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో మార్కండేయ ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ నేతల దాడి ని నిరసిస్తూ ఈనెల 17న నాగర్‌కర్నూల్‌లో దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టి బొమ్మలను దహనం చేస్తామని హెచ్చరించారు.

# కేసీఆర్‌పై నమ్మకంతోనే ఇన్నాళ్లూ భరించా!

**ఒకస్థాయి వరకే ఇబ్బందులు తట్టుకోగలం**

- ఏదో ఒక రోజు గొంతు విప్పాల్సి వస్తుంది... నాకు ఎలాంటి సెక్యూరిటీ అవసరం లేదు
- పార్టీ మార్పుపై కల్లబొల్లి కబుర్లు చెప్పను... ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి



మణుగూరులో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో విల్లు ఎక్కు పెట్టిన మాజీ ఎంపీ పొంగులేటి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గౌరవం ఇవ్వడమంటే గన్‌మెన్లు, సెక్యూరిటీ కల్పించడం కాదని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తనకు సెక్యూరిటీ కావాలని ప్రభుత్వాన్ని ఎప్పుడూ అడగలేదని, ఇప్పుడున్న ఇద్దరు గన్‌మెన్లను తీసేసినా బాధ లేదని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో మంగళవారం నిర్వహించిన పినపాక నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీపై ఆయన విమర్శలు ఎక్కుపెట్టారు. కేసీఆర్, కేటీఆర్ మాటలపై నమ్మకంతోనే ఇంతకాలం పార్టీలో తనకు, తన అనుచరులకు ఎన్ని అవమానాలు ఎదురైనా మౌనంగా భరిస్తూ వచ్చానన్నారు. మౌనంగా ఉన్నామంటే కష్టాలను, అవమానాలను భరించేందుకు అంగీకరించినట్టు కాదని చెప్పారు. 'నాకు కలిగిన కష్టాలను జనవరి ఒకటో తేదీన బయటకు చెబితే మీకు కష్టం కలిగింది. మరి నాలుగేళ్లుగా నాకు, నన్ను నమ్ముకున్న వారికి దక్కుతున్న గౌరవం మాటేమిటి' అని అధికార పార్టీని ప్రశ్నించారు. తనకు కష్టం కలిగిందని చెబితే సహించకుండా కాకులు, గద్దల్లా పొడుచుకుతింటున్నారని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి వ్యాఖ్యానించారు. ఇకపై అలా చేస్తామంటే కుదరదన్నారు. తండ్రీకొడుకుల మధ్య విభేదాలు ఉంటాయని, అంతమాత్రాన వారిద్దరూ శత్రువులు కారని, ఆ భావనతోనే ఇన్నాళ్లూ పార్టీలో కొనసాగానని పొంగులేటి అన్నారు. ఒకస్థాయి వరకే ఇబ్బందులు తట్టుకోగలమని, ఆ తర్వాత ఏదో ఒక రోజు గొంతు విప్పాల్సి వస్తుందన్నారు. పార్టీ మార్పుపై కల్లబొల్లి కబుర్లు చెప్పబోనని తెలిపారు.

**దోచుకుంటున్నారు...**

అసెంబ్లీ నియోజకవర్గాలను సామ్రాజ్యంగా మార్చి దోచుకుంటున్నారని, ఎమ్మెల్యేలు రాజుల్లా మారి ప్రజలను చిత్రహింసలు పెడుతున్నారని పొంగులేటి ఆరోపించారు. 'ప్రతీది ఊరికే పోదు. అవన్నీ వారి ఖాతాలో జమ అవుతున్నాయి. సమయం వచ్చినప్పుడు బుల్లెట్ (ఎన్నికలను ఉద్దేశిస్తూ) దిగుతుంది' అని ఆయన చెప్పారు. అధికార బలంతో తనను అణచివేయాలని చూస్తే ప్రజాక్షేత్రంలో మీకు పరాభవం తప్పదంటూ అధికార పార్టీ నేతలను హెచ్చరించారు.

**రాజకీయాలు ఆపేది లేదు**

అధికార పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఆర్థికంగా ఇబ్బంది పెడతారంటూ తన అనుచరులు ఆందోళనగా ఉన్నారని, రాజకీయాల్లోకి రాకముందు నుంచే తెలంగాణలో ఉన్న పదిమంది పెద్ద కాంట్రాక్టర్లలో తాను ఒకడినని పొంగులేటి చెప్పారు. ఎన్ని వేల కాంట్రాక్టులు చేసింది, ఎంత సంపాదించింది ప్రతీది లెక్కతో సహా ఉందన్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ముతోనే ప్రజాసేవలోకి వచ్చానని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే జోలె పట్టుకుని ప్రజల వద్దకు వెళ్లయినా సరే రాజకీయాలు చేస్తానే తప్ప వెనకడుగు వేయబోనని చెప్పారు.

# బీఆర్ఎస్‌లో 'పొంగులేటి' కాక!

- మాజీ ఎంపీ పార్టీని వీడతారనే ప్రచారం... సోమవారం జరిగిన భేటీలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు?
- ఖమ్మం సభ నేపథ్యంలో పొంగులేటి కదలికలపై ఆరా... బుజ్జగింపునకు మొగ్గుచూపని కేసీఆర్
- వరిచేలో పరిగపోతూ ఉంటుంది.. పట్టించుకోవాల్సిన అవసరం లేదన్న అధినేత

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఆవిర్భావం నేపథ్యంలో ఈ నెల 18న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా సత్తా చాటాలని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భావిస్తున్నారు. అదీగాక 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కో స్థానంలో మాత్రమే పార్టీ అభ్యర్థులు విజయం సాధించడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పట్టుసాధించేందుకు వ్యూహరచన చేస్తున్నారు. అయితే ఖమ్మం జిల్లా బీఆర్ఎస్‌లో జరుగుతున్న పరిణామాలు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పార్టీని వీడతారనే ప్రచారం, ఇటీవల కాలంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు దీనికి ఊతమిస్తున్నాయి. 2014లో వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీగా గెలిచిన పొంగులేటి తర్వాతి కాలంలో టీఆర్ఎస్‌లో చేరారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ దక్కకపోయినా పార్టీలోనే కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఆయన్ని రాజ్యసభకు నామినేట్ చేస్తారనే ప్రచారంతోపాటు ఎమ్మెల్సీగా అవకాశమిచ్చి కేబినెట్ పదవిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఎలాంటి గుర్తింపు దక్కకపోయినా సొంత కార్యక్రమాలతో ప్రజాక్షేత్రంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తాను ఎట్టి పరిస్థితుల్లో పోటీ చేస్తానంటూ పలు సందర్భాల్లో ప్రకటనలు కూడా చేశారు. అయితే, న్యూ ఇయర్ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి బీఆర్ఎస్‌లో తనకు ఎలాంటి గౌరవం దక్కిందో అందరికీ తెలుసని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా మంగళవారం జరిగిన సమ్మేళనంలోనూ కీలక వ్యాఖ్యలు చేయడం, ఫ్లెక్సీల్లో కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు పెట్టని విష యమై అధిష్టానానికి సమాచారం అందినట్లు తెలిసింది.

**పొంగులేటిని ఆహ్వానిస్తారా?**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ నేతల నడుమ విభేదాలు తొలగించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గత జూన్‌లో జిల్లా పర్యటనకు వెళ్లారు. మంత్రి పువ్వాడ అజయ్‌తో పాటు బీఆర్ఎస్ పార్లమెంటు ఫ్లోర్ లీడర్ నామా, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు జిల్లాకు చెందిన పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్యనేతలు కేటీఆర్ పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ పొంగులేటి నివాసానికి వెళ్లి భోజనం కూడా చేశారు. పొంగులేటి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే ఏదో ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకోవాలని పార్టీ అధినేత నుంచి ఆయనకు సమాచారం వెళ్లినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. అయితే కొద్దినెలలుగా పొంగులేటి కార్యక్రమాల వేడి పెంచడాన్ని కేసీఆర్ సీరియస్‌గా తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఖమ్మం సభను విజయవంతం చేసేందుకు సోమవారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధుల భేటీలో పొంగులేటి చేసిన వ్యాఖ్యలు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. దీనిపై కేసీఆర్ స్పందిస్తూ 'వరి చేలో పరిగపోతూ ఉంటుంది. పట్టించుకోవాల్సిన అవసరం లేదు. మనం ప్రజల్లో ఉన్నాం. ప్రజలు మనవెంటే ఉంటారు' అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఖమ్మం సభ ఏర్పాట్లను సమీక్షించేందుకు మంత్రి హరీశ్‌రావు బుధవారం ఖమ్మంకు వెళ్లనున్నారు. ఈ సమావేశానికి పొంగులేటిని ఆహ్వానిస్తారా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

## క్లుప్తంగా...

### ఎన్టీపీసీ ప్లాంట్‌కు సింగరేణి బొగ్గు

సాక్షి, హైదరాబాద్: పెద్దపల్లి జిల్లా రామగుండంలో తెలంగాణ సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్‌కేంద్రం తొలి దశ కింద ఎన్టీపీసీ నిర్మించిన 1,600(2×800) మెగావాట్ల ప్లాంట్‌కు సింగరేణి బొగ్గు సరఫరా కానుంది. ఈ మేరకు సింగరేణి బొగ్గు గనుల సంస్థ, ఎన్టీపీసీ మధ్య మంగళవారం సింగరేణి భవన్‌లో ఒప్పందం కుదిరింది. సింగరేణి సంస్థ ఈడీ (కోల్ మూమెంట్) జె.అల్విన్, ఎన్టీపీసీ తెలంగాణ ప్రాంత పర్యవేక్షక ఉన్నతాధికారి పాల్ సమక్షంలో ఈ ఒప్పందంపై సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) కె.సూర్యనారాయణ, ఎన్టీపీసీ జీఎం (ఫ్యూయెల్) తపస్ సాహాలు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం తొలిదశలోని 800 మెగావాట్ల ప్లాంట్‌కు సింగరేణి సంస్థ ఈ ఏడాది ఏప్రిల్ వరకు 4 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేయనుందని కె.సూర్యనారాయణ తెలిపారు. వచ్చే ఏడాది నుంచి ఫేజ్–1లోని రెండు ప్లాంట్లకు (2×800) కలిపి 80 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయడానికి సూత్రప్రాయంగా అంగీకరించామని, త్వరలోనే ఈ మేరకు ఒప్పందం జరగనుందని వెల్లడించారు.

### కిలిమంజారోను అధిరోహించే వెన్నెలకు అండగా ఉంటాం

- రూ.3 లక్షల ఆర్థికసాయం చేసిన ఎంపీ జోగినపల్లి సంతోష్



వెన్నెలతో మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సోమవారంపేట గ్రామ గిరిజన విద్యార్థిని బానోతు వెన్నెల ఈనెల 19 నుంచి కిలిమంజారో (5,895 మీటర్ల) పర్వతాన్ని అధిరోహించనుంది. ఈ మేరకు మంగళవారం ప్రగతిభవన్‌లో రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్‌ను వెన్నెల మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా వెన్నెలకు సంతోష్ రూ.3 లక్షల ఆర్థిక సాయం చేసి ఆశీర్వదించారు. భవిష్యత్‌లో కూడా అన్ని రకాలుగా అండగా ఉంటానని, తెలంగాణ, భారతదేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ప్రపంచంలోనే అతి పెద్దదైన మౌంట్ ఎవరెస్ట్ పర్వతాన్ని కూడా అధిరోహిస్తానని వెన్నెల తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ కో ఫౌండర్ రాఘవ పాల్గొన్నారు.

# వేసవికల్లా వీసా చిక్కులకు చెల్లు

**జారీ కోసం అదనపు సిబ్బందిని నియమిస్తున్నాం**

- విద్యార్థి వీసాలకు ప్రాధాన్యమిస్తాం
- సకాలంలోనే వారికి వీసాలు జారీచేస్తాం
- హైదరాబాద్‌లో కొత్త కాన్సుల్ జనరల్ భవనం త్వరలోనే అందుబాటులోకి..
- అమెరికా చార్జ్ డి అఫైర్స్ ఎలిజబెత్ జోన్స్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎలిజబెత్ జోన్స్

సాక్షి, హైదరాబాద్: అమెరికా వీసాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని త్వరలోనే అధిగమిస్తామని, వచ్చే వేసవికల్లా జారీ వేగవంతం అవుతుందని చార్జ్ డి అఫైర్స్ ఎ.ఎలిజబెత్ జోన్స్ స్పష్టం చేశారు. వీసాల జారీ జాప్యాన్ని అత్యంత ప్రాధాన్యం గల అంశంగా పరిగణిస్తున్నామని చెప్పారు. ఆమె మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమస్యపై ఇప్పటికే ఇరు దేశాల విదేశాంగ మంత్రులు ఆంటోనీ జాన్ బ్లింకెన్, జయశంకర్ చర్చించారని చెప్పారు. వీసాల జారీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఎక్కువ మంది సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. వచ్చే వేసవికల్లా భారత్‌లో కోవిడ్‌కు ముందు ఉన్నదాని కంటే ఎక్కువ మంది సిబ్బంది పనిచేస్తారని వివరించారు. 'సాధారణంగా బీ1, బీ2 వీసాల జారీలోనే జాప్యం ఎక్కువగా జరుగుతోంది. దీన్ని తగ్గించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాం. హైదరాబాద్‌లోనూ అదనపు సిబ్బంది త్వరలోనే అందుబాటులోకి వస్తారు. గత ఏడాది విద్యార్థులకు 1.25 లక్షల వీసాలు జారీ చేయగా.. ప్రస్తుతం మరోసారి వీసాలకు డిమాండ్ పెరిగింది. విద్యార్థి వీసాలకు ప్రాధాన్యమిచ్చి వారు సకాలంలో తమ కోర్సుల్లో చేరేలా వీసాలు జారీ చేస్తాం'అని ఎలిజబెత్ తెలిపారు.

**భారత్ పరిస్థితిని అర్థం చేసుకున్నాం**

భారత్‌కు పూర్తిస్థాయి దౌత్యవేత్త నియామకం రెండేళ్లుగా జరక్కపోవడంపై ఎలిజబెత్ జోన్స్ మాట్లాడుతూ.. దాని ప్రభావం ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఏమాత్రం ప్రభావం చూపదని స్పష్టం చేశారు. పూర్తిస్థాయి దౌత్యవేత్త లేకున్నా అనేకమంది అమెరికా పార్లమెంటు సభ్యులు భారత్‌ను సందర్శించారని, ఇరుదేశాల మిలటరీ దళాలు సంయుక్తంగా విన్యాసాలు నిర్వహించాయని, వాణిజ్యం కూడా పెరిగిందని తెలిపారు. 'రష్యా–ఉక్రెయిన్ యుద్ధం విషయంలో భారత్ పరిస్థితిని మేము సంపూర్ణంగా అర్థం చేసుకున్నాం. ఏ దేశమైనా తమ ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తుంది. అందుకే విదేశీ వ్యవహారాల్లో ఏ దేశం ఎలా వ్యవహరించాలో మేము ఎప్పుడూ నిర్ణయించం'అని ఆమె చెప్పారు. ఆయా దేశాల సమస్యలను అర్థం చేసుకుని.. వాటికి లోబడే ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు. ఉక్రెయిన్ యుద్ధ బాధితులకు మానవతా సాయం అందించడం భారత్ చేస్తున్న అతిపెద్దమేలని పేర్కొన్నారు. జీ–20 అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్‌తో కలిసి పనిచేసేందుకు అమెరికా నుంచి మరిన్ని బృందాలు వస్తున్నాయని తెలిపారు.

**తెలంగాణ ప్రభుత్వ సహకారం భేష్**

అమెరికా పారిశ్రామికవేత్తలకు ఇక్కడ అన్ని రకాలుగా మద్దతు లభిస్తోందని, మరీ ముఖ్యంగా తెలంగాణలో ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారాన్ని అమెరికా వ్యాపారవేత్తలు ఎంతగానో ప్రశంసిస్తున్నారని ఎలిజబెత్ జోన్స్ చెప్పారు. అయితే, మేకిన్ ఇండియా కార్యక్రమంలో తామెలా భాగం కావాలన్నది వారికి ఇంకా స్పష్టం కావడం లేదని, భారతీయ కంపెనీలతో కలిసి ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. చైనాతో భారత్ సరిహద్దు వివాదాల విషయంలో అమెరికా పాత్ర ఏమీ ఉండదని, కాకపోతే భారతీయ భౌగోళిక సమగ్రతకు ఎలాంటి ముప్పు రాకూడదని అమెరికా భావిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో కొత్త కాన్సుల్ జనరల్ భవనం త్వరలోనే అందుబాటులోకి వస్తుందని, ఈ కొత్త భవనానికి నిపుణుల అనుమతి లభించాల్సి ఉందని చెప్పారు. కొత్త భవనంలో మరింత ఎక్కువ మంది సిబ్బంది పనిచేసేందుకు సౌకర్యాలు ఉన్నాయన్నారు.

# సివిల్ ఎస్సైకి.. 95 మంది | ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు.. 96 మంది

**పోలీస్ కొలువుకు గట్టి పోటీ!**

- తుది రాతపరీక్షకు టీఎస్ఎల్పీఆర్బీ ఏర్పాట్లు
- పోస్టులు ఎక్కువగా ఉండటంతో సివిల్ కానిస్టేబుల్‌కు తక్కువ పోటీ



సాక్షి, హైదరాబాద్: పోలీస్ కొలువులకు పోటీ తీవ్రంగానే ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రాథమిక రాత పరీక్ష, దేహదారుఢ్య పరీక్షల్లో విజయం సాధించిన వారంతా ఇప్పుడు తుది రాత పరీక్షపై దృష్టి సారించారు. ఎలాగైనా ఖాకీ యూనిఫాం ధరించాలన్న లక్ష్యంతో ముమ్మర కసరత్తు చేస్తున్నారు. అయితే పోలీసు ఉద్యోగం అంత సులువుగా దక్కే అవకాశం లేదని పోటీ పడుతున్న అభ్యర్థుల సంఖ్య చెబుతోంది. సివిల్ ఎస్సై మొదలు డ్రైవర్ పోస్టు వరకు ప్రతి దానిలో పోటీ తీవ్రంగానే ఉంది. పోలీస్, ఎక్సైజ్, రవాణా శాఖల్లోని వివిధ విభాగాల్లో ఎస్సై, కానిస్టేబుల్ కలిపి.. మొత్తం 11 రకాల పోస్టుల భర్తీ ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఆయా పోస్టులకు మార్చి 12 నుంచి జరిగే తుది రాత పరీక్షకు టీఎస్ఎల్పీఆర్బీ ఏర్పాట్లు చేస్తోంది.

**పోటీ ఉన్న కొన్ని పోస్టులను పరిశీలిస్తే..**

- సివిల్ ఎస్సై మొత్తం పోస్టులు 554 భర్తీ చేయాల్సి ఉండగా..తుది రాత పరీక్షకు 41,256 మంది పురుషులు, 11,530 మంది మహిళలు పోటీ పడుతున్నారు. సరాసరిన ఒక్కో పోస్టుకు 95 మంది పోటీ పడుతున్నారు.
- సివిల్ కానిస్టేబుల్ పోస్టులు 15,644 భర్తీ చేయనున్నారు. భారీ సంఖ్యలో పోస్టులు ఉన్నా...పోటీపడే అభ్యర్థుల సంఖ్యా అదే స్థాయిలో ఉంది. సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు ఏకంగా 22,882 మంది మహిళలు, 67,606 మంది పురుషులు పోటీలో ఉన్నారు. ఒక్కో పోస్టుకు దాదాపుగా ఆరుగురు బరిలో ఉన్నారు.
- మొత్తం 614 ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు గాను తుది రాత పరీక్షకు 59,325 మంది పోటీలో ఉన్నారు. అంటే ఒక్కో పోస్టుకు సరాసరిన 96 మంది పోటీ పడుతున్నారు.
- ఇక అత్యంత పోటీ ఉన్న పోస్టు రవాణా కానిస్టేబుల్ అని చెప్పాలి. మొత్తం 63 పోస్టులకు తుది రాత పరీక్షకు 747 మంది మహిళలు, 8,256 మంది పురుషులు పోటీలో ఉన్నారు. ఒక్కో పోస్టుకు సరాసరిన 142 మంది పోటీ పడుతున్నారు.
- ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై పోస్టులు 8 ఉండగా.. పోటీలో 1,921 మంది అభ్యర్థులు ఉన్నారు. అంటే ఒక్కో పోస్టుకు 240 మంది పోటీ పడుతున్నారు. కానిస్టేబుల్ మెకానిక్ 21 పోస్టులకు గాను 1,185 మంది, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో మూడు ఎస్సై పోస్టులకు 933 మంది, 100 డ్రైవర్ పోస్టులకు 6,504 మంది పోటీలో ఉన్నారు.

# పైగా టూంబ్స్‌కు అమెరికా సాయం

**పరిరక్షణ కోసం రూ.2.04 కోట్ల ఆర్థిక సాయం**



పైగా టూంబ్స్ వద్ద ఎలిజబెత్ జోన్స్, జెన్నిఫర్ లార్సెన్

సంతోష్‌నగర్ (హైదరాబాద్): భవిష్యత్తు తరాల కోసం అమూల్యమైన శిల్ప సంపదను పరిరక్షించాలని అమెరికా చార్జ్ డి అఫైర్స్ ఎలిజబెత్ జోన్స్ చెప్పారు. మంగళవారం ఆమె అమెరికా కాన్సుల్ జెన్నిఫర్ లార్సెన్‌తో కలిసి సంతోష్‌నగర్ ఒవైసీనగర్ కాలనీలోని పైగా టూంబ్స్ (సమాధి)ను సందర్శించారు. 18, 19వ శతాబ్దాల్లో నిర్మించిన పైగా సమాధుల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగమైనందుకు తాము గర్విస్తున్నామని ఎలిజబెత్ చెప్పారు. ఆరుకు పైగా సమాధుల పరిరక్షణ, పునరుద్ధరణకు కోసం అమెరికా 'అంబాసిడర్స్ ఫండ్స్ ఫర్ కల్చరల్ ప్రిజర్వేషన్ (ఏఎఫ్‌సీపీ)'రూ.2.04 కోట్ల సాయం చేసిందని ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చరల్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రతీష్ నందా తెలిపారు. ఈ ప్రాజెక్టును ఆగాఖాన్ ట్రస్ట్ అమలు చేస్తోందన్నారు. ఇది హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ ద్వారా నిధులు సమకూర్చిన ఐదో ప్రాజెక్టని కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ చెప్పారు. హైదరాబాద్‌లో కుతుబ్‌షాహీ టూంబ్స్ వద్ద తమ ఏఎఫ్‌సీపీ ప్రాజెక్టుల్లో ఒకదాన్ని ప్రారంభించే అదృష్టం తనకు దక్కిందన్నారు.

### భారతీయ టెక్ స్టార్టప్‌లపై.. టీ హబ్ 'గ్లోబల్ ఇమర్షన్'

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఆవిష్కరణల వాతావరణానికి మూల స్తంభంలా నిలుస్తోన్న 'టి హబ్'.. అమెరికాకు చెందిన టెక్నాలజీ యాక్సిలేటర్ సంస్థ ఫాల్కన్ ఎక్స్ భాగస్వామ్యంతో రెండో విడత 'గ్లోబల్ ఇమర్షన్ ప్రోగ్రామ్'ను ప్రారంభించింది. వివిధ రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను తమ ఉత్పత్తులు, ఆవిష్కరణల ద్వారా పరిష్కారం చూపుతున్న భారతీయ టెక్ స్టార్టప్‌లపై గ్లోబల్ ఇమర్షన్ కార్యక్రమం దృష్టి కేంద్రీకరిస్తుంది. మూడు వారాల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన అత్యుత్తమ స్టార్టప్‌లు అమెరికాలో తమ వాణిజ్య కార్యకలాపాలను విస్తరించుకునే అవకాశం లభిస్తుంది. ఎంపికయ్యే స్టార్టప్‌లకు సిలికాన్ వ్యాలీలోని 40కి పైగా ఎంట్రప్రెన్యూర్లు, పెట్టుబడుదారులు, నిపుణుల నుంచి మార్గదర్శనం లభిస్తుంది. ఎంపికైన స్టార్టప్‌లకు రూ.8 లక్షల నుంచి రూ.9లక్షల వరకు స్టైపండ్ లభిస్తుంది.

**ఎమర్జింగ్ టెక్నాలజీ స్టార్టప్‌లకు ఉపయోగం**

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, క్లీన్‌టెక్, హెల్త్‌టెక్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీ ఆధారిత స్టార్టప్‌లకు గ్లోబల్ ఇమర్షన్ ప్రోగ్రామ్ ఉపయోగపడుతుందని టీ హబ్ సీఈఓ ఎం.శ్రీనివాస్‌రావు తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదికపై 2047 నాటికి భారత్ అగ్రస్థానానికి చేరుతుందని, ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆవిష్కరణలు సాంకేతిక కీలక పాత్ర పోషిస్తాయని ఫాల్కన్ ఎక్స్ సహ వ్యవస్థాపకులు బీవీ జగదీష్ వెల్లడించారు. గ్లోబల్ ఇమర్షన్ ప్రోగ్రామ్ మొదటి విడతలో 60కి పైగా స్టార్టప్‌లకు పాల్గొనగా 9 స్టార్టప్‌లను ఎంపిక చేశామని వీటిలో సగానికి పైగా స్టార్టప్‌లకు నిధులు వచ్చాయని, మరో రెండు స్టార్టప్‌లను పెద్ద కంపెనీలు తీసుకున్నట్లు వెల్లడించారు. మంగళవారం టి హబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో టెక్, వెంచర్ కాపిటల్స్ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

### నిబంధనలు పాటించని సంస్థలో ప్లాట్లు కొనొద్దు: రెరా

సాక్షి, హైదరాబాద్: నిబంధనలు, అనుమతులు లేకుండా వెంచర్లను ఏర్పాటు చేసి స్థలాలు విక్రయిస్తున్న స్క్వేర్ యార్డ్స్ రియల్ ఎస్టేట్ సంస్థ వద్ద స్థిరాస్తులు కొనుగోలు చేయవద్దని తెలంగాణ స్టేట్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) స్పష్టం చేసింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన సదరు సంస్థకు సంబంధించిన వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేయవద్దని రెరా చైర్మన్ తెలిపారు. చేవెళ్లలో 12 ఎకరాల్లో, కిష్టాపూర్ 10.5 ఎకరాల్లో, కంచర్లలో 15 ఎకరాల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాస్, కాలనీల నిర్మాణానికి ప్రకటనలు ఇచ్చి, కొనుగోలు దారులను ఆకర్షించినట్లు పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి జరుగుతున్న ఈ రియల్ దందాను ఆపాలని వచ్చిన ఫిర్యాదుల మేరకు స్పందించినట్లు రెరా వెల్లడించింది.








మన ఆలోచనలతో
మనం ఈ ప్రపంచాన్ని రూపొందిస్తాం.
– బౌద్ధ ధర్మం



సాక్షి
బుధవారం, జనవరి, 11

# అర్థరహితమైన వివాదం

తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి స్వల్ప వ్యవధిలోనే మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఈసారి ఆ రాష్ట్ర అసెంబ్లీ అందుకు వేదికైంది. అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో సభనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. సభా సంప్రదాయానికి అనుగుణంగా రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన ప్రసంగ పాఠాన్ని ఆయన చదవాల్సివుండగా అందులోని కొన్ని వాక్యాలనూ, పదాలనూ ఆయన విడిచి పెట్టారు. పైగా కొన్నింటిని సొంతంగా చేర్చారు. దాంతో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గవర్నర్ తీరును నిరసిస్తూ ముఖ్యమంత్రి తీర్మానాలు ప్రవేశపెట్టడం, సభ వాటిని ఆమోదించటం అయి పోయింది. ఆ దశలో రవి అర్ధాంతరంగా సభ నుంచి నిష్క్రమించారు. తమిళనాట ద్రవిడ ఉద్యమ ప్రభావం ఇప్పటికీ ఎంత బలంగా ఉన్నదో అందరికీ తెలుసు. కేరళ క్యాడర్ ఐపీఎస్ మాజీ అధికారి అయిన రవికి దీనిపై పూర్తి అవగాహన ఉంటుందనటంలో సందేహం లేదు. మరి 'ద్రవిడ మోడల్ ప్రభుత్వం' ప్రస్తావన, పెరియార్ రామస్వామి, అన్నాదురై వంటి తమిళ దిగ్గజాలతోపాటు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రస్తావన సైతం రవికి ఎందుకు రుచించలేదో అనూహ్యం. ఒక పౌరుడిగా ఈ దిగ్గజాలపైనా, మొత్తంగా ద్రవిడ ఉద్యమంపైనా రవికి సొంతా భిప్రాయాలేవో ఉండివుండొచ్చు. అంతమాత్రాన తనకిచ్చిన ప్రసంగపాఠంలో ఆ ప్రస్తావనలను మినహాయించటం హర్షించదగ్గదికాదు. అసలు తమిళనాడు అనటంపైనే ఆయనకు అభ్యంతరం ఉన్నట్టుంది. ఈమధ్య రాజ్‌భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమం సందర్భంగా ఆయన 'తమిళనాడు'కు బదులు 'తమిళగం' అని అన్నారు. ఆ వెంటనే దానిపై పెద్ద వివాదం రాజుకుంది. 'నాడు' అంటే సార్వభౌమాధికారం ఉండే ఒక రాజ్యంగా ధ్వనిస్తూ వేర్పాటువాద భావన కలగజేస్తున్నదని రవి అభిప్రాయంగా కనబడుతోంది. తమిళ సాహితీవేత్తల వివరణ ప్రకారం 'నాడు' అంటే 'గడ్డ', 'ప్రాంతం' అనే తప్ప వేరే అర్థం లేదు. అసలు తమిళనాడు అనే పేరు రాజ్యాంగానికి అనుగుణ మైనదైనప్పుడు దానిపై పట్టింపులకు పోవటం సరైంది కాదు. అదింకా సద్దుమణగక మునుపే తాజా వివాదం తలెత్తింది.

మన ఫెడరల్ వ్యవస్థలో గవర్నర్ల పాత్రపై వివాదాలు చెలరేగడం ఇది మొదటిసారి కాదు... చివరిసారి కూడా కాకపోవచ్చు. నిజానికి అలాంటి సందర్భాల్లో తప్ప గవర్నర్ల వ్యవస్థపైనా, దాని అవసరంపైనా ఎవరూ ప్రశ్నలు లేవనెత్తడం లేదు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచీ ఇప్పటివరకూ ఎన్నో వ్యవస్థలపై చర్చలు సాగాయి. కొన్నింటి రూపురేఖలు కూడా మారాయి. కానీ సుప్రీంకోర్టు, కొన్ని హైకోర్టులూ తమముందుకొచ్చే కేసుల విచారణ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు, నిర్దేశించిన మార్గదర్శకాల పర్యవసానంగా ఏదోమేరకు మారింది తప్ప మొత్తంగా గవర్నర్ల వ్యవస్థ మునుపటి కాలంలో ఉన్నట్టే మిగిలిపోయింది. అందుకే సమస్యలు తప్పడం లేదు. అత్యంత ప్రజాస్వామ్య వాదిగా ముద్రపడిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూయే గవర్నర్ల వ్యవస్థపై తొలి మరక పడటానికి, ఫెడరల్ వ్యవస్థ మనుగడపై సందేహాలు ముసురుకోవటానికి కారకుడు కావటం ఒక వైచిత్రి. ఆనాటి కేరళ గవర్నర్ ద్వారా తనకు కావలసిన నివేదిక తెప్పించుకుని రాజ్యాంగంలోని 356 అధికరణ కింద 1959లో నంబూద్రిపాద్ నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వాన్ని సాగనంపేవరకూ నెహ్రూ విశ్రమించలేదు. అనంతరకాలంలో ప్రధాని అయిన ఆయన కుమార్తె ఇందిరాగాంధీ రికార్డు స్థాయిలో 50 సార్లు ఆ అధికరణాన్ని ఉపయోగించుకుని తనకు గిట్టని రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేశారు. అటుతర్వాత వచ్చిన సంకీర్ణ రాజకీయ యుగంలో దాన్ని పెద్దగా ఎవరూ ఉపయోగించ లేదు. విపక్ష ఏలుబడిలో ఉంటున్న రాష్ట్రాల్లో గవర్నర్లకూ, సీఎంలకూ వివాదం ఏర్పడే ధోరణి తరచు కనబడటం మాత్రం వాస్తవం. అలాగని అన్నిచోట్లా అలా లేదు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బిహార్ గవర్నర్‌గా ఉన్నకాలంలో అప్పటికి బీజేపీ వ్యతిరేక కూటమిలో ఉన్న నితీశ్ కుమార్ ముఖ్య మంత్రిగా ఉన్నా ఆ ఇద్దరి మధ్యా పొరపొచ్చాలు రాలేదు. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా గవర్నర్‌గా పనిచేసినప్పుడు పెద్దగా వివాదాల్లోకెక్కలేదు. కానీ కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, తెలంగాణ గవర్నర్ తమిళిసైలకు అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలతో పొరపొచ్చాలు ఎడతెగకుండా సాగుతూనే ఉన్నాయి.

తమిళనాడు గవర్నర్ తన వ్యవహారశైలితో ఏం చెప్పదల్చుకున్నారో అర్థంకాదు. ఆయన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు ప్రోత్సాహంతోనే ఇలా చేస్తున్నారని డీఎంకే నేతలు ఆరోపించటం వల్ల ఆ రాష్ట్రంలో బీజేపీకి రాజకీయంగా నష్టమే తప్ప లాభం ఉండదు. పైగా తమిళనాట నీరాజ నాలందుకునే పెరియార్, అన్నాదురైల పేర్లూ...అన్నిటికీ మించి అంబేడ్కర్ వంటి మహనీయుడి ప్రస్తావన ససేమిరా సమ్మతం కాదని పరోక్షంగా తెలియజెప్పటం ఏమేరకు సబబో రవి ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఒక రాష్ట్ర ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికీ, అక్కడ గవర్నర్‌గా నియమితులైనవారికీ మధ్య ఆధిపత్య పోరు ఎడతెగకుండా సాగటం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేకపోగా ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరని నష్టం కలగజేస్తుంది. ఇలాంటి వివాదాలు చెలరేగినప్పుడల్లా పరస్పరం విమర్శలు చేసుకోవటం, రాజ్యాంగ సంక్షోభం తలెత్తటం, ఆ తర్వాత మరో కొత్త తగువు బయల్దేరేవరకూ మౌనం వహించటం కాక... గవర్నర్ల అధికారాలు, వారి పరిధులు, పరిమితులపై సరైన దిశగా చర్చ జరిగి వర్తమాన కాలానికి అనుగుణమైన విధానం రూపుదిద్దుకోవటం శ్రేయస్కరం.

# గురి తప్పిన లక్ష్యాలు

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

**పెద్ద నోట్ల రద్దు వల్ల నల్లధనం తుడిచి పెట్టుకుపోతుందనీ, నగదు రహిత లావాదేవీలు 50 శాతానికి చేరుతాయనీ ప్రధాని అన్నారు. కానీ నగదు లభ్యత ఆరేళ్ల కిందితో పోల్చితే రెండు రెట్లు పెరిగింది. ప్రజలు పడిన కష్టాలు సరేసరి! కార్పొరేట్ ట్యాక్స్ గతంలో 30 శాతం ఉండగా దానిని 22 శాతానికి కుదించారు. దీనివల్ల పారిశ్రామిక రంగానికి ఊతం ఇచ్చినట్లవుతుందని చెప్పినా దేశీయ పారిశ్రామికోత్పత్తి వృద్ధిలో మెరుగుదల లేదు. 2014లో నిరుద్యోగిత రేటు 5.4 శాతం ఉండగా, అది ఇప్పుడు 9 శాతానికి చేరింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ స్థాయిలో నిరుద్యోగిత రేటు ఉండటం గతంలో ఎన్నడూ లేదు. ఇవేనా అచ్ఛేదిన్? ఇదేనా సబ్ కా సాథ్... సబ్ కా వికాస్?**

జబ్బు ఒకటయితే దానికి మందు మరొకటి వేస్తే ప్రయోజనం ఏముంటుంది, రోగం ముదరడం తప్ప? ఇటీవల పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశంలో చలామణీలో ఉన్న నగదు గురించి ఇచ్చిన సమాధానం చూసిన తర్వాత ఎవరికైనా ఎన్డీఏ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై ఇటువంటి సందేహం రాక మానదు. 2016 నవంబర్ 8న రాత్రి వేళ అప్పటి ఆర్థిక మంత్రి, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌లతో మాట మాత్రంగానైనా సంప్రదించకుండా ప్రధాని నరేంద్ర మోదీ రూ. 1,000, రూ. 500 నోట్లను తక్షణమే రద్దు చేసిన నిర్ణయం దేశాన్ని కుదిపేసింది. పెద్ద నోట్ల రద్దు వల్ల దేశంలో నల్లధనం చాలావరకు తుడిచి పెట్టుకుపోతుందనీ, దేశంలో 2 శాతంగా ఉన్న నగదు రహిత లావాదేవీలలో పారదర్శకత పెరిగి రాబోయే ఐదేళ్లకు 50 శాతానికి చేరుతాయనీ ప్రధాని నమ్మకంగా చెప్పారు. కాగా, ఆ నిర్ణయాన్ని ఆర్థిక రంగ నిపుణులైన అమర్త్యసేన్, సౌమిత్రి చౌదరి, మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా, బీపీఆర్ విఠల్ వంటి వారు తప్పుపట్టారు. పెద్ద నోట్లను రద్దు చేయడం వల్ల ప్రజలలో భయాందోళనలు కలిగాయి. ఏటీఎంల వద్ద జరిగిన తొక్కిసలాటలలో సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. ఇంకా అనేక విధాలుగా ప్రజలు కష్ట నష్టాలకు లోనయ్యారు. అయితే, నరేంద్ర మోదీ నిర్ణయాన్ని సమర్థించిన వారు కూడా ఉన్నారు. ముఖ్యంగా, ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల నేతలు పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశంలో డిజిటల్ విప్లవం రానున్నదని ఘనంగా సెలవిచ్చారు. కానీ ఈ 6 సంవత్సరాలలో జరిగిందేమిటి?

2016 నవంబర్ 8 నాటికి దేశంలో 16 లక్షల 41 వేల 571 కోట్ల రూపాయల విలువ గల కరెన్సీ చలామణీలో ఉండగా, 2022 డిసెంబర్ 2 నాటికి 31 లక్షల 92 వేల 622 కోట్ల రూపాయల నగదు చలామణీలో ఉందని నిర్మలా సీతారామన్ పార్లమెంట్ సాక్షిగా వెల్లడించారు. ఆరు సంవత్సరాల వ్యవధిలో నగదు లభ్యత రెండు రెట్లు పెరిగింది. డిజిటల్ లావాదేవీలు ఆశించిన స్థాయిలో జరగడం లేదని అర్థమవుతూనే ఉంది. ఇక, నల్లధనం ఏ మేరకు కట్టడి అయిందనే దానిపై లెక్కలు లేవు. ప్రజా జీవితాలకు సంబంధించి తీవ్రమైన నిర్ణయం తీసుకొనే సందర్భంలో పర్యవసానాలను శాస్త్రీయంగా అంచనా వేయకపోతే కలిగే నష్టాలు ఏమిటో 'పెద్దనోట్ల రద్దు' నిర్ణయంతో తెలిసొచ్చింది. అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థలలో పాలకులు తీసుకొనే సంస్కరణలు ప్రజాహితానికి అనుగుణంగా ఉండాలి.

2004–2014 మధ్య కాలంలో ప్రధానిగా ఉన్న మన్మోహన్ సింగ్ నేతృత్వంలో దేశం తిరోగమనంలో పయనించిందనీ, అందువల్ల తాను కొన్ని కఠిన నిర్ణయాలు, కఠోర విధానాలతో గాడితప్పిన దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి పట్టాల మీదకు ఎక్కించి పరుగులు పెట్టిస్తాననీ 2014 జూన్ మొదటివారంలో ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజులకే నరేంద్ర మోదీ దేశ ప్రజలకు స్పష్టం చేశారు. నిజానికి మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని పదేళ్ల యూపీఏ పాలనలో ఆర్థిక



స్థితిగతులు మెరుగ్గానే ఉన్నాయి. ప్రపంచ సంక్షోభం ఏర్పడిన 2008 ఆర్థిక సంవత్సరం మినహా మిగతా 9 ఏళ్ల దేశ స్థూల ఉత్పత్తిలో వృద్ధి రేటు సగటున 8 శాతం మేర నమోదయింది. ఆ తర్వాత 2014–2022 మధ్య 8 ఏళ్ల మోదీ పాలనలో ఒక్క 2020–21లో మాత్రమే అత్యధికంగా 8.95 శాతం మేర జీడీపీలో వృద్ధిరేటు కనిపించింది. అది కూడా అంతకుముందు ఏడాది కరోనా కారణంగా ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమై జీడీపీ వృద్ధిరేటులో క్షీణత కనిపించింది. దానితో పోల్చుకుంటే 2021–22లో ఆర్థిక వ్యవస్థ కుదుటపడటం వల్ల అధిక వృద్ధిరేటు నమోదయింది. 2014లో దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం దాదాపు 2 ట్రిలియన్‌ల డాలర్ల మేర ఉంది. గ్లోబల్ ర్యాకింగ్స్‌లో అప్పుడు భారత్‌ది 10వ స్థానం. ప్రస్తుతం 3 ట్రిలియన్ డాలర్లతో భారత్ 5వ స్థానం ఆక్రమించడం చెప్పుకోదగ్గ ఘనతే. కానీ, ఇతర సూచికల్లో భారత్ ఏ విధంగా పురోగమించింది?

వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను అతిపెద్ద పన్నుల సంస్కరణగా చెప్పుకొన్నారు. చేనేత, చివరకు ప్రాణాధార ఔషధాల మీద కూడా జీఎస్టీ విధించడం వల్ల పేదలు, మధ్యతరగతి ప్రజలపై పరోక్షంగా ఆర్థిక భారం పడుతున్నది. కేంద్రానికి సమకూరే ఆదాయాన్ని దామాషా పద్ధతిలో రాష్ట్రాలతో పంచుకొనే విధానానికి కూడా ఎన్డీఏ చెల్లుచీటి పాడింది. కొన్ని రంగాలపై ఎన్డీఏ ప్రభుత్వం విపరీతంగా సెస్సు (ప్రత్యేక పన్ను) విధిస్తున్నది. గతంలో కూడా పెట్రోల్, డీజిల్, రహదారులు మొదలైన రంగాలలో 'సెస్సు'లు ఉన్న మాట నిజమే. కాకపోతే ఆ మొత్తం ఇప్పుడు ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఉదాహరణకు 2013–14 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వానికి సెస్సు రూపంలో లభించిన మొత్తం రూ. 73,880 కోట్లు కాగా, 2021–22 ఆర్థిక సంవత్సరం నాటికి కేంద్రానికి సెస్సు ద్వారా పోగుపడిన మొత్తం రూ. 2,96,884 కోట్లు. అంటే గత 7 ఏళ్లల్లో సెస్సుల ద్వారా కేంద్రం అంతకుముందు కంటే 3 రెట్ల మొత్తాన్ని తన ఖజానాలో వేసుకుంది. ఇందులో రాష్ట్రాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. నిజానికి, 'సెస్సు'ను ఏ రంగం నుంచి అయితే వసూలు చేస్తారో, ఆ మొత్తాన్ని ఆ రంగం అభివృద్ధికే ఖర్చు చేసే సంప్రదాయం ఉంది. కానీ, ఎన్డీఏ ప్రభుత్వం సెస్సు నిధులను ఇతర రంగాలకు దారి మళ్లిస్తోంది. ఒక్క సెస్సుల రూపంలోనే దేశ ప్రజలు రోజుకు రూ. 813 కోట్లు మేర కేంద్రానికి చెల్లిస్తున్నారు.

కార్పొరేట్ ట్యాక్స్ గతంలో 30 శాతం ఉండగా దానిని 22 శాతానికి కుదించారు. దీనివల్ల పారిశ్రామిక రంగానికి ఊతం ఇచ్చినట్లవుతుందని చెప్పినప్పటికీ దానికి ఫలితాలు కనబడటం లేదు. గత 8 ఏళ్లల్లో దేశీయ పారిశ్రామికోత్పత్తి వృద్ధిలో చెప్పుకోదగ్గ మెరుగుదల నమోదు కాలేదు. ఎగుమతుల రంగంలో ఏటా సగటున 100 బిలియన్ల డాలర్ల మేర పెరుగుదల నమోదు అవుతున్నప్పటికీ, సాపేక్షంగా దిగుమతులు పెరిగిపోతున్నాయి. ఫలితంగా, 'బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్'లో లోటు ఏర్పడి రూపాయి విలువ క్రమంగా క్షీణిస్తోంది. 2014లో డాలర్ విలువ 52 రూపాయలుండగా, ప్రస్తుతం 82 ఉంది.

రెండుళ్లుగా దేశాన్ని అల్లకల్లోలం చేసిన కరోనా నుంచి ఇప్పుడిప్పుడే క్రమంగా కోలుకొంటున్నప్పటికీ దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగిత ప్రమాద ఘంటికల్ని మోగిస్తోంది. 2014లో నిరుద్యోగిత రేటు 5.4 శాతం ఉండగా, అది ఇప్పుడు దాదాపు 9 శాతానికి చేరినట్లు సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) తెలిపింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ స్థాయిలో నిరుద్యోగిత రేటు ఉండటం గతంలో ఎన్నడూ లేదు. ప్రతియేటా దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో 2 కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తామని మోదీ ఇచ్చిన హామీ నీటిపై రాతగానే మిగిలిపోయింది.

మరోవైపు దేశంలో సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రపంచ కుబేరుల జాబితాలో భారతీయుల సంఖ్య 100 దాటినట్లు ఫోర్బ్స్ పత్రిక వెల్లడించింది. 2014–15లో దేశంలో సగటు తలసరి ఆదాయం రూ. 86,454 కాగా, 2020–21 నాటికి అది రూ. 1.32 లక్షలకు చేరింది. తలసరి ఆదాయంలో పెరుగుదల సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవన స్థితిగతుల మెరుగుదలకు నిజమైన సూచికగా భావించవచ్చునా? సంపన్నులు మరింత సంపన్నులవుతున్నారు. పేదలు మరింత పేదలవుతున్నారు. కనుక తలసరి ఆదాయ గణాంకాలు నిజమైన అభివృద్ధికి సూచికలు కావు. మరోవైపు రైల్వేలు, ఓడరేవులను ప్రైవేటుపరం చేసిన కేంద్రం త్వరలోనే 25 విమానాశ్రయాలను లీజుల ద్వారా ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడానికి సిద్ధం అయింది. ఇవన్నీ గమనించినప్పుడు భారత ఆర్థిక రంగం 'మేడిపండు'లాగే కనిపిస్తోంది. దేశంలో పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులను పెంచకుండా, ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపర్చకుండా, విలువైన సహజ వనరుల్ని ఉపయోగించుకోకుండా ఆర్థిక వ్యవస్థ ఎలా పటిష్టం అవుతుంది? స్థిరమైన పెట్టుబడులు, ఎగుమతులు, విదేశాలతో మెరుగైన వాణిజ్య సంబంధాలు, సరళీకృతమైన పారదర్శక ఆర్థిక విధానాలు, భారం పడని పన్నుల విధింపు తదితర చర్యలు మాత్రమే దేశ ఆర్థిక రంగాన్ని సుస్థిరపర్చగలవు.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### వాడుకుని వదిలేస్తారా?



కశ్మీర్ పండిట్ ఉద్యోగులు 245 కంటే ఎక్కువ రోజుల నుంచి తమ 'జీవించే హక్కు' కోసం నిరసన తెలియజేస్తున్నారు. వాళ్ల వేతనాలను నెలలుగా అట్టిపెట్టారు. భద్రతను గాలికి వదిలేశారు. 'వాడుకో, వదిలెయ్' అనే బీజేపీ విధానమే వారి దురవస్థకు కారణం.

– మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

### ఏం సాధించినట్టు?



పాకిస్తాన్ 1947లో భారత్‌తో విడిపోయింది. ఇప్పుడు భారత్ స్థానికంగా తయారు చేసిన మిలిటరీ ట్రక్కులను మొరాకో లాంటి ముస్లిం దేశాలకు ఎగుమతి చేస్తుండగా, పాకిస్తాన్ 8 బిలియన్ డాలర్ల విదేశీ సాయం పొందడానికి అల్లాడింది. ఎగతాళి చేయడం లేదు. మత ఆధారిత వేర్పాటువాదం ఏమీ సాధించలేదు.

– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

### ఆరోగ్య సమస్యలొచ్చాయి



టీకా వేసుకోవడానికి బదులుగా నేను చాలా ముందుగానే కోవిడ్ కుట్ర సిద్ధాంతదారుగా ఉండవలసిందని ఇప్పుడు అనుకుంటున్నాను. నా ఆరోగ్యం దెబ్బతింది. గుండె ఫెయిల్ అయినంత పనైంది. మరోవైపు కుట్ర సిద్ధాంతదారులు ఆరోగ్యంగా ఉన్నారు.

– ర్యాన్ కన్నింగ్‌హామ్, యూఎస్ క్యాంపెయిన్ మేనేజర్

### అనవసర ఆర్భాటం



ఏటా ఆస్కార్ 'అతి సుదీర్ఘ లిస్ట్'పై జరిగే అనవసర అర్భాటం గురించి 2018లోనే రాశాను. ఈ సినిమాలన్నీ కేవలం అర్హత సాధించాయే తప్ప ఆస్కార్ అకాడమీ ఎంపిక చేసినట్టు కాదు! ఇదేం గొప్ప విషయం కాదు. వాసూ భగ్నానీ 'యంగిస్తాన్' కూడా అప్పట్లో ఈ జాబితాకు ఎక్కింది.

– నమ్రతా జోషీ, సినీ విమర్శకురాలు

### ఎందుకీ భయం?



చేపలు తిని పాలు తాగితే మా అమ్మ కేకలేస్తుంది. భారతీయ, పాకిస్తానీ తల్లులేనా? అమ్మలు అందరూ ఇట్లాగే ఉంటారా?

– ఉజైర్ రిజ్వీ, జర్నలిస్ట్


# ప్రెస్ – పిక్చర్ – ప్లాట్‌ఫాం!

కలంతో, గళంతో సాహిత్య–సాంస్కృతిక సాఫల్యం సాధించిన తెలుగు పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు. 4,000కు పైగా జీవిత చరిత్రలు, 16,000కు పైగా ప్రసంగాలు చేసి, ప్రపంచ రికార్డు సృష్టించిన తుర్లపాటి కీర్తికాయుడై నేటికి రెండు సంవత్సరాలు.

ముక్కుసూటితనం, చొరవ మూర్తీభవించిన నిజాయితీతో తుర్లపాటి మొదటినుండీ ప్రత్యేకమైన, ప్రతిష్ఠాత్మకమైన సందర్భాలను సొంతం చేసుకున్నారు. స్వరాజ్యనిధికి 5 రూపాయలు ఇస్తేగానీ ఆటోగ్రాఫ్ ఇవ్వని మహాత్మాగాంధీ వద్ద నుండి ఉచితంగా ఆటోగ్రాఫ్ పొందారు. తన 19వ ఏటనే టంగుటూరి ప్రకాశం పంతులు వద్ద కార్యదర్శిగా చేరారు. నార్ల వెంకటేశ్వరరావుకు ఏకలవ్య శిష్యునిగా తనను భావించుకునేవారు. పత్రికా రంగంలో ఆచార్య ఎన్జీ రంగా ప్రారంభించిన 'వాహిని'తో మొదలై, 'ప్రతిభ' పత్రికకు మారి, తర్వాత టంగుటూరి ప్రకాశం పంతులు కోరిక మేరకు 'ప్రజా పత్రిక'కు తన సేవలందించారు. తదనంతరం 'ఆంధ్రజ్యోతి', 'జ్యోతి చిత్ర' పత్రికలలో పనిచేస్తూ, అలా 70 సంవత్సరాలకుపైగా వివిధ స్థాయిలలో విలువైన సేవలందించిన అతి కొద్దిమంది పాత్రికేయులలో ప్రముఖమైన స్థానం సంపాయించారు.

తెలుగు పత్రికా రంగంలో కళాప్రపూర్ణ, పద్మశ్రీలను అందుకున్న ఏకైక వ్యక్తి తుర్ల పాటి. ఆయనపై బీబీసీ వారు, జపాన్ మీడియా వారు తీసిన ప్రామాణికమైన డాక్యుమెంటరీలు ఆయన ప్రతిభను తేటతెల్లం చేశాయి. ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యునిగా సేవలందించారు. పలు సభలలో జాతీయ స్థాయి నాయకుల, ప్రభుత్వాధినేతల అన్య భాషా ప్రసంగాలకు దీటైన అనువాదకులుగా అందరినీ మెప్పించారు. దశాబ్దాల క్రితమే ఇప్పుడున్నంత సమాచార వ్యవస్థ లేని కాలంలోనే 'వార్తలలోని వ్యక్తి' అనే శీర్షికతో దాదాపు 50 సంవత్సరాలపాటు ప్రముఖుల జీవిత రేఖా చిత్రాలు అందించారు. ఆ వివరాలను ఎక్కడెక్కడి నుండి ఆయన సేకరించారో అనే ఆశ్చర్యం చదువరుల వంతయ్యేది. బహుశా 5 దశాబ్దాల పాటు పత్రికలలో కొనసాగిన అరుదైన ఘనత శీర్షికా రచయితగా తుర్లపాటిది. ఆయన ఇతర రచనలు క్లుప్తతనూ, సరళ తనూ నింపుకున్న సమాచార సముద్రాలు.

18 మంది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రు లతో ఆయనకు గాఢమైన సత్సంబంధాలు ఉండేవి. రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, తుర్లపాటి ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయన చేతుల మీదుగా సత్కారాలు పొందిన కళాకారులు అందరూ 'గజా రోహణం – గండపెండేరాలు' పొందినంత సంబరపడి పోయేవారు. ఆయన ద్వారా 'నటసామ్రాట్' అన్న బిరుదు పొందిన అక్కినేని కూడా, తాను పొందిన ఎన్నెన్నో బిరుదులన్నింటికన్నా ఆ బిరుదే అత్యంత ఇష్టమైనదని చెప్పేవారు.



తుర్లపాటి కుటుంబరావు

'మనసున మల్లెల మాలలూగెనే – కన్నుల వెన్నెల డోలలూగెనే' తుర్లపాటికి ప్రాణప్రదమైన పాట. ఎప్పుడూ ఆ పాటను ఎంతో ఆర్తితో పాడించుకునేవారు. తల్లి – బంధువులు మందలించినప్పటికీ, ప్రేమ వివాహం చేసుకున్న కృష్ణ కుమారిని 'ఏమండీ' అని సంబోధించే అలవాటు, ఆయనకు మహిళల పట్ల ఉన్న నిజమైన గౌరవానికి సూచిక. ఆమె పట్ల ప్రేమ–గౌరవాలతో ఆయన స్థాపించిన సాంస్కృతిక సంస్థ 'కృష్ణ కళాభారతి'. పలు సంస్థలవారు చేసే కార్యక్రమాలలో తమ సహ నిర్వహణ సంస్థగా ఈనాటికీ అభిమానంగా పేరు వేస్తూ తమ నివాళి అర్పిస్తున్నారు. తన 87 సంవత్సరాల సుదీర్ఘ జీవితంలో భార్య, కుమార్తెలను పోగొట్టుకున్నా, తనకి కేన్సర్ వ్యాధి వచ్చినా, స్థితప్రజ్ఞతతో, దృఢసంకల్పంతో కష్టాలను, అనారోగ్యాన్ని జయించిన విజేత తుర్లపాటి.

– గోళ్ల నారాయణరావు, ప్రధాన కార్యదర్శి
కామ్రేడ్ జి.ఆర్.కె.–పోలవరపు సాంస్కృతిక సమితి
(నేడు తుర్లపాటి కుటుంబరావు వర్ధంతి)

# ఆదివాసుల హృదయ దీపాలు

సందర్భం



సుమనస్పతి రెడ్డి

తూర్పు గోదావరి జిల్లా కొండ అడవుల్లో డాక్టర్ ఊర్మిల పింగ్లె తీసిన ఇక్కడ కనిపిస్తున్న ఫొటో... హైమండార్ఫ్ దంపతులు కలిసి ఉన్న దాదాపు తుది చిత్రం. పదవీ ఉద్యోగాలు లేకపోయినా మానవ శాస్త్రవేత్తగా తనతో యాభై ఏళ్లుగా వెన్నెముకలా ఉండి అలుపెరగకుండా కలిసి పని చేసిన బెట్టీ సాహచర్యం గురించి లోతుగా తలపోస్తున్నట్టు క్రిస్టోఫ్ హైమండార్ఫ్ కనిపిస్తున్నారు ఈ చిత్రంలో. ఆ తర్వాత కొద్ది రోజులకే హైదరాబాద్‌లో 11 జనవరి 1987 నాడు బెట్టీ అని అందరూ అభిమానంగా పిలిచిన ఎలిజబెత్ హైమండార్ఫ్ గుండెపోటుతో హఠాత్తుగా ప్రాణాలు విడిచారు. ఆమె మరణం క్రిస్టోఫ్ హైమండార్ఫ్‌ను బాగా కుంగదీసింది. ఆ తర్వాత ఎనిమిదేళ్లకే ఆయన కూడా తనువు చాలించారు.

భారత్ ఈశాన్య ప్రాంతంలోని కొన్యక్ నాగాలు, ఆపతానీలు, హైదరాబాద్ నిజాం సంస్థానంలోని చెంచులు, కొండ రెడ్లు, రాజ గోండులు, ఇంకా నేపాల్ షేర్పాలు, మధ్య ప్రదేశ్ భిల్లులు... ఈ జాతుల గురించి క్రిస్టోఫ్ వాన్ ఫ్యూరర్ హైమండార్ఫ్ చేసిన పరిశోధనలు ఇప్పటికీ ప్రామాణికంగా నిలుస్తున్నాయి. అయితే వీటన్నింటిలో ఆదిలాబాద్ రాజ్ గోండులతో ఆయన 1940ల్లో ఏర్పరచుకొని, జీవన పర్యంతం కొనసాగించిన బాంధవ్యానికి సాటి రాగలిగినది ఏదీ లేదు. మార్లవాయి గ్రామంలో రాజ్ గోండుల మధ్య వారిలో ఒకరిగా ఒక గుడిసెలో జీవిస్తూ వారి సంప్రదాయాలు, పురాణాలను, వారి గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని సాధికారికంగా నమోదు చేస్తూ, ఆదివాసీ జీవన దృక్పథ సార్వజనీనమైన విలువను గుర్తుండి పోయేలా ఆవిష్కరించగలిగారు.

హైదరాబాద్ సంస్థానంలోని ఆదివాసీలను దాదాపు మూడు సంవత్సరాల పాటు అధ్యయనం చేసిన తరువాత 1945లో, ఆయన విశ్లేషణల నాణ్యతను చూసిన నిజాం ప్రభుత్వం ఆయనను గిరిజన తెగలు, వెనుకబడిన తరగతుల సలహాదారుగా నియమించింది. సంస్థానంలోని ఆదివాసీల అభ్యున్నతికి కీలకమైన నూతన ప్రణాళికల రూపకల్పన, వాటి అమలు బాధ్యతలను ఆయనకు అప్పగించారు. ఆ పదవిలో ఉంటూ కుమ్రం భీం తిరుగుబాటు, వీర మరణం తరువాత పూర్తిగా ధైర్యాన్ని కోల్పోయి, తీవ్రమైన నిరాదరణకు గురవుతున్న ఆదిలాబాద్ జిల్లా గోండుల కోసం తొలి పాఠశాలలు ఏర్పరిచి, భూములు లేని వేలాది ఆదివాసీ కుటుంబాలకు దాదాపు 160 వేల ఎకరాల భూమిని పట్టాలతో సహా అందించి వారి సమగ్ర పునరుజ్జీవనానికి గొప్ప పునాది వేయగలిగారు హైమండార్ఫ్. 1950లో లండన్‌కు వెళ్లి పోయిన తర్వాత కూడా తరచుగా ఆదిలాబాద్‌ను సందర్శిస్తూ గోండుల బాగోగుల గురించి తెలుసుకుంటూ ఉండేవారు హైమండార్ఫ్ దంపతులు. 1960ల తరువాత బయటి నుండి వచ్చిన చొరబాటుదారుల దురాక్రమణకు ఆదివాసీల భూములు గురికావడం, వారి పరిస్థితి మళ్లీ హీనం కావడం హైమండార్ఫ్ దంపతులను ఎంతో బాధించేది.

తమను ఎంతో ఆదరించి, అభిమానించిన గోండుల సన్నిధిలో మార్లవాయి లోనే తమ సమాధులు ఉండాలని హైమండార్ఫ్ దంపతులు కోరుకున్నారు. బెట్టి మరణం తర్వాత, ఆమె అస్థికలను మార్లవాయికి తీసుకు వచ్చి, ప్రేమాభిమానాలతో తరలివచ్చిన వేలాది ఆదివాసీల సమక్షంలో మార్లవాయి గ్రామం పక్కనే ఖననం చేశారు. క్రిస్టోఫ్ అవశేషాలను కూడా ఆయన మరణించిన చాలా ఏళ్ళ తర్వాత బెట్టి సమాధి పక్కనే పూడ్చి మరో సమాధి నిర్మింపజేశారు.



హైమండార్ఫ్ దంపతులు

బెట్టి వర్ధంతినే హైమండార్ఫ్ దంపతుల ఉమ్మడి సంస్మరణ దినంగా ప్రతి ఏడాది మార్లవాయి గ్రామంలో 11 జనవరి నాడు నిర్వహిస్తూ వస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఇది పెద్ద కార్యక్రమంగా వికసిస్తూ వస్తున్నది. మార్లవాయి గ్రామ గుసాడి నృత్య కళాకారుడు కనక రాజుకు పద్మశ్రీ గౌరవం దక్కడం దీనికి తోడయ్యింది. తమ జాతి సంస్కృతిని అధ్యయనం చేసి, తమ అభ్యున్నతి కోసం పరితపించిన మానవ శాస్త్రవేత్త దంపతులకు ఆ జాతి నుంచి లభించిన ఇటువంటి ఆరాధనకు సాటిరాగల ఉదాహరణ మరెక్కడా లేదేమో!

1980వ దశకం నుండి చివరిదాకా హైమండార్ఫ్ దంపతులను బాగా ఎరిగిన, క్రిస్టోఫ్‌తో కలిసి రెండు పరిశోధన గ్రంథాలను కూడా రాసిన ఊర్మిళ పింగ్లె, బెట్టి వ్యక్తిత్వాన్ని గుర్తు చేసుకుంటూ ఇలా అన్నారు : 'తనను కలిసిన వారందరి పట్లా గొప్ప అనురాగం చూపుతూ... గొప్ప చమత్కారం, హాస్య దృష్టిలతో జీవ చైతన్యం ఉట్టిపడుతూ ఉండేది ఆమె. ఆదివాసీ సమాజాల పరిస్థితి పట్ల ఎనలేని సానుభూతితో వారి అభ్యున్నతి కోసం అంతటా వాదిస్తూ ఉండేది. తన భర్తకు నిజమైన ఆత్మబంధువుగా నిలిచిన వ్యక్తి!'

వ్యాసకర్త ఆకాశవాణి విశ్రాంత అధికారి | 96761 80802
(నేడు హైమండార్ఫ్ దంపతుల సంస్మరణ దినం)

# ఈగ – తేనెటీగ

అదొక ఆశ్రమం. ఒక శిష్యుడు 'గురువుగారూ... మీరు ప్రకృతి గురించి, ఇతర ప్రాణుల గురించి అనేక విషయాలు చెప్తూ వస్తున్నారు. వాటి నుంచి అనేకం నేర్చుకోవచ్చన్నారు. అయితే నాలాంటి సామాన్యులైన విద్యార్థులు ఓ ఈగ నుంచి ఏం నేర్చుకోవచ్చో చెప్పగలరు' అన్నాడు.

'శిష్యా! మంచి ప్రశ్న వేశావు. ఈగ దేనిపైనా ఎక్కువసేపు దృష్టి పెట్టకుండా తిరుగుతూనే ఉంటుంది. పూవు మీద వాలినా, తేనెను రుచి చూసినా దానిని తనతో తీసుకుపోదు.



జ్యోతిర్మయం

నీలాంటి విద్యార్థి పాఠం చదువుతున్నప్పుడు ఈగలాగే మనసు ఎక్కడెక్కడికో తిరగడానికి పోతుంటుంది. అటువంటి మనసుని పక్కకు పోనివ్వకుండా చదువుతున్న పాఠంమీదే ఏకాగ్రత వహించాలి అనేది ఈగ ప్రవర్తన నుంచి నేర్చుకోవలసిన పాఠం' అన్నారు గురువుగారు.

అనంతరం ఇంకొక శిష్యుడు 'అలాగైతే మరి మేం దేనిలా ఉండాలి' అని అడిగాడు. 'ఒక్కొక్క విద్యార్థీ తేనెటీగలా ఉండాలి. తేనెటీగ ప్రతి పువ్వు దగ్గరకు వెళ్ళి ఎంతో పొందికగా ఆ పువ్వులోని మకరందాన్ని సేకరిస్తుంది. ఏ పువ్వు నుంచి తేనె స్వీకరించినా మొదటగా దానిని తన నోటి నాళంలోకి పోనిస్తుంది. అక్కడి నుంచి తన గూటికి పోయి అక్కడ పద్ధతి ప్రకారం నిల్వ చేస్తుంది. అలాగే విద్యార్థి కూడా తాను చదివే వేద వేదాంగాలనూ అర్థం చేసుకుని సారాన్ని తనలో నిలుపుకోవాలి. అలా ఉంచుకున్న విషయాలు ఇహలోకంలో ఆదర్శ జీవనం గడపడానికే కాదు... దైవ సాయుజ్యాన్ని పొందటానికీ ఉపయోగపడతాయి. ఈగ మీరు ఎలా ఉండకూడదో చెబుతుంటే... తేనెటీగ మీరు ఎలా ఉండాలో చెబుతోంది' అని గురువుగారు సమాధానం ఇచ్చారు.

– యామిజాల జగదీశ్



గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** బ.చవితి ప.11.34 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** మఖ ఉ.9.37 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** సా.6.15 నుండి 8.01 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.44 నుండి 12.31 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.01 నుండి 8.44 వరకు : **రాహుకాలం** : ప.12.00 నుండి 1.30 వరకు : **యమగండం** : ఉ.7.30 నుండి 9.00 వరకు : **సూర్యోదయం** 6.38 : **సూర్యాస్తమయం** 5.39.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

## క్లుప్తంగా...

### లడ్డూల వివాదంపై విచారణ నేడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో ఏర్పడిన లడ్డూ ప్రసాదం వివాదంపై దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ బుధవారం విచారణ చేపట్టనుంది. లడ్డూలు బూజు పట్టాయంటూ పోలీసులకు భద్రాచలం మేజిస్ట్రేట్ ఫిర్యాదు చేయడం, వంటశాలను సీజ్ చేయడానికి వచ్చిన పోలీసులను దేవస్థానం సిబ్బంది అడ్డు కోవడంతో వాగ్వాదం జరగడం.. నమూనాలను పరీక్షల కోసం హైదరాబాద్ పంపించడం తెలిసిందే. కాగా ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన దేవాదాయ శాఖ కమిషనర్ దేవాదాయ శాఖ అదనపు కమిషనర్, భద్రాచలం ఆర్డీవో, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్లతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు.

### వేదామృతం పేరుపై అభ్యంతరమెందుకు?



సాక్షి, హైదరాబాద్: ప్రకృతి పానీయమైన నీరాకు 'వేదామృతం' అని పేరు పెడితే కించపరిచినట్టు ఎలా అవుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయఅధ్యక్షుడు జాజుల శ్రీని వాస్ గౌడ్ మంగళవారం ఓ ప్రకటన లో ప్రశ్నించారు. కల్లు, నీరా ఆయుర్వేదానికి చెందినవనే వాస్తవాన్ని బ్రాహ్మణ సంఘాలు గుర్తించాలని ఆయన కోరారు. లక్షలాది మంది గీత వృత్తి మీద ఆధారపడిన విషయాన్ని కొన్ని బ్రాహ్మణ సంఘాలు గుర్తించకుండా వితండ వాదానికి దిగడం ఎంతవరకు సమంజసం? అని నిలదీ శారు. ప్రకృతి సిద్ధంగా తాటి, ఈత చెట్ల నుంచి తీసే స్వచ్ఛమైన పానీయాన్ని సీసాలు, ప్యాకెట్లలో విక్రయించే కేంద్రానికి రాష్ట్ర ప్రభు త్వం వేదామృతం అనే పేరు పెట్టిందన్నారు. దేవుళ్ల పేరుతో లిక్కర్ షాపులు, హోటళ్లు, లాడ్జీలు, చివరికి క్లబ్‌లు ఉన్నాయని, వాటిపై లేని అభ్యంతరం నీరాపై ఎందుకన్నారు.

### నీరాను వేదామృతం అంటే తప్పా?



బాలరాజు గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): స్వచ్ఛమైన ప్రకృతి పానీయం నీరాకు వేదామృతం అనే పేరు పెడితే కించపరిచినట్లు ఎలా అవుతుందని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బలగౌని బాలరాజు గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్ కుమార్ ప్రశ్నించారు. మంగళవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాల యంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. బ్రాహ్మణ సంఘాలు ఇలాంటి వ్యతిరేక ఆలోచనలు మానుకోవాలని కోరారు. ప్రకృతి సిద్ధంగా తాటి, ఈత చెట్ల నుంచి సూర్యరశ్మి రాక ముందే తీసే స్వచ్ఛమైన పానీయం నీరా.. అని వారు స్పష్టం చేశారు. అమృతం అంటే సురా అని, సురా అంటే నీరా అని, నీరా అంటే కల్లు అని.. అవగాహన లేనివారు తప్పుడు ప్రకటనలు చేయడం.. తెలంగాణలోని లక్షలాది మంది గీత వృత్తి దారులను అవమానించడమే అవుతుందని విమర్శించారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్.. సర్దార్ పాపన్న గౌడ్ స్ఫూర్తితో నీరాకు వేదామృతం అని పేరు పెట్టడాన్ని హర్షిస్తు న్నట్టు తెలిపారు.

### నీరాకు వేదామృతం పేరు సబబు కాదు



నల్లకుంట (హైదరాబాద్): నీరా (కల్లు)కు వేదామృతం అని పేరు పెట్టడం సమంజసం కాదని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణా రావు అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లా డుతూ.. నీరా హబ్ ఏర్పాటు నేపథ్యంలో నీరాకు ఆ పేరు పెట్టిన ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీరును తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు. నీరాకు వేదామృతంగా పేరు పెట్టడం పవిత్రమైన వేదాలను కించపరచడ మేనని స్పష్టం చేశారు. వెంటనే సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని నీరాకు పెట్టిన ఆ పేరును తొలగింపజేయాలని ఆయన డిమాండ్ చేశా రు. మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ టీబీఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తుందని రమణారావు స్పష్టం చేశారు.

### అంబేడ్కర్‌పై వ్యాఖ్యలకు నిరసన



కవాడిగూడ (హైదరాబాద్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏపీలోని కర్నూలు జిల్లా రాయలసీమ యూనివర్సిటీ సూపరింటెండెంట్ ఇస్మాయిల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. ఇస్మాయిల్ వ్యాఖ్యలను నిరసిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. చెన్నయ్య మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏపీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వ్యవసాయ శాఖలో అలజడి

- ఉన్నతాధికారుల వివక్షపై ఉద్యోగుల అసంతృప్తి
- డైరీ ఆవిష్కరణకు మంత్రి నిరంజన్‌రెడ్డిని పిలవని ఒక సంఘం
- అదే సభకు మరో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరుతో రచ్చ
- వేధింపులకు భయపడొద్దని మంత్రి శ్రీనివాస్ గౌడ్ భరోసా

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ శాఖలో అలజడి చెలరేగింది. ఈ శాఖలోని ఒక సంఘానికి చెందిన ఉద్యోగులు వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి, కార్యదర్శి రఘునందన్‌రావుపై బహిరంగంగా తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాక నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ సభకు సంబంధిత శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, కార్యదర్శి రఘునందన్ రావును ఆనవాయితీగా ఆహ్వానించాల్సి ఉండగా, వారు ఏమాత్రం పట్టించుకోలేదు. అంతటితో ఆగక పుండు మీద కారం చల్లినట్లుగా ఈ శాఖకు సంబంధం లేని మరో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సభకు ఆహ్వానించడం పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. డైరీ ఆవిష్కరణ సభ వాడీవేడిగా కొనసాగింది. సగానికిపైగా ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే ఒక సంఘం ఇలా చేయడంతో ఒక్కసారిగా వ్యవసాయ శాఖలో కలకలం చెలరేగింది.

#### వివక్ష.. వేధింపుల వల్లే?

వ్యవసాయ శాఖలో రెండు సంఘాలున్నాయి. అందులో తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ కీలకమైంది. ఈ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ సభ మంగళవారం హైదరాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగింది. దీనికి ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు హాజరయ్యారు. సాధారణంగా ఏటా వ్యవసాయ శాఖ మంత్రిని, కార్యదర్శిని పిలవడం ఆనవాయితీ అయినా, కావాలనే వారిని ఆహ్వానించలేదని, ఈ శాఖ మంత్రిని కాకుండా మరో మంత్రిని పిలిచారని తీవ్రమైన రచ్చ జరుగుతోంది. తమ సంఘంపై వివక్ష చూపడం, సంఘం సభ్యులను ఇష్టారాజ్యంగా వివిధ ప్రాంతాలకు పంపించడం, వేధింపులకు గురిచేయడం జరుగుతోందని ఉద్యోగ నేతలు మండిపడుతున్నారు. ఈ విషయంపై బహిరంగంగానే తమ నిరసన వ్యక్తం చేశారు.



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

#### విజిలెన్స్ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారు

ఈ సభలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజారత్నం మాట్లాడుతూ, తమ సంఘంపై వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విజిలెన్స్ దాడుల పేరుతో ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. తమ అసోసియేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులు ఉన్నందుకే ఈ వివక్ష అని మండిపడ్డారు. తమ సంఘానికి మద్దతు ఇచ్చే వారిని బదిలీ పేరుతో బయటికి పంపిస్తున్నారని ఆరోపించారు. 317 జీవో పేరుతో 15 మందిని బదిలీ చేశారన్నారు. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ, వ్యవసాయ శాఖలో 2018 తరువాత ఎలాంటి పదోన్నతులు ఇవ్వలేదన్నారు. రెండు సంఘాల మధ్య గొడవలు ఉన్నందునే పదోన్నతులు ఇవ్వలేదని చెప్తున్నారన్నారు. తమ నిరసనను వ్యక్తం చేయడం కోసమే డైరీ ఆవిష్కరణకు మంత్రి నిరంజన్‌రెడ్డిని, కార్యదర్శి రఘునందన్ రావును ఆహ్వానించలేదన్నారు. తమకు అనుకూలంగా ఏమీ చేయకున్నా ఫర్వాలేదని, కానీ ఇబ్బందులకు గురిచేయవద్దని ఆయన వారికి విజ్ఞప్తి చేశారు. శాఖలో ఒకరిద్దరు చీడ పురుగుల్లా తయారయ్యారన్నారు. వాళ్లు చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

#### వివక్ష తగదు: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

డైరీ ఆవిష్కరణ అనంతరం మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, వ్యవసాయ శాఖలో ఉద్యోగులపై వివక్ష తగదని అన్నారు. ఈ విషయాన్ని తాను సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సాటి ఉద్యోగులపై వివక్ష చూపితే ఎలాగని ప్రశ్నించారు. 'సావిత్రీబాయి పూలే, అంబేడ్కర్ లాంటి వారికే అవమానాలు తప్పలేదు.. ఎవరు, ఎంతగా అవమానపరచినా వారు బాధపడలేదు. వెనక్కు తగ్గలేదు. శరీరం కుంగిపోతున్నా మనసు కుంగిపోలేదు. అలా కుంగిపోతే రాజ్యాంగం, రిజర్వేషన్లు వచ్చేవి కాదు. పట్టుదలను వదలొద్దు. భయం, పిరికితం వద్దు. ఎవరో ఒకరిద్దరు అధికారులు, ఒకరిద్దరు నాయకులను ఇబ్బంది పెట్టి వేధిస్తే అయ్యేదేమీ లేదు. ప్రమోషన్లు రాకపోతే చస్తమా. ధైర్యంగా ఉండాలి..' అంటూ వ్యవసాయ శాఖ ఉద్యోగులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభయం ఇచ్చారు. ఈ ప్రభుత్వం అందరిదని, ఒకప్పుడు వ్యవసాయ శాఖ అంటేనే ఎక్కువగా తెలిసేది కాదని, కానీ సీఎం కేసీఆర్ దీనిని అద్భుతంగా తీర్చిదిద్దారని చెప్పారు. గువ్వల బాల రాజు మాట్లాడుతూ, తాము ఎప్పుడూ ఉద్యమ స్ఫూర్తితోనే ఉంటామన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాము ఉద్యోగుల వెంట ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు కె.రాములు, ఇతర నేతలు పాల్గొన్నారు.

# అతివేగంతో అదుపుతప్పి కెనాల్‌లో పడిన కారు

- ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం
- ఘటనా స్థలంలో ఐదుగురు... చికిత్స పొందుతూ మరొకరు
- రాజన్న దర్శనానికి వెళ్లివస్తుండగా మునిగడపలో ప్రమాదం

గజ్వేల్: వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం మునిగడపలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని బలితీసుకుంది. అతివేగం వల్ల కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొని రోడ్డు పక్కనే ఉన్న కొండపోచమ్మసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లో పడిపోవడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఘటనా స్థలంలోనే ఐదుగురు మృతి చెందగా.. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు కన్నుమూశారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి– భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన బొల్లు సమ్మయ్య(38).. భార్య స్రవంతి(36), కూతురు భవ్య(13), కుమారుడు కార్తీక్ అలియాస్ లోకేశ్(11)లతో పాటు అదే జిల్లా బొమ్మల రామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన మామ బిట్టు వెంకటేష్ (58), అత్త రాజమణి(56)లను తీసుకొని ఆల్టో కారులో తనే డ్రైవింగ్ చేస్తూ సోమవారం మధ్యాహ్నం వేములవాడ రాజన్న ఆలయానికి వెళ్లాడు. సమ్మయ్య ఏటా ఆలయానికి ఆనవాయితీగా వెళ్తుంటాడు. మొక్కుతీర్చుకొని వీరంతా మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. తక్కువ దూరం ఉంటుందని భావించి రాజీవ్ రహదారిపై ఉన్న గజ్వేల్ మండలం కొడకండ్ల నుంచి జగదేవ్‌పూర్, భువనగిరి వైపు వచ్చారు.

#### కల్వర్టును ఢీకొట్టిన తర్వాత..

మార్గమధ్యలో మధ్యాహ్నం 3.30గంటల సమయంలో మునిగడప గ్రామ స్టేజీ సమీపంలో ఎల్లమ్మ ఆలయం వద్ద మలుపు దాటిన తర్వాత కొండపోచమ్మసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ కోసం నిర్మించిన కల్వర్టును వేగంగా ఢీకొట్టాడు. దాంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పింది. ఇదే క్రమంలో స్టీరింగ్ తిప్పి ఎక్సలేటర్ మరింత పెంచడంతో కారు వేగంగా ఎడమ నుంచి కుడివైపు దూసుకువెళ్లి మట్టిగడ్డను తాకింది. దాని పైనుంచి కాల్వలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను తాకి అందులో పడిపోయింది. అప్పటికే కాల్వలో నీరు ఉండడం వల్ల కారు తలకిందులైంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారందరూ తీవ్రంగా గాయపడడంతో పాటు కారులోకి నీరుచేరడంతో నీటమునిగి ఊపిరాడనిస్థితిలో కొట్టుమిట్టాడారు. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు హుటాహుటిన పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడం, ఇదే సమయంలో ఎస్ఐ కృష్ణమూర్తి, గజ్వేల్‌రూరల్ సీఐ రాజశేఖరరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని నీటమునిగిన వారిని బయటకు తీశారు. అప్పటికే సమ్మయ్య, స్రవంతి, భవ్య, కార్తీక్‌లతో పాటు రాజమణిలు మృతి చెందినట్లు గుర్తించారు. వెంకటేష్ మాత్రం విషమస్థితిలో ఉన్నట్టు గమనించి ఆయన్ను చికిత్స నిమిత్తం గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రికి ఆ తర్వాత సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా... చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలను అక్కడి నుంచి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. ఆర్థికంగా ఇంకా కుదురుకోని సమ్మయ్య కుటుంబ పోషణ నిమిత్తం స్టీల్ సామాన్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మరో మృతుడు సమ్మయ్య మామ వెంకటేష్‌ది రెక్కాడితేగాని డొక్క నిండని కుటుంబం.



మృతదేహాలను బయటకు తీస్తున్న స్థానికులు

#### కారు కండీషన్‌లో లేకపోవడం...

మృతులు ప్రయాణించిన కారు కండీషన్ సక్రమంగా లేకపోవడం, అందులో ఆరుగురు ఇరుకుగా కూర్చోవడం కూడా ప్రమాదానికి ఓ కారణంగా భావిస్తున్నారు. కాగా ప్రమాదంలో మృతి చెందిన వెంకటేష్– రాజమణి దంపతులు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నిరుపేద కూలీలు. రాజమణి గంపలో గాజులు, స్టీల్, ప్లాస్టిక్ సామాన్లు పెట్టుకుని ఇంటింటికి అమ్ముతూ ఉండగా, వెంకటేష్ గ్రామంలో ఎక్కడైనా దినసరి కూలీ లభిస్తే వెళ్లేవాడు. లేని పక్షంలో పూర్వీకుల నుంచి ఆచారంగా వచ్చిన వృత్తిలో భాగంగా భాగవతం పాటలు పాడుతూ భిక్షాటన చేసేవాడు.

#### మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి

మునిగడపలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖామంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతదేహాల పోస్టుమార్టంతో పాటు ఇతర సహాయక చర్యలను వెనువెంటనే జరిపించేందుకు దగ్గరుండి పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, సీపీ శ్వేతలను ఆదేశించారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో కలెక్టర్, సీపీలు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి చేరుకొని పోస్టుమార్టం త్వరగా జరిపించి మృతదేహాలను స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని వైద్యాధికారులతో పాటు పోలీసులకు సూచించారు.

# కర్ణాటకతో తెలుగు రాష్ట్రాలకు నష్టం

### కృష్ణా జలాల అవార్డు కేసులో తెలంగాణ

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాలపై ప్రాజెక్టులు నిర్మిస్తూ కర్ణాటక తీసుకుంటున్న నిర్ణయం వల్ల తెలుగు రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని తెలంగాణ ఆరోపించింది. ఆయా ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఉన్నాయా అనే అంశంపై వివరాలేమీ కర్ణాటక కోర్టుకు ఇవ్వలేదని పేర్కొంది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డుపై గెజిట్ ప్రచురణపై స్టే ఎత్తివేయాలంటూ కర్ణాటక దాఖలు చేసిన ఇంటర్ లొకేటరీ అప్లికేషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.రామసుబ్రమణియన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కర్ణాటక తరఫు సీనియర్ న్యాయవాది శ్యాం దివాన్ వాదనలు వినిపిస్తూ... బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డుపై స్టే ఎత్తివేయాలని కోరారు. ఇప్పటికే రూ.వేల కోట్లు వెచ్చించి ప్రాజెక్టులు, కాలువలు నిర్మించామన్నారు. అదనపు జలాల్లో 75 టీఎంసీల నీటి వినియోగం నిమిత్తమే ఆ ప్రాజెక్టులు నిర్మించినట్లు తెలిపారు. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ.. కేంద్ర జలసంఘం, పర్యావరణ అనుమతులు ఉన్నాయో లేవో చెప్పకుండా తమంతట తామే కర్ణాటక ప్రాజెక్టులు నిర్మించడం వల్ల దిగువనున్న రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు. ఈ కేసు అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని గెజిట్ ప్రచురణపై ఉన్న ప్రధాన పిటిషన్ విచారిస్తే సరిపోతుందని వైద్యనాథన్ తెలిపారు. ట్రిబ్యునల్ అవార్డు గెజిట్ ప్రచురణ వద్దని, కోర్టు 2011లో ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత కర్ణాటక కాలువలు నిర్మించిందని వైద్యనాథన్ ఆరోపించారు. కర్ణాటక అప్లికేషన్‌కు ఎలాంటి అభ్యంతరం లేదని మహారాష్ట్ర తరఫు సీనియర్ న్యాయవాది నాఫడే తెలిపారు. బుధవారం ప్రధాన కేసుల విచారణ అనంతరం ఈ పిటిషన్ విచారిస్తామని ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.


**మున్సిపల్ కౌన్సిల్, అమీన్‌పూర్ :: సంగారెడ్డి జిల్లా**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

Tender Notice No.Engg-MCA/E1/NIT/31/2022-2023 తేది: 10.01.2023

పనుల సంఖ్య: 01, అంచనా కాంట్రాక్టు విలువ: రూ.7.00 కోట్లు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది, సమయం: 11.01.2023 ఉ.10.30 గం. బిడ్ల స్వీకరణకు చివరి తేది, సమయం: 21.01.2023 ఉ.10.30 గం. ధర బిడ్ తెరుచు తేది: 21.01.2023 ఉ.11.00 గం. సంబంధిత అధికారి చిరునామా: కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ. తదుపరి వివరాలను www.tender.telangana.gov.inలో చూడవచ్చును.

సం/- కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ

DIPR RO No.11181-PP/CL/Advt/1/2022-23, Dt. 10.01.2023



తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల & ఆయకట్టు అభివృద్ధి శాఖ
**సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, I & CADD,**
ఇరిగేషన్ సర్కిల్, నర్సంపేట, వరంగల్-506 132.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

టెండరు నోటీస్ నం. 04/2022-23 (1st Call) తేది:07-01-2023

పని పేరు: I & CAD శాఖ: JCRDLIS- హనుమకొండ జిల్లా, శాయంపేట (మం.), ... దగ్గర కి.మీ. 9.850 నుండి కి.మీ. 10.000 ... JCRDLIS ... 2.50M ... అత్యవసర పనుల. అంచనా వ్యయం విలువ: రూ. 92,95,259/-. టెండరు డాక్యుమెంట్ల లభ్యత: 11-01-2023న ఉ.11.00 గం.ల నుండి 19-01-2023న ఉ.11.00 గం.ల వరకు. మరిన్ని వివరాల మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం https://tender.telangana.gov.in దర్శించండి.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, I & CADD, ఇరిగేషన్ సర్కిల్, నర్సంపేట, వరంగల్ జిల్లా

DIPR RO.No.11169-PP/CL/Advt/1/2022-23, Dt: 10/01/2023



**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
మార్కెటింగ్ శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

మార్కెటింగ్ శాఖ, టి.టి.దేవస్థానములు వారికి ప్రముఖ తయారీదారులు/ అధీకృత డీలర్లు/ ట్రేడర్లు అనగా రేమండ్స్, బాంబే డైయింగ్, ... మరియు ... (స్యూటింగ్ మరియు షర్టింగ్ క్లాత్ ఐటమ్‌ల కోసం) నుండి యూనిఫారం క్లాత్ ఐటమ్‌లు సేకరించి సరఫరా కోసం ఇ-టెండర్లు కోరబడుతున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాల కోసం వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.inకు లాగాన్ కావలెను. తదుపరి వివరాల కోసం సంప్రదించండి ఫోన్ నంబర్లు: 0877-2264079, 2264555, ఫ్యాక్స్ నం: 0877-2264554

Roc No.PR4/13950/Adv.No.344/PRO/2023, Dt: 10.01.2023 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్



**సదాశివపేట మున్సిపాలిటీ కార్యాలయం**
సంగారెడ్డి జిల్లా (T.S)

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

Tender Notice No.E1/22/SSPT/e-Proc/2022-2023 తేది: 10.01.2023

సదాశివపేట మున్సిపాలిటీలో SDF క్రింద వివిధ ప్రదేశాలలో టౌన్ అభివృద్ధి పనుల కోసం ... టెండర్లు కోరబడుచున్నవి. ... 11-01-2023న సా 5.00 గం॥ నుండి ... 25-01-2023న సా 5.00 గం॥ వరకు. బిడ్లు తెరుచు తేదీ: 25-01-2023న సా 5.30 గం॥కు. ... సెల్ నం.9849905918, ఇ-మెయిల్: mc.sadasivpet@yahoo.com ... www.tender.telangana.gov.in లో చూడవలెను. ... 11-01-2023 సా 5.00 గం॥ నుండి.

సం/- కమిషనర్, సదాశివపేట్ మున్సిపాలిటీ

DIPR RO No.11188-PP/CL/Advt/1/2022-23, Dt. 10.01.2023



**తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ లిమిటెడ్**
3-5-891, టూరిజం హౌస్, హిమాయత్‌నగర్, హైదరాబాద్ -500 029, ఫోన్: +91-40-23262151 to 57

TSTDC/Admn/P5/01/2017 ప్రకటన తేది: 10-01-2023

పాలసీ పేరును స్పష్టంగా పేర్కొనడం ద్వారా 2023-2024 సంవత్సరం కోసం TSTDC ఉద్యోగుల కోసం గ్రూప్ మెడిక్లెయిమ్ పాలసీ మరియు గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ పాలసీ కోసం నగదు రహిత ఇన్సూరెన్స్ సేవలు అమలు చేసేందుకు హెల్త్ ఇన్సూరెన్స్‌లో వ్యవహరిస్తున్న కనీసం 3 సంవత్సరాల అనుభవం గల IRDA వద్ద నమోదైన ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలు మరియు బ్రోకింగ్ ఇన్సూరెన్స్ కంపెనీల నుండి TSTDC లిమిటెడ్ వారు సీల్డ్ కొటేషన్లు కోరుతున్నారు. కొటేషన్ల దాఖలుకు ఆఖరి తేది: కార్పొరేట్ ఆఫీస్, హిమాయత్‌నగర్ వద్ద 18-01-2023న మ.2.00 గం.లకు లేదా అలోగా మరియు అవి అదే రోజు మ.3.00గం.లకు తెరువబడును. పూర్తి వివరాలు www.tourism.telangana.gov.in లభించును.

DIPR RO No.11205-PP/CL/Advt/1/2022-23, Dt. 10.01.2023 సం/- మేనేజింగ్ డైరెక్టర్ (FAC)



**దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్**
చీఫ్ జనరల్ మేనేజర్/ మెట్రో జోన్/హైదరాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు స్పెసిఫికేషన్ నం. CGM-eMZ-03A/2022-23 కు 1వ పొడిగింపు
టెండరు నోటీసు నం. CGM-MZ-10/22-23 (Paper Notification)

బంజారాహిల్స్ సర్కిల్ (eMZ-03A) కోసం ఎర్రగడ్డ వద్ద SPM షెడ్ వద్ద లభించే అన్ని సామర్థ్యాల విఫలమైన 1-ఫేజ్ మరియు 3-ఫేజ్ DTRs (కన్వెన్షనల్, CSP & అమార్ఫస్ టైప్స్)కు మరమ్మతులు చేపట్టేందుకు అర్హత గల ఏజెన్సీల నుండి ఇ-టెండర్లు కోరబడుతున్నవి మరియు వివరాలను చీఫ్ జనరల్ మేనేజర్/మెట్రో జోన్ నుండి పొందవచ్చును. దీనికి సంబంధించి ఏదేని తదుపరి సమాచారాన్ని వెబ్‌సైట్ www.tender.telangana.gov.in మరియు www.tssouthernpower.com లో చూడవచ్చును.

సం/- చీఫ్ జనరల్ మేనేజర్, మెట్రో జోన్, హైదరాబాద్

DIPR RO No.11196-PP/CL/ADVT/1/2022-23, Dt:10-01-2022


# మీడియా స్వేచ్ఛ హరించుకుపోతోంది

### తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

పటాన్‌చెరు టౌన్: దేశంలో మీడియా స్వేచ్ఛ రోజురోజుకూ హరించుకుపోతోందని.. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా గొంతులు తప్ప మిగిలిన గొంతులు మూగబోయిన పరిస్థితి ఉందని తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ వ్యాఖ్యానించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు శివారులో మంగళవారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వితీయ మహాసభల ముగింపు సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఏది మాట్లాడినా అణచివేసే ధోరణి వచ్చిందని.. వర్గ శత్రువులతో ఉంటే జర్నలిస్టులను కూడా విద్రోహకారులుగా పరిగణించే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహాసభల ముగింపు సందర్భంగా ఐజేయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ జాతీయ అధ్యక్షుడిగా వినోద్ కోహ్లీ, ప్రధాన కార్యదర్శిగా సభా నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా సయ్యద్ ఇస్మాయిల్(తెలంగాణ), కార్యదర్శులుగా నారాయణ పంచల్( మహారాష్ట్ర), రతుల్బోరా(అసోం), రాజమౌళిచారి(తెలంగాణ), ట్రెజరర్‌గా నతుముల్ శర్మ (ఛత్తీస్‌గఢ్), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నవీన్ శర్మ(చండీగఢ్), భాస్కర్(తెలంగాణ) సిమిజాన్ (కేరళ), బాబు థోమస్, అనిల్ బిశ్వాస్, తారక్ నాథ్‌రాయ్(వెస్ట్‌బెంగాల్), రవి (మహారాష్ట్ర), జుట్టు కలిత (అసోం)ను ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్ కోహ్లీ, అల్లం నారాయణ

# టెన్త్ విద్యార్థి బలవన్మరణం

- పాఠశాల ఆవరణలో చెట్టుకు ఉరేసుకున్న వైనం
- సిగరెట్ తాగుతున్నాడని మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడంటున్న స్కూలు వర్గాలు
- టై పెట్టుకురాకపోవడంతో స్కూళ్లో అవమానించారంటున్న కుటుంబ సభ్యులు
- నాగర్‌కర్నూల్ జిల్లా పొలిశెట్టిపల్లిలో ఘటన



ఆకాశ్

బల్మూర్: పదో తరగతి విద్యార్థి.. చదువుతున్న స్కూళ్లోనే చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన విషాదకర సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని పొలిశెట్టిపల్లి జేఎంజే ఉన్నత పాఠశాలలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పాఠశాల యాజమాన్యం కథనం ప్రకారం.. అమ్రాబాద్ మండలం మాధవానిపల్లికి చెందిన మణెమ్మ కుమా రుడు ఆకాశ్(15) పదో తరగతి చదువుతూ.. పాఠశాలకు చెందిన హాస్టల్‌లోనే ఉంటున్నాడు. మంగళవారం అతను తరగతి గదిలో లేకపోవడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది పరిసరాల్లో వెతకగా.. పాఠశాల వెనక ఆవరణలో ఉన్న చెట్టుకు బోరుమోటార్ వైరుతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి రక్షించడానికి ప్రయత్నించగా అప్పటికే మృతిచెందాడని పాఠశాల సిబ్బంది తెలిపారు.

#### కుటుంబ సభ్యుల ఆందోళన

ఆకాశ్ మరణ వార్తను తెలుసుకున్న తల్లి మణెమ్మ, బంధువులు పాఠశాల వద్దకు చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. పదేళ్ల కితం తన భర్త కరెంటు షాక్‌తో చనిపోయాడని, ఎంతో భవిష్యత్తు ఉన్న కుమారుడు ఇప్పుడు ఇలా మృతి చెందడం తట్టుకోలేని విషాదమని ఆమె బోరున విలపించారు. కాగా, పాఠశాలలో వసతులు సక్రమంగా లేవని, భోజనం నాణ్యతగా లేదని తమతో ఆకాశ్ చెప్పేవాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ప్రార్థన సమయంలో టై పెట్టుకుని రాకపోవడంతో తోటి విద్యార్థుల ముందు టీచర్లు మందలించి గంటపాటు నిల్చోబెట్టారని, ఆ అవమానంతోనే తమ పిల్లాడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపించారు. తమకు న్యాయం చేయా లని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్– అచ్చంపేట రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అయితే విద్యార్థి చెడు వ్యసనాలకు (సిగరెట్ తాగడం) అలవాటుపడుతున్నాడని తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చామని.. ఆమె ఫోన్ చేసి కొడుకును మందలించడంతో మనస్తాపంతోనే ఆత్మహత్యకి పాల్పడి ఉంటాడని స్కూలు హెచ్‌ఎం సిస్టర్ అమూల్య తెలిపారు. రాస్తారోకోకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన ఏబీవీపీ, వీహెచ్‌పీ, బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# రైతుబంధు ఐదెకరాలకే పరిమితం చేయండి

### ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఒక ఏఈవో లేఖ



సాక్షి, హైదరాబాద్: రైతుబంధు పథకాన్ని పెద్ద రైతులకు కాకుండా, కేవలం ఐదెకరాల వరకు భూము లున్న రైతులకు మాత్రమే అమలు చేయాలని కోరుతూ నల్లగొండ జిల్లా కట్టంగూరు వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో) కల్లేపల్లి పరశురాములు ఏకంగా సీఎం కేసీఆర్‌కు లేఖ రాయడం వ్యవసాయశాఖలో సంచలనమైంది. అలా మిగిలిన సొమ్మును రైతులు పొలాలకు, చేన్లకు వెళ్లే డొంకలు, బండ్ల బాటల అభివృద్ధికి కేటాయించాలని సీఎంకు విన్నవించారు. నగరాలుగా అభివృద్ధి చెందిన గ్రామాల్లో రియల్ ఎస్టేట్ భూములకు, పంటలు పండించనటువంటి భూములకు రైతుబంధు ద్వారా వచ్చే డబ్బులు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ లేఖను మంగళవారం రాసి సీఎంకు సాధా రణ పోస్టులో పంపించినట్లు తెలిపారు. గ్రామాల్లో రైతుల బాధలు చూశానని, వారి పొలాలకు వెళ్లే దారులు దారుణంగా మారాయని పేర్కొన్నారు. గతంలో వలసలు ఉండేవని, కానీ కేసీఆర్ నిర్ణయాల వల్ల వలసలు ఆగిపోయాయన్నారు. రైతులు చల్కలు, పొలాల దగ్గరకు వెళ్లే బండ్ల బాటలు నడవడానికి కూడా కష్టంగా మారాయన్నారు. వాటిని బాగు చేయిస్తే రైతులు ప్రయోజనం పొందుతారన్నారు. తెలంగాణ అంటే ఒకప్పుడు మెట్ట భూమి. కానీ ఇప్పు డు తరి భూమి అయిందన్నారు. అలా ఎంతో సాధించిన కేసీఆర్‌ను జాతిపితగా ఏఈవో పరిగణించారు. ఈ లేఖ రాయడానికి కారణాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ, రైతుబంధు ధనికులకు ఇవ్వడం వల్ల డబ్బులు వృథా అవుతున్నాయనే ఆవేదన తనకు ఉందన్నారు. ఎవరికి చెప్పాలో అర్థంగాక తాను సీఎంకే లేఖ రాసినట్లు తెలిపారు. తమలాంటి వారికి దశాబ్దానికిపైగా పదోన్నతులు ఇవ్వలేదని, దీంతో నిరాశగా ఉందన్నారు.


**GOVERNMENT OF INDIA**
**DEPARTMENT OF ATOMIC ENERGY**
**HEAVY WATER PLANT (MANUGURU)**

**TENDER NOTICE**

General Manager, HWPM on behalf of the President of India Invites online item rate bids two bid system for following works.

| SL. No. | Name of the work | NIT No. | Estimated Cost | EMD amount (INR) | Period of Completion | Last time & date for submission |
|---|---|---|---|---|---|---|
| 1 | De-choking of coal bunkers, transportation of coal and cleaning of oil guns 2023 | HWP(M)/PU/DECB/201/22/NIT/W30 | ₹ 33.27 Lakhs | ₹ 66,540/- | 15 months | upto 16:00 hrs on 19.01.2023 |
| 2 | Cleaning of firing floor area & T.G. equipments - 2023 - 24 | HWPM/PU/65098/201/22/W34 | ₹ 56.00 Lakhs | ₹ 1,12,000/- | 24 months | upto 16:00 hrs on 19.01.2023 |
| 3 | Collection, transportation and safe delivery of 600 KL of LDO from Visakapatnam to HWP (manuguru) | HWPM/PU/LDO-600KL/TRAN/201/22/W37 | ₹ 8.10 Lakhs | ₹ 16,200/- | 24 months | upto 16:00 hrs on 21.01.2023 |
| 4 | Upkeep & support in dry and wet fly ash disposal system 2023 | HWPM/PU/AHP/65068/201/22/W32 | ₹ 37.20 Lakhs | ₹ 74,400/- | 15 months | upto 16:00 hrs on 25.01.2023 |

The Bid Documents / Tender Document can be viewed and down loaded from https://eprocure.gov.in

NIT can be viewed at www.hwb.gov.in

Sd/-
(Signature of Tender inviting authority)

HWP(M)/Admn(G)/NIT/15/2023/2199. Dt. 10/10/2023.

## క్లుప్తంగా...

### భారతీయులు పౌరసత్వాన్ని ఎందుకు వదిలేస్తున్నారు?

న్యూఢిల్లీ: 2014 నుంచి భారత పౌరసత్వాన్ని వదిలేసుకుని వెళ్లే వారి సంఖ్య 1.7 రెట్లు పెరగడంపై కాంగ్రెస్ పార్టీ కేంద్రాన్ని నిలదీసింది. 'అచ్చే దిన్'ను వెతుక్కుంటూ భారతీయులు ఎందుకు వెళ్లిపోతున్నారో కారణాలు చెప్పాలని ప్రధాని మోదీని ప్రశ్నించింది. 2022లో రోజుకు 604 మంది చొప్పున మన వాళ్లు పౌరసత్వాన్ని త్యజించినట్లు విదేశాంగ శాఖ తెలిపిన గణాంకాలపై కాంగ్రెస్ ప్రతినిధి గౌరవ్ వల్లభ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2014లో ఈ సంఖ్య 354 మాత్రమేనన్నారు. నిరుద్యోగం, అవకాశాల లేమితోపాటు ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ, నోట్ల రద్దు వంటి వాటి వల్లే దేశం వీడుతున్నారని చెప్పారు. ప్రధాని చెప్పే అమృత కాలం ఇదేనా అని ప్రశ్నించారు. ప్రధాని చెబుతున్న 'అచ్చే దిన్' దేశ పౌరులకు కాకుండా విదేశాల్లో ఉంటున్న భారతీయులకు వచ్చాయన్నారు.

### నాసా చీఫ్ టెక్నాలజిస్ట్‌గా భారతీయ అమెరికన్



వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష సంస్థ ప్రతిష్టాత్మక నాసా చీఫ్ టెక్నాలజిస్ట్‌గా భారతీయ అమెరికన్ ఏసీ చరానియా నియమితులయ్యారు. వాషింగ్టన్‌లోని నాసా ప్రధాన కార్యాలయంలో అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్‌కు టెక్నాలజీ పాలసీ, ప్రోగ్రామ్‌ల ప్రధాన సలహాదారుగా చరానియా సేవలందించాల్సి ఉంటుంది. మరో భారతీయ అమెరికన్ సైంటిస్ట్ భవ్యా లాల్ స్థానంలో ఆయన ఈ నెల 3వ తేదీన కొత్త బాధ్యతలు చేపట్టారని నాసా ఒక ప్రకటనలో తెలిపింది. టెక్నాలజీ, పాలసీ, స్ట్రాటజీ సంబంధిత విషయాలపై ప్రధానంగా ఆయన పనిచేస్తారని పేర్కొంది. ఇప్పటివరకు రిలయబుల్ రోబోటిక్స్ సంస్థకు ప్రొడక్ట్ స్ట్రాటజీ వైస్‌ప్రెసిడెంట్‌గా ఉన్నారు. వర్జిన్ ఆర్బిట్‌లోనూ చరానియా పని చేశారు. నాసాకు చెందిన ఫాస్ట్ ఫార్వర్డ్ ఇండస్ట్రీ గ్రూపునకు చరానియా నేతృత్వం వహించారు. లూనార్ ఎక్స్‌ప్లోరేషన్ అనాలిసిస్ గ్రూప్ కమర్షియల్ అడ్వైజరీ బోర్డు సభ్యుడు కూడా. చరానియా ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీ పొందారు.

### విశాఖలో మాజీ గ్యారిసన్ ఇంజనీర్‌పై సీబీఐ కేసు

న్యూఢిల్లీ: టెండర్ వేసిన పనులు పూర్తికాకమునుపే ఆ కాంట్రాక్టర్లకు సొమ్ము చెల్లించారనే ఆరోపణలపై మాజీ గ్యారిసన్ ఇంజనీర్‌పై సీబీఐ కేసు నమోదుచేసింది. ప్రశాంత్ శివహరే గతంలో విశాఖపట్నంలోని నేవీ డాక్‌యార్డ్‌లో గ్యారిసన్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ హోదాలో కొన్ని టెండర్లు పిలిచి వాటికి చెల్లింపులు చేసే అధికారం ఆయనకు ఉంది. ఈ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ 2018 ఆగస్ట్ నుంచి 2019 మార్చి కాలంలో కొందరు కాంట్రాక్టర్లకు రూ.7.84 కోట్లు ముందే చెల్లించి ఖజానాకు నష్టం తెచ్చారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఐపీసీ సెక్షన్ల కింద ఆయనపై, డిపార్ట్‌మెంట్‌లో ఆయన కింది ఉద్యోగులపై, సొమ్ము పొందిన కాంట్రాక్టర్లపై సీబీఐ 3 కేసులు నమోదుచేసిందని సంబంధిత అధికారులు మంగళవారం వెల్లడించారు.

### పార్లమెంట్ విశ్వాసం పొందిన ప్రచండ

కఠ్మాండూ: నేపాల్ నూతన ప్రధానమంత్రి పుష్ప కమల్ దహల్ 'ప్రచండ'(68) మంగళవారం పార్లమెంట్ విశ్వాస తీర్మానం నెగ్గారు. ఎన్నికల ముందు నేపాలీ కాంగ్రెస్‌తో పెట్టుకున్న పొత్తును వదిలేసి, అనూహ్యంగా ప్రతిపక్ష నేత కేపీ ఓలీతో చేతులు కలిపిన ప్రచండ మూడోసారి నేపాల్ ప్రధానిగా డిసెంబర్ 26న బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రతినిధుల సభలోని 275 మందికి గాను 138 మంది ఓట్లు అవసరం కాగా, ప్రచండకు రికార్డు స్థాయిలో 268 మంది అనుకూలంగా ఓటేశారు. ప్రచండ సభ విశ్వాసం పొందినట్లు సభాధ్యక్షుడిగా వ్యవహరించిన సీనియర్ నేత పశుపతి షంషేర్ రాణా ప్రకటించారు.

### స్వర్ణ దేవాలయంలో రాహుల్ ప్రార్థనలు



చండీగఢ్/అమృత్‌సర్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం మధ్యాహ్నం అమృతసర్‌లోని స్వర్ణదేవాలయంలో ప్రార్థనలు చేశారు. హరియాణాలోని అంబాలాలో మంగళవారం ఉదయం యాత్ర ముగించుకుని ఆయన విమానంలో అమృతసర్‌కు చేరుకున్నారు. సిక్కుల తలపాగా ధరించి స్వర్ణదేవాలయంలో ప్రార్థనలు చేశారు. రాహుల్ వెంట పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్ తదితరులు ఉన్నారు. బుధవారం ఉదయం నుంచి పంజాబ్‌లో జోడో యాత్ర ఫతేఘర్‌లోని సిర్‌హింద్ నుంచి ప్రారంభవుతుందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చెప్పారు. భిన్నత్వాన్ని ఆసరాగా తీసుకుని మన సమాజాన్ని విభజించేందుకు యత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భాష, ప్రాంతం, కులం, మతం పేరుతో దేశంలో విద్వేషాన్ని వ్యాపింపజేస్తున్నారంటూ పరోక్షంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించారు. మన భిన్నత్వాన్ని పరిరక్షించే ప్రాథమిక బాధ్యత కాంగ్రెస్ పార్టీపై పడిందన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం సమాజాన్ని విభజించే శక్తులతో పోరాటం సాగిస్తామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో తమ యాత్ర ఉద్యమంలా సాగుతోందని చెప్పారు.

# పాకిస్తాన్‌లో ఆహార సంక్షోభం

- రాయితీ గోధుమ పిండి కోసం జనం పడిగాపులు
- మార్కెట్లలో తొక్కిసలాటలు
- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- ఏడాదిలోనే 501 శాతం పెరిగిన ఉల్లి ధర



ఇస్లామాబాద్‌లో సబ్సిడీ గోధుమ పిండి కోసం బారులు తీరిన ప్రజలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఆర్థిక సంక్షోభం మరింత ముదురుతోంది. ఆహార సంక్షోభం సైతం మొదలయ్యింది. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రధానంగా గోధుమ పిండి కొరత వేధిస్తోంది. రాయితీపై ప్రభుత్వం అందించే గోధుమ పిండి కోసం జనం ఎగబడుతున్నారు. ఖైబర్ పఖ్తూంక్వా, సింధ్, బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న తొక్కిసలాట, తోపులాట దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పిండి కోసం తరలివచ్చిన జనంతో మార్కెట్లు నిండిపోయాయి. మార్కెట్లలో రాయితీ గోధుమ పిండి కోసం జనం గంటల తరబడి వరుసల్లో నిలబడాల్సి వస్తోంది. నిత్యం వేలాది మంది వస్తున్నారని స్థానిక మీడియా వెల్లడించింది.

**కిలో గోధుమ పిండి రూ.160**

పాకిస్తాన్ ప్రధాన ఆహారమైన గోధుమలు, గోధుమ పిండి ధర విపరీతంగా పెరిగిపోయింది. కరాచీలో కిలో పిండి ధర రూ.160కు చేరింది. ఇస్లామాబాద్, పెషావర్‌లో 10 కిలోల గోధుమ పిండి బ్యాగ్‌ను రూ.1,500కు విక్రయిస్తున్నారు. 15 కిలోల బ్యాగ్ ధర రూ.2,050 పలుకుతోంది. గత రెండు వారాల వ్యవధిలోనే ధర రూ.300 పెరిగింది. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దిగజారడం ఖాయమన్న సంకేతాలను బలూచిస్తాన్ ఆహార మంత్రి జమారక్ అచాక్‌జాయ్ ఇచ్చారు. గోధుమ నిల్వలు పూర్తిగా ఖాళీ అయ్యాయని చెప్పారు. ఆహార శాఖ, పిండి మిల్లుల నడుమ సమన్వయ లోపమే కొరతకు కారణమని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు.

**కరిగిపోతున్న విదేశీ మారక నిల్వలు**

పాకిస్తాన్‌ను ద్రవ్యోల్బణం హడలెత్తిస్తోంది. గత ఏడాది సంభవించిన భీకర వరదల వల్ల కష్టాలు మరింత పెరిగాయి. కేవలం గోధుమలే కాదు ఉల్లిపాయలు, తృణధాన్యాలు, బియ్యం ధరలు సైతం పైకి ఎగబాకుతున్నాయి. కిలో ఉల్లిపాయల ధర 2022 జనవరి 6న రూ.36.7 కాగా, 2023 జనవరి 5 నాటికి ఏకంగా రూ.220.4కు చేరింది. అంటే ఏడాది వ్యవధిలోనే 501 శాతం పెరిగింది. అలాగే డీజిల్ ధర 61 శాతం, పెట్రోల్ ధర 48 శాతం పెరిగింది. బియ్యం, తృణధాన్యాలు, గోధుమల ధర 50 శాతం ఎగబాకింది. 2021 డిసెంబర్‌లో పాక్ ద్రవ్యోల్బణం 12.3 శాతం కాగా, 2022 డిసెంబర్‌లో 24.5 శాతం నమోదయ్యింది. ఆహార ద్రవ్యోల్బణం ఒక ఏడాదిలోనే 11.7 శాతం నుంచి 32.7 శాతానికి చేరింది. పాకిస్తాన్‌లో విదేశీ మారక నిల్వలు వేగంగా అడుగంటుతున్నాయి. 2021 డిసెంబర్‌లో 23.9 బిలియన్ డాలర్లు ఉండగా, 2022 డిసెంబర్‌లో కేవలం 11.4 బిలియన్ డాలర్లు ఉన్నాయి.

### రష్యా గోధుమల దిగుమతి

రష్యా నుంచి గోధుమలు పాకిస్తాన్‌కు చేరుకోవడం కొంత ఊరట కలిగిస్తోంది. రెండు ఓడల్లో వేలాది టన్నుల గోధుమలు తాజాగా కరాచీ రేవుకు చేరుకున్నాయి. అదనంగా 4,50,000 టన్నులు రష్యా నుంచి గ్వాదర్ పోర్టు ద్వారా త్వరలో రానున్నాయని పాక్ అధికారులు వెల్లడించారు. గోధుమల కొరతను అధిగమించడానికి వివిధ దేశాల నుంచి 75 లక్షల టన్నులు దిగుమతి చేసుకోవాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం సరుకు ఈ ఏడాది మార్చి 30 నాటికి పాకిస్తాన్‌కు చేరుకుంటుందని అంచనా.



కొడుకు, కూతురుతో తేజస్విని, ఆమె భర్త(ఫైల్)

### మెట్రో పిల్లర్ కూలి.. తల్లి, కొడుకు మృత్యువాత

సాక్షి బెంగళూరు: బెంగళూరులో నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్ కూలిన దుర్ఘటనలో తల్లి(30), ఆమె రెండున్నరేళ్ల కొడుకు ప్రాణాలు కోల్పోయారు. ఔటర్ రింగ్ రోడ్‌లోని హెబీఆర్ లే అవుట్ సమీపంలో మంగళవారం ఉదయం ఈ విషాదం జరిగింది. హెణ్ణూరులోని డీఎక్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న లోహిత్, తేజస్విని దంపతులకు కవలలు. తేజస్విని ఐటీ కంపెనీలో పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం భార్యను ఆఫీసులో, ఇద్దరు పిల్లలను బేబీ కేర్ సెంటర్ వద్ద దిగబెట్టేందుకు లోహిత్ బైక్‌పై బయలుదేరారు. మెట్రోకు సంబంధించిన పిల్లర్ ఫ్రేమ్‌ను కార్మికులు నిలబెడుతుండగా అది పక్కకు ఒరిగి లోహిత్ కుటుంబంపై పడిపోయింది. ఘటనలో తీవ్ర గాయాలతో తేజస్విని, కుమారుడు విహాన్ చనిపోయారు. లోహిత్, కూతురు చికిత్స పొందుతున్నారు. బెంగళూరు మెట్రో బాధిత కుటుంబానికి రూ.20 లక్షల పరిహారాన్ని ప్రకటించింది.



చారిత్రక ఎర్రకోట వద్ద మంగళవారం దృశ్య, శ్రవణ ప్రదర్శనలో కళాకారులు.
ఈ ప్రదర్శనను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు.

## జోషీమఠ్‌లో ఇళ్లు, హోటళ్ల కూల్చివేత!

ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

జోషీమఠ్: ఉత్తరాఖండ్ రాష్ట్రం జోషీమఠ్‌లో ప్రమాదకరంగా మారిన ఇళ్లు, హోటళ్లను కూల్చివేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా మలారీ ఇన్, మౌంట్ వ్యూ హోటళ్లను నేలమట్టం చేయడానికి రంగం సిద్ధమయ్యింది. పటిష్టంగా లేని నిర్మాణాలను కూల్చివేయాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డేంజర్ జోన్‌లో ఉన్న గృహాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రజలను ఖాళీ చేయించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటిదాకా 131 కుటుంబాలను తాత్కాలిక సహాయక శిబిరాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. జోషీమఠ్‌లో దెబ్బతిన్న ఇళ్ల సంఖ్య 723కు చేరుకున్నట్లు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ మంగళవారం ఒక బులెటిన్‌లో ప్రకటించింది.

**అత్యవసర విచారణ చేపట్టలేం**

ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పరిస్థితిని సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవడానికి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సంస్థలు ఉన్నాయని తేల్చిచెప్పింది. అన్ని ముఖ్యమైన వ్యవహారాలను తమ ముందుకు తీసుకురావాల్సిన అవసరం లేదని సూచించింది. కాగా, జోషీమఠ్ సంఘటనపై కేంద్ర బృందం రంగంలోకి దిగింది. కేంద్ర హోంశాఖ అధికారులు, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీతో సమావేశమయ్యారు. తాజా పరిస్థితిని సమీక్షించారు. కుంగుతున్న ప్రాంతాల్లో భూగర్భంలో నీటి ప్రవాహాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సహాయ పునరావాసం కోసం ఎంపిక చేయాల్సిన ప్రాంతాల్లో జియోలాజికల్ సర్వే చేపడతామన్నారు. సైంటిస్టుల సాయం తీసుకుంటామని తెలిపారు.



### యూపీ బోరు బావి ఘటన సుఖాంతం

హాపూర్: ఉత్తరప్రదేశ్‌లో బోరుబావిలో పడిన బాలుడిని జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) సభ్యులు ఐదుగంటల పాటు శ్రమించి, సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. హాపూర్ జిల్లా కట్లా ఏరియాకు చెందిన మవియా అనే నాలుగేళ్ల బాలుడు ఆడుకుంటూ వెళ్లి మూత లేని బోరు బావి గుంతలో పడ్డాడు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం రక్షణ సహాయక చర్యలు చేపట్టింది. ఆక్సిజన్‌ను పంపించి, బాలుడికి శ్వాసను అందించారు. బధిరుడైన చిన్నారి ఏ ప్రాంతంలో ఇరుక్కుపోయి ఉన్నదీ తెలుసుకునేందుకు అత్యాధునిక సాంకేతికతను వాడారు. మొత్తం 47 మంది ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యులు విడతలు వారీగా ఎంతో సహనంతో ఈ క్రతువును కొనసాగించారు. ఐదు గంటలపాటు శ్రమించి, కొద్దిపాటి గాయాలతో బాలుడిని బయటకు తీసుకువచ్చారు. అప్పటి వరకు ఎంతో ఉత్కంఠతో సహాయక చర్యలను గమనించిన గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృంద సభ్యులను ప్రశంసలతో ముంచెత్తారు.

## దేశ రాజధానికి మరో అప్రతిష్ట

అత్యంత కాలుష్యమయ నగరంగా రికార్డ్

న్యూఢిల్లీ: కాలుష్యకాసారంగా మారిన ఢిల్లీ పరువు మరోసారి పోయింది. గతంలోనూ కాలుష్యమయ నగరంగా పేరుమోసిన ఢిల్లీ తాజాగా 2022 ఏడాదికి దేశంలోనే అత్యంత కాలుష్యమయ నగరంగా రికార్డులకెక్కింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఈ గణాంకాలతో ఒక నివేదిక విడుదలచేసింది. దీని ప్రకారం ఢిల్లీలో 2.5 స్థాయి(పీఎం) సూక్ష్మ ధూళి కణాలు నాణ్యత పరిమితికి మించి రెట్టింపు స్థాయిలో ఉన్నాయి. 10 గాఢత విభాగంలో దేశంలో ఢిల్లీ మూడో స్థానంలో నిలిచిందని గణాంకాలు వెల్లడించాయి. అయితే, నాలుగేళ్ల క్రితంతో పోలిస్తే కాలుష్యం 7 శాతంపైగా తగ్గడం కాస్త ఊరట కలిగించే విషయం అని ఈ గణాంకాలను ఎన్‌సీఏపీ ట్రాకర్ విశ్లేషించింది. 2.5 స్థాయి సూక్ష్మధూళి కణాల విభాగంలో ఢిల్లీ తొలి స్థానంలో నిలవగా, హరియాణాలోని ఫరీదాబాద్ రెండో ర్యాంక్‌లో, ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ మూడో ర్యాంక్‌లో నిలిచిందని గణాంకాలు పేర్కొన్నాయి. 10 పీఎం విభాగంలో దేశంలో ఘజియాబాద్ తొలిస్థానంలో నిలిచింది. తర్వాత ఫరీదాబాద్, ఢిల్లీ ఉన్నాయి. కనీసం 20–30 శాతం కాలుష్యం తగ్గాలన్న జాతీయ స్వచ్ఛ వాయు పథకం(ఎన్‌సీఏపీ) లక్ష్యాలకు ఈ గణాంకాలు సుదూరంగా ఉండటం విషాదకరం. ఈ పథకం లక్ష్యాలను సాధించడంలో దేశ పురోగతిని గణిస్తూ 'ఎన్‌సీఏపీ ట్రాకర్' ఈ లెక్కలను విడుదలచేసింది. 131 నగరాల్లో కాలుష్యాన్ని 30 శాతం మేర తగ్గించాలన్న కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్దేశించుకుంది. అయితే 2026కల్లా కాలుష్యం 40 శాతం తగ్గించుకోవాలని 2022 సెప్టెంబర్‌లో కొత్తగా లక్షించింది. 2.5 స్థాయి కణాలు అత్యంత సూక్ష్మంగా ఉండి నేరుగా ఊపిరితిత్తుల్లో అక్కడి నుంచి రక్తంలో కలిసిపోగలవు. 'నగరాల్లో కఠిన నిబంధనలను ఖచ్చితంగా అమలుచేయలేకపోతే లక్ష్యాలను సాధించడం చాలా కష్టం' అని క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ డైరెక్టర్ ఆర్తీ ఖోస్లా విచారం వ్యక్తంచేశారు.

## ఎమ్మెల్యే గారూ.. పెళ్లికి అమ్మాయిని వెతకండి

- శాసనసభ్యుడిని కోరిన నియోజకవర్గ శివసేన కార్యకర్త
- మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆడియో క్లిప్

ఔరంగాబాద్: దాదాపు పది ఎకరాల భూమి ఉన్నా పిల్లను ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదని తెగ వాపోయాడు ఓ పెళ్లికాని ప్రసాద్. తెలిసిన వారందరినీ వధువు కోసం ఆరాతీసి విసిగిపోయిన ఆ అవివాహితుడు చివరకు ఏకంగా తమ నియోజకవర్గం ఎమ్మెల్యేకే ఫోన్ చేసి బాధపడిపోయాడు. మీరయినా పెళ్లికి సరిజోడీని వెతికిపెట్టండి సారూ అంటూ ఫోన్‌లోనే విన్నపాలు వినిపించాడు. అతని బాధను అర్థంచేసుకున్న ఆ ఎమ్మెల్యే పెళ్లిళ్ల పేరయ్యగా మారేందుకూ సిద్ధమయ్యాడు. వెంటనే బయోడేటా పంపించు.. పెళ్లికి అమ్మాయిని వెతికిపెట్టే పూచీ నాదీ అంటూ హామీ ఇచ్చాడు. ఎమ్మెల్యే, నియోజకవర్గ ఓటరుకు మధ్య జరిగిన ఈ ఆసక్తికర సంభాషణ తాలూకు ఆడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో యమా చక్కర్లు కొట్టేస్తోంది. మహారాష్ట్రలోని కన్నాడ్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉదయ్‌సింగ్ రాజ్‌పుత్‌కు అక్కడి ఖుల్తాబాద్ వాస్తవ్యుడికి మధ్య ఈ సంభాషణ జరిగింది. ఉదయ్‌సింగ్.. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన చీలికవర్గానికి మద్దతు ఇస్తున్నారు. పెళ్లికాని ఓటరు ఫోన్‌కాల్‌పై మీడియా ప్రశ్నించగా ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. 'గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాస్తవిక సమస్య ఇది. ఓ 2,000 మంది జనాభా ఉన్న గ్రామాన్ని తీసుకుంటే అందులో ఖచ్చితంగా 150 మంది యుక్తవయసు అబ్బాయిలు పెళ్లిళ్లుకాక ఇబ్బందులు పడుతున్నారు. 100 ఎకరాల భూస్వామి అయినా సరే వధువు కోసం తిప్పలు పడాల్సిందే. పట్టణప్రాంతాల్లో స్థిరపడిన అబ్బాయిలవైపు అమ్మాయిల తల్లిదండ్రులు మొగ్గుచూపడమే ఇక్కడ అసలు సమస్య. పెళ్లి కావట్లేదు బాబోయ్ అంటూ నాకు ఇలాగే చాలా మంది ఫోన్లు చేశారు' అని ఎమ్మెల్యే చెప్పారు.

## ప్రపంచంలోనే సుదూర నదీ పర్యాటకం

- జనవరి 13న వారణాసిలో 'గంగా విలాస్'ను ప్రారంభించనున్న ప్రధాని
- గంగా, బ్రహ్మపుత్రసహా 27 నదులగుండా 52 రోజుల పాటు ప్రయాణించనున్న విలాసనౌక
- వివరాలు వెల్లడించిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: నదీజలాల్లో పర్యాటకులు సుదూరాలకు విలాసవంత ప్రయాణం సాగించేలా రివర్ క్రూయిజ్ (షిప్) పర్యాటకానికి భారతీయ నదులు సిద్ధమయ్యాయి. 52 రోజులపాటు గంగావిలాస్ పేరుతో కొనసాగే ఈ పర్యాటక నౌక సేవలను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. గంగా నది, బ్రహ్మపుత్ర నదుల మీదుగా కొనసాగే ఈ ప్రయాణం జనవరి 13న వారణాసిలో ప్రారంభం అవుతుంది. దాదాపు 3,200 కిలోమీటర్ల పాటు 5 రాష్ట్రాల్లో మొత్తం 27 నదుల్లో ప్రయాణించి బంగ్లాదేశ్ మీదుగా మార్చి ఒకటిన అస్సాంలోని దిబ్రూగఢ్‌కు గంగా విలాస్ చేరుకుంటుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రపంచంలో ఇంతవరకు ఇలా రెండు పొడవైన నదులపై క్రూయిజ్ (షిప్)లో పర్యటన సందర్భాలు లేవని తెలిపారు. అందుకే తొలిసారిగా అత్యంత ఎక్కువ దూరాలకు గంగ, బ్రహ్మపుత్ర నదులపై కొనసాగే ఈ యాత్రపై ఆసక్తి నెలకొందని వివరించారు. 'గంగా విలాస్ రివర్ క్రూయిజ్ ప్రాజెక్టు ద్వారా భారత్, బంగ్లాదేశ్ మధ్య సాంస్కృతిక బంధాన్ని ప్రపంచానికి చాటిచెప్తాం. భారతీయ పర్యాటకరంగ రూపురేఖలు మార్చడంలో ఈ ప్రాజెక్ట్ కీలక భూమిక పోషించనుంది' అని ఉద్ఘాటించారు.

## కాలిఫోర్నియాలో వరద బీభత్సం

వెంటాడుతున్న బురద ముప్పు

కాలిఫోర్నియా: అగ్రరాజ్యం అమెరికాను భీకర వరదలు ముంచెత్తాయి. కాలిఫోర్నియా, లాస్ ఏంజెలిస్‌లో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కాలిఫోర్నియా జనాభాలో ఏకంగా 90 శాతం మంది ప్రజలు వరద ముప్పును ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. భారీ వర్షాల వల్ల వరదలు ముంచెత్తుతున్నాయి. పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో కాలిఫోర్నియా రాష్ట్రంలో దాదాపు 25 వేల మందిని ప్రభుత్వ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం. హాలీవుడ్ సినీ ప్రముఖులు నివసించే మాంటెసిటో నగరంలో పరిస్థితి మరింత దారుణంగా మారిందని అధికారులు వెల్లడించారు. బురద ముప్పు పొంచి ఉందని, ప్రజలు ఈ నగరాన్ని వెంటనే వీడాలని అత్యవసర హెచ్చరిక జారీ చేశారు. కాలిఫోర్నియా రాష్ట్రంలో 17 ప్రాంతాల్లో భీకర వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కాలిఫోర్నియాలో పలు ప్రాంతాలు ఇప్పటికే జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో బురద ప్రవాహం పెరిగింది.

### త్వరలో భారత్‌కు ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్ నేతలు

న్యూఢిల్లీ: వచ్చే రెండు, మూడు నెలల్లో ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా సహా పలు దేశాల అధినేతలు భారత్‌కు విచ్చేయనున్నారు. ప్రపంచదేశాలపై ఉక్రెయిన్ యుద్ధం, ఆహార, ఇంధన భద్రతలపై పడిన తీవ్ర ప్రభావంపై చర్చలే లక్ష్యంగా వీరి పర్యటనలు సాగనున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ వచ్చే నెలలో భారత్‌కు రానున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మార్చిలో వస్తారని భావిస్తున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మేక్రాన్ కూడా మార్చి మొదటి వారంలోనే పర్యటించే అవకాశాలున్నాయి.

### అరాచకంపై దర్యాప్తు ముమ్మరం

రియో డీ జనీరియో: బ్రెజిల్ నూతన అధ్యక్షుడు లూయిజ్ డ సిల్వాను గద్దె దింపాలన్న ప్రధాన డిమాండ్‌తో దేశ రాజధానిలో అధికార కేంద్రాలపై విధ్వంసకాండకు దిగిన మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో మద్దతుదారులపై కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. సోమవారం నాటి ఘటనలో ఇప్పటికే 1,500 మందికిపైగా నిరసనకారులను అరెస్ట్‌చేసిన పోలీసులు ఇంతటి మెరుపుదాడి వెనుక సూత్రధారులు ఎవరెవరు ఉన్నారనే దానిపై కూపీ లాగుతోంది. రాజధాని ప్రాంత భద్రత బాధ్యతలు చూసే ప్రాంతీయ గవర్నర్‌ను ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ సుప్రీంకోర్టు ఆయనను తాత్కాలికంగా విధుల నుంచి తప్పించింది. ఓవైపు తన మద్దతుదారులు దేశంలో వీరంగం సృష్టిస్తే వారి నాయకుడు బోల్సొనారో అనారోగ్యంతో అమెరికాలోని ఓర్లాండో సిటీలోని ఓ ఆస్పత్రిలో చేరినట్లు వార్తలొచ్చాయి.

## తమిళనాట గవర్నర్‌ను వ్యతిరేకిస్తూ పోస్టర్లు

అందుకు ప్రతిగా ఆయన్ను కీర్తిస్తూ బీజేపీ పోస్టర్లు




సాక్షి, చెన్నై: తమిళనాడు డీఎంకే సర్కార్‌కు, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య భేదాభిప్రాయాలు తమిళనాట గోడలపైకి ఎక్కాయి. సోమవారం రాష్ట్ర శాసనసభలో స్టాలిన్ సర్కార్ అందించిన ప్రసంగ పాఠాన్ని ఉన్నది ఉన్నట్లుగా చదవకుండా కొన్ని పదాలు, వాక్యాలు వదిలేసి, సొంతంగా కొన్ని చేర్చి ప్రసంగించిన గవర్నర్‌పై అధికార డీఎంకే గుర్రుగా ఉంది. దీంతో ఆయనను 'రాష్ట్రం నుంచి వెళ్లిపోండి (#GetoutRavi)' అంటూ మంగళవారం చెన్నై, పలు ప్రాంతాల్లో పోస్టర్లు వెలిశాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని గవర్నర్ అసెంబ్లీలో చదవడం సాంప్రదాయం. అందుకు భిన్నంగా వ్యవహరించిన గవర్నర్‌పై వ్యతిరేక తీర్మానాలను సీఎం స్టాలిన్ ప్రతిపాదిస్తుండగా మధ్యలోనే గవర్నర్ హఠాత్తుగా వెళ్లిపోవడం తెల్సిందే. సభ నుంచి వెళ్లిన గవర్నర్ అలాగే రాష్ట్రాన్ని వదిలేయాలంటూ పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. డీఎంకే శ్రేణుల చర్యతో ఆగ్రహించిన రాష్ట్ర బీజేపీ విభాగం నేతలు వెంటనే గవర్నర్‌కు మద్దతుగా నిలిచారు. ఆయనను కీర్తిస్తూ పుదుకొట్టాయ్ జిల్లాలో పోస్టర్లు అంటించారు. సభలో గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు, రభస సృష్టించిన డీఎంకే ఎమ్మెల్యేలపై పోలీసులకు ఫిర్యాదుచేశామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఏ అశ్వత్థామన్ ట్వీట్‌చేశారు. కాగా, తమిళనాట పొంగల్ సంబరాల సందర్భంగా గవర్నర్ కార్యాలయం రాజ్‌భవన్ వెలువరించిన ఆహ్వాన ప్రతిలో రాష్ట్ర అధికార చిహ్నం లేదు. కేవలం జాతీయ చిహ్నం ముద్రించారు. తమిళనాడు అని ఉండాల్సిన చోట తమిళగ అని ఉంది. తమిళనాడు పేరును తమిళగ అని మార్చాలని గవర్నర్ గతంలోనే వ్యాఖ్యానించడం వివాదమైంది.

**న్యాయ నిపుణులతో గవర్నర్ భేటీ**

అసెంబ్లీలో తన ప్రసంగంలోని కొన్ని అంశాలను తొలగిస్తున్నట్లు తమిళనాడు సీఎం తీసుకొచ్చిన తీర్మానానికి చెక్ పెట్టేందుకు గవర్నర్ పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఈ అంశంపై మంగళవారం ఆయన న్యాయ నిపుణులతో చర్చించినట్లు సమాచారం. మంగళవారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సివిల్ సర్వీసు ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కేంద్రం చెప్పినట్లే వినాలని గవర్నర్ సూచించడం చర్చనీయాంశమైంది.

### అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములుగా మారండి

ప్రవాస భారతీయులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపు

ఇండోర్: ప్రవాస భారతీయులు అంతర్జాతీయ స్థాయిలో అత్యంత కీలకమైన, విశిష్టమైన శక్తిగా ఎదిగారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రశంసించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 17వ ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమంలో మంగళవారం ఆమె ప్రసంగించారు. పట్టుదల, నిరంతర శ్రమతో ప్రవాసీలు విభిన్న రంగాల్లో అత్యున్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే 25 ఏళ్లలో స్వయం సమృద్ధ దేశంగా ప్రగతి సాధించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుందని, ఈ ప్రయాణంలో ప్రవాస భారతీయులంతా పూర్తిస్థాయిలో భాగస్వాములు కావాలని ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. మీ శక్తి, అనుభవం, ఆలోచనలు, వ్యాపార వ్యూహాలు, పెట్టుబడులు, సాంకేతిక నిపుణత, విజ్ఞానాన్ని మాతృదేశ అభివృద్ధి కోసం వెచ్చించాలని సూచించారు.

# సాక్షి హైదరాబాద్

బుధవారం । 11 । జనవరి । 2023


## అక్రమ రవాణాపై ఆర్టీఏ కొరడా

సాక్షి, సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేట్ వాహనాలపై రవాణాశాఖ కొరడా ఝుళిపించింది. సంక్రాంతి రద్దీ దృష్ట్యా ప్రయాణికులను తరలించే వాహనాలపై అధికారులు దృష్టి సారించారు. ఆర్టీసీ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జేటీసీ పాండురంగ్ నాయక్ తెలిపారు. మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని క్యాబ్‌లు, మ్యాక్సీ క్యాబ్‌లపై కేసులు నమోదు చేశారు.



## వంట మనిషే లాకర్ దొంగ

ఎమ్మెల్యే కాలనీకి చెందిన అరిహంత్ జైన్ ఇంట్లో జరిగిన భారీ దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడు అదే ఇంట్లో పని చేస్తున్న వంట మనిషిగా గుర్తించారు.

-8లో

## నేడు మహిళా పారిశ్రామికవేత్తలకు అవార్డుల ప్రదానం

మణికొండ: మహిళా పారిశ్రామికవేత్తలకు హైదరాబాద్ బిజినెస్ అవార్డులను బుధవారం ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రదానం చేస్తారని ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) సంస్థ పేర్కొంది. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని అడ్రస్ కన్వెన్షన్‌లో సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. మంత్రి కేటీఆర్‌తో పాటు గౌరవ అతిథిగా నీతి ఆయోగ్ మాజీ సీఈఓ, షెర్పా అమితాబ్‌కాంత్ హాజరవుతారు.

## న్యూస్‌రీల్

### రంజని 'సంక్రాంతి సంచిక' ఆవిష్కరణ



ఖైరతాబాద్: పరిమితమైన సమయంలో అత్యద్భుతమైన కార్యక్రమాలను నిర్వహించడం రంజని సంస్థకు తప్ప మరెవరికీ సాధ్యం కాదని ప్రసిద్ధ సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. మంగళవారం తెలుగు సాంస్కృతిక సంస్థ రంజని తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో ఏజీ కార్యాలయంలో 'సంక్రాంతి సంచిక'ను ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుద్దాల మాట్లాడుతూ.. యువతరం సాహిత్యం వైపు ఆకర్షితులైతేనే తెలుగు భాష మనుగడ సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో సుధీర్ కుమార్, రంజని అధ్యక్షురాలు నందిరాజు పద్మలతా జయరాం, చీకోలు సుందరయ్య, మట్టిగుంట వెంకటరమణ పాల్గొన్నారు.

### 'కావ్యత్రయం' ఆవిష్కరణ.. అంకితోత్సవం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

నాంపల్లి: డాక్టర్ శాస్త్రుల రఘుపతి రచించిన 'కావ్యత్రయం' ఆవిష్కరణ, అంకితోత్సవం సభ మంగళవారం తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో జరిగింది. సభకు అధ్యక్షత వహించిన వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు 'శతక యుగళము-భారతీ శివ శతకములు' అనే మొదటి కావ్యాన్ని, 'కవిత్రయ మహా భారతంలో సూక్తులు' అనే కావ్యాన్ని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, ఓయూ తెలుగు శాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య పి.సుమతీ నరేంద్ర 'జీవన వాణి- పద్య కావ్యం' అనే కావ్యాన్ని ఆవిష్కరించారు. శతక యుగళము-భారతీ శివ శతకములు కావ్యాన్ని వాసరేశ్వరి శ్రీజ్ఞాన సరస్వతీ దేవికి అంకితమిచ్చారు. జీవనవాణి పద్య కావ్య కృతిని అవధాని శిరోమణి శ్రీ అష్టకాల నరసింహరాయ శర్మ స్వీకరించారు. కవిత్రయ మహా భారతములో సూక్తులు కావ్య కృతిని విశ్రాంత అధ్యాపకులు పరాశరం శారద, పరాశరం ప్రసాద్ స్వీకరించారు. పరమార్థ కవి డాక్టర్ వెలుదండ సత్యనారాయణ రావు కావ్యత్రయ పరిచయం చేయగా వీణావాణీ పత్రికా సంపాదకుడు అష్టకాల విద్యాచరణ్ సభను సమన్వయ పరిచారు.



## వండర్‌ఫుల్ 'పైగా టూంబ్స్'

నగరంలోని సంతోష్‌నగర్ ఒవైసీనగర్ కాలనీలో ఉన్న 'పైగా టూంబ్స్'ను మంగళవారం యూఎస్ కాన్సులేట్ జెన్నీఫర్ లార్సన్, యూఎస్ రాయబారి ఎలిజబెత్ జోన్స్ సందర్శించారు. ఇక్కడి చారిత్రక, వారసత్వ కట్టడాల పరిరక్షణ, వాటి పునరుద్ధరణకు అమెరికా ప్రభుత్వం సహకారం అందించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ఈ శిల్పసంపద అద్భుతమని కొనియాడారు.



# గ్రేటర్ షివర్!

'ఎట్టకేలకు ఇప్పుడు చలికాలం వచ్చింది' అంటూ నగర వాసి సయ్యద్ ఫర్హాన్ ఖాద్రి ట్వీట్ చేయడం పట్టణ వాసుల్లో చలి పట్ల ఫీలింగ్స్‌కి ఓ నిదర్శనం. శీతలం గుప్పిట్లో చిక్కిన నగరంలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. శివార్లలోని పలు ప్రాంతాల్లో టెంపరేచర్ సింగిల్ డిజిట్‌కి పడిపోయింది. నగరంలోనూ చలి తీవ్రత బాగా పెరిగింది. డిసెంబర్ నెలలో ముఖం చాటేసిన వింటర్ వేవ్.. అకస్మాత్తుగా జనవరిలో తిరిగి రావడం సిటిజనుల్లో కొందరికి కొత్త సరదాలు పుట్టిస్తుంటే మరికొందరిలో రోగాలను తిరగబెట్టిస్తోంది.

– సాక్షి, సిటీబ్యూరో

- పెరిగిన చలితో ఒకటే వణుకు
- ఒకవైపు బెడద.. మరోవైపు సరదా
- రోగాలతో ఆసుపత్రుల్లో చేరికలు
- బార్బెక్యూలు, బార్ల ఎదుట క్యూలు
- నగరంలో విభిన్నమైన పరిస్థితులు
- జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు

ఇప్పటికే నగరంలో ఆస్తమా రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు జ్వరం శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నట్లు ఆసుపత్రుల్లో రికార్డులు చెబుతున్నాయి. ఈ పరిస్థితి కనీసం మరో 5 రోజుల పాటు కొనసాగనుందని వాతావరణ శాఖ చెబుతుండడం నగరవాసుల్ని వణికిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలకు అటూ ఇటూగా నమోదయే అవకాశాలున్న నేపథ్యంలో ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కిమ్స్ వైద్యులు డా.శివరాజు సూచిస్తున్నారు.

### బాధితులూ బహు పరాక్..

- 60 ఏళ్లు పైబడిన వారిలో వారం రోజులుగా ఇన్ఫెక్షన్లు తీవ్రంగా పెరుగుతున్నాయి. స్వైన్ ఫ్లూతో ఐసీయూలలో చేరుతున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది. వయసులకతీతంగా వైరల్ ఫీవర్స్ పెరిగాయి. చిన్నపిల్లల్లో కూడా వస్తున్నాయి కానీ అంత తీవ్రత లేదు. టీనేజర్లలో జ్వరం, దగ్గు, తలనొప్పి, ఒళ్లునొప్పులు లాంటివి పెరిగాయి.
- ఈ పరిస్థితుల్లో వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఫ్లూ వ్యాక్సిన్ కూడా తీసుకోవాల్సి వస్తే తీసుకోవాలి. అనవసర ప్రయాణాలు మానుకోవాలి. రద్దీలో తిరిగేటప్పుడు మాస్కులు ధరించాలి. చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలి. తెల్లవారుజామున నడక అలవాటు ఉన్నవారు బాగా ఆలస్యంగా ప్రారంభించాలి. పొగతాగే అలవాటు ఉన్నవారు బాగా తగ్గించాలి. ఈ ఏడాది ఇంకా ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోని వారు తప్పకుండా తీసుకోవాలి.
- ఈవినింగ్ షిఫ్టులలో పని చేయాల్సి వచ్చిన వారు తిరిగి వెళ్లేటప్పుడు బాగా కేర్‌ఫుల్‌గా ఉండాలి. నాలుగ్గోడల మధ్య ఏసీ గదుల్లో పని చేసేవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఇంట్లో ఒక్కరికి ఇన్ఫెక్షన్ వచ్చినా మిగిలిన వారంతా అప్రమత్తం కావాలి. ఈ సీజన్‌లో విటమిన్ 'డి' లోపం ఉంటే సరిచేసుకోవాలి. పగటి వేళ సూర్యరశ్మి శరీరానికి బాగా తగిలేలా చూసుకోవాలి. నగరంలో కొన్ని ఇళ్లలో ఆయా ప్రాంతాలను బట్టి గ్రీనరీ ఎక్కువ ఉండే కమ్యూనిటీల్లో విపరీతమైన చలి ఉండే అవకాశం ఉంది. అలాంటి ఇళ్లలో అవసరాన్ని బట్టి తక్కువ ధరల్లోనే లభ్యమవుతున్న హీటర్స్ ఉపయోగించాలి.

### పార్టీలు ఫుల్....

ఓ వైపు కొందరు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతుంటే మరోవైపు అనుకోకుండా వచ్చిన వింటర్‌ని ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు మరికొందరు. ఫాం హౌస్‌లలో ఓపెన్ బార్బెక్యూలు, లిక్కర్ పార్టీలు అకస్మాత్తుగా ఊపందుకున్నాయి. మల్లేపల్లికి చెందిన ఓ దుస్తుల దుకాణం యజమాని సయ్యద్ అఖిఫ్ మాట్లాడుతూ.. వింటర్ వేర్‌కి అకస్మాత్తుగా డిమాండ్ పెరిగిపోయిందని చెప్పాడు. స్వెట్టర్లు, జాకెట్స్ స్టాక్ అయిపోయాయన్నాడు.

### 'సోషల్' కూల్

- సోషల్ మీడియాలో కూల్ వెదర్ హీట్ పుట్టిస్తోంది. చలిలో వణుకుతున్న ఫొటోలను కొందరు షేర్ చేస్తున్నారు. మరికొందరు చలిని కొలిచే సాధనాలతో తమ తమ ప్రాంతాల్లో ఉన్న చలి తీవ్రతను పంచుకుంటున్నారు. తన థర్మోస్ హైగ్రో క్లాక్ ద్వారా 7.3 డిగ్రీల సెల్సియస్ ఉందని గుర్తించినట్టు కొండాపూర్‌లో బొటానికల్ గార్డెన్ ప్రాంత నివాసి ఒకరు ట్విట్టర్లో పోస్ట్ చేశారు. అలాగే సిఖ్ విలేజ్ సికింద్రాబాద్‌లో థర్మోమీటర్ 12–13 డిగ్రీల సెల్సియస్ చూపిస్తున్న వైనాన్ని మరో వ్యక్తి పోస్ట్ చేశారు. ఇక నగర వాతావరణాన్ని ఢిల్లీ వాతావరణ దృశ్యాలను పోలుస్తూ సోషల్ మీడియాలో మీమ్స్ వగైరాలు చక్కర్లు కొడుతున్నాయి.





## ఎయిర్‌పోర్ట్ తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

- ప్రపంచస్థాయి ప్రమాణాలతో సదుపాయాలు
- రూ.653 కోట్లతో పునర్ అభివృద్ధికి చర్యలు
- 19న పనులకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరభివృద్ధి నమూనా చిత్రం

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ హంగులను సంతరించుకుంటున్న నగరంలో మరో అద్భుతమైన కట్టడం ఆవిష్కృతం కానుంది. నిజాం కాలం నాటి చారిత్రక సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రపంచస్థాయి ప్రమాణాలతో అత్యాధునిక సదుపాయాలతో విమానాశ్రయం తరహాలో అందుబాటులోకి రానుంది. 1870లలో నిర్మించిన రైల్వే స్టేషన్ కళాత్మకతకు ఏ మాత్రం విఘాతం కలగకుండా దీని పునరభివృద్ధికి దక్షిణమధ్య రైల్వే కార్యాచరణ చేపట్టింది. వాస్తవానికి ఒకటిన్నర దశాబ్దం క్రితమే సికింద్రాబాద్ స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాల మేరకు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో పునరభివృద్ధికి నిర్మాణ సంస్థలను ఆహ్వానించినప్పటికీ ప్రైవేట్ సంస్థలు నిరాసక్తత వ్యక్తం చేశాయి. దీంతో దక్షిణమధ్య రైల్వే స్వయంగా ఈ ప్రాజెక్టును చేపట్టింది. రానున్న 36 నెలల్లో పునరభివృద్ధి చేసేవిధంగా కాంట్రాక్టుకు ఇచ్చారు. కొద్ది రోజుల క్రితమే సికింద్రాబాద్ స్టేషన్ వద్ద భూసార పరీక్షలను సైతం నిర్వహించారు. సుమారు రూ.653 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులకు ఈ నెల 19న ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు.

### ప్రయాణికుల సేవలో..

నాన్ సబర్బన్ గ్రేడ్ –1 (ఎన్ఎస్‌జీ1) కేటగిరీకి చెందిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రతి రోజు సుమారు 1.8 లక్షల మంది ప్రయాణం చేస్తారు. రోజుకు 200 రైళ్లు వివిధ ప్రాంతాలకు బయలుదేరుతాయి. పండుగలు, వేసవి సెలవులు, ఇతర ప్రత్యేక రోజుల్లో ప్రయాణికుల రద్దీ 2.3 లక్షల వరకు చేరుకుంటుంది. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉన్న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి దక్షిణమధ్య రైల్వేకు ఏటా రూ.500 కోట్లకు పైగా ఆదాయం లభిస్తోంది. 2008లోనే వరల్డ్‌క్లాస్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. వరుసగా బడ్జెట్‌లలో ఈ మేరకు ప్రతిపాదనలు చేసినప్పటికీ నిధులు మాత్రం విడుదల చేయలేదు. దీంతో తీవ్రమైన జాప్యం చోటుచేసుకుంది. మూడేళ్ల క్రితం ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. కానీ ముందుకు సాగలేదు. దీంతో దేశవ్యాప్తంగా ప్రధాన స్టేషన్‌ల పునరభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధికి కార్యాచరణ మొదలైంది. స్టేషన్ భవనాలను, మౌలిక సదుపాయాలను, ప్రయాణికుల సేవలన్నింటినీ ఆధునీకరించి ఎయిర్‌పోర్టు తరహాలో ప్రయాణికులకు సీమ్‌లెస్ సర్వీసులను అందజేయడం ఈ సమీకృత స్టేషన్ పునరభివృద్ధిలో భాగం .ఈపీసీ మోడల్‌లో టెండర్‌లను ఖరారు చేశారు.

## అందంగా.. హుందాగా

### ఇవీ సదుపాయాలు..

- ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా సాఫీగా ప్రయాణం చేసేలా స్టేషన్ పునరభివృద్ధి చేపట్టనున్నారు. సిటీ బస్సులు, ఎంఎంటీఎస్, మెట్రో తదితర ప్రజారవాణా మార్గాల్లో ప్రయాణికులు స్టేషన్‌కు రాకపోకలు సాగించేలా కనెక్టివిటీని పెంచడం ప్రధాన లక్ష్యం. పార్కింగ్ ఇబ్బందులను తొలగిస్తారు.
- స్టేషన్ పరిసరాల్లో ఎలాంటి రద్దీ లేకుండా నియంత్రించి ఆ స్థలాల్లో షాపింగ్‌మాల్స్, ఇతర వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేస్తారు. కొత్త స్టేషన్ భవనంలో ఉత్తరం వైపు జీ+3 అంతస్తులు, దక్షిణం వైపు జీ+3 అంతస్తుల భవనాలను నిర్మిస్తారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తారు. ఉత్తరం వైపు మల్టిలెవల్ పార్కింగ్ సదుపాయం ఉంటుంది. దక్షిణం వైపు అండర్‌గ్రౌండ్ పార్కింగ్ ఏర్పాటు చేయనున్నారు.
- రెండు వైపులా రాకపోకలు సాగించే విధంగా 7.5 మీటర్ల వెడల్పుతో 2 నడక దారులను ఏర్పాటు చేస్తారు. సికింద్రాబాద్ ఈస్ట్, సికింద్రాబాద్ వెస్ట్ మెట్రో స్టేషన్‌లకు చేరుకొనేందుకు స్కైవేలను అందుబాటులోకి తెస్తారు. ప్రస్తుతం స్టేషన్‌లో ఉన్న 10 ప్లాట్‌ఫామ్‌లకు పూర్తిగా పైకప్పులు వేస్తారు. స్టేషన్‌కు చేరుకొనేందుకు, తిరిగి వెళ్లేందుకు వేరు వేరు ప్లాట్‌ఫామ్‌లు ఉంటాయి. మరో వైపు స్టేషన్‌లో సుమారు 5000 కిలోవాట్స్ పవర్ సామర్థ్యం కలిగిన సోలార్ పవర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు.

# 'కవర్' చేస్తే కటకటాలే

## నంబర్ ప్లేట్లను 'మూసేస్తున్న' ఉల్లంఘనులు

- అదే బాటలో వెళ్తున్న స్నాచర్లు, ఇతర నేరగాళ్లు
- కేసులు నమోదు చేస్తున్న హైదరాబాద్ పోలీసులు
- రెండ్రోజుల క్రితం ఓ యువకుడికి 8 రోజుల జైలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సంచరిస్తున్న ట్రాఫిక్ ఉల్లంఘనులు నానాటికీ రెచ్చిపోతున్నారు. జరిమానాలు తప్పించుకోవడానికి నిఘా నేత్రాలు, ట్రాఫిక్ కెమెరాలకు తమ నంబర్ ప్లేట్లు చిక్కకుండా ఉండేందుకు వాటిని 'కవర్' చేస్తున్నారు. దీని కోసం మాస్కులు తదితరాలు తొడగటం, వంచేయడం, విరిచేయడం చేస్తున్నారు. ఎన్ని చర్యలు తీసుకున్నా ఉల్లంఘనుల్లో మార్పు రాకపోవడం, నేరగాళ్లు సైతం ఇదే బాటపట్టడంతో ట్రాఫిక్ కాప్స్‌తో పాటు శాంతిభద్రతల విభాగం అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా నంబర్ ప్లేట్స్ మూసేసిన వారిపై పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. నంబర్ ప్లేట్‌ను మాస్కుతో కవర్ చేసిన యువకుడిని రెయిన్‌బజార్ పోలీసులు రెండు రోజుల క్రితం పట్టుకున్నారు. ఇతడికి న్యాయస్థానం ఎనిమిది రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది.

### చలాన్లు తప్పించుకోవడానికే..

- నంబర్ ప్లేట్లు మూసేయడం అనేది ప్రధానంగా ఈ–చలాన్లను తప్పించుకోవడానికే అని స్పష్టంగా తెలుస్తోంది. ప్రస్తుతం నాన్–కాంటాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానాలు అమలవుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది తమ చేతిలో ఉన్న డిజిటల్ కెమెరాలతో ఉల్లంఘనలకు పాల్పడిన వాహనాల ఫొటోలను నంబర్ ప్లేట్లతో సహా చిత్రీకరిస్తున్నారు. వీటితో పాటు సీసీ కెమెరాల ద్వారా సేకరించిన ఫొటోల ఆధారంగా కమాండ్ అండ్ కంట్రోల్ సిబ్బంది ఉల్లంఘనులకు ఈ–చలాన్లు జారీ చేస్తున్నారు.
- ఈ విధానంలో వాహనాల నంబర్, దాని ఆధారంగా సేకరించే చిరునామా కీలకం . తమ వాహనాలకు సంబంధించిన నంబర్ ప్లేట్లను వివిధ రకాలుగా కవర్ చేయడం, వంచేయడం, విరిచేయడం చేస్తున్న వాహనచోదకులు వాటి రిజిస్ట్రేషన్ నంబర్లు ట్రాఫిక్ కెమెరాలకు చిక్కకుండా చేస్తున్నారు. కొందరు నేరగాళ్లు సైతం నంబర్ ప్లేట్లు కనిపించకుండా చేసి నేరాలకు పాల్పడుతున్నారు. నగరంలో ఇలా జరిగిన కొన్ని నేరాలను కొలిక్కి తేవడానికి పోలీసులు అనేక వ్యయప్రయాసలకోర్చాల్సి వస్తోంది.

### వాహనం వెనుకవే ఎక్కువగా..

వాహనాల నంబర్ ప్లేట్స్ ఎదుటి వారికి, సీసీ కెమెరాలకు చిక్కకుండా కవర్ చేయడం అనేది తేలికపాటి వాహనాల కంటే ద్విచక్ర వాహనాలకే ఎక్కువగా కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. రోడ్లపై ఈ తరహా నంబర్ ప్లేట్‌ను పోలీసులు గుర్తించి ఆపడానికి ప్రయత్నిస్తే బైక్స్ మాదిరిగా తేలికపాటి వాహనాలు తప్పించుకునిపోలేవు. ఈ నేపథ్యంలోనే వీళ్లు ఆ తరహా చర్యల జోలికి వెళ్లట్లేదు. ద్విచక్ర వాహనాల్లోనూ 90 శాతం వెనుక వైపు నంబర్ ప్లేట్‌కే రూపురేఖలు లేకుండా చేస్తున్నారు. సాధారణంగా ఉల్లంఘనల్ని వాహనం వెనుక నుంచే ఫొటోలు తీస్తుండటంతోనే ఈ చర్యలకు పాల్పడుతున్నారు. ఇలా ఉద్దేశపూర్వకంగా ఇలాంటి ఉల్లంఘలకు పాల్పడిన వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయడం మొదలెట్టారు.

### మాస్క్ మాటున మస్కా కొట్టాలని..

ఇలాంటి ఉల్లంఘనకు పాల్పడిన వాహన చోదకుడిపై కొన్నాళ్లుగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. రెయిన్‌బజార్ పోలీసులు పెట్టిన కేసులో మాత్రం వాహన చోదకుడికి ఎనిమిది రోజుల శిక్షపడింది. నంబర్ ప్లేట్ ఉల్లంఘనలో ఇంత శిక్షపడటం ఇదే తొలిసారి అని ఇన్‌స్పెక్టర్ నైని రంజిత్‌కుమార్ గౌడ్ 'సాక్షి'కి తెలిపారు. బాలాపూర్‌నకు చెందిన సయ్యద్ షోయబ్ అక్తర్ అలీకి ఈ శిక్షపడిందని వివరించారు. ఈ తరహా ఉల్లంఘనులపై పోలీసులు ఐపీసీలోని 420 (మోసం), 186 (ప్రభుత్వ అధికారుల విధులు అడ్డుకోవడం) సహా మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.



వాహన నంబర్ ప్లేట్‌కు మాస్కు పెట్టిన షోయబ్ అక్తర్ అలీ

### నంబర్ ప్లేట్లపై స్పెషల్ డ్రైవ్

ఈ నెల 2 నుంచి 9 వరకు చేపట్టిన డ్రైవ్‌లలో నంబర్ ప్లేట్ సరిగా లేకపోవటం, టాంపరింగ్, స్పష్టత లేకుండా చేయడం వంటి 2,925 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశామని ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. 27,467 విత్ అవుట్ హెల్మెట్ కేసులు, 509 మందిపై 39 (బీ) పెట్టీ కేసులు, 264 మందిపై 41 సీపీ యాక్ట్ (వెహికిల్ లిఫ్టింగ్), 441 మంది వాహనదారులపై ట్రిపుల్ రైడింగ్ కేసులు నమోదు చేశామని వివరించారు.

## ఒక్క శాతం కూడా పాల్గొనలే..

### సిటిజెన్ పర్‌సెప్షన్ సర్వే

- అంతగా స్పందించని జనం
- జీహెచ్ఎంసీ నిర్లక్ష్యమే కారణం

సాక్షి, సిటీబ్యూరో: అనుకున్నంతా అయ్యింది. తగిన ప్రచారం, అవగాహన కార్యక్రమాలు లేకపోవడంతో కనీసం ఒక్కశాతం ప్రజలు కూడా ఈజ్ ఆఫ్ లివింగ్ (ఈఓఎల్–2022) ఇండెక్స్‌కు సంబంధించి సిటిజెన్ పర్‌సెప్షన్ సర్వేలో పాల్గొనలేదు. గ్రేటర్ హైదరాబాద్ నగర జనాభాలో కేవలం 0.36 శాతం మంది ప్రజలు మాత్రమే పాల్గొన్నారు. అది సైతం గ్రేటర్ జనాభా 66 లక్షలుగా పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సర్వేలో పాల్గొనాల్సిందిగా జీహెచ్ఎంసీ మొక్కుబడి ప్రకటనలు తప్ప తగిన శ్రద్ధ చూపకపోవడం వల్లే ఎక్కువమంది పాల్గొనలేదని తెలుస్తోంది. కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల శాఖ నిర్వహించిన ఈ సర్వేలో కేవలం 24,013 మంది మాత్రమే పాల్గొన్నారు. నగరంలో జీవన ప్రమాణాలు, సంపాదన సామర్థ్యం , సుస్థిరత తదితరాలను అంచనా వేసేందుకు ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రానికి సంబంధించి పరిగణనలోకి తీసుకుంటే హైదరాబాద్ కంటే వరంగల్, కరీంనగర్‌లు మెరుగ్గా ఉన్నాయి. వరంగల్‌లో 96 వేల మందికి పైగా, కరీంనగర్‌లో 79 వేలకు పైగా ప్రజలు సర్వేలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈజ్‌ఆఫ్ లివింగ్ ఇండెక్స్ తుది ఫలితాల్లో ఇది ప్రభావం చూపుతుందని పట్టణ వ్యవహారాల నిపుణులు చెబుతున్నారు.

### పీర్జాదిగూడ నయం..

శివారుల్లోని పీర్జాదిగూడ స్థానికసంస్థలోని జనాభాలో యాభై శాతానికి పైగా ప్రజలు ఈ సర్వేలో పాల్గొన్నారు. 16వేలకు పైగా ప్రజలు ఈ సర్వేలో పాల్గొన్నారు. థానే, బెంగళూర్, భోపాల్, నవీ ముంబై, విజయవాడ వంటి నగరాల్లో లక్షల సంఖ్యలో ప్రజలు సర్వేలో పాల్గొన్నారు.

### జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం..

ఈ అంశంపై ప్రజలకు వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాల్సి ఉండగా ఆ పని చేయలేదు. ఓటింగ్ ప్రారంభానికి ముందునుంచే తగిన ప్రచారం చేయాల్సి ఉండగా, ఓటింగ్ ప్రారంభమయ్యాక చాలా రోజులకు జీహెచ్ఎంసీ మేయర్, కమిషనర్లు ఒకటి రెండు ట్విట్టర్ పోస్టులు, ప్రకటనలు జారీ చేసి చేతులు దులిపేసుకున్నారు బిల్‌బోర్డులు, హోర్డింగులు, గోడలపై గ్రాఫిటితో పాటు ప్రజలు కనీసం యాభైమందికి తక్కువ కాకుండా సమూహాలుగా ఉండే ప్రాంతాల్లో ప్రచారాలు, ప్రింట్, డిజిటల్ మీడియా ద్వారా వినూత్నంగానూ ప్రచారం చేయాల్సి ఉండగా అవేవీ చేయలేదు. దాంతో విషయం తెలియక ప్రజలు ఈ సర్వేలో పాల్గొనలేకపోయినట్లు తెలుస్తోంది.




# వంట మనిషే లాకర్ దొంగ

ఎమ్మెల్యే కాలనీ దొంగతనాన్ని ఛేదించిన బంజారాహిల్స్ క్రైం పోలీసులు


దొంగతనం వివరాలు వెల్లడిస్తున్న బంజారాహిల్స్ ఏసీపీ సుదర్శన్


నిందితుడు చంద్రశేఖర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీలో నివసించే రాజధాని హోటల్ యజమాని అరిహంత్ జైన్ ఇంట్లో జరిగిన భారీ దొంగతనం కేసును బంజారాహిల్స్ క్రైం పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడు అదే ఇంట్లో పని చేస్తున్న వంట మనిషిగా గుర్తించారు. మంగళవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బంజారాహిల్స్ ఏసీపీ ఎం.సుదర్శన్, సీఐ నరేందర్, డీఐ ప్రవీణ్ కుమార్, డీఎస్ఐ మల్లికార్జున్‌తో కలిసి దొంగతనం వివరాలు వెల్లడించారు. రాజస్తాన్ నాగోర్ జిల్లా బేగాన మండలం గుండీసన్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్(31) రెండున్నరేళ్ళ క్రితం అరిహంత్ జైన్ ఇంట్లో వంట మనిషిగా కుదిరాడు. పక్కా ప్రణాళికతో ఈ ఇంట్లో వంటవాడిగా చేరిన చంద్రశేఖర్ ఇంటి యజమానుల కదలికలు ఎప్పటికప్పుడు గమనిస్తూ డబ్బు లావాదేవీలు, ఆభరణాలు ఎక్కడెక్కడ దాచి పెడతారు తదితర వివరాలు గమనిస్తూ వచ్చి రాజస్తాన్‌కు చెందిన తన స్నేహితుడు రామకృష్ణ అలియాస్ రామకిషన్‌తో ప్లాన్ వేశాడు. ఇందులో భాగంగానే రామకృష్ణకు ఎప్పటికప్పుడు ఇన్‌స్టా ద్వారా ఇంటి వివరాలను, లొకేషన్, ఆభరణాలు ఎక్కడ దాస్తారు తదితర వివరాలు చెప్పసాగాడు. ఇందులో భాగంగానే ఈ నెల 3వ తేదీన జైన్ ఇంటి వాచ్‌మెన్ సెలవులో ఉండటంతో ఇదే అదునుగా దొంగతనానికి ప్లాన్ వేసిన చంద్రశేఖర్ రామకృష్ణను రాజస్తాన్ నుంచి పిలిపించాడు. సాయంత్రం 6.30 గంటలకు ఆ ఇంటికి చేరుకున్న రామకృష్ణ గోడ దూకి సీసీ కెమెరాల వ్యవస్థను భగ్నం చేసి అవి రికార్డు కాకుండా చూశాడు. రాత్రి 12.30 గంటల ప్రాంతంలో మొదటి అంతస్తుకు వెళ్ళి కప్‌బోర్డ్‌లో ఉన్న లాకర్‌ను చంద్రశేఖర్ సాయంతో దొంగిలించి మూడో అంతస్తులో సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉన్న చంద్రశేఖర్ గది ముందు పెట్టి దానిపైన వేరే డబ్బాలు పెట్టి చెప్పుల స్టాండ్ అడ్డుగా పెట్టి కనిపించకుండా చేశారు. అదే రాత్రి 2.30 గంటలకు రామకృష్ణ రాజస్తాన్‌కు ఉడాయించాడు. ఈ నెల 4న బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. అయిదు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. ఆ ఇంటి ముందు ఉన్న ఒక సీసీ కెమెరాలో మాత్రమే ఓ వ్యక్తి గోడ దూకి లోనికి వెళ్ళడం అదే వ్యక్తి బయటికి రావడం మాత్రం కనిపించింది. దొంగిలించిన సొత్తు బయటికి తీసుకెళ్ళలేదని నిర్ధారణకు వచ్చిన డీఐ ప్రవీణ్ కుమార్ మరింత లోతుగా విచారణ చేపట్టి అక్కడ పని చేస్తున్న 12 మందిని విచారించారు. మూడు రోజులు విచారించినా ప్రధాన నిందితుడు చంద్రశేఖర్ మాత్రం పోలీసుల ముందుకు వస్తూనే ఏ మాత్రం బయట పడలేదు. పోలీసులకు గాలిస్తున్న సమయంలోనే లాకర్‌ను తెరిచేందుకు తీసుకొచ్చిన గ్యాస్ కట్టర్, ఇతర సామాగ్రి చంద్రశేఖర్ గది ముందు దొరికాయి. దీంతో ఇంటి పనిమనిషుల సాయంతోనే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని భావించి అనువనువు గాలించగా చంద్రశేఖర్ గది ముందు లాకర్ దొరికింది. తెరిచి చూడగా అందులో నగదుతో పాటు ₹ 25 లక్షల విలువ చేసే ఆభరణాలు భద్రంగా ఉన్నాయి. తన స్నేహితుడు రామకృష్ణ సాయంతో లాకర్‌ను దొంగిలించిన చంద్రశేఖర్ గ్యాస్ కట్టర్‌తో అది తెరుచుకోకపోవడంతో తన ఇంటి ముందు భద్రపరిచినట్లుగా చెప్పాడు. మరో పది రోజుల్లో రాజస్తాన్‌కు వెళ్ళే ప్లాన్ వేసుకున్న చంద్రశేకర్ ఆ లోపున రామకృష్ణను పిలిపించి ఇద్దరూ కలిసి ఈ లాకర్‌ను తీసుకెళ్ళాలని పథకం వేసి చివరికి పోలీసులకు చిక్కారు. చంద్రశేఖర్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. రామకృష్ణ పరారీలో ఉన్నాడని తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న లాకర్, కట్టర్ తదితర సామగ్రి


**The Andhra Pradesh Mineral Development Corporation Limited.,**
*(A State Government Undertaking)*
***Mangampet Barytes Project***

Branch Office :
Mangampet-516 105.
Kadapa District, Andhra Pradesh
Phone : 08566 246229
Fax : 08566 246230.
Email : apmdcmpet@gmail.com

Head Office :
No. 294/ 1 D,
100ft Kanur to Nidumanur Road,
Vijayawada- 521137. Andhra Pradesh
Phone No. : 0866-2429999
Email : apmdcltd@yahoo.com

**TENDER NOTICE**

Sealed Tenders are invited from Authorized/ Reputed Vendor of 3D Laser Scanner with point studio software on monthly rental basis to carry out volumetric survey and Monitoring of Slope Stability of Mine benches and dumps of Mangampet barytes Project, M/s. APMDC LTD., Mangampet Village, Obulavaripalli Mandal, Annamaiah District. For further details please contact Chief Project Officer. Cell No: 9490167233 of Mangampet Barytes Project during working hours between 10.00 am to 4.00 pm. The Tender Schedule can be had from the Survey Section at Administrative building of Mangampet Barytes Project, **M/s. APMDC LTD., Mangampet during the office working hours from 10.00 am to 4.00 pm between 12-01-2023 to 20-01-2023 on payment of Rs.1,150/-** by way of cash or in the form of U.U. should be drawn in favour of APMDC LTD, A.P. Regn. Payable at Rly. Koduru. The Sealed Tender document should be reach to the Chief Project Officer on or before 21-01-2023, up to 2.00 pm and the same shall be opened on 21-01-2023 by 3.00 pm in the presence of available contractors or their authorized representatives. The APMDC LTD have right to cancel the Tender without assigning any reason.

**Chief Project Officer**



మీ ఆప్తుల అంత్యక్రియలు, నిర్యాణం వర్ధంతి, జయంతిల నివాళులు ప్రకటనల కోసం సంప్రదించండి.
✆ 9912220352


## కాలుష్యంపై కింకర్తవ్యం?

- కాన్పూర్ ఐఐటీ నివేదికపై చర్చ
- వాయు కాలుష్యానికి ప్రధాన కారణాలు వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ సిటీలో వాయు కాలుష్యాన్ని తగ్గించే అంశంపై ఎట్టకేలకు పీసీబీ దృష్టిసారించింది. కేంద్ర కాలుష్యనియంత్రణ మండలి మార్గదర్శకాల మేరకు త్వరలో కార్యాచరణ చేపట్టనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. గత ఐదేళ్లుగా సీపీసీబీ నిర్దేశిత స్థాయి కంటే అధికంగా ఉద్గారాలు వెలువడిన నగరాల్లో గ్రేటర్ హైదరాబాద్ కూడా ఉన్నట్లు పేర్కొంది. నగరంలో వాయు కాలుష్యానికి గల ప్రధాన కారణాలను గతంలో ఐఐటీ కాన్పూర్ నిపుణులు సిద్ధంచేసిన సమగ్ర నివేదికను పీసీబీకి, ప్రభుత్వానికి సమర్పించిన విషయం విదితమే. ఈ అధ్యయన నివేదికపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్, ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ ముఖేష్ శర్మ, సీపీసీబీ మాజీ సభ్యులు సేన్‌గుప్త, పీసీబీ సభ్యకార్యదర్శి నీతూ ప్రసాద్‌లు మంగళవారం సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ట్రాఫిక్ అధ్యయనం, నగరంలో వాయు కాలుష్యాన్ని ప్రధాన కారణాలను అన్వేషించినట్లు తెలిపింది.

**ఐఐటీ కాన్పూర్ నివేదికలోని ముఖ్యాంశాలివీ..**

సూక్ష్మ,స్థూల ధూళి కాలుష్యానికి కారణాలు: రహదారులపై దుమ్ము, కాలంచెల్లిన వాహనాలు విడుదల చేసే పొగ, బహిరంగంగా చెత్తను, ఇతర ఘన వ్యర్థాలను తగులబెట్టడం, వాహనాల పొగతో సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు, బెంజీన్ ఉద్గారాలు అధికంగా ఉండడం.

**తుదినివేదిక అనంతరం కార్యాచరణ ప్రణాళిక..**

ఐఐటీ కాన్పూర్ బృందం కాలుష్యంపై తుదినివేదిక సమర్పించిన అనంతరం..కాలుష్య కట్టడికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ పీసీబీ అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు చదరపు కిలోమీటర్లకు ఒక గ్రిడ్‌ను ఏర్పాటుచేసి వాయుకాలుష్యాన్ని గుర్తించాలని సూచించారు.

## 'హాత్ సే హాత్ జోడో అభియాన్' ను విజయవంతం చేయాలి

హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలీవుల్లా

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో 'హాత్ సే హాత్ జోడో అభియాన్' కార్యక్రమాలను విజయవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సమీర్ వలీవుల్లా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం గాంధీభవన్‌లో అభియాన్ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మెడికల్ క్యాంపులు, మున్సిపల్ డివిజన్లలో క్రికెట్ టోర్నమెంట్లు, రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందేశాన్ని అందించేందుకు మున్సిపల్ వార్డులలో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రెండు నెలల పాటు జరిగే కార్యక్రమం ప్రతి ఇంటికి చేరేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. సమావేశంలో సీనియర్ నాయకులు సీహెచ్ శ్రీనివాస్, బొల్లు కిషన్, సయ్యద్ నిజాముద్దీన్, షేక్ అర్షద్, కోట్ల శ్రీనివాస్, సిరాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌పై వాహనదారుడి దాడి

బంజారాహిల్స్: ఫ్రీ లెఫ్ట్‌లో కారును అడ్డు తొలగించాలని కోరిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై వాహనదారుడు కాలితో కారును తొక్కించడమే కాకుండా దాడి చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌కృష్ణా జంక్షన్‌లో ఓ కారు డ్రైవర్ ఫ్రీ లెఫ్ట్‌లో కారు నిలపడంతో అక్కడ విధుల్లో ఉన్న బంజారాహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎల్.నగేష్ అడ్డు తొలగాలని సైగలు చేశాడు. అయినాసరే సదరు వాహనదారుడు వినిపించుకోలేదు. వెంటనే కానిస్టేబుల్ ఆ కారు దగ్గరికి వెళ్ళగా ఆగ్రహంతో ఊగిపోతున్న డ్రైవర్ కోపంతో కానిస్టేబుల్ కాలుపైకి కారును పోనిచ్చాడు. అంతే కాకుండా కిందకు దిగి పిడిగుద్దులతో దాడి చేసి చెప్పుతో కొట్టాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్ బట్టలు కూడా చిరిగాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై సెక్షన్ 353 కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

## పోలీసుల అదుపులో వృద్ధుని హత్య కేసు నిందితులు

మలక్‌పేట: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిన వృద్ధుని హత్య కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మూసారంబాగ్ చౌరస్తాలోని మహ్మదీయ మసీద్ పక్క సందులో ఈ సంఘటన జరిగింది. మృతుడు మహమ్మద్ జాఫర్ గాయాలతో రోడ్డుపై రక్తం మడుగులో పడి ఉండటంతో తొలుత ప్రమాదంగా భావించిన స్థానికులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు పరిశీలించగా ఒంటిపై కత్తిగాట్లు ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు జాఫర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా షాద్‌నగర్‌లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండలం మొతిగన్‌పూర్‌కు చెందిన మహ్మద్ అలీ, షాద్‌నగర్, భగత్‌సింగ్ కాలనీ చెందిన పాన్‌షాప్ నిర్వాహకుడు షేక్ అర్షద్‌తో కలిసి దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. కుటుంబ తగదాల నేపథ్యంలో హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

## 'సుమోటో'గా విచారణ

- సీజే హామీ ఇచ్చారన్న న్యాయవాదుల ప్రతినిధులు
- 'కోర్టుల బహిష్కరణ' విరమిస్తున్నట్లు ప్రకటన

హైదరాబాద్: వరంగల్, నిజామాబాద్‌లో న్యాయవాదులపై దాడి, కేసు ఘటనలకు సంబంధించి సుమోటోగా విచారణ జరుపుతామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హామీ ఇచ్చారని హైకోర్టు బార్ అసోసియేషన్ పేర్కొంది. మంగళవారం సాయంత్రం తెలంగాణ బార్ కౌన్సిల్, హైకోర్టు బార్ అసోసియేషన్, వరంగల్, నిజామాబాద్ బార్ అసోసియేషన్ల ప్రతినిధులు సీజేను ఆయన ఛాంబర్‌లో కలిశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రధాన న్యాయమూర్తి హామీ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా పలు రోజులుగా కొనసాగుతున్న కోర్టుల బహిష్కరణను విరమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రఘునాథ్, ఉపాధ్యక్షుడు పాశం కృష్ణారెడ్డి, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గణపతి, వరంగల్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు కె.రాజు, దూడ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# పండగ వేళ..చోరీల నిరోధానికి చర్యలు

సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి పండుగ సీజన్‌లో ఊళ్లకు వెళ్లే వారు నిర్భయంగా వెళ్లొచ్చని, తాళం వేసిన ఇళ్లల్లో చోరీలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని, మీరు భద్రంగా ఊరెళ్లి, ఆనందంగా పండగ జరుపుకోండని సైబరాబాద్ పోలీసులు నగరవాసుల్లో ధైర్యం నింపుతున్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో వాహనాలు, హెచ్‌బీ డే, నైట్ దొంగతనాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్లను గుర్తించి, ఆయా ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని, వీటిని కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తామని సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. 24/7 పర్యవేక్షిస్తూ అనుమానాస్పద కదలికలపై స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తుంటామని పేర్కొన్నారు. రాత్రి సమయంలో నివాస ప్రాంతాలలో విజిబుల్ పోలీసింగ్‌ను పెంచి, రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా పోలీసులు చెప్పటాల్సిన ముందస్తు చర్యలపై సైబరాబాద్‌లోని అన్ని ఠాణా అధికారులు, క్రైమ్స్ విభాగంతో మంగళవారం సీపీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ప్రాంగణంలో కెమెరాలను ఏర్పాటు చేసుకోనేలా, కాలనీలలో అనుమానాస్పద వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారాన్ని తెలియజేసేలా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. పాత నేరస్తులు, ఇటీవల జైలు నుండి విడుదలైన వారి కార్యకలాపాలను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. అనుమానితులను పట్టుకోవడానికి కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేయాలని సూచించారు. కమిషనరేట్ పరిధి సరిహద్దు ప్రాంతాల పోలీసు స్టేషన్ సిబ్బంది ఇతర కమిషనరేట్ ఠాణా పెట్రోలింగ్, రైల్వే పోలీసులతో సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ప్రజలకు ఇబ్బంది కలగకుండా వాహనాలను నడుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు కల్మేశ్వర్ సింగన్వర్, శ్రీనివాస్ రావు, శిల్పవల్లి, జగదీశ్వర్ రెడ్డి, సందీప్, అదనపు డీసీపీలు రవి కుమార్, నరసింహా రెడ్డి, తదిరతులు పాల్గొన్నారు.

# సిటీ పోలీసులో ఏఐ

- ఈ ఏడాది నుంచి అమలుకు నిర్ణయం
- టార్గెట్–2023పై నగర కొత్వాల్ సమీక్ష



సాక్షి, సిటీబ్యూరో: నేరాల నియంత్రణ, కేసులు కొలిక్కి తీసుకురావడంతో పాటు సిటీలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగించాలని కొత్వాల్ సీవీ ఆనంద్ నిర్ణయించారు. ఈ ఏడాదిలో అవసరమైన అన్ని విభాగాల్లోనూ ఏఐతో పాటు చాట్ బోట్స్ అందుబాటులోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. టార్గెట్–2023ను నిర్దేశించుకున్న తీరులో, సమయంలో పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కొత్వాల్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో అదనపు, సంయుక్త సీపీలతో పాటు డీసీపీలు, అదనపు డీసీపీలు పాల్గొన్నారు. నగర పోలీసు విభాగంలోని ప్రతి యూనిట్‌లోనూ డిజిటల్ లైబ్రరీలు అమలులోకి తీసుకురానున్నారు. మాదకద్రవ్యాల తయారీ యూనిట్లతో పాటు అందుకు ఉపకరించే రసాయనాల విక్రయం తదితరాల పైనా ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. దీనికోసం హెచ్–న్యూకు అదనపు హంగులు చేర్చనున్నారు. నగరంలోని ప్రతి ప్రాంతాన్ని కవర్ చేసేలా సీసీ కెమెరాల ఏర్పాటు, వీటిని పక్కాగా నిర్వహించడం కూడా ఈ ఏటి లక్ష్యాల్లో ఉన్నాయి. పోలీసు విభాగంలో మౌలిక వసతుల అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం సమీకరణకు అవసరమైన నిధులు విడుదల చేయనున్నారు. మరో నెల రోజుల్లో అన్ని జోన్లలోని కాలేజీల్లో, ఈ ఏడాది చివరి నాటికి ప్రతి స్కూలులో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. సైబర్ క్రైమ్ సపోర్ట్ సెంటర్ ఏర్పాటు, పోలీసుస్టేషన్లలోనూ సైబర్ క్రైమ్ దర్యాప్తు చేసేలా సిబ్బందికి తర్ఫీదు ఇవ్వడం, అందుకు అవసరమైన ఉపకరణాల ఖరీదుకు కమిషనర్ ఆమోదముద్ర వేశారు. విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని, కేసుల పెండెన్సీ తగ్గించాలని, మాదకద్రవ్యాలకు చెక్ చెప్పడం, సైబర్ నేరాలు నిరోధించడంపై దృష్టి పెట్టాలని కొత్వాల్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర రాజధానిగా ఉన్న హైదరాబాద్ నగరం భద్రతకు కీలక ప్రాధాన్యం ఇస్తున్నారు.

# ఐటీ కార్యాలయాలలో చేనేత మేళాలు


అరబిండ్ గెలాక్సీలో చేనేత మేళాను ప్రారంభిస్తున్న తెలంగాణ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ సభ్యులు

హఫీజ్‌పేట్ : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ చేనేత మేళాను ప్రమోట్ చేస్తూ రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని అరబిండ్ గెలాక్సీలో 20వ ఎడిషన్ చేనేత మేళాను మంగళవారం ప్రారంభించారు. అనంతరం తెలంగాణ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షులు సత్యనారాయణ మాతల, డైరెక్టర్ డాక్టర్ చిన్నం రెడ్డి తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్క ఐటీ ఉద్యోగి చేనేత వస్త్రాలు ధరించే విధంగా చేనేత మేళాల ద్వారా ముందుకు తీసుకు వచ్చి అవగాహన కల్పిస్తున్నామన్నారు. చేనేత సోమవారం అనేది మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపుగా చేనేతలను ప్రోత్సహించడంతో పాటు దుస్తులను ధరించడం ద్వారా కార్మికులను ఆదుకోవడమని అన్నారు. 2023 సంవత్సరంలో 11 మేళాలను నిర్వహించనున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఐటీ కార్యాలయాలలో 19 చేనేత ప్రదర్శనలను నిర్వహించామన్నారు. నాలుగు లక్షల మంది ఐటీ, ఇతర ఉద్యోగులను చేరుకోవడం, రూ.4 కోట్ల విలువైన చేనేత వస్త్రాలను విక్రయించడం లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. గద్వాల్ పోచంపల్లి, సిద్ధిపేట, ఇక్కట్ పట్టు చీరలు, హస్తకళా ఉత్పత్తులు, చేనేత కుర్తాలు విక్రయానికి అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి మేళా మూడు రోజుల పాటు తెరిచి ఉంటుందన్నారు.

# ప్రైవేటులో రిజర్వేషన్లు కల్పించాలి

ఆర్.కృష్ణయ్య డిమాండ్


ఆందోళనలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య తదితరులు


గన్‌ఫౌండ్రీ: ప్రైవేటు విశ్వ విద్యాలయాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ప్రైవేటు విశ్వ విద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ.. బషీర్‌బాగ్‌లోని విద్యాశాఖ మంత్రి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రైవేటు కళాశాలలను విశ్వ విద్యాలయాలుగా మారుస్తూ రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతున్నాయని, ఓ పథకం ప్రకారం.. సాంకేతిక విద్యాశాఖలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రిజర్వేషన్లు అందకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లోనూ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై దాడులను అరికట్టాలి: మల్లు రవి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో అంబేద్కర్ పార్టీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో కొడంగల్‌లో దళితుడు బాలరాజుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ..... దళితుల రక్షణకు అనేక చట్టాలు ఉన్నప్పుడు వాటిని సక్రమంగా అమలు చేయకపోవడంతో వారికి రక్షణ లేకుండా పోయిందన్నారు. కొడంగల్ మండలం రావులపెల్లి గ్రామంలో జరిగిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభలో అయ్యప్పను కొందరు కించపరిచారనే నెపంతో బీజేపీ, అయ్యప్ప భక్తులు ధర్నా నిర్వహించారని, ఆ ధర్నాని చూడటానికి వచ్చిన గుండుమాల్ గ్రామానికి చెందిన బాలరాజుపై దాడి చేసి విపరీతంగా కొట్టా రని ఆవేదన వ్యక్తం చేశారు. బాలరాజుపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించడంతోపాటు దళితుల రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ బహదూర్, వివిధ సంఘాల నాయకులు మన్నారం నాగరాజు, జె.బి రాజు, నల్లా సూర్య ప్రకాష్, జి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యో.. ఏమైందో ఏమో!

- కూలి పనుల కోసం వచ్చి విగతజీవులుగా మారి..
- అనుమానాస్పద స్థితిలో వృద్ధ దంపతుల మృతి


హనుమంతు, వెంకటమ్మ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: కూలి పనికోసం వలస వచ్చిన వృద్ధ దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. రాత్రి పడుకున్న మంచంపైనే తెల్లవారేసరికి విగతజీవులుగా మారారు. ఈ విషాదకర సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన నాగారం హనుమంతు (65), భార్య వెంకటమ్మ(50)తో కలిసిఅబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్‌లో సుగుణ అనే మహిళా రైతు వద్ద హార్టికల్చర్ పనులు చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి నిద్రకు ఉపక్రమించారు. మంగళవారం ఉదయం ఇంకా ఇంట్లోంచి బయటకు రాకపోవడంతో సుగుణ వారిని పిలిచేందుకు వెళ్లింది. లోపలి నుంచి గడియపెట్టి ఉండడంతో పాటు దంపతులిద్దరూ స్పందించకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని గ్రామస్తులకు చెప్పింది. దీంతో కొంతమంది వచ్చి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా హనుమంతుదంపతులు మంచంపై విగతజీవులుగా కనిపించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. మృతుల కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.


## సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

**BUILDING CONSTRUCTION**

■ Srirama Constructions మంచి మెటీరియల్ తో 1675/- Sft. కట్టి ఇవ్వబడును & ఇండ్ల ఆల్టరేషన్ చేయబడును. (కార్ డ్రైవర్ కావలెను) ఫోన్ : 9347156817. [HA-10038]

**FLAT FOR SALE**

■ Balanagar Ambica Colony Near Hanuman Temple, H.No. 6-1-122/820 sft. Ph: 9849178541, 9493105553. [H-792725]

■ New 3BHK, 2140 Sft Maharah Magnus Apt 4th Floor(E/F) Beside HDFC Bank, Nanal Nagar, Main Road, Mehdipatnam, Hyd. 6303733064, 7895093270 [G-5915]

**LAND FOR SALE**

■ జనవహాడ్ మెయిన్ రోడ్ ఫేసింగ్ 25 ఎకరాల అగ్రికల్చర్ భూమి. ఫుల్ నీటి సదుపాయంతో అమ్మకం. దామెరచర్ల దగ్గర, నల్గొండ జిల్లా. సంప్ర : 9115842234, 8499870866. [H-776444]

**PLOT FOR SALE**

■ "ICONIC INFRA GROUP" HMDA 100ft. రోడ్ ఫేసింగ్ VJA హైవే @ చౌటుప్పల్ & 200ఫీట్ రోడ్, సాగర్ హైవే ఫేసింగ్ DTCP@యాచారం (బ్యాంక్ లోన్ కలదు) ఫోన్ : 9700021777. [HA-792693]

■ నారాయణఖేడ్ లో 369 ఎకరాల మెగా వెంచర్లో ఎర్ర చందనం మొక్కలతో & Free Resort తో కలిగిన 605 SQD కేవలం 5 లక్షలు, మార్కెటింగ్ టీం కావలెను. ఫోన్ : 9000838648. [H-792718]

■ మహేశ్వరం E-City, Wipro కి 100 MTS దగ్గరలో HMDA ప్లాట్స్ కలవు. మార్కెటింగ్ టీమ్ కావలెను. Sankranthi లోపు ప్లాట్స్ కొన్న వారికి 10 గ్రాం గోల్డ్ ఉచితం. ఫోన్ : 9100048061. [H-792715]

■ రాజాపూర్ @NH-44 దగ్గర 0% ఇంట్రెస్ట్ తో 30 నెలల EMIతో అన్ని డెవలప్‌మెంట్‌తో 147 గజాల 'MUDA' లేఅవుట్ ఓపెన్ Plots కలవు. ఫ్రీ సైట్ విజిట్ కు సంప్ర.: 9949695027. [HA-676]

■ విశాఖ కొత్తవలస రైల్వేస్టేషన్‌కు అతి చేరువలో 100 గజాలు మామిడి, జామ, రోజ్‌వుడ్ మొక్కలతో 5 సంవత్సరాలు మెయింటెన్ చేసి ఇవ్వబడును. గజం రూ.3,900/- మాత్రమే. ఫోన్: 93473 75773 [V-1691]

■ Residential Ready to Built Plots for Sale in Hyd 1.E/F 1000Sq.Yards Pragathi Nagar ALeap x rd 2) W/F 420sq.yards Shankar green homes, Ameenpur. 7382808724, 9999596079 [G-5938]

Services

■ బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1740]

**ASTROLOGY**

■ శ్రీ దుర్గాదేవి జ్యోతిష్యాలయం పండిత్ మార్తాండరావు శాస్త్రీ, జన్మపత్రిక మీ రెండు హస్తరేఖలు ఫోటో చూసి మీ జీవిత సంపూర్ణ భవిష్యత్తు శాస్త్రోక్తముగా తెలుపగలరు. విద్య, ఉద్యోగం, వ్యాపారంలో లాభనష్టాలు, సంతానం, ప్రేమ వివాహం, కుటుంబ కలహాలు, వాస్తు/గ్రహదోషం, ఆరోగ్యం, విదేశీయానం, కోర్టు, మీకు ఎటువంటి సమస్యలకైనా 21 రోజుల్లో శ్రీ దుర్గాదేవి పూజ ద్వారా పరిష్కారం తెలుపగలరు. మలక్ పేట్, హైదరాబాద్. ఫోన్ : 8977279272. [HA-13157]

**BUSINESS SERVICE**

**BUSINESS OFFER**

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-776588]

■ అర్జెంటుగా మంచి 100% ప్రాఫిట్ గల బిజినెస్ కొరకు Investment Partner కావలెను Food (ministores) Genuine Person Call me 7674990470 [H-792642]

■ ఇంటి నుండి 100 రకాల ఉత్పత్తులతో రోజు సంపాదన. LED's, TV's, AC's Mobiles కొత్తవి కొన/అమ్మబడును. Emi, Credit Cardలో బ్యాలెన్స్ ఉన్నవారికి Spot పర్సనల్/బిజినెస్ లోన్స్ ఫైనాన్స్ సౌకర్యం. ఫోన్: 9100729447 [HA-2902]

■ Business Tycoon Hub Shadow of Enterpner Enroll New Year Super offer 50% off. Please cont ✆ 81435 14395 [B-1376]

**HOME CARE SERVICES**

■ మంజు హోమ్ కేర్ సర్వీసెస్ వృద్ధులకు మంచాన ఉన్న వారికి 24 గంటలు సేవలు చేయుటకు అనుభవం గల అటెండర్లను మీ ఇంటికి పంపించబడును. సంప్ర: 9493698334. [H-792696]

**HOME NEEDS**

**PEST CONTROL**

■ చెదలు, బొద్దింకలు, నల్లులు, బల్లులు, శానిటేషన్, వాసనలేని మరకలు పడని ISI కెమికల్స్‌తో నివారించే సంస్థ. హిందుస్తాన్ పెస్ట్ కంట్రోల్, సంప్ర: 7981533849, 9490179238. [HA-880]

■ చెదలు, బొద్దింకలు నివారణ, న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282 / 8333030227. [HA-10024]

**PERSONAL CARE**

**CHANGE OF NAME**

■ I, Pavithran S/o. Surya Prakash, R/o. Flat No.-104, Telkars Tower, Taranagar, Near Tulja Bhavani Temple, Serilingampally, K.V. Rangareddy, Telangana- 500019, have changed my name and shall hereafter be Known as Voruganti Pavithran Kumar. [H-27999]

■ I, Aravind Kumar (Old name), S/o. G. babu Rao, R/o. 8-3-228/678/587, Karmika Nagar, Yousufguda, Hyd-500045 has Changed my Name As G. Aravind Kumar (New Name) for all purposes. [HA-2901]

■ I, Vasavi K, D/o. P.M. Tulasi, Age: 22 years, Occ: House Wife. R/o. H.No. 15-31-1/9, 4th Phase, KPHB Colony, Kukatpally, Medchal-Malkajgiri Dist. Hyd-072, T.S. hereby Declare that Marriage Changed my Name as Palapatti Vasavi W/o. Palapatti Rajesh for all Records. [HA-885]

**LOST**

■ I, K. Sridevi W/o. Late k. Radha Krishna Murthy R/o. H.No. 21-18/3, Sharada Nagar, Pochamma Temple Dilsukhnagar, Hyd. I have Lost my Original Sale Deed Documents Bearing Document No.: 16493/1989, While Traveling from Jafferguda Site to my Home on 27/11/2021 If any body found call: 9985151222. [H-787478]

**TOURS & TRAVELS**

■ సాయి టూర్స్: రామేశ్వరం, కన్యాకుమారి Jan-21, గుజరాత్ సోమనాథ్, ఉజ్జయిని Feb-6, Mar-6, కర్ణాటక, ఉడిపి, గోకర్ణం, శృంగేరి Feb-19, మహారాష్ట్ర అష్టగణపతులు, శిరిడి Mar-16, ఫోన్: 9848664831. [H-793253]

Wanted

■ Dherji సైట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. PVR Projects Ltd., మహారాష్ట్ర. ఫోన్: 040-23348080, 23338080 Email:adm.vineela@gmail.com [HA-779938]

■ సబ్ ఎడిటర్ కావలెను 35 సం॥గా ప్రచురించ బడుతున్న వ్యాపార పల్లె పత్రికకు సబ్ ఎడిటర్స్ కావలెను. P/F టైం, Exp. వారికి ప్రాధాన్యత, డిగ్రీ చదివిన కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ఫోన్: 9989113036, 9848113036 [H-792694]

■ V.B.Johnson Elevators లిఫ్ట్ కం. కూకట్‌పల్లిలో లేడీ రిసెప్షనిస్టు (తెలుగు/హిందీ) మాట్లాడేవారు కావలెను. జీతం: 10,000/- (Exp.) కంప్యూటర్ నాలెడ్జ్). ఫోన్ : 9154954305. [H-786781]

■ 5&3 స్టార్ హోటల్స్‌లో క్యాటరింగ్ బాయ్స్, గర్ల్స్ P: 600/- F: 1200/- రూం+మీల్స్ & టి॥కాలర్స్, సె॥గార్డ్స్, ప్యాకింగ్ బాయ్స్, గర్ల్స్, హౌస్‌కీపింగ్, జీ.12-18K. ఫోన్:9848992744, 9010385868. [H-787474]

■ ప్రముఖ ఆఫీస్ లో సెక్యూరిటీ గార్డ్స్, ASO, ఫీల్డ్ ఆఫీసర్స్, హౌ॥కీ. బాయ్స్, (M/F) కావలెను, 8-12 గం.లు. Age:18-40y. Qly:0-డిగ్రీ, జీ.12-20 వేలు, జూబ్లీహిల్స్. ఫోన్: 9063239926, 9154219926. [H-779924]

■ డైరెక్ట్‌జాబ్ పేషెంట్ కేర్, బేబీకేర్, కుక్స్(స్త్రీలు), నర్సింగ్, కేర్ కొరకు వెంటనే కావలెను. ఫ్రీరూం+భోజనం+ జీతం: 16000 నుండి 30000వేల వరకు. Ph: 9703122497, 9346605007. [H-776697]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776003]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ. 18K ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888, 7569955551. [HA-786818]

■ Urgently Req. Accounts Manager, Qly. B.Com, Graduate Exp. 2-3 yrs. in Accounts, Salri As per Experience, Location Western Plaza Apartment, Ph: 9059602505. Email: westernplaza.mc@gmail.com [H-786782]

■ Req. Exp. Telecallers (F) For Reputed Bank DSA @ Tarnaka & Vanasthalipuram. Direct Job. Fixed Salary. Ph: 9989222459, 8790153029 [HA-10037]

■ Wanted 5 yrs Experienced Driver Living near Banjarahills 9.30 am to 8 pm. Salary 20000/- Contact: 7732003000. [HA-89912]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : జాబ్ పై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

| | | | |
|---|---|---|---|
| దిల్‌సుఖ్‌నగర్ | 9912348016 | రాజేంద్రనగర్ | 9010202372 |
| ఎల్.బి.నగర్ | 9912225475 | కూకట్‌పల్లి | 9912225476 |
| తార్నాక | 9010202751 | బాలానగర్ | 9951602997 |
| సికింద్రాబాద్ | 9010299013 | మల్కాజ్‌గిరి | 9505507562 |
| చిక్కడపల్లి | 9010188892 | మెహదీపట్నం | 9912225468 |
| అబిడ్స్ | 9705144457 | చందానగర్ | 9010213322 |
| అమీర్‌పేట్ | 9505507563 | ఉప్పల్ | 7095250115 |

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: బేగంపేట, ప్రకాశ్‌నగర్, లోధ సబ్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్ లాండ్స్ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్ తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎల్లమ్మ ఆలయం ఏరియా, బలకంపేట, సాయిబాబా ఆలయం, రేణుకానగర్, ఎరుకల బస్తీ, మెజిస్టిక్ మాన్సన్, జాగృతి అపార్ట్‌మెంట్స్ పరిసరాలు, ఆర్‌బీఐ క్వార్టర్స్ ఎదురులైన్, సనత్‌నగర్, ఇండస్ట్రియల్ ఏరియా, అల్లాడిన్ కోటి, లిక్కర్ కంపెనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- మ.2 నుంచి సా. 5 గంటల వరకు మైత్రీవనం, ఎస్.పార్క్, ప్రకాశ్‌నగర్, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గాయత్రీనగర్, సత్యం థియేటర్ మెయిన్‌రోడ్డు, బ్లూఫాక్స్, ప్రైమ్ ఆసుపత్రి, జీఈ బిల్డింగ్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ఎఫ్‌సీఐ గోడౌన్ ఏరియా, ప్రేమ్‌నగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

### లోప్రెషర్ సమస్యను పరిష్కరించండి


గౌరీశంకర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం. 11లోని గౌరీశంకర్ కాలనీ, నందినగర్‌లో వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి మంగళవారం పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గౌరీ శంకర్ కాలనీలోని నల్లాల నుంచి తాగునీరు లోప్రెషర్‌తో వస్తోందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ త్వరలో కొత్త పైప్‌లైన్ వేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. నందినగర్‌లో సీసీ రోడ్లు మంజూరయ్యాయన్నారు. కమ్యూనిటీ హాల్ ప్రాంతంలో మంచినీటి, సీవరేజి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు.

### 'పోలీసు అభ్యర్థులకు న్యాయం చేయాలి'


దీక్షలో పాల్గొన్న రోహిణ్‌రెడ్డి తదితరులు

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పోలీసు నియామకాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని ఖైరతాబాద్ యూత్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బంజారాహిల్స్ రోడ్ నం. 1లోని జీవీకే వన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి పాల్గొని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అభ్యర్థులకు న్యాయం చేసే వరకు యూత్ కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందన్నారు. యూత్ కాంగ్రెస్ నేతలు బల్లు రాథోడ్, నారికేళ్ల నరేష్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ యాదవ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

### ఓయూ దూరవిద్య పీజీ కోర్సుల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య వివిధ పీజీ కోర్సుల పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. గత ఏడాది ఆగస్టులో జరిగిన 7 ఎంఏ, రెండు ఎమ్మెస్సీ కోర్సుల ఇంటర్నల్ పరీక్షల ఫలితాలను ఉస్మానియా వెబ్‌సైట్లో ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

# సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యం

- ఈ నెల 18 నుంచి కంటి వెలుగు శిబిరాలు
- జీహెచ్ఎంసీ సహకారంతో నిర్వహించనున్న వైద్యారోగ్యశాఖ
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో 12 శిబిరాల ఏర్పాటు


కంటి వెలుగు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం


కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేయనున్న గౌతంనగర్ కమ్యూనిటీ హాల్

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. జీహెచ్ఎంసీ సహకారంతో వైద్యారోగ్య శాఖ అధికారులు ఈ శిబిరాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆయా ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు కార్యాచరణ రూపొందించారు.

- ఖైరతాబాద్ నియోజక వర్గం పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ, వెంకటేశ్వర కాలనీ, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో 12 కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నారు.
- నియోజక వర్గంలోని జనాభా ఆధారంగా శిబిరాలు, బృందాల సంఖ్యను నిర్ణయించారు.
- వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరాల్లో పాల్గొనే వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు
- ఇందులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని పలు సూచనలు జారీ చేశారు. ఇందులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని పలు సూచనలు జారీ చేశారు.
- పరీక్షలు చేసిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు తాత్కాలిక పద్ధతిన ఆప్టమెట్రిస్టులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు.
- ఈ శిబిరాల్లో అందరికీ పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి అద్దాలు సరఫరా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

**ఆరు డివిజన్లకు 28 బృందాలు..**

ఖైరతాబాద్ నియోజక వర్గంలోని ఆరు డివిజన్లలో 4.45 లక్షల జనాభా ఉన్నట్లు అంచనా. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నియోజక వర్గంలోని ఆరు డివిజన్లకుగాను 28 బృందాలు కేటాయించారు. మొత్తం 12 శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. మొదటి విడతతో పోలిస్తే సుమారు 50 వేల మందికి అదనంగా కంటి పరీక్షలు చేస్తారని అంచనా. పరీక్షలు చేయించుకునే వారిలో సుమారుగా 95 వేల మందికి రీడింగ్ గ్లాస్‌లు అవసరం పడతాయని అంచనా వేశారు. ఇంకో 70 వేల మందికి కళ్లద్దాలు, శస్త్ర చికిత్సలకు సిఫారసు చేయనున్నారు. కంటి వ్యాధులు, ఇతర లోపాల మందులు అందిస్తారు.

**బృందంలో ఎవరెవరుంటారు..**

కంటి వెలుగు బృందాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, శిబిరం వైద్యులు, హెల్త్ ఎడ్యుకేటర్, ఆప్టమెట్రిస్ట్, ఫార్మాసిస్ట్, ఏఎన్ఎం లేదా డాటా ఎంట్రీ ఆపరేటర్, ఆశ కార్యకర్త, ఎంపీహెచ్ఎస్ ఉంటారు. మరో మూడు బృందాలు అదనంగా ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడైనా అత్యవసరం అనుకుంటే వీరిని వినియోగించుకుంటారు. వీరు ఆయా పీహెచ్‌సీల పరిధిలోని నిర్దేశించిన ప్రణాళికల ప్రకారం బస్తీలకు వెళ్లి కంటి పరీక్షలు చేస్తారు. పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు, అద్దాల పంపిణీ వివరాలను వెంటనే డాటా ఎంట్రీ ఆపరేటర్ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాడు. వైద్యాధికారి స్థానిక ఎమ్మెల్యే సూచనల ప్రకారం కమ్యూనిటీ హాళ్లలో ఈ శిబిరాలు ఏర్పా టు చేస్తారు. ప్రభుత్వ వాహనాలతో పాటు మరో పది వాహనాలను అద్దెకు తీసుకున్నారు.

**ఖైరతాబాద్‌లో కంటి వెలుగు శిబిరాలివే..**

- బంజారాహిల్స్‌రోడ్ నం..10లోని ఇబ్రహీం నగర్ కమ్యూనిటీ హాల్
- రోడ్ నం..14లోని నందినగర్ కమ్యూనిటీ హాల్
- రోడ్ నం.11లోని గౌరీశంకర్ కాలనీ కమ్యూనిటీ హాల్
- రోడ్ నం.12లోని ఎన్బీ నగర్ కమ్యూనిటీ హాల్
- ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్
- ఖైరతాబాద్ ఓల్డ్ సీబీ క్వార్టర్స్ కమ్యూనిటీ హాల్
- శ్రీనివాసనగర్ కమ్యూనిటీ హాల్
- సోమాజిగూడ ఎంఎస్ మక్తా కమ్యూనిటీ హల్
- సోమాజిగూడ పీజేఆర్ కమ్యూనిటీ హాల్.
- హిమాయత్‌నగర్ డివిజన్‌లో ఒక చోట
- చింతల్ బస్తీ శ్యాంరావునగర్ కమ్యూనిటీ హాల్

## జూబ్లీహిల్స్‌లో ట్రా'ఫికర్'

- రోడ్ నం. 59 రోడ్డు పనులు
- రోడ్ నం. 45లో 'డైవర్షన్ల'తో వాహనదారులకు ఇక్కట్లు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లో చేపట్టిన ట్రాఫిక్ డైవర్షన్లతో అంతర్గత రహదారులు ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో నాలుగు గంటల పాటు వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకొని నరకయాతన అనుభవిస్తున్నారు. దీనికి తోడు రోడ్ నం. 59లో వారం క్రితం రోడ్డు పనులు ప్రారంభించారు. ఫలితంగా మూడు రోడ్లకు రాకపోకలు నిలిచిపోయాయి. దీని ప్రభావం రోడ్ నం. 54పై చూపుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డు కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోతూ వాహనదారులు నానా అ వస్థలు పడుతున్నారు. రోడ్ నం. 45 పై ఓవర్ కింద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా ముందుకు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉంటున్నా నియంత్రణలో చేతులెత్తేస్తున్నారు. ఇలాఉండగా, సీవీఆర్ న్యూస్ నుంచి జర్నలిస్టు కాలనీ చౌరస్తా వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ మెల్లగా సాగుతోంది. మోహన్‌బాబు ఇంటి వద్ద యూ టర్న్ కూడా వాహనదారులకు సమస్యాత్మకంగా మారింది. ఇంకోవైపు పెద్దమ్మగుడి రోడ్డు, దాని చుట్టుపక్కల రహదారులు కూడా ట్రాఫిక్‌తో కిటకిటలాడుతున్నాయి.



జూబ్లీహిల్స్ రోడ్ నెం 59లో రోడ్డు పనులు


రోడ్ నెం. 54లో స్తంభించిన ట్రాఫిక్

## రాకేష్ మాస్టర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**టీఎంపీఎస్ డిమాండ్**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఎంపీఎస్ నాయకులు

బంజారాహిల్స్: మహిళతో అసభ్యంగా మాట్లాడటంతో పాటు సహజీవనం చేసి 22 ఏళ్ల క్రితం వదిలేసిన మరో మహిళను వేధిస్తున్న సినీ డ్యాన్స్ మాస్టర్ రాకేష్ మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని టీఎంపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గారే వెంకటేష్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ ఆయన బాధితులు చింతా కస్తూరి, లక్ష్మి, శాన్వి మీడియా యూట్యూబర్ చరణ్ గురువునిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 22 ఏళ్ల క్రితం రాకేష్ మాస్టర్ తనను ప్రేమ పేరుతో పెళ్లి చేసుకొని వదిలేశాడని, తాజాగా మొదటి భార్య విడిపోవడానికి తాను కారణమంటూ లేనిపోనివి చెప్తూ తనను దుర్భాషలాడుతూ వేధిస్తున్నాడని చింతా కస్తూరి ఆరోపించారు. దళిత మహిళ అయినా తన పట్ల ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని, ఇదే విషయమై గతంలో పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. రాకేష్ మాస్టర్ నుంచి విడిపోయిన మరో మహిళ లక్ష్మిని కూడా ఇదే విధంగా వేధిస్తున్నాడని అన్నారు. ఈ మహిళలు ఇద్దరికీ ఉపాధి కల్పించినందుకు శాన్వి మీడియా యూట్యూబర్ చరణ్ గురువనిని కూడా వేధిస్తున్నాడన్నారు. రాకేష్ మాస్టర్ పై త్వరలో నగర పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని గారే వెంకటేశ్ మాదిగ చెప్పారు. మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్న రాకేష్ మాస్టర్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు.

### జీఓ 60 ప్రకారం జీతాలు ఇవ్వాలి


నిరసన వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

వెంగళరావునగర్: ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే జీఓ 60 ప్రకారం జీతాలు ఇవ్వాలని ఆసుపత్రి యూనియన్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఛాతి ఆసుపత్రి ఆవరణలో మంగళవారం నిరసన తెలియజేశారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ 60 ప్రకారం నెలకు రూ.15600 జీతం ఇస్తుండగా, ఛాతీ ఆసుపత్రిలో మాత్రం ఈ జీఓను అమలు చేయడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 17 నుంచి 24వ తేదీరకు వరకు నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలపాలని కార్మికులు నిర్ణయించామన్నారు. అనంతరం 25 నుంచి 31వ తేదీ వరకు లంచ్ టైమ్‌లో గంటసేపు నిరసన వ్యక్తం చేస్తారన్నారు. నిరసన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నస్రీన్, చంద్రకళ, కృష్ణ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు

## తమిళనాడు గవర్నర్‌ను పదవి నుంచి తొలగించాలి

**దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు కృష్ణస్వరూప్**

లిబర్టీ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో పాటు పలువురు మహనీయులను అవమానించిన తమిళనాడు గవర్నర్ ఆర్.ఎస్.రవిని వెంటనే పదవి నుంచి తొలగించాలని భారత రాష్ట్రపతికి, హోంశాఖ మంత్రికి దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమిళనాడు శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ ఆర్ఎస్.రవి అంబేడ్కర్ పేరు ఉచ్ఛరించకుండా ప్రసగించటాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అంబేడ్కర్‌తో పాటు లొకికవాద వాఖ్యను, పెరియార్ రామస్వామి మాటను, అన్నాదురై మాటను మాట్లాడకుండా కించపరిచారని ఆరోపించారు. శాసనసభలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేరును ప్రస్తావించకుండా అవమానించిన గవర్నర్ రవి భారత జాతికి, దళిత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

లిబర్టీ: దళిత బహుజనుల మేధావులపై జరుగుతున్న దాడులు ఆపకపోతే తిరుగుబాటు తప్పదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. దళిత బహుజన మేధావులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, దాడులకు పాల్పడ్డ వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. మంగళవారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోని అనేక గ్రామాల్లో దళిత బహుజనులపై, ప్రధానంగా మేధావులపై దాడుల పరంపర కొనసాగుతోందని, ప్రభుత్వంగానీ, పోలీసులు గానీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు.

## ముమ్మరంగా తాగునీటి పైప్‌లైన్ పనులు


పోచమ్మ గుడి వద్ద పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న తట్టికాన మేనేజర్ రాంబాబు

బంజారాహిల్స్: ఎన్బీటీ నగర్ బస్తీలో కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పాత పైప్‌లైన్ స్థానంలో కొత్తగా వేస్తున్న పైప్‌లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తట్టికాన సెక్షన్ మేనేజర్ రాంబాబు తెలిపారు. మొదటి దశలో కల్లు కాంపౌండ్ వైపు నుంచి పోచమ్మ గుడి వరకు పనులు పూర్తి చేశామని, తాజాగా పోచమ్మ గుడి నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు ప్రాంతాన్ని బట్టి 200 ఎంఎం, 150 ఎంఎం, 100 ఎంఎం డయా పరిమాణంలో పైపులు వేస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తయితే ఇక్కడ తాగునీటి ఎద్దడితో పాటు కలుషిత నీటి సరఫరా సమస్యకు కూడా తెరపడుతుందన్నారు. రూ. 58 లక్షల వ్యయంతో 800 మీటర్ల మేర ఈ పైప్‌లైన్ వేస్తున్నామన్నారు.

## కలుషిత నీటి సరఫరాను నివారించండి


రహమత్‌నగర్‌లో పర్యటిస్తున్న డీజీఎం వాహబ్, సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: డివిజన్‌లో పలు బస్తీల్లో సరఫరా అవుతున్న కలుషిత మంచినీటి సరఫరాకు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి జలమండలి అధికారులను కోరారు. రహమత్ నగర్ బస్తీలో కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని స్థానికుల ఫిర్యాదు మేరకు, మంగళవారం జలమండలి డీజీఎం వాహబ్, మేనేజర్ రమేశ్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ, కలుషిత నీటి సరఫరా మూలంగా బస్తీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించకపోతే ప్రజలు రోగాలు బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. తాగునీరు లేక అనేక మంది వాటర్ క్యాన్లను కొలుగోలు చేస్తూ తమ దాహాన్ని తీసుకుంటారని వాపోయారు. జలమండలి డీఎంసీ వాహబ్ మాట్లాడుతూ, కలుషిత నీరు సరఫరా అవుతున్న ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేస్తామని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### పల్లాను కలిసిన బీసీ దళ్ ప్రతినిధులు


పల్లా రాజేశ్వర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కుమారస్వామి

లిబర్టీ: శాసన మండలి సభ్యుడు, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో మంగళవారం బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. శాసన సభలో ప్రజా సమస్యలు, బీసీల సమస్యలను ప్రస్తావిస్తూ పరిష్కార మార్గాలు చూపిస్తున్నందుకు ఆయనను అభినందించారు.

### సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి


ఎస్పీఆర్ హిల్స్‌లో సీఐటీయూ జెండాను ఎగుర వేస్తున్న స్వామి తదితరులు

రహమత్‌నగర్: బెంగళూరులో నిర్వహించనున్న మహాసభల సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్పీఆర్ హిల్స్ కూడలిలో మంగళవారం సీఐటీయూ జెండాలను యూనియన్ నగర ఉపాధ్యక్షుడు స్వామి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బెంగళూరులో ఈనెల 18 నుంచి 22 వరకు సీఐటీయూ అఖిల భారత మహాసభలు జరుగుతాయన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మహాసభలకు తరలిరావాలని పిలుపు నిచ్చారు. అలాగే రహమత్‌నగర్ ఆటో స్టాండ్ వద్ద యూనియన్ ప్రెసిడెంట్ మోహిన్ సీఐటీయూ జెండాను ఎగురవేశారు. సయ్యద్ జహంగీర్ అలీ, సయ్యద్ షరీఫ్, ఇక్బాల్, భాగ్యరాజ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE IV ADDITIONAL DISTRICT JUDGE AT MAHABUBNAGAR
O.S.NO. 4 of 2022

Between:
N.Yadaiah Goud ...Plaintiff
And
M/s.Prasad Town Ship Pvt.Ltd. & others ...Defendants

To:
1. M/s.Prasad Town Ship Pvt. Ltd. Rep. by its Authorized Person Smt.N.Bhanumathi W/o late N.Chandra Prasad, R/o Flat No.201, II Floor, Surabi Lotus, Besides Image Hospital, Ameerpet, Hyderabad 500073. (Defendant No. 1)
2. B.Swamy S/o B.Kistaiah, R/o H.No.6-7-59/20, Bansilalpet, Secunderabad, Hyderabad. (Defendant No.4)
3. E.Venkat Reddy S/o Koti Reddy, R/o H.No.2-52/101/KLN/F/502, Prashanth Hills, Nizampet, Kukatpally, Medchal, Hyderabad. (Defendant No.5)
4. P.Narender S/o P.Sesha Sayi, R/o H.No. 18-1-350/F, Bhavani Nagar, Tirupati, Chittoor District A.P. (Defendant No.6)
5. Syed Mansoor Ali S/o Mohd. Ashraf Ali, R/o H.No.19-4-7-189, Al-Jubail Colony, Falaknuma, Chandrayan gutta, Hyderabad, Telangana - 500005. (Defendant No.20)
6. Smt Kama Sri Lakshmi W/o KVS Sridhar, age R/o H.No. 10-4-81, Fathe Nagar, Hyderabad, Telangana - 500018. (Defendant No.21)

WHEREAS the Plaintiff has filed above suit against you and others for declaration of Title and Perpetual Injunction in respect of the suit schedule property. The said suit stands posted on 30-01-2023 for your appearance. You are hereby directed to appear before the above Court on said date at 10-30 a.m. either in person or through Advocate, in default the matter will be decided on the material available on record.

// BY ORDER OF THE COURT //

Date: 05-01-2023 Counsel for Plaintiff
K.PRATAP KUMAR Advocate,
Krishna Nivas, H.No.1-4-130/A/7/B,
Kamala Nehru Colony, BayammaThota,
Mahabubnagar - 509001.
Telangana State. Mobile : 9848069541

## సీవరేజి, తాగునీటి సమస్యలపై కార్పొరేటర్ సమీక్ష


సీవరేజి సమస్యలపై డీజీఎంతో చర్చిస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లో నెలకొన్న సీవరేజి, తాగునీటి సమస్యలతో పాటు పెండింగ్ పనులపై మంగళవారం వాటర్‌వర్క్స్ డివిజన్ డీజీఎం శ్రీనివాస్‌తో కార్పొరేటర్ విజయారెడ్డి సమీక్షించారు. డివిజన్‌లో సీవరేజి సమస్య అధికంగా ఉందని, సచివాలయ నిర్మాణ పనుల నేపథ్యంలో సీవరేజి మ్యాన్‌హోళ్లు శిథిలం కావడంతో సమస్య పరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, క్రమం తప్పకుండా డీసిల్టింగ్ చేయాలని, ఐమాక్స్ వద్ద త్వరగా పంపులను ఏర్పాటుచేసి సచివాలయం గుండా వెళ్లాల్సిన నీటిని ఐమాక్స్ వైపు మళ్లించాలని సూచించారు. వాటర్ వర్క్స్ మేనేజర్ స్వామి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## దారిలో మట్టి కుప్పలతో అవస్థలు


దారిలో వేసిన మట్టి కుప్పలు

రహమత్‌నగర్: రహమత్‌నగర్‌లోని ఓ వీధిలో దారిలో మట్టి కుప్పలు వేయడంతో వారం రోజులుగా పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు... రహమత్‌నగర్ పబ్లిక్ స్కూల్ చివరిలో ఓ వ్యక్తి భవన నిర్మాణ పనులు చేపడుతున్నాడు. పిల్లర్ గుంతల కోసం తీసిన మట్టిని దారిలోనే గుట్టలుగా వేశాడు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే విద్యార్థులు, రోజు వారీ కూలీలు మట్టి కుప్పలు ఎక్కలేక.. దిగలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు సైతం వారి నివాసాలకు వేరే సందులోంచి వెళ్లాల్సి వస్తోంది. బంగారు మైసమ్మ ఆలయం, యూసుఫ్‌గూడ పోలీస్ లైన్‌కు చెందిన వారు రోడ్డుపై ఉన్న ఈ మట్టికుప్పల వల్ల ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

### రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

వెంగళరావునగర్: ప్రభుత్వం అందిస్తున్న రుణాలను ప్రతి గ్రూపు మహిళ సద్వినియోగం చేసుకుని జీవితంలో మరింతగా ఎదగాలని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్-19 కార్యాలయంలో మంగళవారం ఆమె డ్వాక్రా గ్రూపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా డ్వాక్రా గ్రూపు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, రుణాల మంజూరు, వాటి ద్వారా చేయాల్సిన వ్యాపారాలు, ఎదుగుదలకు మార్గాలను వారితో కలిసి కార్పొరేటర్ చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రూపునకు బ్యాంక్ రుణ సదుపాయం కల్పించాలని ఇప్పటికే ఆయా బ్యాంకులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. రుణాల విషయంలో ఏదైనా బ్యాంకు లేదా అధికారుల నుంచి ఎలాంటి సమస్య ఎదురైతే తక్షణమే తనకు తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.


డ్వాక్రా గ్రూపు మహిళలతో సమావేశమైన కార్పొరేటర్ దేదీప్య విజయ్




### నిరుపేదల సంజీవని సీఎంఆర్ఎఫ్


మంజూరు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ సంజీవని అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ కళాసీగూడకు చెందిన రవికుమార్ సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 1.5 లక్షలకు సంబంధించిన పత్రాన్ని మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ ఎందరో నిరుపేదల జీవితాల్లో వెలుగులు ప్రసాదించిందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలకు ప్రభుత్వం అండగా నిలబడి వారి వైద్య ఖర్చుల కోసం అవసరమైన నిధులను సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన వారందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ అత్తెలి అరుణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### త్వరలో శ్మశానవాటిక అభివృద్ధి పనులు పూర్తి

సనత్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రాంతంలోని ధనియాలగుట్ట శ్మశానవాటిక అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేసి అందుబాటులో తీసుకురానున్నట్లు కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి స్పష్టం చేశారు. మంగళవారం ఆమె జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించి మాట్లాడారు. అన్ని రకాల సదుపాయాలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అవసరమైన చోట్ల మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లు, పార్కుల అభివృద్ధి పనులను శరవేగంగా జరుపుతున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ వెంట ఈఈ సుదర్శన్, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, నరేష్, సత్యనారాయణ ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

# 'నారా'యణ.. నల్లధనం ఓ 'ఎన్‌స్పైర'!

**రూ. వెయ్యి కోట్లకుపైగా మళ్లించిన మాజీ మంత్రి నారాయణ**

- ఆ నిధులు తన బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్‌లోకి
- నారాయణ సిబ్బంది పేరుతో అసైన్డ్ భూముల కొనుగోలు
- బినామీల పేరిట 169.27 ఎకరాల అసైన్డ్ భూములు హస్తగతం
- హైదరాబాద్‌లోని ఎన్‌స్పైర కార్యాలయంలో ఏపీ సీఐడీ తనిఖీలు.. హార్డ్ డిస్కులు, కీలక పత్రాలు స్వాధీనం
- అమరావతిలో మొత్తం రూ.5,600 కోట్ల విలువైన 1,400 ఎకరాల అసైన్డ్ దందా



ఎన్‌స్పైర కార్యాలయంలో సీఐడీ సోదాల కారణంగా బయట హడావుడి

సాక్షి, అమరావతి: రాజధాని ముసుగులో టీడీపీ పెద్దలు రూ.వెయ్యి కోట్లకుపైగా నల్లధనాన్ని మళ్లించి 169.27 ఎకరాల అసైన్డ్ భూములను సిబ్బంది, పని మనుషుల పేరుతో కాజేసిన బాగోతం బట్టబయలైంది. అమరావతిలో చంద్రబాబు సర్కారు అక్రమాలపై దర్యాప్తు చేస్తున్న ఏపీ సీఐడీ అధికారులు ఈ కేసులో కీలక పురోగతి సాధించారు. టీడీపీ హయాంలో మొత్తం రూ.5,600 కోట్ల విలువైన 1,400 ఎకరాల అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నట్లు ఇప్పటికే గుర్తించగా నల్లధనాన్ని మళ్లించేందుకు 'ఎన్‌స్పైర' అనే షెల్ కంపెనీని వాడుకున్నట్లు తాజాగా తేలింది. ఈమేరకు హైదరాబాద్‌లోని 'ఎన్‌స్పైర' కార్యాలయంలో మంగళవారం విస్తృతంగా సోదాలు నిర్వహించిన సీఐడీ అధికారుల బృందం 45 హార్డ్ డిస్కులు, బ్యాంకు ఖాతా లావాదేవీల కీలక పత్రాలను స్వాధీనం చేసుకుంది. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న పొంగూరు నారాయణ తమ కుటుంబ వ్యాపార సంస్థ 'ఎన్‌స్పైర' ద్వారా సాగించిన అక్రమాల బాగోతం ఇలా ఉంది.

**కుమార్తె, అల్లుడు డైరెక్టర్లుగా..**

మాజీ మంత్రి నారాయణ తమ కుటుంబం నిర్వహించే నారాయణ విద్యా సంస్థల కోసమంటూ 'ఎన్‌స్పైర మేనేజ్‌మెంట్ సర్వీసెస్' అనే కంపెనీని ఏర్పాటు చేశారు. నారాయణ విద్యా సంస్థలకు సంబంధించి కొనుగోళ్లు, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగులు, సిబ్బందికి జీతాల చెల్లింపుల కోసం దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నారాయణ విద్యా సంస్థను లాభాపేక్షలేని సంస్థగా ఏపీ సొసైటీల చట్టం ప్రకారం ఏర్పాటు చేశారు. దీంతో విద్యాసంస్థ నిధులను నారాయణ తమ వ్యక్తిగత, కుటుంబ అవసరాలకు మళ్లించేందుకు వీలులేదు. దీంతో నిధుల మళ్లింపు కోసం ఎత్తుగడ వేసిన నారాయణ తన కుమార్తె పొంగూరు సింధూర, అల్లుడు పునీత్ డైరెక్టర్లుగా ఎన్‌స్పైర అనే కంపెనీని నెలకొల్పారు.

**నల్లధనం భారీగా మళ్లింపు..**

నారాయణ విద్యా సంస్థలకు అన్ని రకాల చెల్లింపులు నిర్వహిస్తున్నందుకు ఎన్‌స్పైరకు 10 శాతం కమిషన్ చెల్లిస్తున్నట్లు రికార్డుల్లో చూపారు. ఇదే అవకాశంగా ఎన్‌స్పైరలోకి ఇతర సంస్థల నుంచి భారీగా నిధులు మళ్లించారు. ఎన్‌స్పైరలో ఇతర కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టినట్లు చూపడం గమనార్హం. ఒలంపస్ క్యాపిటల్ ఏసియా క్రెడిట్ అండ్ సీఎక్స్ పార్టనర్స్ మ్యాగజైన్ అనే కంపెనీ 2016లో ఏకంగా రూ.400 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు చూపించారు. ఇక 2018లో మోర్గాన్ స్టాన్లీ ప్రైవేట్ ఈక్విటీ ఏసియా, బన్యాన్ ట్రీ గ్రోత్ క్యాపిటల్ అనే సంస్థలు రూ.75 మిలియన్ డాలర్లు (రూ.613.27 కోట్లు) పెట్టుబడి పెట్టినట్టు రికార్డుల్లో చూపడం గమనార్హం. రెండు విడతల్లో ఎన్‌స్పైర కంపెనీలోకి రూ.1,013.27 కోట్లు వచ్చి చేరాయి. ఇలా భారీగా నల్లధనాన్ని ఎన్‌స్పైరలోకి మళ్లించినట్లు తెలుస్తోంది.

**ఆ నిధులు రామకృష్ణ హౌసింగ్‌లోకి**

వివిధ మార్గాల్లో ఎన్‌స్పైరలోకి మళ్లించిన నిధులను నారాయణ తమ సమీప బంధువైన కేపీపీ అంజనికుమార్ ఎండీగా ఉన్న రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లోకి తరలించారు. దీంతోపాటు నారాయణ విద్యా సంస్థల సిబ్బంది బ్యాంకు ఖాతాల్లోకి కూడా నిధులు మళ్లించడం గమనార్హం. అనంతరం ఆ చిరుద్యోగుల పేరిట అమరావతిలో అసైన్డ్ భూములను కొనుగోలు చేశారు. తమ వద్ద పనిచేసే చిరుద్యోగులను బినామీలుగా మార్చుకుని 169.27 ఎకరాల అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు.

**మొత్తం రూ.5,600 కోట్ల అసైన్డ్ దందా**

అమరావతిలో రూ.5,600 కోట్ల విలువైన 1,400 ఎకరాల అసైన్డ్ భూములను టీడీపీ పెద్దలు కొల్లగొట్టినట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. టీడీపీ హయాంలో పురపాలక శాఖ మంత్రిగా అమరావతి వ్యవహారాల్లో చక్రం తిప్పిన నారాయణ కన్నుసన్నల్లోనే భూ దందాలు జరిగాయి. రాజధాని కోసం సమీకరించే అసైన్డ్ భూములను గత ప్రభుత్వం ఎలాంటి పరిహారం చెల్లించకుండా తీసుకుంటుందని రెవెన్యూ, పురపాలక శాఖ అధికారుల ద్వారా ప్రచారం చేశారు. ఇదే అదనుగా దళితులు, బీసీల భయాందోళనలను సొమ్ము చేసుకునేందుకు రియల్ ఎస్టేట్ కంపెనీలను రంగంలోకి దింపారు. అసైన్డ్ భూములను అయినకాడికి అమ్ముకోకుంటే ప్రభుత్వ పరమైపోతాయని పేదలను బెదిరించి కారుచౌకగా కాజేశారు. అసైన్డ్ భూములున్న వారికి నగదు చెల్లింపులు చేసి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) పొందారు. అనంతరం సేల్ డీడ్‌ల ద్వారా కథ నడిపించారు. రిజిస్ట్రేషన్ చట్టం 22 ఏ కింద నిషేధిత భూముల జాబితాలో ఉన్న వీటిని పకడ్బందీగా సొంతం చేసుకున్నారు. ఆ విధంగా అమరావతి పరిధిలోని అనంతవరం, కృష్ణాయపాలెం, కురగల్లు, లింగాయపాలెం, మందడం, నెక్కల్లు, నవులూరు, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెం, బోరుపాలెం, నేలపాడు, రాయపూడి తదితర గ్రామాల్లోని అసైన్డ్ భూములను టీడీపీ పెద్దలు కాజేశారు. అనంతరం అసైన్డ్ భూములకు గత ప్రభుత్వం తాపీగా ప్యాకేజీ ప్రకటించడం గమనార్హం.

**అక్రమాలు బహిర్గతం..**

అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్న కేసులో మాజీ మంత్రి పి.నారాయణను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ అసైన్డ్ భూముల బదిలీ నిషేధిత చట్టం 1977, ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంతో పాటు ఐపీసీ 34, 35, 36, 37, 409, 420, 506 తదితర సెక్షన్ల కింద సీఐడీ అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ కుంభకోణంలో పాత్రధారులుగా వ్యవహరించిన నారాయణ సన్నిహితులైన ఐదుగురిని గతంలో అరెస్టు చేశారు. కాగా అసైన్డ్ భూములు కొల్లగొట్టేందుకు ఎన్‌స్పైర కంపెనీ ద్వారా నల్లధనాన్ని మళ్లించి అక్రమాల కథ నడిపించినట్లు సీఐడీ దర్యాప్తులో తాజాగా బహిర్గతమైంది.

● కొత్త సచివాలయంలో..

# సరికొత్త ఫౌంటెయిన్‌లు!

- పార్లమెంటు భవనం ముందున్న ఫౌంటెయిన్ తరహాలోనే...
- అక్కడ ఒక్కటే.. ఇక్కడ రెండు..
- సెక్రటేరియట్‌లో సిద్ధమైన 'ఢిల్లీ'డిజైన్ ఫౌంటెయిన్లు
- ధోల్పూర్ ఎర్రరాతితో నిర్మాణం
- ఫౌంటెయిన్ నుంచి నీళ్ల ధారలు.. వాటిపై లైట్ల కాంతులు..
- నూతన సచివాలయానికి అందాల సొబగులు






సచివాలయంలో సిద్ధమవుతున్న ఫౌంటెయిన్లు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలోని పార్లమెంటు ముందు ధోల్పూర్ ఎర్రరాతితో నిర్మించిన ఫౌంటెయిన్ ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుంది. పార్లమెంటు సభ్యులు సహా సందర్శకులు దాని ముందు నిలబడి ఫొటోలు దిగుతుంటారు.. ఇప్పుడు అచ్చుగుద్దినట్టు అలాంటి ఫౌంటెయినే తెలంగాణ కొత్త సచివాలయంలో సిద్ధమైంది. పార్లమెంటు ముందు ఒకటే ఫౌంటెయిన్ ఉండగా, సచివాలయంలో రెండు రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు ఇవి ఈ భవనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయి.

-ఇండోపర్షియన్ ఆకృతిలో గుమ్మటాలతో రూపుదిద్దుకుంటున్న సచివాలయానికి మరో ప్రత్యేకత కూడా ఉండాలన్న ఉద్దేశంతో పార్లమెంటు ముందున్న ఆకృతిలో ఫౌంటెయిన్‌లను డిజైన్ చేశారు. సచివాలయ భవనం ముందు రెండు వైపులా విశాలమైన లాన్లు ఉంటాయి. వాటి మధ్యలో రెండు వైపులా రెండు ఫౌంటెయిన్‌లు నిర్మించాలని భావించి రకరకాల ఆకృతులు పరిశీలించారు. కానీ, చివరకు పార్లమెంటు ముందున్న ఆకృతిని ఎంపిక చేశారు.

- దిగువ 47 అడుగుల వెడల్పుతో భారీ వేదిక.. దానిమీద 25 అడుగుల వెడల్పుతో సాసర్ ఆకృతిలో నీటి తొట్టె, దాని మీద 9 అడుగుల వెడల్పుతో మరో తొట్టె.. ఈ మూడింటిని అనుసంధానిస్తూ దాదాపు 27 అడుగుల ఎత్తున్న శిల.. అంతా ఎరుపు రంగు.. ఇది దీని ఆకృతి.
- అప్పట్లో బ్రిటిష్ ఆర్కిటెక్ట్ దీన్ని డిజైన్ చేయగా పార్లమెంటు భవనం ముందు నిర్మించారు. ఇప్పుడు అదే డిజైన్‌ను వినియోగించి ఇక్కడ నెలకొల్పారు. పార్లమెంటు ముందున్న ఫౌంటెయిన్‌కు మొత్తం రాజస్థాన్‌లోని ధోల్పూర్ ఎర్రరాతి ఫలకాలను వాడారు. ఆ నిర్మాణానికి ప్రత్యేకంగా రంగు ఉండదు. ఇక్కడ కూడా అదే రాతిని వినియోగించటం విశేషం.
- సచివాలయం బేస్‌కు పూర్తిగా ఈ ఎర్రరాయినే వాడారు. ఇందుకోసం రాజస్థాన్ ధోల్పూర్ క్వారీలకు వెళ్లి అక్కడ రాయిని ఎంపిక చేసి తెప్పించిన విషయం తెలిసిందే. పార్లమెంటు ముందున్న ఫౌంటెయిన్ తరహాలోనే పాట్నాలో ఇటీవల ఫౌంటెయిన్‌ను రూపొందించిన శిల్పిని కలిసి చర్చించి సలహాలు తీసుకున్నారు. ఇప్పుడు అదే డిజైన్‌తో రెండు ఫౌంటెయిన్ల నిర్మాణం పూర్తయింది. దీంతో సచివాలయ ప్రధాన నిర్మాణ పనులు పూర్తయినట్టయింది. ఈ ఫౌంటెయిన్ నుంచి నీళ్ల ధారలుగా ఎగజిమ్మి దిగువకు పడుతుండగా, వాటిపై లైట్ల కాంతులు ప్రసరిస్తూ అందాన్ని రెట్టింపు చేస్తాయి.

# ఊహలు వద్దు... ఆశకు పోవద్దు



- నిర్వహణ ఖర్చులను కచ్చితంగా చూపెట్టండి
- గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దులో జీతాలు చూపించొద్దు
- వచ్చే ఏడాదిలో ఎన్ని ఉద్యోగాలు ఇవ్వాల్సి వస్తుందో ప్రత్యేక ప్రొఫార్మాలో ఇవ్వండి
- 2023–24 బడ్జెట్ వివరాల కోసం ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ

సాక్షి, హైదరాబాద్: రానున్న ఆర్థిక సంవత్సరానికి (2023–24) గానూ బడ్జెట్ తయారీ కోసం అన్ని శాఖలు ఈనెల 12లోగా ప్రభుత్వానికి పంపాలని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈనెల 12 కల్లా ప్రభుత్వ విభాగాధిపతులకు వివరాలు వస్తే వాటికి అవసరమైతే మార్పులు చేర్పులు చేసి ఈనెల 13 కల్లా ఆర్థిక శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులకు సూచించింది. ఈ మేరకు 2023–24 బడ్జెట్ ప్రతిపాదనలు, 2022–23 సవరించిన బడ్జెట్ అంచనాలను రూపొందించేందుకు గాను మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు విడుదల చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బడ్జెట్ ప్రతిపాదనలు పకడ్బందీగా పంపాలని, ఊహాజనిత అంచనాలు, లెక్కకు మిక్కిలి ప్రతిపాదనలు పంపవద్దని సూచించారు.

**ప్రత్యేక అంశాలతో ఉత్తర్వులు**

శాఖల వారీగా పంపాల్సిన బడ్జెట్ వివరాలతో పాటు ఏయే విషయాల్లో జాగ్రత్తగా ఉండాలో కొన్ని సూచనలు చేశారు. వాటి ప్రకారం... ప్రతి శాఖ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఖర్చులను తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఆయా శాఖల పరిధిలోని ఉద్యోగుల జీతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దు (310–312)లో చూపించకూడదు. అలా చూపించినట్టు గుర్తిస్తే సదరు అధికారిపై క్రమశిక్షణా చర్యలు తీసు కుంటామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రతి శాఖకు సంబంధించిన ఖర్చులను విడివిడిగా చూపించవద్దని, అన్ని ఖర్చులను ఒకేచోట చూపించాలని కూడా పేర్కొన్నారు. ఇక, శాఖల నిర్వహణ, ఆఫీసు ఖర్చులు, వాహనాలు, అద్దెలు, నీరు, విద్యుత్ ఖర్చులు, స్టేషనరీ, ఔట్‌సోర్సింగ్ సర్వీసులు, సంక్షేమ, సబ్సిడీ పథకాలకు సంబంధించిన ఖర్చులను జాగ్రత్తగా చూపెట్టాలని తెలిపారు. ప్రతి శాఖ పరిధిలో 2023–24లో జాయిన్ అయ్యే కొత్త ఉద్యోగుల వివరాలను (ఖాళీగా ఉన్న, కొత్తగా మంజూరైన పోస్టులు కాకుండా) కూడా ప్రత్యేక ఫార్మాట్‌లో పంపాలని ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఇక ప్రభుత్వ శాఖకు సంబంధించిన ఆస్తులు, అప్పుల వివరాలను కూడా ప్రత్యేక ఫార్మాట్‌లో పంపాలని ఆర్థిక శాఖ తెలిపింది. గత పదేళ్ల నుంచి రెవెన్యూ కింద చూపెట్టినా రాని పన్నుల వివరాలను కూడా కోరింది.

---

టీడీపీని వీడని నిరాశ, నిస్పృహలు...

**వేర్ ఈజ్ ద 'పార్టీ'!**

గెలిచిన ఎమ్మెల్యేల్లోనే 30 శాతం మంది దూరం.. దూరం

అప్పట్లో హవా నడిపించిన నాయకులిప్పుడు తెరచాటుకు

రాష్ట్రంలో 68 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులే లేరు

పార్టీ పదవులిస్తామంటున్నా... మాకొద్దంటున్న నేతలు

**హైకోర్టు జడ్జీలుగా మరో ఇద్దరు**

జ్యోతిర్మయి, గోపాలకృష్ణారావుల పేర్లకు సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదం

**ఆధునిక అంగన్‌వాడీలు**

- నాడు–నేడుతో రూ.1,500 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం
- ఆహార పంపిణీలో అలక్ష్యం జరిగితే బాధ్యులపై చర్యలు.. మహిళా శిశు సంక్షేమ శాఖపై సీఎం జగన్ సమీక్ష

మరిన్ని వివరాలు, వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

---

**నగర వార్తలు**

## క్లుప్తంగా

**21, 22 తేదీల్లో ఆర్ అండ్ డీ షోకేస్**

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వార్షిక ఆర్ అండ్ డీ షోకేస్ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 21, 22వ తేదీల్లో గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ఆర్ అండ్ డీ షోకేస్‌ను నిర్వహిస్తారు. విద్యార్థులు తాము వివిధ విభాగాల ద్వారా రూపొందించిన ఎగ్జిబిట్లను ప్రదర్శించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ కళాశాలల విద్యార్థులకు కూడా అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో విద్యార్థుల పరిశోధక డెమోస్, పోస్టర్ల ప్రదర్శన ఉంటుంది. దీనికితోడు వివిధ రకాల నిష్ణాతులతో ప్రత్యేక టాక్‌షోను కూడా నిర్వహిస్తారు.

**ఇంటివంటతో ట్రెజర్ హంట్**

- సిటీలో ఇండియన్ కలినరీ ట్రెజర్ హంట్
- దేశవ్యాప్తంగా హోమ్‌కుక్‌లతో నిర్వహణ




సాక్షి, సిటీబ్యూరో: ఎంత కాంటినెంటల్ ఫుడ్ తిన్నా ఇంటి వంటకు సరితూగదన్నది వాస్తవ సత్యం. ప్రస్తుత నగర జీవనశైలిలో ఇంటివంటకు ప్రాధాన్యత చాలావరకు తగ్గింది. ఈ తరుణంలో నగరంలోని షెరటన్ హోటల్ వేదికగా దేశవ్యాప్తంగా పసందైన ఇంటి వంటకాలను ప్రదర్శించేలా ఇండియన్ కలినరీ ట్రెజర్స్ హంట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కలినరీ ట్రెజర్స్ హంట్‌లో దేశవ్యాప్తంగా విభిన్న ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది హోమ్ కుక్(ఇంటి వంటకారులు)ను ఎంపిక చేయనున్నారు. ఎఫ్ అండ్ బీ ఆవిష్కరణలో ప్రసిద్ధిగాంచిన మాస్టర్ చెఫ్ మహేష్ పడాల ఇండియన్ కలినరీ ట్రెజర్స్ హంట్‌కు నేతృత్వం వహిస్తుండగా మరో చెఫ్ సంజయ్ రావత్, ప్రముఖ భారతీయ ఆహార విమర్శకులు సంకల్ప్ విష్ణులు ఇంటి వంటకారులను ఎంపిక చేయనున్నారు. ఈ హంట్‌లో భాగంగా ఎనిమిది మంది హోమ్ కుక్‌లు తయారు చేసిన వినూత్న భారతీయ ఇంటి వంటకాలను ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా షెరటన్ జీఎం ప్రణయ్ వెర్దియా మాట్లాడుతూ.. నగరం వేదికగా అంతర్జాతీయ ఫుడ్ స్పెషలిస్టులకు ధీటుగా భారతీయ వంకాలను తయారుచేసే వారిని నిలపాలనే లక్ష్యంతో ఈ కలినరీ ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. దేశంలో వినూత్న వంటకాలను అందించే కుక్‌లను ఒక వేదికపైకి తీసుకురానున్నామన్నారు. మాస్టర్ చెఫ్ మహేష్ పడాల మాట్లాడుతూ.. దేశంలో పోషకాహార లోపానికి కారణం ఇంటివంటకు దూరం కావడం ప్రధాన కారణమన్నారు.

# ఉపకార వేతనాలకు 'ఆదాయ ధ్రువీకరణ' తిప్పలు

అంబర్‌పేటకు చెందిన శ్రీకాంత్‌కు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వార్షికాదాయ ధ్రువీకరణ పత్రం(ఇన్‌కమ్ సర్టిఫికెట్) అవసరమైంది. మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దాని ప్రతులను తహసీల్ ఆఫీస్‌లో సమర్పించారు. వారం తర్వాత మీ సేవ కేంద్రానికి వెళ్తే ఆన్‌లైన్ తనిఖీచేసి ఇంకా.. ఆమోదం కాలేదని పేర్కొన్నారు. మరో వారం తర్వాత కూడా అదే పరిస్థితి ఎదురైంది. తహసీల్ ఆఫీస్‌కు వెళ్లి ఆరా తీస్తే.. రెండు, మూడు రోజుల్లో తీసుకోవచ్చని సిబ్బంది పేర్కొన్నారు. తర్వాత మీ సేవ కేంద్రానికి వెళ్తే ప్రింట్ కాపీ తీసి ఇచ్చారు. వార్షికాదాయం పరిశీలిస్తే రూ.2.70 లక్షలతో ధ్రువీకరణ పత్రం జారీ అయ్యింది. అర్హతకు మించి వార్షికాదాయం వచ్చిందని, పరిష్కారమేలా? అంటే ఆపరేటర్ ఉచిత సలహా ఇచ్చారు. తెలిసిన వ్యక్తి ఉన్నాడు. పని చేసి పెడ్తాడు. కొంత ఖర్చు అవుతుంది. మళ్లీ దరఖాస్తు చేయండని చెప్పుకొచ్చాడు. చేసేది లేక మరోసారి దరఖాస్తు చేసుకున్నాడు. కొంత నగదు ముట్టజెప్పాడు. మూడురోజుల్లో వార్షికాదాయం రూ.1.90 లక్షలతో ధ్రువీకరణ పత్రం జారీ అయ్యింది. ఇది ఒక శ్రీకాంత్ సమస్య కాదు.. పేద విద్యార్థులకు ఎదురవుతున్న సమస్య.

- ధ్రువీకరణ జారీలో అమలు కాని సిటిజన్ చార్టర్
- వార్షికాదాయం నిర్ధారణకు సవాలక్ష కొర్రీలు
- దళారులను ఆశ్రయిస్తే మాత్రం సకాలంలో..
- గడువు సమీపిస్తుండటంతో విద్యార్థుల ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఉపకార వేతనాల దరఖాస్తుల కోసం అవసరమైన ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ ముప్పుతిప్పలు పెడుతోంది. రెవెన్యూ అధికారుల తీరు పేద విద్యార్థులను ఉపకార వేతనాలకు దూరం చేస్తోంది. దరఖాస్తులకు కనీసం సిటిజన్ చార్టర్ అమలు కాకపోగా, కనీసం వార్షిక ఆదాయం నిర్ధారణ కూడా సరిగ్గా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దళారుల నుంచి దరఖాస్తు చేసుకుంటే మాత్రం ధ్రువీకరణ పత్రం సకాలంలో జారీ కావడంతో పాటు వార్షిక ఆదాయం తక్కువగానే వస్తుందనే ప్రచారం అనేక ఘటనలకు బలం చేకూరుస్తోంది. తాజాగా పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు సమీపిస్తుండటంతో విద్యార్థులు ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఉరుకులు పరుగులు తీస్తున్నారు.

**తప్పనిసరి..**

ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు తాజా ఆదాయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. దీంతో మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని తహసీల్ ఆఫీసుల చుట్టూ చక్కర్లు తప్పడం లేదు. నిబంధనల ప్రకారం తెల్లరేషన్ కార్డు ఉన్నవారంతా పేదల జాబితా కింద వస్తారు. స్కాలర్‌షిప్ పొందాలంటే మండల రెవెన్యూ కార్యాలయం నుంచి జారీ అయిన ఆదాయ, కుల ధ్రువ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కుల ధ్రువీకరణ పత్రం శాశ్వతమైనప్పటికీ ఆదాయ ధ్రువీకరణ పత్రం కాల పరిమితి మాత్రం ఒక విద్యా సంవత్సరం మాత్రమే ఉంటుంది. నగర పరిధి అయితే వార్షికాదాయం రూ.2 లక్షలలోపు ఉండాలని విద్యాశాఖ స్పష్టం చేస్తోంది. అంతకంటే ఎక్కువ ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండదు. రెవెన్యూ అధికారులు మాత్రం రూ.2 లక్షలపైనే ఆదాయ ధ్రువపత్రాన్ని జారీ చేయడం విస్మయానికి గురిచేస్తోంది.

## స్క్వేర్ యార్డ్‌లో ప్రాపర్టీ కొనొద్దు

- ప్రభుత్వ అనుమతులు రాలేదు
- రెరాలో నమోదు చేయలేదు
- టీఎస్ రెరా చైర్మన్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: స్క్వేర్ యార్డ్ ఫ్యాక్టరీ అభివృద్ధి చేస్తున్న ప్రాజెక్ట్‌లలో ప్రాపర్టీ కొనుగోలు చేయకూడదని తెలంగాణ స్టేట్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(టీఎస్–రెరా)లో కొనుగోలుదారులను హెచ్చరించింది. ఆయా సంస్థ చేవెళ్లలో 12 ఎకరాలలోని గోల్డెన్ పామ్స్ ఎన్‌క్లేవ్, కిస్టాపూర్‌లో 10.5 ఎకరాలలో గ్రీన్ స్క్వేర్, ప్రైమ్ అవెన్యూ, రాకంచర్లలో 11.5 ఎకరాలలో మ్యాజిస్టిక్ విల్లాస్, 3.5 ఎకరాలలో స్టార్ కాలనీ ఏ ప్రాజెక్ట్‌లు కూడా జీహెచ్‌ఎంసీ/హెచ్‌ఎండీ/డీటీసీపీ నుంచి ఎలాంటి నిర్మాణ అనుమతులు తీసుకోలేదని, రెరాలో నమోదు చేయలేదని టీఎస్ రెరా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రెరాలో నమోదు చేయకుండా విక్రయాలు చేయడం రెరా చట్టం–2016 సెక్షన్ 3(1), 4(1) కింద ఉల్లంఘన కిందికి వస్తుందని తెలిపింది.

# ప్రతి ఇంటికీ 'కంటి వెలుగు'



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

- జీహెచ్‌ఎంసీ 91 వార్డుల్లో 115 శిబిరాలు
- 18 నుంచి జూన్ 30 వరకు కార్యక్రమం
- గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు అవకాశం
- కంటివెలుగు రివ్యూలో మంత్రి తలసాని

హిమాయత్‌నగర్: కంటిచూపుతో బాధపడేవారి ఇబ్బందిని దూరం చేస్తూ వారి కళ్లల్లో వెలుగులు నింపేందుకు 'కంటి వెలుగు' రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనియాద్ తెలిపారు. రెండో విడతగా ఈ నెల 18వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు వందరోజుల(పనిదినాలు) ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 91 వార్డుల్లో 115 శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'కంటి వెలుగు' హైదరాబాద్ జిల్లా రివ్యూలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీలు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, దానం నాగేందర్, రాజాసింగ్, సాయన్న, టీఎస్‌ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతతో కలిసి సమీక్ష చేపట్టారు. అనంతరం కంటి వెలుగు రెండో విడతకు చెందిన బ్రోచర్‌లను ఆవిష్కరించారు. నగరంలో ఏవిధంగా పరీక్షలు చేపట్టాలి, ఇతర పార్టీలకు చెందిన కార్పొరేటర్‌లను ఏవిధంగా కలుపుకుపోతూ ఈ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలనే విషయాలను అధికారులకు మంత్రులు, ఎమ్మెల్యేలు సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో తలసాని వివరాలను వెల్లడించారు.

**అన్ని వయసుల వారికి పరీక్షలు**

రెండో విడతలో భాగంగా 'కంటి వెలుగు' పరీక్షలను వయసుతో సంబంధం లేకుండా అందరికీ చేస్తున్నట్లు మంత్రి తలసాని చెప్పారు. అన్ని వయస్సుల వారికి ఈ పరీక్షలను చేసి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 91 వార్డుల్లో ఉన్న కమ్యూనిటీ హాల్స్, మున్సిపల్ గ్రౌండ్‌లతో పాటు ఓపెన్ గ్రౌండ్స్‌లో టెంట్ వేసి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా కార్పొరేటర్లు, మహిళా సంఘాలు, యువజన సంఘాల వారు పాల్గొనాలన్నారు. కార్పొరేటర్ల అభిప్రాయం మేరకు కేటాయించిన శిబిరాలను మరో ప్రాంతానికి మార్చే వెసులుబాటును కూడా అందిస్తున్నామన్నారు. ఒక్కో టీంలో వైద్యుడు, కంటి వైద్యుడు, ఫార్మాసిస్టు, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ ఇలా పదిమంది ఉంటారన్నారు. ఇంత మంచి కార్యక్రమం త్వరలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.

# ముగిసిన యువజనోత్సవాలు



విజేతలకు జ్ఞాపికలను అందజేస్తూ..

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించిన యువజనోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీలలో అరుణ సుబ్బారావు, లింగశ్రీనివాస్, ప్రశాంత్‌కుమార్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలలో జానపద నృత్యం (గ్రూప్), జానపద గీతం (గ్రూప్) వక్తృత్వం, కబడ్డీ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు.

## గంజాయి విక్రేత అరెస్ట్

- 1.5 కేజీల గంజాయి స్వాధీనం

ముషీరాబాద్: ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ హోటల్ వద్ద వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 1.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ వివరాల ప్రకారం: అబ్దుల్ ఖాదర్ అలియాస్ మహ్మద్ ఉస్మాన్(60) డ్రైవర్‌గా పనిచేస్తూ బాకారంలో నివాసం ఉంటున్నాడు. అతడు భోలక్‌పూర్, పార్శిగుట్ట, ఉస్మానియా రైల్వేస్టేషన్, లోయర్ ట్యాంక్‌బండ్, గాంధీ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో గంజాయిని యువకులకు విక్రయిస్తున్నట్లు విచారణలో చెప్పాడని, అతడిని రిమాండ్‌కు తరలించామన్నారు. గతంలో ఎవరెవరికి గంజాయి విక్రయించాడని, ఎక్కడి నుంచి సరఫరా అవుతుందనే దానిపై అతడి సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

# శ్యామజోషి హఠాన్మరణం



బంజారాహిల్స్: జార్జియా, మంగోలియా దేశాల్లో పనిచేసిన భారత మాజీ రాయబారి టి.సురేష్ సతీమణి శ్యామజోషి(65) మంగళవారం ఉదయం 7 గంటలకు జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని వారి స్వగృహంలో గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆమె మాస్కో యూనివర్సిటీలో రష్యన్ భాషలో ఎంపీ పీహెచ్‌డీ చేశారు. ఢిల్లీ, సిమ్లా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా పనిచేశారు. హిమాచల్‌ప్రదేశ్‌లో జన్మించిన ఆమె విజయవాడ ప్రథమ మేయర్ దివంగత టి.వెంకటేశ్వరరావు రెండో కోడలు. ఆమె మృతి పట్ల సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి రామకృష్ణ, ఫ్రెండ్స్ ఫోరం సభ్యులు సంతాపాన్ని తెలియజేశారు. ఫిలింనగర్ మహాప్రస్థానంలో బుధవారం మధ్యాహ్నం 3–4 గంటల మధ్య అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## చిన్నారితో అసభ్య ప్రవర్తన

- నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగారం



చేజెర్ల ప్రసాద్

రంగారెడ్డిజిల్లాకోర్టులు: ఎనిమిదేళ్ల చిన్నారి పట్ల అసభ్యప్రవర్తన కేసులో నిందితుడికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తున్నట్లు ఎల్‌బీ నగర్ తొమ్మిదవ అదనపు జిల్లా కమ్ పోక్సో కోర్టు న్యాయమూర్తి హరీష వెల్లడించారు. తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి కమ్ పోక్సో కోర్టు స్పెషల్ పీపీ బర్ల సునీత తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బి నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన కేసులో నిందితుడు చేజెర్ల ప్రసాద్(22) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 2017 జూన్ మాసంలో ఆరుబయట ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల చిన్నారిని అపహరించి తన నివాసానికి ఎత్తుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. చిన్నారి పెద్దగా అరవడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎల్‌బీ నగర్ పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. మంగళవారం కోర్టు పైవిధంగా తీర్పు తీర్పు వెలువరించింది.

## అభివృద్ధికి సహకరించాలి

హబ్సిగూడ: ఉప్పల్ నియోజకవర్గానికి రావాల్సిన మైనింగ్ మినరల్ ఫండ్స్‌తో పాటు మల్లాపూర్ డివిజన్‌కు మల్టీపర్పస్ హాల్, హబ్సిగూడ డివిజన్‌కు మల్టీపర్పస్ యుటిలిటీ భవనం, బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాల భవనం, జగన్నాథ స్వామి పూజల కోసం స్థలాలు కేటాయించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ హరీష్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మంగళవారం వినతి పత్రం అందజేశారు.



కలెక్టర్ హరీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

## 5 కిలోల బియ్యం ఎందుకివ్వట్లేదు?

- బండి సంజయ్ నిలదీత
- సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ

సాక్షి, హైదరాబాద్: కేంద్రం ఉచితంగా 5 కిలోల రేషన్ బియ్యం అందిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు పంపిణీ చేయడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల సంక్రాంతి పండుగ పూట మూడున్నర కోట్ల మంది పస్తులుండబోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం సీఎం కేసీఆర్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. సర్కార్ నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం కారణంగా పేదలకు ఈ దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇది క్షమించరాని నేరమని అన్నారు. పేదలకు బియ్యం పంపిణీ చేస్తే కేంద్రానికి పేరొస్తుందనే అక్కసుతో పేదల కడుపు కొట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

**వెంటనే జీతాలు, పింఛన్లు చెల్లించండి**

రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా ఉద్యోగుల కుటుంబాలు కూడా పండుగ జరుపుకోలేని దుస్థితి నెలకొందని సంజయ్ విమర్శించారు. 10వ తేదీ వచ్చినా పలు జిల్లాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలతో పాటు పెన్షనర్లకు పింఛను సొమ్ము అందకపోవడం బాధాకరమన్నారు. సంక్రాంతి పండుగకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు చెల్లిస్తారని ఆశిస్తే... కనీసం జీతాలు కూడా ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు తీసుకోవడమనే ఉద్యోగుల హక్కును కాలరాయడమంటే రాజ్యాంగ మౌలిక సూత్రాలను ఉల్లంఘించడమేనని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ సొమ్ము విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


## సోమేశ్‌ను బాధ్యతల నుంచి తప్పించాలి: బండి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కోర్టు తీర్పును శిరసావహిస్తూ సోమేశ్ కుమార్‌ను సీఎస్ బాధ్యతల నుంచి తప్పించి ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయాలని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. సీఎస్‌గా సోమేశ్ కుమార్ కొనసాగింపును రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ పదవికి ఆయన రాజీనామా చేయాలన్నారు. తెలంగాణ వ్యక్తిని లేదా తెలంగాణకు కేటాయించిన వ్యక్తిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించాలని సూచించారు. కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండగా సోమేశ్ కుమార్‌ను సీఎస్‌గా నియమించడం సీఎం కేసీఆర్ అనైతిక రాజకీయాలకు నిదర్శనమని మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కేంద్రం ఆదేశాల మేరకు ఏపీకి కేటాయించిన అధికారులను అక్కడకు, తెలంగాణకు కేటాయించిన అధికారులను స్వరాష్ట్రానికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఆదేశాలను తుంగలో తొక్కి ఏపీకి చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు తెలంగాణలో కీలక బాధ్యతలు ఇవ్వడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. రాజకీయ అవసరాల కోసం కేసీఆర్ తన అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడానికి అధికారులను పావుగా వాడుకుంటున్నారని, 317 జీవో సహా అనేక ఉద్యోగ, ప్రజా వ్యతిరేక ఉత్తర్వులను సోమేశ్ కుమార్ ద్వారా విడుదల చేయించారన్నారు.

## సోమేశ్ నిర్ణయాలపై సీబీఐ విచారణ

**టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ డిమాండ్**



సాక్షి, హైదరాబాద్: సీఎస్ సోమేశ్‌కుమార్ తీసుకున్న నిర్ణయాలపై అత్యున్నత దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, రెవెన్యూ కార్యదర్శిగా, భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)గా, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్మన్‌గా సోమేశ్ తీసుకున్న నిర్ణయాలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. ఆయన నియామకం అక్రమమని మొదటి నుంచీ చెబుతున్నామని, ఇప్పుడు హైకోర్టు కూడా అదే చెప్పిందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.

## కేంద్ర సర్వీసులకు ప్రీతి మీనా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కేడర్ ఐఏఎస్ అధికారి ప్రీతి మీనా డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లనున్నారు. కేంద్ర పాఠశాల విద్య, అక్షరాస్యత మంత్రిత్వ శాఖలో డిప్యూటీ సెక్రటరీగా నియమిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ మంగళవారం ఆదేశాలు జారీచేసింది. నాలుగేళ్లు ఆమె కేంద్ర సర్వీసుల్లో పని చేయాల్సి ఉంటుంది.

## ఏపీకి విమానాల రద్దీ

**భారీగా పెరిగిన చార్జీలు**

శంషాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ నగరాలకు వెళ్లే విమాన ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో ప్రయాణ చార్జీలు ఆకాశాన్నంటుతున్నాయి. సాధారణ సమయాల్లో హైదరాబాద్ నుంచి రాజమండ్రికి రూ. 3 వేల టికెట్ ధర ఉండగా ప్రస్తుతం రూ.8 వేల నుంచి గరిష్ఠంగా రూ. 11 వేల చార్జీలను తీసుకుంటున్నాయి. విశాఖపట్నం వెళ్లేందుకు విరివిగా విమానాలుండడంతో చార్జీలు కొంతమేరకు మాత్రమే పెరిగాయి. విజయవాడకు రద్దీ ఎక్కువగా ఉండటంతో సాధారణ సమయాలతో పోల్చితే వందశాతం అదనంగా టికెట్ ధరలు పెరిగాయి. సెలవులు కావడంతో తిరుపతి వెళ్లే ప్రయాణికుల రద్దీ కూడా సాధారణ సమయాలతో పోల్చితే వందశాతం అధికంగా ఉండటంతో యాభైశాతానికి పైగా చార్జీలు పెరిగాయి. కర్నూలు, కడప నగరాలకు వెళ్లే విమానాలకు రద్దీ ఉండటంతో ఆ చార్జీలను కూడా పెంచేశారు.

# ఒక తీర్పు.. పలువురిలో కలవరం

**సోమేశ్‌కుమార్ తరహాలో రాష్ట్రంలో మరికొందరు సివిల్ సర్వీస్ అధికారులు**

- క్యాట్ ఉత్తర్వులతో తెలంగాణలో కొనసాగుతున్న వైనం
- ఐదుగురు ఐఏఎస్‌లు, ముగ్గురు ఐపీఎస్‌ల పరిస్థితిపై సందిగ్ధత



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: తెలంగాణ సీఎస్ సోమేశ్‌కుమార్ విషయంలో హైకోర్టు వెలువరించిన తీర్పు పలువురు అఖిల భారత సర్వీసు అధికారుల్లో కలవరం పుట్టిస్తోంది. తమ పరిస్థితి ఏమవుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. తెలంగాణ కేడర్‌లో కొనసాగడానికి రాష్ట్ర విభజన సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేడర్‌లోని సివిల్ సర్వీసెస్ అధికారులను ఆప్షన్లు అడిగిన తరువాత.. వారి సీనియారిటీ, స్థానికత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ (డీవోపీటీ) వారిని రెండు రాష్ట్రాలకు విభజించి కేటాయింపు జరిపింది. అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పలు కారణాలు చూపిస్తూ.. కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (సీఏటీ)ను ఆశ్రయించి ఏపీకి వెళ్లకుండా తెలంగాణ రాష్ట్రంలోనే ఉండడానికి అనుమతులు తెచ్చుకున్నారు. సీఎస్ సోమేశ్‌కుమార్ కూడా వీరిలో ఉన్నారు. అయితే డీవోపీటీ 2017లోనే క్యాట్ ఉత్తర్వులను సవాల్ చేసింది. ఏ రాష్ట్రానికి కేటాయించిన అధికారులు ఆయా రాష్ట్రాల్లోనే పనిచేయాలని పేర్కొంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై దాదాపు ఐదు సంవత్సరాల అనంతరం మంగళవారం తీర్పు వెలువరించిన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ నేతృత్వంలోని ధర్మాసనం..సోమేశ్‌కుమార్ ఏపీకి వెళ్లాల్సిందేనంటూ తీర్పు ఇవ్వడం.. పలువురు అధికారులను కలవరపరుస్తోంది. తామంతా ఏపీకి వెళ్లాల్సిందేనా? అన్న చర్చ సదరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో కొనసాగుతోంది. ఏపీకి కేటాయించిన పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తెలంగాణలో పనిచేస్తుండగా.. తెలంగాణ రాష్ట్ర కేడర్‌కు కేటాయించిన కొందరు ఆంధ్రప్రదేశ్‌లోనూ కొనసాగుతున్నారు.

**అక్కడివారు ఇక్కడ.. ఇక్కడివారు అక్కడ**

కేంద్ర ప్రభుత్వం కేటాయించిన కేడర్‌లలో కాకుండా క్యాట్ ఉత్తర్వులతో రెండు రాష్ట్రాల్లో కొనసాగుతున్న వారిలో 9 మంది ఐఏఎస్‌లు, ఆరుగురు ఐపీఎస్ అధికారులు ఉన్నారు. ఐపీఎస్‌లకు సంబంధించి ఇటీవలే తెలంగాణ ఇన్‌చార్జి డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అంజనీకుమార్, అడిషనల్ డీజీపీ అభిలాష బిస్త్, అభిలాష్ మహంతిలు ఆంధ్ర కేడర్‌కు చెందిన అధికారులు కాగా.. తెలంగాణలో పనిచేస్తున్నారు. మొన్నటివరకు ఏపీ కేడర్‌కు చెందిన సంతోష్ మెహ్రా తెలంగాణలో పనిచేసినా, ఈ మధ్యనే ఆయన ఏపీ కేడర్‌కు వెళ్లిపోయారు. కాగా తెలంగాణకు కేడర్‌కు కేటాయించిన మనీష్‌కుమార్ సింగ్, అమిత్‌గార్గ్, అతుల్ సింగ్‌లు ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్నారు. ఇక ఈ విధంగా ఐఏఎస్ అధికారుల్లో సోమేశ్‌కుమార్, వాణీప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఎం.ప్రశాంతి, కాటా ఆమ్రపాలి తెలంగాణ కేడర్‌లో పనిచేస్తుండగా కాగా తెలంగాణ కేడర్‌కు కేటాయించిన హరికిరణ్, శ్రీజన, శివశంకర్‌లు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్నారు.

**ఇన్‌చార్జి డీజీపీగా అందుకేనా?**

తెలంగాణ డీజీపీగా అంజనీ కుమార్‌ను రెగ్యులర్ డీజీపీగా కాకుండా ఇన్‌చార్జి డీజీపీగా నియమించడానికి ప్రధాన కారణం హైకోర్టులో సోమేశ్‌కుమార్‌పై కొనసాగుతున్న కేసు నేపథ్యమేనన్న ప్రచారం ఉంది. తాజా తీర్పుతో ఇప్పుడు అంజనీకుమార్ పరిస్థితేంటన్నది పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇలా ఉండగా సీనియర్ ఐఏఎస్‌ల్లో వాకాటి కరుణ ప్రస్తుతం విద్యా శాఖ కార్యదర్శిగా, వాణీప్రసాద్ పర్యావరణ పరిరక్షణ, పరిశోధన, శిక్షణా సంస్థలో డైరెక్టర్‌గా, రొనాల్డ్‌రోస్ ఆర్థికశాఖ కార్యదర్శిగా, ఎం.ప్రశాంతి అటవీ శాఖలో సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కాటా ఆమ్రపాలి కేంద్ర సర్వీస్‌ల్లోకి వెళ్లి ప్రస్తుతం పీఎంఓలో ఉన్నారు.

## సీఎస్ రేసులో ముగ్గురు?

- రేసులో శాంతికుమారి, రామకృష్ణారావు, అరవింద్‌కుమార్
- సోమేశ్‌కుమార్‌ను తెలంగాణ కేడర్ నుంచి రిలీవ్ చేసిన కేంద్రం
- హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్న సోమేశ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సోమేశ్‌కుమార్ ఏపీ కేడర్‌కు వెళ్లిపోవాలని హైకోర్టు తీర్పు చెప్పగా, ఆ వెంటనే ఆయన్ను తెలంగాణ కేడర్ నుంచి రిలీవ్ చేస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 12లోగా ఏపీ ప్రభుత్వంలో రిపోర్టు చేయాలని కేంద్రం సోమేశ్ కుమార్‌ను ఆదేశించింది. దీంతో తక్షణమే కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకం అనివార్యంగా మారింది. హైకోర్టు తీర్పు అనంతరం సోమేశ్ కుమార్ సీఎం కేసీఆర్‌ను కలిశారు. కాగా, మంగళవారం అర్ధరాత్రి వరకు ఉత్తర్వులు రాకపోవడంతో కొత్త సీఎస్ నియామకంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**సీనియారిటీతో సంబంధం లేకుండా..**

కొత్త సీఎస్ రేసులో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. సీనియారిటీ ప్రకారం పరిశీలిస్తే సీఎస్ రేసులో 1987 బ్యాచ్ ఐఏఎస్ వసుధ మిశ్రా ముందంజలో ఉంటారు. అయితే, డెప్యూటేషన్‌పై యూపీఎస్సీ సెక్రటరీగా మంచి పదవిలో ఉండటం, మరో నెల రోజుల్లో పదవీ విరమణ చేయనుండడంతో ఆమె పోటీలో లేనట్టే. రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాణికుముదిని (1988 బ్యాచ్)కి సైతం ఆరు నెలలకు మించి సర్వీసు లేదు. వీరిద్దరి తర్వాత సీనియారిటీ ప్రకారం 1989 బ్యాచ్‌కు చెందిన శాంతికుమారి, 1990 బ్యాచ్ అధికారులైన శశాంక్ గోయల్ (ప్రస్తుతం డెప్యూటేషన్‌పై కేంద్రంలో ఉన్నారు), రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, 1991 బ్యాచ్ అధికారులైన రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, కేంద్ర జలవనరుల శాఖ డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ పేర్లను పరిశీలించాల్సి ఉండనుంది. సీనియారిటీతో సంబంధం లేకుండా తమకు నచ్చిన అధికారులను సీఎస్‌గా నియమించుకునే సంప్రదాయం కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో గతంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసిన శాంతికుమారి, రామకృష్ణారావు, అరవింద్ కుమార్‌ల్లో ఒకరిని సీఎస్‌గా నియమించవచ్చనే చర్చ జరుగుతోంది. కీలకమైన రాష్ట్ర ఆర్థిక శాఖ బాధ్యతలను సుదీర్ఘకాలంగా నిర్వహిస్తున్న కె.రామకృష్ణారావు పనితీరు పట్ల సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారు. ముక్కుసూటిగా వ్యవహరించే అధికారిగా పేరున్న అరవింద్ కుమార్ అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో స్పెషల్ సీఎస్‌లుగా ఉన్న శాంతికుమారి, రామకృష్ణారావు, అరవింద్‌కుమార్‌లలో ఒకరిని నియమిస్తారనే చర్చ జరుగుతోంది.

**ప్రస్తుతానికి ఇన్‌చార్జి సీఎస్ నియామకం?**

పూర్తి స్థాయి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని నియమించాలా? లేదా ఇన్‌చార్జి సీఎస్‌ను నియమించాలా? అన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్టు సమాచారం. సోమేశ్‌కుమార్‌ను కేంద్ర ప్రభుత్వం ఏపీ కేడర్‌కు కేటాయించడాన్ని సమర్థిస్తూ హైకోర్టు జారీ చేసిన తీర్పును ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్టు తెలిసింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధిస్తే మళ్లీ ఆయన్నే సీఎస్‌గా పునర్నియమించే అవకాశముంది. సుప్రీంకోర్టు స్టే విధించడానికి నిరాకరిస్తే మాత్రం పూర్తి స్థాయి సీఎస్‌ను నియమించక తప్పని పరిస్థితి ఏర్పడనుంది. అలాంటి పరిస్థితుల్లో స్టేపై సుప్రీంకోర్టు నిర్ణయం వచ్చే వరకు రామకృష్ణారావు, అరవింద్‌కుమార్‌లలో ఒకరిని ఇన్‌చార్జి సీఎస్‌గా నియమించవచ్చని తెలుస్తోంది.

## 'వార్ రూమ్' కేసులో మల్లు రవి!



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ వార్ రూమ్ కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో ఆ పార్టీ సీనియర్ నేత మల్లు రవిని నిందితుడిగా చేర్చాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నిర్ణయించారు. గురువారం విచారణకు హాజరుకావాల్సిందిగా ఇప్పటికే ఆయనకు నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. 'నా వాంగ్మూలం నమోదు చేయండి' అంటూ మల్లు రవి ఇటీవల సైబర్ క్రైమ్ పోలీసులకు లేఖ రాయడం, సోమవారం దర్యాప్తు అధికారుల ఎదుట హాజరైన కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు స్టేట్‌మెంట్‌లో పేర్కొన్న వివరాల ఆధారంగా పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా మల్లు రవి మంగళవారం సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌కు వచ్చారు. తనకు ఇచ్చిన నోటీసుపై అక్కడి అధికారులను వివరాలు కోరారు. దానికి సంబంధించిన వివరాలు అందించిన అధికారులు గురువారం విచారణకు హాజరవ్వాలని చెప్పారు. అది ముగిసిన తర్వాత ఈ కేసులో మల్లు రవిని ఐదో నిందితుడిగా చేరుస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.

## మే 15న పాలిసెట్ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్, వెటర్నరీ, హార్టికల్చర్, అగ్రికల్చర్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ పాలిసెట్ ప్రవేశ పరీక్ష మే 17న జరగనుంది. ఎంపీసీ, బైపీసీ రెండు విభాగాలకు ఒకేరోజు ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. 2023–24 పాలిసెట్ నోటిఫికేషన్ మంగళవారం విడుదలైంది. ఈ మేరకు మంగళవారం సాంకేతిక విద్యామండలి కార్యదర్శి డాక్టర్ శ్రీనాథ్ ఈ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ప్రవేశాలుసహా ఇతర వివరాల కోసం విద్యార్థులు www.polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, సందేహాల నివృత్తికి 040 –23222192 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ఏపీకి వెళ్లాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

తీర్పు అమలును మూడు వారాలు నిలిపేయాలన్న సోమేశ్‌కుమార్ తరఫు న్యాయవాది విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. అన్ని అంశాలను వివరంగా పరిశీలించిన తర్వాతే తీర్పు ప్రకటిస్తున్నామని స్పష్టం చేసింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పంపిణీకి సంబంధించిన వివాదాలపై గతంలో క్యాట్ జారీ చేసిన ఉత్తర్వులను.. కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల మంత్రిత్వశాఖ హైకోర్టులో సవాల్ చేసింది. సుదీర్ఘ కాలం ఇరుపక్షాల వాదనలు విని, గత జూలైలో తీర్పును రిజర్వు చేసిన న్యాయస్థానం మంగళవారం తీర్పు వెల్లడించింది.

**మాకెలాంటి పక్షపాతం కన్పించడం లేదు..**

'కేంద్రానికి క్యాట్ అప్పిలేట్ అధికారిగా వ్యవహరించలేదు. అది చట్టప్రకారం సమర్థనీయం కాదు. ఆలిండియా కేడర్ ఉద్యోగులు దేశంలో ఎక్కడైనా విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలి. ఫలానా రాష్ట్రంలోనే పని చేస్తానని చెప్పడం సుప్రీంకోర్టు గత తీర్పులకు విరుద్ధం. సోమేశ్‌ను ఏపీకి కేటాయించడంలో మాకు ఎలాంటి పక్షపాతం కనిపించడం లేదు. సీనియారిటీ, కేడర్ దెబ్బతింటుందన్న వాదనలో వాస్తవం లేదు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే కేంద్రం కేడర్ విభజన చేసింది. పరస్పర బదిలీకి సంబంధించి సోమేశ్ చేసిన అభ్యర్థనను మార్గదర్శకాల మేరకు కేంద్రం తిరస్కరించింది. 1989 బ్యాచ్ అధికారి సోమేశ్‌కు, 1990 బ్యాచ్ అధికారి రజత్‌భార్గవ్‌తో పరస్పర బదిలీ సాధ్యం కాదంది. విభజన సమయంలో సీఎస్‌గా ఉన్న మొహంతి.. ప్రత్యూష్ సిన్హా కమిటీలో సభ్యుడిగా ఉండటం సరికాదని, కుమార్తె, అల్లుడికి ప్రయోజనం కలుగుతున్నందున కమిటీలో ఆయన ఉండొద్దన్న క్యాట్ నిర్ణయం సమర్థనీయం కాదు. కేంద్రాన్ని ఆయన ఎలా ప్రభావితం చేశారో ఎవరూ చెప్పలేదు. 60 ఏళ్లు నిండటంతో 2014 ఫిబ్రవరిలో మొహంతి పదవీకాలం ముగిసింది. అయినా విభజన దృష్ట్యా 4 నెలలు పదవీ కాలాన్ని పొడిగించారు. జూన్ 1న పదవీ విరమణకు అనుమతించాలన్న ఆయన అభ్యర్థనను నాటి సర్కార్ అంగీకరించింది. విరమణ రోజును పని దినంగా పేర్కొనరాదని నిబంధనలున్నా.. క్యాట్ ఆ రోజును కూడా పరిగణనలోకి తీసుకోవడాన్ని తప్పుబట్టాల్సిందే. ఈ కేసులో సోమేశ్ తరఫున నాటి జీఏడీ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ కౌంటర్ దాఖలు చేశారు. సోమేశ్ అఫిడవిట్ ఎందుకు వేయలేదన్నది సందిగ్ధం..' అని ధర్మాసనం పేర్కొంది.

**సోమేశ్ అవకాశాలను మొహంతి దెబ్బతీశారు**

రాష్ట్ర విభజన సమయంలో అఖిల భారత సర్వీస్ అధికారుల విభజన కోసం ఏర్పాటైన ప్రత్యూష్ సిన్హా కమిటీలో సమైక్యాంధ్ర చివరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పీకే మొహంతి రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించలేదు. ఆయన తన కుమార్తె, అల్లుడికి లబ్ధి చేకూరేలా వ్యవహరించారు. రాష్ట్ర విభజనకు ఒక్కరోజు ముందు పదవీ విరమణ చేసిన మొహంతి పేరిట 2014, జూన్ 1న కూడా ప్రభుత్వ జీవోలు జారీ అయ్యాయి. దీని ప్రకారం అప్పటివరకు సర్వీస్‌లో ఉన్న మొహంతిని ఏపీ లేదా తెలంగాణకు కేటాయించక పోవడం చట్ట వ్యతిరేకం. చివరిరోజు వరకు విధుల్లో ఉండి ఆపై రాజీనామా చేయడం ద్వారా కావాలని సోమేశ్ కుమార్ అవకాశాలను దెబ్బతీశారు. లబ్ధిదారుడైన మొహంతి కమిటీలో సభ్యుడిగా ఉండటం చెల్లదు. కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలి.

– సోమేశ్‌కుమార్ తరఫు న్యాయవాదులు

**క్యాట్‌లో ఒకలా.. హైకోర్టులో మరోలా..**

సివిల్ సర్వీస్ అధికారులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వమే కేడర్ కంట్రోలింగ్ అథారిటీ. ఇష్టం వచ్చిన రాష్ట్రాన్ని ఎంపిక చేసుకునే హక్కు సదరు అధికారులకు లేదు. రాష్ట్ర ప్రభుత్వ వాదన సరికాదు. తెలంగాణలో సోమేశ్ కొనసాగింపు చట్ట వ్యతిరేకం. ఆయన కంటే సమర్థులు లేరని తెలంగాణ భావిస్తే ఏపీ ప్రభుత్వాన్ని ఒప్పించి డిప్యుటేషన్ మీద మళ్లీ రప్పించుకోవచ్చు. ఈ కేసుపై క్యాట్‌లో విచారణ సందర్భంగా ఐఏఎస్, ఐపీఎస్ కేటాయింపులపై నిర్ణయాధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉంటుందంటూ రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. హైకోర్టు ఎదుట మాత్రం వైఖరిని మార్చుకుంది. రాష్ట్ర విభజనకు అపాయింటెడ్ డే అయిన జూన్ 2, 2014కు ఒకరోజు ముందు పీకే మొహంతి రిటైరయ్యారు. అందుకే ఆయనను ఇరు రాష్ట్రాల మధ్య విభజన అధికారుల జాబితాలో చేర్చలేదు. అలా చేర్చి ఉంటే తనకు తెలంగాణ వచ్చేదన్న సోమేశ్‌కుమార్ వాదన సరి కాదు. ప్రత్యూష్ సిన్హా కమిటీలో పీకే మొహంతి ఎక్స్‌అఫీషియో మెంబర్ మాత్రమే. మిగతా సభ్యులు ఉండగా ఆయన వివక్ష చూపడానికి అవకాశం లేదు. క్యాట్ ఉత్తర్వులను కొట్టేయాలి. సోమేశ్‌కుమార్ ఏపీకి వెళ్లాల్సిందే.

– ఏఎస్‌జీ టి.సూర్యకరణ్‌రెడ్డి

## 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి'కి ఆరు షోలు

సాక్షి, హైదరాబాద్: చిరంజీవి నటించిన వాల్తేర్ వీరయ్య, బాలకృష్ణ నటించిన వీర సింహారెడ్డి సినిమాల విడుదల రోజు 6 షో లు ప్రదర్శించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఈ సినిమాల చిత్ర నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ చేసిన విజ్ఞప్తి మేరకు ఆరు షోల ప్రదర్శనకు అనుమతినిస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి సినిమాల ప్రదర్శన మొదలు కానుంది.

## చదువులో ఓటమి అంగీకరించొద్దు

**కుమార్తె, కుమారుడు పుట్టినా నేను చదువు కొనసాగించాను**

- విద్యార్థులతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- జీ–20పై పోటీల్లో విజేతలకు పురస్కారాల పంపిణీ



పురస్కార గ్రహీతలతో గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: ఎన్ని అడ్డంకులు, అవరోధాలు ఎదురొచ్చినా చదువులో ఓటమిని అంగీకరించవద్దని విద్యార్థులకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. ఎన్ని సవాళ్లు ఎదురొచ్చినా ఎదుర్కోగలనన్న ఆత్మవిశ్వాసం విద్యార్థుల్లో ఉండాలని ఆమె సూచించారు. తాను ఎంబీబీఎస్ చదివే రోజుల్లో ఒక్క సెమిస్టర్‌లో కూడా ఫెయిల్ కాలేదన్నారు. 3వ సంవత్సరం కోర్సులో ఉండగా కుమారుడు, హౌజ్ సర్జన్‌గా పనిచేస్తున్నప్పుడు కుమార్తె పుట్టినా చదువులపై ఏమాత్రం ప్రభావం పడకుండా కష్టపడి కొనసాగించినట్లు తెలిపారు. జీ–20 సదస్సుపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు రాజ్‌భవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, లోగో తయారీ పోటీల్లో విజేతలకు మంగళవారం ఆమె రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో పురస్కారాలను అందజేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ సదస్సును దేశంలో నిర్వహిస్తుండటం గర్వకారణమని, తెలంగాణలో సైతం ఇందుకు సంబంధించిన 6 ఈవెంట్లను నిర్వహించనున్నారని తెలిపారు. రాజ్‌భవన్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను ప్రారంభించనున్నామని, త్వరలో సీపీఆర్ చాలెంజ్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు.

## పేదరికం బీసీలకు పెద్ద శాపం

**హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నంద**



అమీర్‌పేట: పేదరికం బీసీలకు పెద్ద శాపమని, బీసీల్లో చాలా మంది చదువుకోలేక పోతున్నారని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సమాజ్ ఆధ్వర్యంలో అమీర్‌పేటలో మంగళవారం నిర్వహించిన 'బీసీ ఉమెన్ సింపోజియం'లో జస్టిస్ నంద మాట్లాడారు. పనిలో ఇచ్చే వేతనం మహిళలకు తక్కువగా ఉంటుందని, ఉద్యోగాలు, ప్రమోషన్లలో సైతం వివక్ష చూపిస్తున్నారని అన్నారు. మహిళలకు చదువు చెప్పిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని.. ఇంట్లో అమ్మ చదువుకుంటే అందరూ చదువుకున్నట్లేనని పేర్కొన్నారు. విద్య అన్నిటికంటే ముఖ్యం కాగా రెండో ముఖ్యమైన రంగం రాజకీయమన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ రాజకీయ సాధికారతకు నిదర్శనమన్నారు.

**కూతురే కావాలంటున్నారు: ఈటల**



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ .. ఇప్పుడు ట్రెండ్ మారింది. అబ్బాయి వద్దు.. అమ్మాయి కావాలని చాలా మంది తల్లిదండ్రులు కోరుకుంటున్నారని చెప్పారు. ఏ తల్లి కుటుంబాన్ని పట్టించుకుంటుందో ఆ కుటుంబమే బాగు పడుతుందన్నారు. దేశంలో వ్యవసాయం ఇంకా ఉందంటే అది మహిళల శ్రమవల్లేనని అన్నారు. జ్ఞానం, సంస్కారం కులాన్ని బట్టి రావనీ, చైతన్యానికి, ఐక్యతకు, పోరాటానికి కులం లేదని చెప్పారు. కార్యక్రమంలో రెండు రాష్ట్రాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

## 28న రాష్ట్రానికి అమిత్ షా

▶ మొదటి పేజీ తరువాయి

ఇక్కడే ఉండే అవకాశం ఉంది. ఈ సందర్భంగా నాలుగేసి లోక్‌సభ నియోజకవర్గాలను కలిపి ఒక క్లస్టర్‌గా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం. అమిత్‌షా కనీసం రెండు క్లస్టర్ సమావేశాల్లో పాల్గొని సంస్థాగతంగా ఎన్నికల సన్నద్ధతను పర్యవేక్షించనున్నట్టు తెలుస్తోంది.

**ఎన్నికల కసరత్తు షురూ**

వచ్చే డిసెంబర్‌లోగా ఎప్పుడైనా ఎన్నికలు ఉండొచ్చనే అంచనాల మధ్య బీజేపీ కసరత్తును ముమ్మరం చేసింది. ఎన్నికల సన్నద్ధతపై తాజాగా ఆరెస్సెస్ జాతీయ నాయకత్వం నుంచి బీజేపీ జాతీయ, రాష్ట్రనాయకత్వాలు సలహాలు తీసుకున్నాయి. కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను తీవ్రస్థాయిలో ఎండగట్టడంతోపాటు గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మరింత సమన్వయంతో పనిచేయాలని ఆరెస్సెస్ సూచించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీకి సంబంధించిన వివిధస్థాయిల నాయకులు, లోక్‌సభ నియోజకవర్గస్థాయి కమిటీలకు బుధ, గురువారాల్లో పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్రపార్టీ సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ దిశానిర్దేశం చేయనున్నారు. వివిధ వర్గాల ప్రజల్లో కేసీఆర్ ప్రభుత్వ తీరును, ముఖ్యమైన హామీలను నిలబెట్టుకోకపోవడాన్ని ఎండగట్టేలా భవిష్యత్ కార్యాచరణకు తుదిరూపు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో పాటు సంస్థాగతంగా పార్టీ పటిష్టత, పోలింగ్ బూత్ స్థాయి వరకు వివిధ కమిటీల బలోపేతం, ప్రజాసమస్యల పరిష్కారం తదితర అంశాలపై దృష్టి పెట్టనున్నారు. అలాగే, బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షతన జరిగే పార్లమెంటు ప్రభారీ, విస్తారక్ సమావేశంలోనూ బన్సల్ పాల్గొంటారని రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.


**ప్రభారీలు, కన్వీనర్ల నియామకం**

రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్లమెంటరీ ప్రభారీలు, కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లుగా రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలను బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ నియమించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల వరకు వీరు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో పనిచేయాల్సి ఉంటుంది.

| నియోజకవర్గం | ప్రభారీ | కన్వీనర్ |
|---|---|---|
| ఆదిలాబాద్ | అల్జాపూర్ శ్రీనివాస్ | ఎ.భూమన్న |
| పెద్దపల్లి | ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి | పి.మల్లిఖార్జున్ |
| కరీంనగర్ | ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ | బి.ప్రవీణ్‌రావు |
| నిజామాబాద్ | వెంకటరమణి | గడ్డె శ్రీనివాస్ |
| జహీరాబాద్ | బద్దం మహిపాల్‌రెడ్డి | రవికుమార్‌గౌడ్ |
| మెదక్ | జయశ్రీ | వి.రామ్మోహన్‌గౌడ్ |
| మల్కాజిగిరి | యెండల లక్ష్మీనారాయణ | ఆర్కే శ్రీనివాస్ |
| సికింద్రాబాద్ | గోలి మధుసూదన్ రెడ్డి | టి.రాజశేఖర్‌రెడ్డి |
| హైదరాబాద్ | దేవకీ వాసుదేవరావు | ఎ.ఇంద్రసేనారెడ్డి |
| చేవేళ్ల | డా.కాసం వెంకటేశ్వర్లు | మల్లారెడ్డి |
| మహబూబ్‌నగర్ | వీరెల్లి చంద్రశేఖర్ | పవన్‌కుమార్‌రెడ్డి |
| నాగర్‌కర్నూల్ | అట్లూరి రామకృష్ణ | రాగి రామకృష్ణారెడ్డి |
| నల్లగొండ | ఎం.ధర్మారావు | బండారు ప్రసాద్ |
| భువనగిరి | చింతల రామచంద్రారెడ్డి | బండారు లింగస్వామి |
| వరంగల్ | గొట్టాల ఉమారాణి | టి.కుమారస్వామి |
| మహబూబాబాద్ | కట్టా సుధాకర్‌రెడ్డి | ఎం.శ్రీనివాసరెడ్డి |
| ఖమ్మం | కె. రమేశ్ | ఎస్.రామలింగేశ్వరావు |

## తెలంగాణలో సోమేశ్ 'ముద్ర'

- ప్రభుత్వానికి ఆదాయ మార్గాలను సృష్టించడంలో దిట్ట
- ఆబ్కారీ, వాణిజ్య పన్నుల శాఖల్లో కీలక చర్యలు
- జీహెచ్ఎంసీలో సంస్కరణల నుంచి అన్ని శాఖల్లో ఈ–పాలన వరకు ఈయన హయాంలోనే..



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఎస్.సోమేశ్‌కుమార్ తనదైన ముద్ర వేసుకున్నారు. మూడేళ్ల క్రితం సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్.కె.జోషి నుంచి ప్రభుత్వ శాఖల పాలన పగ్గాలు తీసుకున్న ఆయన.. అనేక రాజకీయ విమర్శలను, ఆరోపణలను ఎదుర్కొన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా తనదైన శైలిలో ప్రభుత్వ వ్యవస్థను ముందుకు నడిపిన ఐఏఎస్ అధికారిగా గుర్తింపు పొందారు. ముఖ్యంగా ప్రభుత్వానికి ఆదాయ వనరులను సృష్టించడంలో దిట్టగా పేరొందారు. ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నుల శాఖల ద్వారా ఆదాయాన్ని రెండు, మూడింతలు చేయడంలో కీలకపాత్ర పోషించిన ఆయన ఆయా శాఖల్లో కీలక సంస్కరణలు చేపట్టారు. రాష్ట్రంలోని చిట్‌ఫండ్ కంపెనీల ఇష్టారాజ్యాన్ని నియంత్రించేలా మార్పులు తెచ్చారు. ఆబ్కారీ శాఖలో హోలోగ్రామ్ విధానాన్ని తెచ్చి కల్తీ, నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యాన్ని నియంత్రించడంతోపాటు ట్రాక్ అండ్ ట్రేస్ విధానం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా మార్పులు తెచ్చారు. వాణిజ్య పన్నుల శాఖను పునర్వ్యవస్థీకరించి పన్ను ఎగవేతలను సమర్థవంతంగా అడ్డుకున్నారు. ఆదాయ శాఖలన్నింటిలో తనదైన ముద్ర వేసిన సోమేశ్.. ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తేవడం ద్వారా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో పారదర్శకతను తెచ్చారు. అయితే, ఈ పోర్టల్ అమల్లో అనేక విమర్శలు కూడా వచ్చాయి. రైతుల భూములకు సంబంధించిన సమస్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

**ల్యాండ్ బ్యాంక్ రూపకల్పన**

నిరర్థక ఆస్తులు, భూములను అమ్మి ప్రభుత్వ ఖజానా నింపడం, టీఎస్ఐఐసీ లాంటి సర్వీస్ ప్రొవైడర్ ద్వారా భూములను విక్రయించే పద్ధతిని సోమేశ్‌కుమార్ తీసుకొచ్చారు. లెక్కాపత్రం లేని ప్రభుత్వ భూముల వివరాలను పక్కాగా తయారు చేసి భవిష్యత్తు అవసరాల కోసం ల్యాండ్ బ్యాంక్‌ను రూపొందించడం లాంటి పనులు కూడా ఆయన హయాంలోనే జరిగాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల పోస్టింగులకు సంబంధించిన పైరవీలకు సోమేశ్ చెక్ పెట్టారనే వాదన కూడా ఉంది. ఏటా అన్ని శాఖల్లో ఆడిటింగ్‌ను క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా జవాబుదారీతనం పెంపు కోసం యత్నించారు. ఇక జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పనిచేసిన కాలంలో డోర్ టు డోర్ సర్వే, రూ.ఐదుకే భోజనం, ఎస్ఆర్‌డీపీ (స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కింద ఫ్లైఓవర్ల నిర్మాణం, మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం లాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జీహెచ్ఎంసీలో కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి ప్రజలు సులవుగా ఫిర్యాదులు చేసే అవకాశం కల్పించింది కూడా ఈయన హయాంలోనే. ఈ కాల్‌సెంటర్ కోవిడ్ సమయంలో చాలా ఉపయోగపడిందనే పేరుంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 11-1-2023

పండగ వేళ





ఫొటో: ఎస్.కె.రియాజుద్దీన్, ఏలూరు

# ఊరికి కాంతి సంక్రాంతి

'ఊరెళ్లాలి'
సంక్రాంతికి తెలుగువారి
తలపుల్లోకి వచ్చే మాట అది.
ఊరంటే?
చిన్నప్పటి స్నేహితులు.
దగ్గరి బంధువులు.
తిరుగాడిన వీధులు.
నేర్చుకున్న పాఠాలు.
మరపురాని జ్ఞాపకాలు.
సంవత్సరానికి ఒకసారి
ఊరితో ఉన్న ముడిని
గుర్తు చేసే పండగ సంక్రాంతి.
మనకో ఊరు ఉంది
అనే భావనతో
సంతోషాన్ని ఇచ్చే పండగ
సంక్రాంతి.
ఊరెళదామా?
ఆ తలపులతో పండగకు
ఉత్సాహంగా సిద్ధమవుదామా?

ఉన్న ఊరు... కన్నతల్లి అన్నారు. ఉన్న వూళ్లోనే కన్నతల్లితో కలిసి ఉండే అదృష్టం ఇప్పుడు అందరికీ లేదు. ఉద్యోగాల కోసం ఉపాధి కోసం ఊరు వదలాలి. వెళ్లాలి. బతకాలి. ఎదగాలి. కాని ఊరితో బొడ్డుపేగు బంధాన్ని కాపాడుకోవాలి. అందుకు సంక్రాంతి ఒక వారధి. 'పండక్కు ఊరికి రా' అని పిలిచే ఏకైక పండగ సంక్రాంతి. కారణం? అది ఆకుపచ్చ పండగ. పల్లీయుల పండగ. పంట చేతికొచ్చాక వచ్చే పండుగ. పశువులకు కృతజ్ఞత పలకాల్సిన పండగ. అయినవారిని కలుసుకోవాల్సిన పండగ. పంటలు, పశువులు పట్టణాల్లో, నగరాల్లో ఉంటాయా? పల్లెల్లో ఉంటాయి. ఊళ్లల్లో ఉంటాయి. అందుకే సంక్రాంతికి ఊరికెళ్లాలనిపిస్తుంది. నాదైన నేల మీద, నా వాళ్ల మధ్యలో, నా పూర్వికులు పీల్చి వదిలిన గాలిలో నేనూ కాసిన్ని రోజులు గడపాలి అనిపించేలా చేస్తుంది సంక్రాంతి.

**రైతు రక్తం**

ఇప్పుడు కలెక్టరైనా, సాఫ్ట్‌వేర్ ఇంజనీరైనా మూడు నాలుగు తరాలు వెనక్కు వెళితే వ్యవసాయమే కనిపిస్తుంది. భారతీయులు వందల తరాలు వ్యవసాయదారులుగానే ఉన్నారు. అందరిలోనూ తవ్వుకుంటూ వెళితే కుల మతాలకు అతీతంగా వ్యవసాయమే కనిపిస్తుంది. సంక్రాంతికి ఆ రక్తబంధం జాగృతం అవుతుంది. అందుకే సంక్రాంతికి ఊరి మీద ధ్యాస మళ్లుతుంది. బండ్లకెత్తుకుని నడిచే వడ్ల బస్తాలు, నిండిన గాదెలు, చేతిలో తిరుగాడే దుడ్లు, నేతి గిన్నెలు, పెరళ్లలో విరగ్గాసే తీగలు, రెక్క విప్పే బంతిపూలు.... పల్లె టూళ్లు తమ వారిని ఆహ్వానించే మూడ్‌లో ఉంటాయి. ఉల్లాసంగా ఉంటాయి. అతిథి వస్తే ఆనందించేలా ఉంటాయి. ఆదరిద్దామనుకుంటాయి. అందుకని అందరూ ఊరికెళదామనుకుంటారు. కొత్త అల్లుడు వస్తాడు. కూతురు కళకళలాడుతూ తిరుగుతుంది. కొడుకు కోడలు కారు బయట పార్కు చేసేసి దిగుతారు. పిల్లలు అరుగులు ఎక్కి దుముకుతారు. వీధులు ముగ్గులతో స్వాగతం పలుకుతాయి. పళ్ల కింద నలగడానికి చెరుగు గడలు తీపి నింపుకుంటాయి. చలిమంటల్లో తాటాకులు చిటాచిటా మండుతాయి. ఆ మంటల్లో తాటి పండ్లను కాల్చి తింటే అద్భుతంగా ఉంటాయి. మాటల్లో నవ్వులు పువ్వులు పూస్తాయి. ఇవన్నీ ఊరిలో సంక్రాంతి సమయంలోనే సొంతం. అందుకే ఊరికే వెళ్లాలనిపిస్తుంది.

**ఇంటి దేవత**

ఇప్పటికీ చాలా కుటుంబాలకు ఇంటి దేవతలు ఉంటారు. గ్రామ దేవతలు ప్రతి ఊరికీ ఎలాగూ ఉంటారు. సంక్రాంతి నాడు ఇంటి వాళ్లంతా కలిసి ఇంటి దేవతకు నైవేద్యాలు పెట్టుకోవాలి. ఆడపిల్లకు కొత్త బట్టలు పెట్టాలి. అందు కోసం అందరూ కలవాలి. వరుసలు పిల్లలకు తెలపాలి. కొత్త బంధాలు వేసుకోవాలి. వీరు ఫలానా వారు ఫలానా అనుకుంటే వీరంతా మన బలగం అనుకుంటే మనిషికి సంతోషం. ఇక ఊరి దేవత దగ్గర ఊరంతా కలుస్తుంది. చిన్నప్పటి నుంచి చూసిన వారంతా కలుస్తారు. ఎలా ఉన్నావు అంటే ఎలా ఉన్నావు అనుకుంటారు. పగలంతా హరిదాసు, కొమ్మదాసు, జంగమ దేవరలు, గంగిరెద్దులవాళ్ల పలకరింపులు. పిట్టల దొరల ప్రేలాపనలు. కోడి పందేల దగ్గర సత్తా చాటుకోవడాలు. ఎగిరే గాలిపటాలు. రాత్రయితే ఊరి గుడి దగ్గర వినోద కార్యక్రమాలు. బతుకు సంబరంగా గడవడం అంటే ఏమిటో సంక్రాంతి చూపుతుంది. అందుకే ఊరెళ్లాలనిపిస్తుంది.

**ఇచ్చే చేయి**

సంక్రాంతి వస్తే అమ్మది ఇచ్చే చేయి అవుతుంది. సంక్రాంతి పండగ ఇనాములు, నజరానాలు ఇచ్చే పండగ. మేర పంచే పండగ. ఇంటి పెద్ద దర్పంగా కూచుని ఇవన్నీ తమకు సేవ చేసే వారికి, తమ మీద ఆధారపడ్డవారికి ఇంటి మహాలక్ష్మి చేతి మీదుగా ఇప్పించడం ఆనవాయితీ. ఇరుగు పొరుగూ వారికి పిండి వంటలు పంచడం కూడా అమ్మ పనే. పిల్లల స్థితిగతులను గమనించే అమ్మ తాను ఇవ్వాలనుకున్న సంతానానికి గుట్టుగా కొంత ముట్ట జెప్పేది ఈ సమయంలోనే. ముగ్గులు వేస్తూ ఇంటి ఆడవాళ్లంతా చెప్పుకోవాల్సిన ముచ్చట్లన్నీ తనివితీరా చెప్పుకుంటారు. గొబ్బెమ్మ పాటలు పాడుతూ గౌరమ్మ దయ తమ కుటుంబాల మీద ఉండాలని కోరుకుంటారు. కొత్తబట్టల్లో వారంతా మెరిసిపోతారు. సంక్రాంతి వల్ల వారంతా కొత్త ఊపిరి నింపుకుంటారు.

**పాతది దగ్ధం చేసి కొత్త వెలుతురులోకి**

భోగి నాడు పాత వస్తువులన్నింటిని దగ్ధం చేయడం ఆనవాయితీ. ఇక్కడ పాతవి అంటే వస్తువులని మాత్రమే కాదు. పాత ఫిర్యాదులు, అభ్యంతరాలు, తగాదాలు, మాట పట్టింపులు, అలకలు, మూతి విరుపులు, దూరాలు... వీటన్నింటినీ దగ్ధం చేయాలి. కుటుంబంలో బంధువర్గంలో అందరూ మళ్లీ కలిసిపోయి సమ్యక్ క్రాంతి అంటే చక్కటి కాంతిని తెచ్చే ఉత్తరాయణంలోకి అడుగు పెట్టమని కూడా సంక్రాంతి సందేశం ఇస్తుంది. మనిషి ఎక్కడ తిరిగినా తన నేల మీద తన బంధాన్ని కోల్పోకూడదు. ఎంత దూరంగా ఉన్నా తనవారితో బంధాన్ని కోల్పోకూడదు. ఈ రెంటినీ సంక్రాంతి నాడు సజీవం చేసుకుని ముందుకు సాగమని కోరుతుంది సంక్రాంతి. అందుకే ఊరెళదామని కోరిక నింపుతుందా పండుగ.

ట్రైన్‌లు, బస్సులు, కార్లు... ఏవీ సరిపోవు పండక్కు ఊర్లెళ్లడానికి.

కాని ఏమైనా సరే ఊర్లో తీరుతాడు తెలుగు వాడు సంక్రాంతికి.

లీవ్ ఈసరికే ఓకే అయి ఉంటుంది.

సూట్‌కేసులు సర్దేశారా.

## ప్రకాశవంతమైన చర్మం కోసం...

- తాజా నిమ్మరసం చర్మం రంగును మెరుగుపరచడానికి బాగా ఉపయోగపడుతుంది. ఒక టీ స్పూను తాజా నిమ్మరసం, రెండు టీ స్పూన్లు కీరా జ్యూస్, ఆలివ్ ఆయిల్ మూడు టీ స్పూన్లు తీసుకుని మూడింటినీ కలుపుకోవాలి. ముందుగా నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుని ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని అప్లై చేయాలి. వేళ్ళతో నెమ్మదిగా రబ్ చేయాలి. ఆ తర్వాత సబ్బుతో కడిగేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికే కాకుండా శరీరమంతా కూడా అప్లై చేసుకోవచ్చు. స్నానానికి వెళ్ళే ముందు ఈ చిట్కా పాటిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇలా ప్రతిరోజూ స్నానానికి ముందు చేయడం వల్ల మీ చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా తయారవుతుంది.
- అర టీస్పూన్ గంధపు పొడిలో తగినంత రోజ్ వాటర్ కలిపి ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా మూడు రోజులకోసారి చేస్తూ వుంటే ముడతలు తగ్గడంతో పాటు ముఖ కాంతి మెరుగుపడుతుంది.



## నల్లమచ్చల నివారణకు...

- నాలుగు తులసి ఆకులు, పావు టీస్పూన్ పసుపు కలిపి పేస్ట్ చెయ్యాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి15 నిమిషాలు ఉంచి కడిగేయాలి.
- అరచేతిలో టీ స్పూన్ తేనె తీసుకుని రెండు రేకల కుంకుమ పువ్వుని వేసి రంగరించాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, 15 నిమిషాల తరువాత కడిగేయాలి. ఇలా చేస్తే క్రమంగా నల్ల మచ్చలు తగ్గుముఖం పడతాయి.

## ముగ్గు - ముచ్చట

చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com
(మీ ఊరి పేరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)





ఎం. సుమలత
జహీరాబాద్
17 చుక్కలు, 7 వరుసలు
7 వచ్చే వరకు, వరుస చుక్క





యర్ర పద్మావతి
పురంధరపురం
నెల్లూరు జిల్లా
15 చుక్కలు, 3 వరుసలు
3 వచ్చే వరకు, సరి చుక్క





తేజస్విని
తాండూర్, వికారాబాద్
31 చుక్కలు, 16 వచ్చే వరకు
మధ్య చుక్క





బి. యమునా రాణి
న్యూమీర్జాలగూడ
మల్కాజిగిరి
15 చుక్కలు
15 వరుసలు





భాగ్యలక్ష్మి
కిసాన్ నగర్, మహబూబ్‌నగర్
18 చుక్కలు, 2 వరుసలు
2 వచ్చే వరకు, సరి చుక్క

రీ యూజబుల్

## పాతవే ..కొత్తగా!

**డ్రెస్‌కు తగిన షూ, చెప్పల్స్ వాడటం ఈ రోజుల్లో ఫ్యాషన్. రోజూ సాధారణంగా ధరించేవైనా ఒక్కొక్కరికి రెండు మూడు జతల షూస్ ఉంటాయి. పాతగా అయినా, పిల్లలకు బిగుతుగా అనిపించినవాటినైనా పక్కన పడేయడం చాలా సాధారణంగా చేసే పని. అయితే బెంగళూరు విద్యార్థి సియా మాత్రం కొత్తగా ఆలోచించింది. కాలనీలు తిరిగి పాత చెప్పులను సేకరించి, వాటిని బాగు చేసి, మరీ పేదవారికి పంచుతుంది. ఇలా ఇప్పటి వరకు వేలమందికి సహాయం చేసింది.**







బెంగళూరులోని కోరమంగళలో ఉంటున్న సియా ఇంటి చుట్టూ భవన నిర్మాణ పనులు జరుగుతుండేవి. అక్కడ పనిచేసే భవన నిర్మాణ కార్మికులు, వారి పిల్లలు చెప్పులు లేకుండా పరిగెత్తడం సియాను బాధించేది. ఓ రోజు ఇంటికి వచ్చే దారిలో పిల్లల పాదాలను చూసింది, వారి పాదాలకు పగుళ్లు ఉన్నాయని గమనించిన ఆమె, వారికి చెప్పులను తెచ్చివ్వడానికి తన ఇంటికి పరిగెత్తింది.

**సోల్ వారియర్...** అక్కణ్ణుంచి ఇరుగింటి వారిని, పొరుగింటి వారిని అడిగింది. చాలా చెప్పులనే సేకరించింది. ఆ తర్వాత కూతురి తపన చూసిన ఆమె తల్లిదండ్రులు కూడా తమకు తెలిసిన వారిని అడిగి చెప్పులను సేకరించేవారు. అక్కణ్ణుంచి వాలంటీర్లు వచ్చి జత కలిశారు. ఫలితంగా కొన్ని వేల జతల చెప్పులు వచ్చి చేరాయి. ఆ విధంగా 2019లో 'సోల్ వారియర్' పేరుతో ఒక ఎన్జీవోను ప్రారంభించింది.

**పునరుద్ధరణ...** పాదరక్షలను సేకరించడం, వాటిని స్వచ్ఛందంగా పునరుద్ధరించడం ఒక ఉద్యమంలా మొదలుపెట్టింది సియా. బాగు చేసిన చెప్పులను పేదవారికి అందిస్తూ వచ్చింది. ఇప్పటి వరకు 15,000 జతల చెప్పులను బాగు చేసి, పేదలకు పంచింది. 'అధిక జనాభాను ప్రభావితం చేసే పరిష్కారం కనుక్కోవడం చాలా ముఖ్యం. సోల్ వారియర్స్‌తో నేను అదే పనిచేశాను' అంటుంది సియా.

**గ్రూపులుగా సేకరణ...** సొంతంగా పోస్టర్లను తయారు చేయం, వాట్సాప్ గ్రూప్‌లలో వాలంటీర్లతో సమన్వయం చేసుకోవడం వరకు అన్నీ పర్యవేక్షిస్తుంది సియా. ఒక నెలలో దాదాపు 500 జతల పాదరక్షలను సేకరించగలిగింది. ఈ వార్త వేగంగా వ్యాప్తి చెందడంతో ఎక్కువ మంది వ్యక్తులు విరాళం ఇవ్వడానికి వచ్చేవారు. ఈ విషయంలో సహాయం చేయడానికి వాలంటీర్లు ముందుకు వచ్చారు.

**విస్తరణ...** బెంగళూరులో ఈ మిషన్ విజయవంతమైన తర్వాత ఇప్పుడు ముంబై, చెన్నై నగరాలకూ పాత పాదరక్షల సేకరణ విస్తరించింది. దీంతో చెప్పుల సేకరణ వేగం పెరిగి, వేల జతలు వచ్చి చేరుతున్నాయి.

**అవార్డులు...** సియా చేస్తున్న ఈ పనిని ప్రిన్సెస్ డయానా అవార్డునూ, డయానా లెగసీ అవార్డును వెంట వెంటనే పొందింది. దీని తర్వాత ఆమె తన పనిని అమెరికా, పశ్చిమ ఆఫ్రికాలకూ విస్తరించనుంది. 'ఒకరు మరొకరికి ఇలా సహాయం చేస్తే పేద పిల్లలు ఎవరూ చెప్పులు లేకుండా స్కూల్‌కు వెళ్లరు. పాదాలకు వచ్చే సమస్యలు దరి చేరవు' అని చెబుతోంది సియా.

యూత్ పల్స్

## రెడీ...సెట్...ప్లే

### వికాసం నుంచి విజ్ఞానం వరకు

**జ్ఞాపక శక్తికి పదునుపెట్టుకోవడానికి, పదసంపదను పెంచుకోవడానికి, సమస్యల పరిష్కారం విషయంలో బహుముఖ ప్రజ్ఞను సొంతం చేసుకోవడానికి రకరకాల డిజిటల్ బ్రెయిన్ గేమ్స్‌పై యువతరం ఆసక్తి ప్రదర్శిస్తుంది...**

బెంగళూరుకు చెందిన సహజకు చిన్న చిన్న రచనలు చేయడం అంటే ఇష్టం. భవిష్యత్‌లో రచయిత్రిగా పేరు తెచ్చుకోవాలనేది తన కోరిక. ఒక పుస్తకం ఆదరణ పొందాలంటే కాన్సెప్ట్‌తో పాటు భాష కూడా బాగుండాలి అనేది పద్దెనిమిది సంవత్సరాల సహజకు తెలియని విషయమేమీ కాదు. అందుకే తన పదసంపదను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. దీని కోసం 'వొకాబులరీ బిల్డర్' అనే గేమ్ యాప్‌ను సాధనంగా ఎంచుకుంది.

కాల్పనిక రచనల కోసం మాత్రమే కాదు, ఆకట్టుకునే భాషలో ఇ-మెయిల్స్ రాయడానికి, రకరకాల విషయాలపై వ్యాసాలు రాయడానికి యువతరం 'వొకాబులరీ బిల్డర్'ను ఉపయోగిస్తోంది.

'సూపర్‌బెటర్' అనేది రకరకాల సమస్యలను ఎదుర్కోవడానికి ధైర్యాన్ని ఇచ్చి, నైపుణ్యాలు పెంపొందించే ఆట. 'ఎవ్రీ వన్ హ్యాజ్ హీరోయిక్ పొటెన్షియల్' అనేది ఈ ఆట నినాదం.

'నువ్వు నీ గురించి అనుకున్నదాని కంటే బలవంతుడివి...అండగా నిలిచే ఆత్మీయులు నీకు బలమైన సైన్యమై ఉన్నారు...ఎందరికో నువ్వు రోల్ మోడల్‌వి...ఇలాంటి సానుకూల ఆలోచనల్లో నుంచి సమస్యలను జయించే శక్తి పుడుతుంది' అంటోంది 'సూపర్‌బెటర్'ను రూపొందించిన జేన్‌మెక్ గోనిగల్.

జేమ్‌మెక్ ఒకప్పుడు డిప్రెషన్ బారిన పడి అందులోంచి బయట పడింది. తాను కుంగుబాటు చీకటి నుంచి బయటపడిన విధానాన్ని ఒక ఆటగా మలిచి దీని గురించి తన బ్లాగ్‌లో రాసుకుంది. కొద్దికాలంలోనే బ్లాగ్‌లో నుంచి 'సూపర్‌బెటర్' రూపంలో డిజిటల్ ఆటగా మారింది.

న్యూరోసైంటిస్ట్‌ల సలహాల ఆధారంగా రూపొందించిన గేమ్... లుమినో సిటీ. ఈ గేమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వెంటనే 'మీరు ఎలాంటి స్కిల్స్ కోరుకుంటున్నారు?' అని అడుగుతుంది. కోరుకునే ఆప్షన్‌ని సెలెక్ట్ చేసుకోవచ్చు.

కొత్తగా ఆలోచించడానికి, ఒక సమస్యకు భిన్నమైన పరిష్కారాలు ఆలోచించడానికి ఉపకరించే ఇండి పజిల్ గేమ్ మాన్యుమెంట్ వ్యాలీ. ఈ గేమ్ యాప్ యాపిల్ డిజైన్, పాకెట్ గేమర్ 'గోల్డ్' అవార్డ్‌లను గెలుచుకుంది.

'మాన్యుమెంట్ వ్యాలీ' ప్రత్యేకత రిలాక్సింగ్ సౌండ్ ట్రాకింగ్, ఆకర్షణీయమైన డిజైన్.

సుడోకు ప్రేమికులను 'గుడ్ సుడోకు' ఆకట్టుకుంటోంది. 'పజిల్ ప్రేమికులకు ఇదొక ప్రేమలేఖ' అంటోంది కంపెనీ.

ఇక ఫన్‌మెథడ్ వీడియో గేమ్ 'బ్లాక్‌బాక్స్'లో డజన్ల కొద్దీ మినీ గేమ్స్ ఉంటాయి. 'ఎలివేట్'లో ప్రత్యేకమైన వర్కవుట్ క్యాలెండర్ ఉంటుంది. 'ఫన్ అండ్ క్లిక్' పద్ధతిలో దీన్ని రూపొందించారు... ఇలా చెప్పుకుంటూ పోతే యువతరాన్ని ఆకట్టుకుంటున్న బ్రెయిన్ ట్రైనింగ్ గేమ్స్ ఎన్నో ఉన్నాయి.


'బస్సు కోసం ఎదురుచూసే క్రమంలో టైమ్ వృథా అయ్యేది. ఇప్పుడు మాత్రం రకరకాల బ్రెయిన్ జిమ్ గేమ్స్ ఆడుతున్నాను. కొత్త ఉత్సాహం వస్తోంది' అంటున్నాడు ముంబైకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి సాకేత్.

'మా తాతయ్యకు సుడోకులాంటి పజిల్స్‌ను సాల్వ్ చేయడం అంటే ఇష్టం. ఆయన కాలక్షేపం కోసం పజిల్స్‌ను సాల్వ్ చేస్తున్నారనుకునేదాన్ని. పజిల్స్ సాల్వ్ చేసే ప్రక్రియ వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని తెలుసుకున్నాక వినోదంతో కూడిన బ్రెయిన్ ట్రైనింగ్ గేమ్స్‌పై ఆసక్తి పెరిగింది' అంటోంది చెన్నైకి చెందిన భార్గవి.



'మన జీవితమే పెద్ద పజిల్. చావు నుంచి పుట్టుక వరకు రకరకాల పజిల్స్‌ను పరిష్కరిస్తూనే ఉండాలి' అనేది తాత్వికత ధ్వనించే మాట అయితే కావచ్చుగానీ రోజువారి జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి. వ్యక్తిత్వ వికాసానికి డిజిటల్ బ్రెయిన్ గేమ్స్‌ను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటోంది యువతరం.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 11-1-2023



'నేను పెళ్లి చేసుకునే అబ్బాయి ఫలానా హీరోలా ఉండాలి'
'నాకు భార్య కావాలంటే ఆ అమ్మాయికి అదృష్టం ఉండాలి'
ఇలాంటి... డైలాగ్‌లు టీన్స్ నుంచి ట్వంటీస్ వరకు చెప్పేవే.
అమ్మానాన్నలు తెచ్చిన సంబంధాలు వాస్తవంలోకి తెచ్చేవి.
అనేకానేక రాజీలతో బాసికానికి తలవంచి ఏడడుగులు పడేవి.
అది ఒకప్పుడు... ఇప్పుడు కాలం మారింది. ట్రెండ్ మారింది.

కొత్తకాలంలో కట్నం కాలగర్భంలోకి కలిసిపోనుందా?
అయితే... ఇది మంచి పరిణామమే.
అమ్మాయి విద్య ఉద్యోగాలతో సాధికారత సాధించిందా?
అయితే... ఇది ఇంకా గొప్ప శుభపరిణామమే.
భాగస్వామి ఎంపికలో యువత ప్రాధాన్యాలెలా ఉన్నాయి?
ఇండియాలో పెళ్లిళ్లను ట్రంప్ ప్రభావితం చేస్తున్నాడా?
అధ్యక్షుడిగా ట్రంప్ పోయినా ట్రంప్ భయం ఇంకా ఉందా?

● పెళ్లిళ్ల సీజన్ వస్తోంది

# కొంగుముడి ఎప్పుడు?

'పెళ్లిలో పెళ్లి కుదరడం' ఒకప్పటి మాట. అంటే బంధువుల పెళ్లిలో పెళ్లి వయసుకు వచ్చిన అమ్మాయిలు, అబ్బాయిలు బంధువులందరి దృష్టిలో పడతారు. ఏం చదువుకున్నారు? ఉద్యోగం ఎక్కడ చేస్తున్నారు? వంటి వివరాలన్నీ కబుర్లలో భాగంగా బంధువులందరికీ చేరిపోయేవి. అబ్బాయికీ, అమ్మాయికీ బంధుత్వం కలిసే ఎవరో పెద్దవాళ్లు ఎవరో ఓ మాటగా అంటారు. మాటలు కలుపుకుంటారు. పెళ్లి కుదిరేది. శ్రావణమాసం పెళ్లిలో కలిసిన అమ్మాయి, అబ్బాయి విజయదశమి ముహూర్తాల్లో వధూవరులయ్యేవాళ్లు.

**మరి ఇప్పుడు...**

కాలం మారింది. ఎంతగా మారిందీ అంటే... బంధువులను కూడా ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్స్‌గా పలకరించుకునే తరం ఇది. దగ్గరి బంధువుల అమ్మాయి, అబ్బాయిల వివరాలు కూడా మ్యారేజ్ బ్యూరోల ద్వారా తెలుస్తున్న పరిస్థితి. సమాజంలో వచ్చిన ఈ మార్పుతోపాటు... జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో వచ్చిన మార్పు కూడా పెద్దదే. నుదుట బాసికాలు, మెడలో పూలదండలు ధరించకపోతే పెళ్లిపీటల మీద ఉన్న వాళ్లు వధూవరులా లేక కన్యాదాతలా అనే సందేహం కూడా ఎదురవుతుంటుంది. 'తొలి ప్రసవం కనీసం ముప్పై ఏళ్ల లోపు జరగడం శ్రేయస్కరం' అని వైద్యరంగం చెబుతూనే ఉంది. కానీ ఉన్నత విద్యావంతులైన అమ్మాయిలు పెళ్లికి సిద్ధమయ్యేటప్పటికే ముప్పయ్ దాటుతున్నాయి. ఆలస్యానికి కారణాలు ఒకటి-రెండు కాదు, అనేకం. భాగస్వామిని ఎంచుకోవడం పట్ల సమాజం ఎలా ఉందో తెలియాలంటే మ్యారేజ్ బ్యూరోతో మాట్లాడడం ఓ సులువైన మార్గం. హైదరాబాద్‌లోని అవినాష్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు కోటిరెడ్డి, జ్యోతి మ్యాట్రిమోనీ నిర్వాహకురాలు జొన్నలగడ్డ జ్యోతి, శ్రీకాకుళంలోని శ్రీసాయి నరసింహ సేవాసంఘం నిర్వహకులు కరణం నరసింగరావు, తిరుపతికి చెందిన సాయి మ్యాట్రిమోనీ నిర్వాహకురాలు పసుపులేటి శ్వేత అనేక ఆసక్తికరమైన విషయాలను సాక్షితో పంచుకున్నారు.

**ఇదీ నా స్టైల్ షీట్!**

''పెళ్లి కుదర్చడం అనేది ఓ యాభై ఏళ్ల కిందట ఉన్నంత సులభం కాదిప్పుడు. తెరిచిన పుస్తకంలా ఒకరికొకరు బాగా తెలిసిన వాళ్ల మధ్య వివాహం జరిగే రోజులు కావివి. ఖండాల అవతలి వ్యక్తులతోనూ పెళ్లిబంధం కలపాలి. ప్రేమ పెళ్లిళ్లను పక్కన పెడితే పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకునే వాళ్లే మా దగ్గరకు వస్తారు. వాళ్లు తమ గురించి ఏ వివరాలిస్తారో ఆ వివరాలనే అవతలి వాళ్లకు అందివ్వగలుగుతాం. ఈ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. వంద పెళ్లిళ్లలో ఒక్క పెళ్లి విఫలమైనా మేము ఎక్కడో లోపం చేశామేమో అనిపిస్తుంది.

నేను ఇరవై ఏళ్లుగా ఈ ఫీల్డులో ఉన్నాను. వేలాది మంది క్లయింట్‌లతో మాట్లాడాను. రెండువేలకు పైగా పెళ్లిళ్లు చేశాను. ఈ అనుభవంతో ఈ ప్రొఫెషన్‌ని సమగ్రంగా తీర్చిదిద్దుకోవడానికి నాకు నేనుగా కొన్ని నియమాలను రూపొందించుకున్నాను.

● అబ్బాయి, అమ్మాయి ఉద్యోగం, చదువు, ఆస్తిపాస్తుల గురించి ప్రశ్నావళిలో ఇచ్చిన వివరాలు వాస్తవమేనా అనే సందేహం కూడా కలుగుతుంటుంది. సమగ్రంగా విచారణ చేసుకున్న తర్వాతనే ముందడుగు వేయాలి. ఇలాంటి ఎంక్వయిరీ కూడా మ్యారేజ్ బ్యూరో చేసి పెట్టగలగాలి. అలాగే ఆధార్ నంబర్, శాలరీ సర్టిఫికేట్‌లు తీసుకునే నియమం బ్యూరోలకు ఉంటే అబద్ధాలతో పెళ్లి చేసుకోవచ్చనే దురాలోచనను మొగ్గలోనే అరికట్టవచ్చు.

● యువతీయువకులు భాగస్వామి ఎంపిక విషయంలో చాలా పర్టిక్యులర్‌గా ఉంటున్నారు. తమకు నచ్చిన అంశాలన్నీ ఒక వ్యక్తిలో రాశిపోసి ఉండడం సాధ్యం కాదని, మనం కోరుకున్న లక్షణాలతో ఓ వ్యక్తిని తయారు చేయలేమని, ఉన్న ఆప్షన్స్‌లో సెలెక్ట్ చేసుకోవడం మాత్రమే మనం చేయగలిగింది అని పెద్దవాళ్లు చెప్పట్లేదు. ఈ విషయంలో అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలు కొంత త్వరగా నిర్ణయం తీసుకుంటున్నారు'' అన్నారు కోటిరెడ్డి.

ఇన్ని వడపోతలు పూర్తయి పెళ్లి జరిగిన తర్వాత కూడా ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోననే ఆందోళన ఈ తరం తల్లిదండ్రులకు తప్పడం లేదు. అందుకే వైవాహిక బంధం బలపడే వరకు కొంత కనిపెట్టి ఉండాలి. గాడి తప్పుతున్నట్లు అనిపిస్తే సరి చేయడం వరకే ఉండాలి పెద్దవాళ్ల జోక్యం. పిల్లల జీవితంలోకి దూరిపోయి వాళ్ల జీవితాలను తామే జీవించాలనుకోకూడదు.

ఇప్పటి పేరెంట్స్ దాదాపు చదువుకున్న వాళ్లే. అబ్బాయి తల్లిదండ్రులకు కూడా కోడలు వచ్చి తమను చూసుకోవాలనే ఆంక్షల్లేవు. పెళ్లి చేసిన తర్వాత వాళ్ల కుటుంబం వాళ్లను దిద్దుకోమని నూతన దంపతులను వేరే ఇంట్లో ఉంచడానికే ప్రయత్నిస్తున్నారు. మరో ముఖ్యమైన సంగతి... తల్లిదండ్రులు వృత్తి వ్యాపారాల్లో రిటైరై ఉంటే, పిల్లల పెళ్లి బాధ్యత పూర్తయిన తరవాత తమకిష్టమైన లేదా సమాజహితమైన వ్యాపకాన్ని పెట్టుకోవాలి.

- వాకా మంజులారెడ్డి

### ట్రంప్ ప్రభావం

నేను పాతికేళ్లుగా వివాహవేదిక నడుపుతున్నాను. అప్పట్లో అమ్మాయి తల్లిదండ్రులైనా, అబ్బాయి తల్లిదండ్రులైనా అవతలి వారి కుటుంబ నేపథ్యాన్ని ప్రధానంగా గమనించేవారు. ఇప్పుడు డబ్బు, ఆస్తులు ప్రధానం అయ్యాయి. పాతికేళ్ల కిందట విదేశాల మోజు బాగా ఉండేది. పదవ తరగతి అమ్మాయికి కూడా యూఎస్ సంబంధాల కోసం ప్రయత్నించేవారు. ఈ ట్రెండ్ 1990- 2000 మధ్య బాగా ఉండేది. ఇప్పుడు అమ్మాయిలే చదువుకుని విదేశాలకు వెళ్తున్నారు. ఇప్పుడు చదువు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లిన అమ్మాయిలు, అలాగే అక్క, అన్న విదేశాల్లో ఉన్న అమ్మాయిలు మాత్రమే విదేశీ సంబంధాలు కోరుకుంటున్నారు. ట్రంప్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఇండియాలో ఉన్న అమ్మాయికి యూఎస్ అబ్బాయితో పెళ్లి చేసినవాళ్లు, అమ్మాయిని అమెరికా పంపించడానికి వీసా రాక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఇక్కడ కూడా మంచి ఉద్యోగాలున్నాయి కాబట్టి అమ్మాయి మా కళ్ల ముందే ఉంటుంది, ఇండియా సంబంధాలే చెప్పండి అంటున్నారు. అయితే అబ్బాయికి లక్ష రూపాయల జీతం ఉన్నా సరే 'ఏం సరిపోతుంది, ఇంకా పెద్ద జీతం ఉన్నవాళ్లను చెప్పండి' అంటున్నారు. పైగా 'మా అమ్మాయి సర్దుకుపోలేదు, కాబట్టి ఉమ్మడి కుటుంబం వద్దు' అనే నిబంధనలు ఎక్కువయ్యాయి. కట్నం అనేది పెద్ద విషయంగా చర్చకు రావడం లేదు. ఆడంబరాలు మాత్రం ఆకాశమే హద్దు అన్నంతగా పెరిగిపోయాయి. ఇక పెళ్లి వయసుదాటిపోతోందనే ఆందోళన అటు పేరెంట్స్‌లోనూ కనిపించడం లేదు, పెళ్లి చేసుకోవాల్సిన యువతీయువకుల్లోనూ కనిపించడం లేదు. ముప్పై సంవత్సరాలు దాటుతున్నా కూడా వయసును పట్టించుకోవడం లేదు.

- జొన్నలగడ్డ జ్యోతి



### మళ్లీ యూఎస్ క్రేజ్

పదేళ్లుగా ఈ వ్యాపకంలో ఉన్నాను. మొదట్లో అబ్బాయిలు కానీ అమ్మాయిలు కానీ నాలుగైదు సంబంధాలు చూసి నిర్ణయం తీసుకునేవారు. ఇప్పుడు నలభై- యాభై సంబంధాలు చూసినా కూడా నిర్ణయం తీసుకోవడం లేదు. వయసు మీరిపోతున్నా ఎవరికీ పట్టింపు ఉండడం లేదు. అబ్బాయిలైనా, అమ్మాయిలైనా భాగస్వామి కోసం బంగారాన్ని గీటుపెట్టినట్లు చూస్తున్నారు. అబ్బాయి క్యాప్ పెట్టుకున్న ఫొటో పంపిస్తే 'బట్టతల కావచ్చు, క్యాప్ లేని ఫొటోలు పంపించండి' అంటున్నారు అమ్మాయిలు. ఇక అబ్బాయిలు కూడా తాము యావరేజ్‌గా ఉన్నా సరే... అందమైన అమ్మాయి కావాలంటారు. అబ్బాయిలైనా కొంతవరకు రాజీపడుతున్నారు కానీ అమ్మాయిలు కచ్చితంగా ఉంటున్నారు. ఓ మంచి మార్పు ఏమిటంటే... కట్నం ప్రాధాన్యం లేని విషయమైపోయింది. అలాగే ట్రంప్ హయాంలో అమ్మాయి తల్లిదండ్రులు యూఎస్ సంబంధాలు వద్దనేవాళ్లు. ఇప్పుడు మళ్లీ యూఎస్ సంబంధాలకు క్రేజ్ పెరిగింది.

- శ్వేత పసుపులేటి

### లేటెస్ట్ ఫొటోలుండాలి!

మ్యారేజ్ బ్యూరోలో మేము ఒక ప్రశ్నావళిని సమగ్రంగా రూపొందించుకున్నాం. అబ్బాయి లేదా అమ్మాయితో స్వయంగా మాట్లాడతాం. సాధ్యమైతే బ్యూరోలోనే లైవ్ ఫొటో షూట్ చేయడం మంచిది. పేరెంట్స్ ఇచ్చే ఫైల్ ఫొటోలు కొన్ని సందర్భాల్లో బాగా పాతవి ఉంటాయి. ఫొటోలు ఉన్నట్లుగా లైవ్‌లో లేనట్లయితే అబ్బాయి అయినా అమ్మాయి అయినా డిజప్పాయింట్ అవుతారు. ఇక ఆ తర్వాత మిగిలిన ప్రత్యేకతలేవీ పరిగణనలోకి రావు.



- కోటిరెడ్డి

### నిర్ణయం వధూవరులదే!

అమ్మాయికి పెళ్లి చేయాలంటే... ఓ ఇరవై ఏళ్ల కిందట అబ్బాయి కుటుంబ నేపథ్యాన్ని ప్రధానంగా చూసేవారు. ఇప్పుడు చదువు, ఉద్యోగం మొదటి ప్రాధాన్యంలో ఉంటున్నాయి. ఉద్యోగంలో కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు తొలి ప్రాధాన్యం, ఆ తర్వాత గవర్నమెంట్ ఉద్యోగం ఉంటోంది. వ్యాపారం అనగానే 'రిస్క్ అవసరమా' అంటున్నారు. వ్యవసాయం అయితే ఇక నాలుగో ప్రాధాన్యంలోకి వెళ్లిపోయింది. కరోనా తర్వాత విదేశాలంటే భయపడుతున్నారు. అంతవరకు విదేశాలతో సంబంధం లేని వాళ్లు మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. వధువు అక్క లేదా అన్న యూఎస్, యూకేల్లో ఉన్న ఆ దేశంలో ఉన్న అబ్బాయికే మొగ్గు చూపుతున్నారు. ఇక డిమాండ్‌ల విషయానికి వస్తే... వరుని ఎంపిక విషయంలో అమ్మాయిలు చాలా కచ్చితంగా ఉంటున్నారు. ఎంతో కొంత రాజీ పడుతున్నది అబ్బాయిలే.

**చాదస్తం తగ్గింది**

ఒక్కమాటలో చెప్పాలంటే పెళ్లిని ఒకప్పుడు వధూవరుల తల్లిదండ్రులు కుదిర్చేవాళ్లు, ఇప్పుడు వధూవరులు స్వయంగా నిర్ణయం తీసుకుంటున్నారు (అరేంజ్‌డ్ మ్యారేజ్‌ల విషయంలో కూడా). ఇప్పుడు దాదాపుగా అందరూ ఇద్దరు పిల్లల తల్లిదండ్రులే. వాళ్లు కొడుకు, కూతురు ఇద్దరినీ చదివిస్తున్నారు. ఇద్దరినీ ఉద్యోగాలకు పంపిస్తున్నారు. ఆస్తిని దాదాపుగా సమంగా ఇస్తున్నారు. దీంతో కట్నం ప్రస్తావన ప్రధానంగా కనిపించడం లేదు. తల్లిదండ్రులు కూడా పరిణతి చెందారు. ఒకప్పటిలాగ కోడలు తెల్లవారు జామున లేచి ఇంటి పనులు చక్కబెట్టాలని, తాము నిద్రలేచే సరికి కాఫీ కప్పుతో సిద్ధంగా ఉండాలనే చాదస్తాల్లేవు. ఉద్యోగానికి వెళ్లాల్సిన అమ్మాయి ఇంటి పనుల్లోనే అలసిపోవాలని కోరుకోవడం లేదు. ఇక పిల్లలిద్దరికీ పెళ్లి చేసిన వెంటనే వాళ్ల ఇళ్లకు వెళ్లిపోయి పిల్లలతో కలిసి జీవించాలనుకోవడం లేదు. బాధ్యతలు పూర్తయిన తమ విశ్రాంత జీవనాన్ని ప్రశాంతంగా గడపడానికి ఇష్టపడుతున్నారు.



- కరణం నరసింగరావు

---

* స్టడీ



ప్రియదర్శిని కర్వే

గ్రీన్‌లైఫ్

# సముచిత పరిష్కారం

**శతకోటి సమస్యలకు అనంతకోటి పరిష్కారాలు ఉన్నాయట! మనం చేయాల్సిందల్లా... ఆ పరిష్కారాల గురించి ఆలోచించడం. చిన్నప్పుడు తనకు ఎదురైన సమస్యను దృష్టిలో పెట్టుకొని దానికి శాస్త్రీయ పరిష్కారాన్ని అన్వేషించింది ప్రియదర్శిని కర్వే. 'సముచిత ఎన్విరో టెక్'తో పర్యావరణ ప్రేమికులను ఆకట్టుకుంటోంది...**

చిన్నప్పుడు స్కూల్‌కు వెళుతున్నప్పుడు, వస్తున్నప్పుడు దారిలో తీయగా పలకరించే చెరుకుతోటలను చూసేది ప్రియదర్శిని. ఈ తీపిపలకరింపుల మాట ఎలా ఉన్నా తోటల్లో పంటవ్యర్థాలను దహనం చేసినప్పుడు నల్లటిపొగ చుట్టుముట్టేది. తోట నుంచి ఊళ్లోకి వచ్చి అక్కడ అందరినీ ఉక్కిరిబిక్కిరి చేసేది.

'ఈ సమస్యకు పరిష్కారం లేదా!' అనే ఆలోచన ఆమెతో పాటు పెరిగి పెద్దదైంది.

పుణెకు సమీపంలోని పల్తాన్ అనే చిన్న పట్టణానికి చెందిన ప్రియదర్శిని కర్వే సైంటిస్ట్ కావాలనుకోవడానికి, సైంటిస్ట్‌గా మంచిపేరు తెచ్చుకోవడానికి తన అనుభవంలో ఉన్న వాయుకాలుష్యానికి సంబంధించిన సమస్యలే కారణం.

కేంద్రప్రభుత్వం 'యంగ్ సైంటిస్ట్' స్కీమ్‌లో భాగంగా వ్యవసాయవ్యర్థాలకు అర్థం కల్పించే ప్రాజెక్ట్‌లో పనిచేసింది ప్రియదర్శిని.

ఇది తొలి అడుగుగా చెప్పుకోవచ్చు.

2004లో స్కాట్‌లాండ్‌లోని 'యూనివర్శిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్'లో బయోచార్ రిసెర్చ్ సెంటర్‌లో చేరింది. బయోమాస్ సాంకేతికతను లోతుగా అర్థం చేసుకోవడానికి ఈ రిసెర్చ్ సెంటర్ ఉపయోగపడింది. ఎంతో మంది ప్రముఖులతో మాట్లాడి, ఎన్నో విషయాలపై అవగాహన ఏర్పర్చుకునే అరుదైన అవకాశం దీని ద్వారా లభించింది.

'సముచిత ఎన్విరో టెక్' అనే కంపెనీ స్థాపించి పర్యావరణ అనుకూల వస్తువుల ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది ప్రియదర్శిని. తోటలోని చెట్ల వ్యర్థాలను తొలగించడం అనేది పెద్ద పని. చాలామంది ఆ వ్యర్థాలను ఒక దగ్గర చేర్చి మంట పెట్టి ఇబ్బందులకు గురవుతుంటారు. చుట్టుపక్కల వారిని ఇబ్బందులకు గురిచేస్తుంటారు.

ఈ నేపథ్యంలో 'సముచిత ట్రాన్స్‌ఫ్లాషన్ క్లీన్'తో అందరి దృష్టిని ఆకర్షించింది ప్రియదర్శిని. ఇది రివల్యూషనరీ డిజైన్‌గా పేరు తెచ్చుకుంది.

ఈ బాక్స్ బట్టీలో తోట వ్యర్థాలను వేసి, మంటపెట్టి మూత పెడతారు. అవి బయోచార్ ఇంధనంగా మారుతాయి.

ప్రియదర్శిని మరో ఆవిష్కరణ పొగరహిత కుక్కర్.

'వంటగది కిల్లర్' అనే మాట పుట్టడానికి కారణం అక్కడ నుంచి వెలువడే పొగతో మహిళలు రకరకాల ఆరోగ్యసమస్యలకు గురికావడం. కట్టెలు, బొగ్గు మండించి వంట చేయడం తప్ప వేరే పరిష్కారం కనిపించని పేదలకు ఈ పొగరహిత కుక్కర్ సరియైన పరిష్కారంగా కనిపించింది.

కొద్ది మొత్తంలో బయోచార్‌ని ఉపయోగించి దీనితో వంట చేసుకోవచ్చు. పొగకు పొగ పెట్టవచ్చు. ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

పట్టణ ప్రాంత ప్రజల కోసం 'కార్బన్ ఫుట్ ప్రింట్ క్యాలిక్యులేటర్'ను తయారుచేసిన ప్రియదర్శిని కర్వే కొత్త కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టడమే కాదు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. వీటివల్ల తనకు తెలిసిన విషయాలను స్థానికులతో పంచుకోవడమే కాదు తనకు తెలియని సమస్యల గురించి కూడా తెలుసుకొని వాటి పరిష్కారానికి ఆలోచన చేస్తోంది ప్రియదర్శిని కర్వే.

---

# వేతనం లేని పనికి గుర్తింపు ఉండదా?!

స్త్రీల ఇంటిపనికి ఎలాంటి గుర్తింపు, వేతనం ఉండదు. ఇదే విషయమై సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ప్రపంచవ్యాప్తంగా ఒక అధ్యయనం చేసింది. పేద, ధనిక దేశాలలోనూ ఈ విషయంలో అంతరాలనూ చూపించింది. గుర్తింపు లేని పని కారణంగా స్త్రీలలో పెరుగుతున్న మానసిక ఆరోగ్య సమస్యలు, ఇంటి పనితో పాటు ఉపాధి పొందుతున్న మహిళలపై పడుతున్న అధిక భారం గురించి కూడా చేసిన ఈ అధ్యయనం అన్నివర్గాల వారినీ ఆలోచింపజేస్తోంది.

ఇంటి పనులు, బాధ్యతలను సమతుల్యం చేయడం మహిళల నైతిక బాధ్యతగా అంతటా వాడుకలో ఉన్నదే. దీని వల్ల కలుగుతున్న నష్టాలనూ, భాగస్వామ్యంతో ఎలా సమన్వయం చేసుకోవాలో కూడా ఈ సంస్థ తెలిపింది.



**తేలిక భావన**

మహిళకు ఉదయం లేస్తూనే ఒక సాధారణ రోజుగా ప్రారంభమవుతుంది. ఊడవడం, తుడవడం, కడగడం, కుటుంబ సభ్యులకు భోజనం సిద్ధం చేయడం... ఈ రొటీన్ పనులన్నీ వీటిలో ఉండవచ్చు. వీటన్నింటి మధ్య వారు తమ భర్త లేదా పిల్లలు లేదా పెద్దలైన కుటుంబ సభ్యుల అవసరాలను చూస్తుంటారు. ఇక బయట ఉద్యోగం చేసే మహిళలైతే, ఇంటి పనులు పూర్తిచేయడంతో పాటు తమను తాము సిద్ధంగా ఉండటానికి సమయం కేటాయించాలి. ఆఫీస్ లోకి వచ్చాక ఆఫీస్ వర్క్‌తో ముడిపడి ఉండాలి. పిల్లలు స్కూల్‌కి వెళ్లాక, భర్త ఆఫీసుకు వెళ్లినప్పుడు గృహిణులు ఊపిరి పీల్చుకోవడం లేదు. చేయాల్సింది చాలా ఉంటుంది. ఇంటి పనులను చూసుకోవడం, చేయడం మహిళలు మాత్రమే చేయదగినపనిగా పరిగణించబడుతోంది. దీనిని దాదాపు అందరూ స్త్రీలను తేలికగానే తీసుకుంటారు. 'కాలక్రమేణా, వేతనంలేని శ్రమ కారణంగా పురుషుల కంటే స్త్రీలు మానసిక ఆందోళనకు గురవుతున్నార'ని హెల్త్ షాట్స్ సైకాలజిస్ట్ డాక్టర్ మాలినీ సబా తెలియజేస్తున్నారు.

**డబుల్ బైండ్**

ఇంటి యజమానులుగా గుర్తించే మగవారు కార్యాలయంలో పెద్దగా పనులు చేయనప్పటికీ వారు చాలా బిజీగా ఉంటారు. కానీ ఇంటిపని, పిల్లల సంరక్షణతో సహా వేతనంలేని పనికి ఉపాధి పొందుతున్న మహిళలు బాధ్యత వహిస్తారు. డాక్టర్ సబా ప్రకారం, 'గుర్తించబడని మహిళల శ్రమ రెండు రూపాలుగా ఆమెను సవాల్ చేస్తోంది. ఒకటి ఆమె శారీరక ఆరోగ్య సంరక్షణ తగ్గుతోంది. దీంతో పాటు మానసిక భారం అధికమవుతోంది.'

**అసమానతకు నిదర్శనం**

ప్రపంచవ్యాప్తంగా ఉపాధి, నిరుద్యోగ మహిళలు జీతం లేని పనికి ఎక్కువ గంటలు వెచ్చిస్తున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఈ ధోరణి మరీ ఎక్కువగా కనిపించింది. సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం 2021లో పురుషుల 59 అదనపు గంటలతో పోలిస్తే మహిళలు 173 అదనపు గంటలు చెల్లింపు లేని ఇంటిపని, పిల్లల సంరక్షణ బాధ్యతలను తీసుకున్నారు. దిగువ, మధ్య ఆదాయ దేశాలలో ఈ అంతరం మరింత పెరిగింది. ఈ దేశాలలో మహిళలు పురుషుల కంటే మూడు రెట్లు ఎక్కువ గంటలు ఇల్లు, పిల్లలను చూసుకున్నారు.

**భారాన్ని పెంచిన వర్క్ ఫ్రమ్ హోమ్**

ఇంటి నుండి ఆఫీసు పని చేయడం చాలా మంది మహిళల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసింది. మహిళలు వంట చేయడం, శుభ్రపరచడం, పిల్లలు, పెద్దవారిని చూసుకోవడం.. వంటి ఉదాహరణలెన్నో ఉన్నాయి. ఇంటి నుండి ఆఫీసు పని చేయడం అనేది చాలా మందికి కష్టతరమైనది. దాంతో ఎంతో సమయాన్ని కోల్పోతున్నారు. దీనివల్ల స్త్రీలకు ఏ విధమైన వినోదం, విశ్రాంతి లేదా కోలుకోవడానికి సమయం దొరకడం లేదు. శారీరక, మానసిక వేధింపుల కథనాలలో ఒకటైన వైద్యం అందుబాటులో లేకపోవడం కూడా సమతుల్యత దెబ్బతింటుంది. మహమ్మారి సమయంలో పరిమిత ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సంరక్షణ సవాళ్లు, పిల్లల సంరక్షణ లేకపోవడం వల్ల చాలా మంది మహిళలు తమ కుటుంబాలను చూసుకోవడం కోసం తమ వృత్తిని విడిచిపెట్టారని నిపుణులు గుర్తించారు. ఇది ముఖ్యంగా నెలవారీ తక్కువ ఆదాయం కలిగిన తల్లులలో ఎక్కువగా ఉంది.

### న్యాయమైన వాటా

పురుషులు ఇల్లు, పిల్లల పనుల్లోనూ వారి న్యాయమైన వాటాను తీసుకుంటే మహిళలపై చెల్లింపు లేని పని భారం తగ్గుతుంది. కలిసి పనులు చేసుకోవడంలోని అన్యోన్యత స్త్రీ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది వారి ఆదాయ వనరుల అవకాశాలను కూడా పెంచుతుంది. భావోద్వేగ ఒత్తిడి కూడా తగ్గుతుంది. పురుషులకు అనువైన ఏర్పాట్లను సాధారణం చేస్తే, పితృస్వామ్య, పెట్టుబడిదారీ డిమాండ్లను చర్చించడంలో స్త్రీలకు సమయం కలిసివస్తుంది.

---

### కిచెన్‌టిప్స్



● అవెన్‌లోని జిడ్డు, మరకలు పోవాలంటే అవెన్ చల్లబడిన తరువాత మరకలపై ఉప్పు నీటిని చల్లి తుడవాలి



● గిన్నె అడుగు మాడినప్పుడు దానిని ఎక్కువసేపు కష్టపడి తోమకుండా ఆ గిన్నెలో కొద్దిగా డిష్ సోప్ వేసి నీళ్ళు పోసి కొంచెం సేపు చిన్న మంట మీద ఉంచాలి. ఆ తరువాత కడిగితే బాగా శుభ్రపడుతుంది.

● గిన్నెలు తళతళ మెరవాలంటే తోమడానికి వాడే పొడికి గానీ, సబ్బుకి గానీ ఒకటి రెండు టేబుల్ స్పూన్ల వెనిగర్ కలపాలి. వెనిగర్ గిన్నెలపై ఉండే జిడ్డుని వదలగొట్టి మెరిసేలా చేస్తుంది.



● పచ్చి బఠాణి ఉడికించేటప్పుడు కొద్దిగా చక్కెర వేస్తే రంగు ఆకర్షణీయంగా ఉంటుంది. రుచి కూడా ఇనుమడిస్తుంది.



● చిన్న కప్పులో సోడా బై కార్బనేట్ వేసి ఫ్రిజ్‌లో ఒక పక్కగా ఉంచితే వంటల వాసనలను పీల్చుకుంటుంది. ఒక దాని తాలూకు వాసన మరొక దానికి పట్టదు.



● ఆకు కూరలను న్యూస్ పేపర్‌లో చుట్టి ఫ్రిజ్‌లో పెడితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.

● అరటికాయ చిప్స్ కరకరలాడాలంటే వేయించేటప్పుడు ముక్కల మీద ఉప్పు నీటిని చిలకరించాలి.





## రెండో రౌండ్‌లో రామ్‌కుమార్ జోడీ

అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్-2 టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)-రేయస్ వరేలా (మెక్సికో) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్-వరేలా ద్వయం 6-3, 7-6 (7/4)తో రాబిన్ హాస్-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్-వరేలా 14 ఏస్‌లు సంధించింది. రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.



## ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీటీసీ) ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. దోహాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11-2, 5-11, 2-11, 5-11, 13-11, 11-9, 11-8తో చెన్ జు యు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన మనిక బత్రా 13-11, 11-9, 11-6, 11-8తో చెంగ్‌జు జు (హాంకాంగ్)పై గెలుపొందగా... దియా చిటాలె, స్వస్తిక, రీత్ టెనిసన్ ఓడిపోయారు.

# గాయత్రి–ట్రెసా జాలీ జోడీ శుభారంభం



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు ఆశాజనక ఫలితాలు లభించలేదు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణప్రసాద్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-19, 21-14తో యంగ్ ఎన్గా టింగ్-యంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) ద్వయంపై గెలిచింది.

### తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, సైనా

మరోవైపు ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ 12-21, 21-17, 14-21తో హాన్ యుయె (చైనా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 10-21, 8-21తో వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్-కృష్ణప్రసాద్ ద్వయం 10-21, 18-21తో కాంగ్ మిన్ హుక్-సియో సెయంగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 19-21, 14-21తో ప్రపంచ 17వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. గతంలో నిషిమోటోపై ఐదుసార్లు నెగ్గిన శ్రీకాంత్ 2018 తర్వాత ఈ జపాన్ ప్లేయర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్ (స్పెయిన్) పీవీ సింధు; ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో మాళవిక... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్ తలపడతారు.

# హైదరాబాద్ 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో మంగళవారం జింఖానా మైదానంలో మొదలైన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (23; 4 ఫోర్లు), భగత్ వర్మ (11; 2 ఫోర్లు), అనికేత్ రెడ్డి (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/28), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/8) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 250 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌరాష్ట్ర 171 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి (3/74), రోహిత్ రాయుడు (2/20) రాణించారు.

# రాణించిన జ్ఞానేశ్వర్



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 203 పరుగులు సాధించింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (81; 14 ఫోర్లు), కెప్టెన్ విహారి (76 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

**తొలిసారి మహిళా అంపైర్లు...**

రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో మంగళవారం తొలిసారి మహిళా అంపైర్లు అంపైరింగ్ బాధ్యతలు చేపట్టారు. జంషెడ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్-జార్ఖండ్ మ్యాచ్ కు గాయత్రి వేణుగోపాలన్... సూరత్‌లో రైల్వేస్-త్రిపుర మ్యాచ్‌కు జననీ నారాయణన్... పొర్వోరిమ్‌లో పాండిచ్చేరి-గోవా మ్యాచ్‌కు వృందా రాఠి అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు.

# 'రూట్స్ కొలీజియం'తో జత కట్టిన హంపి



సాక్షి, బంజారాహిల్స్: 'రూట్స్ కొలీజియం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' సంస్థ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్, 2019 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేత కోనేరు హంపిని నియమించింది. తన కొత్త భాగస్వామ్యంపై హంపి మాట్లాడుతూ...'రూట్స్ కొలీజియంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. నా చెస్ అనుభవాలను, ఆలోచనలను ఇక్కడి విద్యార్థులతో పంచుకుంటాను. నాకు తెలిసిన అంశాలు వారికి ఏదో రూపంలో ఉపయోగపడాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించింది. ఈ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం చైర్మన్ బీపీ పడాల కూడా పాల్గొన్నారు.

# భారత్ 'టాప్'గేర్

- 'శత'క్కొట్టిన కోహ్లి
- రోహిత్, గిల్ దూకుడు
- తొలి వన్డేలో లంకపై 67 పరుగులతో భారత్ విజయం
- షనక సెంచరీ వృథా
- కోల్‌కతాలో రేపు రెండో వన్డే

**కొత్త ఏడాదిలో ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు దుమ్మురేపింది. సొంతగడ్డపై ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి భారీ విజయంతో సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ కోహ్లి స్వదేశంలో వన్డేల్లో మళ్లీ సెంచరీ కొట్టగా... రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ కూడా మెరిశారు. ఫలితంగా శ్రీలంకపై గెలుపుతో 'వరల్డ్‌కప్ నామ' సంవత్సరానికి టీమిండియా ఘనమైన ఆరంభాన్నిచ్చింది.**



కోహ్లి సెంచరీ అభివాదం

గువహటి: 'టాప్'ఆర్డర్ బ్యాటర్ల వీరవిహారం చేయడంతో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించి సిరీస్ లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (87 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (67 బంతుల్లో 83; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 70; 11 ఫోర్లు) చెలరేగారు. అనంతరం శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ దసున్ షనక (88 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. నిసాంక (80 బంతుల్లో 72; 11 ఫోర్లు) రాణించాడు.

**అదరగొట్టిన ఓపెనర్లు**

విశ్రాంతి తర్వాత ఈ ఏడాదిని ఆరంభించిన కెప్టెన్ రోహిత్ శర్మ మునుపటి 'హిట్‌మ్యాన్'లా ఆడాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించాడు. రజిత వేసిన ఏడో ఓవర్లో రోహిత్ 2 సిక్స్‌లు, ఒక బౌండరీతో 17 పరుగులు పిండుకున్నాడు. మదుషంక ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన గిల్ కూడా బాదడం మొదలు పెట్టడంతో లంక బౌలర్లకు కష్టాలు తప్పలేదు. దునిత్ 19వ ఓవర్లో గిల్ 4, 4, 4, 1 కొడితే ఆఖరి బంతిని రోహిత్ సిక్సర్‌గా బాదాడు. 20వ ఓవర్ వేసిన షనక... గిల్‌ను అవుట్ చేసి 143 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు.

**కోహ్లి కమాల్...**

గిల్ అవుటయ్యాక కోహ్లి రాగా... కాసేపటికే రోహిత్‌ని మదుషంక బౌల్డ్ చేశాడు. లంక హమ్మయ్య! అనుకునేలోపే మరో ధాటైన ఇన్నింగ్స్‌కు కోహ్లి శ్రీకారం చుట్టాడు. బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 47 బంతుల్లో (3 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 52, 81 పరుగుల వద్ద లైఫ్‌లు పొందిన కోహ్లి సెంచరీ దిశగా తనదైన శైలీ షాట్లతో అలరించాడు. 41వ ఓవర్లో భారత్ 300 మార్క్ చేరుకోగా, కోహ్లి 80 బంతుల్లో (10 ఫోర్లు, 1 సిక్స్) తన వన్డే కెరీర్‌లో 45వ సెంచరీ సాధించాడు. 2019 మార్చి 8న ఆస్ట్రేలియాపై రాంచీలో చివరిసారి స్వదేశంలో వన్డేల్లో కోహ్లి సెంచరీ చేశాడు. 49వ ఓవర్లో కోహ్లిని రజిత అవుట్ చేశాడు.

**లంకకు పేస్ దెబ్బ**

భారత సీమర్లు సిరాజ్, ఉమ్రాన్, షమీల పేస్ బౌలింగ్‌కు శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. నిసాంక బాధ్యతగా ఆడినప్పటికీ టాపార్డర్ బ్యాటర్స్



షనక

అవిష్క ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను సిరాజ్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో మిడిలార్డర్ వికెట్లను సీమర్లు కూల్చారు. 206 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకున్న లంకను కెప్టెన్ షనక ఆదుకున్నాడు. షనక టెయిలెండర్ రజిత (9 నాటౌట్)లో కలిసి తొమ్మిదో వికెట్ కు 100 పరుగులు జోడించారు.

**భారత్ క్రీడాస్ఫూర్తి**

ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన షమీ... సెంచరీకి రెండే పరుగుల దూరంలో ఉన్న షనక (98 వద్ద) మన్కడింగ్ చేశాడు. నిజానికి ఇది అవుటే! కానీ కెప్టెన్ రోహిత్... షమీ దగ్గరకొచ్చి వారించాడు. వెంటనే షమీ అంపైర్‌తో అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నాడు. దీంతో షనక ఐదో బంతికి ఫోర్ కొట్టి సెంచరీ సాధించగలిగాడు.

**9** శ్రీలంకపై అత్యధికంగా తొమ్మిది సెంచరీలు చేసిన బ్యాటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ (8) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు.

**20** స్వదేశంలో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా సచిన్ (20) పేరిట ఉన్న రికార్డును తాజా శతకంతో కోహ్లి (20 సెంచరీలు) సమం చేశాడు.

**స్కోరు వివరాలు**

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ (బి) మదుషంక 83; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 70; కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113; అయ్యర్ (సి) ఫెర్నాండో (బి) ధనంజయ 28; కేఎల్ రాహుల్ (బి) రజిత 39; పాండ్యా (సి) హసరంగ (బి) రజిత 14; అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నే 9; షమీ (నాటౌట్) 4; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1-143, 2-173, 3-213, 4-303, 5-330, 6-362, 7-364. **బౌలింగ్:** కసున్ రజిత 10-0-88-3, మదుషంక 6-0-43-1, హసరంగ 10-0-67-0, కరుణరత్నే 8-0-54-1, దునిత్ 8-0-65-0, షనక 3-0-22-1, ధనంజయ 5-0-33-1.

**శ్రీలంక ఇన్నింగ్స్:** నిసాంక (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 72; ఫెర్నాండో (సి) పాండ్యా (బి) సిరాజ్ 5; మెండిస్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 23; ధనంజయ (సి) రాహుల్ (బి) షమీ 47; షనక (నాటౌట్) 108; హసరంగ (సి) అయ్యర్ (బి) చహల్ 16; దునిత్ (సి) గిల్ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే (సి) రోహిత్ (బి) పాండ్యా 14; రజిత (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1-19, 2-23, 3-64, 4-136, 5-161, 6-178, 7-179, 8-206. **బౌలింగ్:** షమీ 9-0-67-1, సిరాజ్ 7-1-30-2, పాండ్యా 6-0-33-1, ఉమ్రాన్ 8-0-57-3, చహల్ 10-0-58-1, అక్షర్ 10-0-58-0.

# మా ఇల్లే పాన్ ఇండియా



శ్రుతీహాసన్

శ్రుతీహాసన్ ఏదీ ప్లాన్ చేయరు. సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. అయితే ఇన్నేళ్లు ఉండాలని ప్లాన్ చేయలేదు. సినిమాకి దూరం కాకూడదనుకుంటారు. అంతే.. ఇక బాబీ దర్శకత్వంలో చిరంజీవితో చేసిన 'వాల్తేరు వీరయ్య', గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణతో చేసిన 'వీరసింహారెడ్డి'తో ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారామె. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ఈ 12న, 13న 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కానున్నాయి. ఈ సందర్భంగా శ్రుతి చెప్పిన విశేషాలు..

● **రెండు చిత్రాలతో మీతో మీరే పోటీ పడటం ఎలా ఉంది?**

నిజానికి ఇది ఊహించలేదు. తొమ్మిదేళ్ల క్రితం నా రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. అయితే పండగప్పుడు కాదు. ఫెస్టివల్ టైమ్‌లో రెండు పెద్ద చిత్రా లతో.. ఇద్దరు లెజెండరీ (చిరంజీవి, బాలకృష్ణ) హీరోల సినిమాలతో రావడం ఆశీర్వాదం అనుకుంటున్నా.

● **రెండు సినిమాలూ హిట్టవ్వాలనే ఓ టెన్షన్ ఉంటుంది కదా...**

టెన్షన్ అనేది సెట్లో పని చేస్తున్నప్పుడు మాత్రమే. ఎక్స్‌ప్రెషన్ సరిగ్గా వచ్చిందా? లేదా డైలాగ్ బాగా చెప్పానా? లేదా అనే టెన్షన్ ఉంటుంది. సెట్ నుంచి బయటికొచ్చేస్తే టెన్షన్ ఉండదు. ఎందుకంటే మిగతాదంతా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది.

● **'వాల్తేరు..', 'వీరసింహా...'లలో ఏ సినిమాలో మీ పాత్ర బాగుంటుందనే పోలిక రావడం సహజం..**

నిజమే. అయితే రెండు సినిమాల కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ భిన్నంగా ఉంటాయి. నా పాత్రలు డిఫరెంట్‌గా, సవాల్‌గా ఉంటాయి. 'వీరసింహా..'లో నా పాత్ర కామెడీగా ఉంటుంది. కామెడీ చేయడం కష్టం. 'వాల్తేరు...'లో నా పాత్రని బాగా రాశారు.

● **చిరంజీవి, బాలకృష్ణలతో డ్యాన్స్ చేయడం...**

నైస్ ఎక్స్‌పీరియన్స్. 'వీరసింహారెడ్డి'లోని 'సుగుణసుందరి...' స్టెప్ బాగా రీచ్ అయ్యింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోని 'శ్రీదేవి... చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది.

● **ఒక పాట మంచి ఎండ (సుగుణ సుందరి)లో.. మరో పాట (నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరు) విపరీతమైన చలిలో చేసిన అనుభవం గురించి?**

ఇండియన్స్‌కి ఎండ సమస్య కాదు. కానీ చలి తట్టుకోవడం కష్టం. పైగా పల్చటి చీరలో మైనస్ 11 డిగ్రీల చలిలో చేయాల్సి వచ్చింది.

● ఈ విషయంలో హీరోయిన్లకే సమస్య. హీరోలు ఫుల్‌గా కవర్ చేసుకునే వీలు ఉంటుంది...

యూనిట్ అంతా నాలుగైదు లేయర్ల కోట్స్ వేసుకుంటే మేం చలిలో డ్యాన్స్ చేశాం (నవ్వుతూ). సార్ (చిరంజీవి) కూడా పెద్దగా కవర్ చేసుకోలేదు. ఒక కోట్.. అంతే.

● **'వీరసింహారెడ్డి' వేడుకలో పాల్గొన్న మీరు 'వాల్తేరు వీరయ్య' వేడుకలో పాల్గొనలేదు.. కారణం?**

ఆరోగ్యం బాగాలేదు. పూర్తిగా రికవర్ కాకపోవడంతో వేడుకకు వెళ్లలేకపోయా. ఐయామ్ సో సారీ.

● **ఆ మధ్య మీకు తెలుగులో గ్యాప్ వచ్చింది... ఇప్పుడు ఇద్దరు సీనియర్ హీరోలతో, యంగ్ హీరో ప్రభాస్‌తో 'సలార్'.. వరుసగా సినిమాలు చేయడం ఎలా ఉంది?**

మా ఇంట్లో మా అమ్మానాన్నని చూసి సినిమా అనేది ఫ్యామిలీ అనిపించింది. ఇక ఇండస్ట్రీ, ఆడియన్స్ పరంగా తెలుగు నాకు రియల్ ఫ్యామిలీ అంటాను. ఎందుకంటే సౌత్‌లో నేను పరిచయం అయింది తెలుగు సినిమాల ద్వారానే. ఒక కొత్త ప్రాంతంలో నాకు మంచి ఆహ్వానం దక్కింది. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. హిట్ ఇచ్చారు. 'క్రాక్' తర్వాత మళ్లీ తెలుగులో వరుసగా సినిమాలు చేయడం ఆనందంగా ఉంది.

**'పాన్ ఇండియా' ట్రెండ్ గురించి మీ అభిప్రాయం?**

నిజానికి నా లైఫ్ చూస్తే.. నేను పాన్ ఇండియన్‌ని (నవ్వుతూ). మా అమ్మ ముంబై (సారిక).. నాన్న (కమల్‌హాసన్) తమిళనాడు. మా డైనింగ్ టేబుల్ మీద మహారాష్ట్రియన్ ఫిష్ కర్రీ, చపాతి, సాంబార్, రైస్ అన్నీ ఉంటాయి. మాది ప్రాపర్ ఇండియన్ హోమ్. అమ్మ ముంబై నుంచి చెన్నై వెళ్లి తమిళ్ నేర్చుకున్నారు. మాట్లాడటం మాత్రమే కాదు.. రాయడం కూడా నేర్చుకున్నారు. నాన్న తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ, బెంగాలీ.. ఇలా చాలా భాషలు మాట్లాడతారు. ఇంట్లో హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మాట్లాడతాం. నా చిన్నప్పుడు ఒక సినిమా రిలీజ్ అంటే ముంబై, అట్నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్, లేకపోతే చెన్నై.. ఇలా వెళ్లేవాళ్లం. పాన్ ఇండియా కాన్సెప్ట్ అనేది నా మైండ్‌లో చిన్నప్పుడే ఉంది. అయితే బాలీవుడ్, టాలీవుడ్ అని పేరు వచ్చినప్పుడు మా నాన్న 'ఇండియన్ సినిమా అందాం. ఆ తర్వాత భాష గురించి మాట్లాడదాం' అనేవారు. నేను పుట్టి, పెరిగింది చెన్నైలోనే. కానీ హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. అట్నుంచి తెలుగుకి వచ్చాను. ఆ తర్వాతే తమిళ్‌కి పరిచయం అయ్యాను. చెప్పాలంటే 'మా ఇల్లే పాన్ ఇండియా'. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ అందరూ అన్ని సినిమాలూ చూడటం పాజిటివ్ విషయం.

**సంక్రాంతి ఎలా జరుపుకుంటారు?**

'సంక్రాంతి' అనే పదం నేను తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతే నా లైఫ్‌లోకి వచ్చింది. మాకు తమిళ్‌లో 'పొంగల్' అంటాం. పండగ రోజు పొంగలి వండుతాను. పూజ చేస్తాను. ఫ్యామిలీతో గడుపుతాను.

**గోపీచంద్ మలినేని మిమ్మల్ని లక్కీ హీరోయిన్ అంటారు. లక్‌ని మీరు నమ్ముతారా?**

లేదు.. హార్డ్ వర్క్‌ని, దేవుడిని నమ్ముతాను. ఒకవేళ ఎవరైనా నన్ను లక్కీ అంటే వాళ్లకు థ్యాంక్స్ చెబుతాను. అయితే నేను లక్, అన్‌లక్‌ని నమ్మను. ఎందుకంటే ఒకప్పుడు నన్ను 'అన్‌లక్కీ' అన్నారు. ఆ తర్వాత 'లక్కీ' అన్నారు. వేరేవాళ్లు నన్ను అలా అనడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను.

**సీనియర్ హీరోల సరసన సినిమా చేస్తే ఇక ఆ హీరోయిన్ సీనియర్ హీరోల సినిమాలకే అని ఫిక్స్ అవుతుంటారు. ఇలాంటి టైమ్‌లో ప్రభాస్‌లాంటి యంగ్ హీరోతో 'సలార్' చాన్స్ రావడం అడ్వాంటేజ్ అనుకుంటున్నారా?**

కథ, నా క్యారెక్టర్ మాత్రమే చూస్తాను. 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య' కథలు, నా పాత్రలు నచ్చాయి. ఫస్ట్ నుంచీ సినిమాని సినిమాగా చూసి, ఒప్పుకోవడం నాకు అలవాటు. అంతేకానీ వేరేవాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించి ఒప్పుకోను. నాకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చేస్తాను. 'సలార్' విషయానికి వస్తే.. నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టం. ప్రశాంత్ సార్ సినిమాలంటే ఇష్టం. ఆ పరంగా నేను హ్యాపీ. అది నాకు అడ్వాంటేజ్ అనుకుంటున్నాను.

సినిమా

## ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో...
# పది భారతీయ చిత్రాలు



ప్రతిష్ఠాత్మక 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మార్చి 12న జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 301 చిత్రాలు ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. వాటిలో ఇండియా నుంచి 10 సినిమాలు ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఉన్నాయి. తొలి జాబితాలో 'ఆర్‌ఆర్‌ఆర్' (తెలుగు), చెల్లో షో (గుజరాతీ), మీ వసంతరావ్ (మరాఠీ), తుజ్యా సాథీ కహా హై (మరాఠీ), ఇరవిన్ నిళల్ (తమిళ్)' వంటి చిత్రాలు ఇప్పటికే ఆస్కార్ నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా ఆస్కార్ అవార్డులకు పోటీపడేందుకు అవకాశం ఉన్న 301 చిత్రాల్లోని మిగతా జాబితాను అవార్డ్స్ కమిటీ మంగళవారం వెల్లడించింది. అందులో 'ది కశ్మీరీ ఫైల్స్' (హిందీ), 'గంగూబాయి కతియావాడి' (హిందీ), 'కాంతార' (కన్నడ), 'విక్రాంత్ రోణ' (కన్నడ), 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' (తమిళ్)' చిత్రాలు ఉన్నాయి. కాగా ఇండియా తరఫున గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' ఆస్కార్ బరిలో నిలుస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు ఓపెన్ కేటగిరీలో నిలిచాయి.

ఇక ఏయే సినిమా ఏయే విభాగంలో పోటీ పడుతుందనే విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్‌ఆర్‌ఆర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం (నాటు నాటు.. పాట)లో షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలోనూ 'ఆర్‌ఆర్‌ఆర్' షార్ట్‌లిస్ట్ అయిన సంగతి తెలిసిందే.

కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో 'కాంతార' ఎంపికైంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది.

అదే విధంగా సుదీప్ హీరోగా అనూప్ బండారి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'విక్రాంత్ రోణ', సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ చిత్రం 'గంగుబాయి కతియావాడి', వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన 'ది కశ్మీరీ ఫైల్స్' వంటివి ఉత్తమ చిత్రం కేటగిరీలో షార్ట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి.

నేటి నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు ఓటింగ్‌కు అవకాశం ఉంటుంది. షార్ట్ లిస్ట్‌లోని తుది నామినేషన్లను ఈ నెల 24న ప్రకటిస్తారు.

# పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది



**- ఎస్ఎస్ తమన్**

"పోటీ అనేది సినిమాల్లోనే కాదు.. ప్రతి చోటా ఉంటుంది. పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది. ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. అన్ని సినిమాలూ గొప్పగా ఆడాలి.. అందరూ బాగుండాలి" అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) రిలీజవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన తమన్ చెప్పిన విశేషాలు.

● బాలకృష్ణగారితో నేను చేసిన 'అఖండ' సినిమాతో 'వీరసింహారెడ్డి'కి పోలికే లేదు. ఇది కల్ట్ మూవీ. ఎమోషనల్, సిస్టర్ సెంటిమెంట్, బాలకృష్ణగారి మాస్.. ఇలా అన్ని అంశాలతో అదిరిపోతుంది. ● దర్శకుడు మంచి సినిమా తీస్తేనే నేను మంచి మ్యూజిక్ ఇవ్వగలను. ఒక సినిమాకి పునాది దర్శకుడే. బాలకృష్ణగారి అభిమానిగా గోపీచంద్ చాలా గొప్పగా తీశారు.. దాని వల్లే నాకూ మంచి మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం వచ్చింది. సినిమా ఏం కోరుకుంటుందో అది ఇవ్వడమే మన పని. ఇందులో 'జై బాలయ్య, సుగుణ సుందరి, మాస్ మొగుడు..' వంటి పాటలన్నీ చక్కగా కుదిరాయి. మాస్ సినిమాలో కూడా కథ నుండే ట్యూన్ పుడుతుంది. ● 'అఖండ'లో మ్యూజిక్‌కి స్పీకర్లు పగిలిపోయాయి. 'వీరసింహారెడ్డి'లోనూ స్పీకర్లు పగులుతాయి జాగ్రత్త అని ముందే చెప్పాను. బాలకృష్ణగారిని చూస్తేనే ఎక్కువ వాయించేయాలనిపిస్తుంది (నవ్వుతూ). చాలా రోజుల తర్వాత సెకండ్ హాఫ్‌లో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లతో అదరగొట్టే సినిమా ఇది. పాప్‌కార్న్ తినే టైమ్ కూడా ఉండదు.. సినిమాని చూస్తూనే ఉంటారు. ● ఈ సంక్రాంతికి విడుదలవుతున్న చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' రెండూ గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను.

# వినరో... విష్ణు తత్త్వం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పర్దేశీ జంటగా మురళీ కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు మాట్లాడుతూ– "ఈ సినిమా కథ చెప్పినప్పుడే టైటిల్ చెప్పాడు మురళీ కిషోర్. నేను కథ మొత్తం విన్నాక 'ఇందులో ఏమైనా దేవుడి ఎలిమెంట్ ఉందనుకుంటున్నారా?' అని అడిగాడు. విష్ణు తత్త్వం ఇంత క్లారిటీగా కనిపిస్తోంది కదా! అన్నాను. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయపడే విధానాన్ని చాలా కమర్షియల్‌గా చెప్పినందుకు మురళికి థ్యాంక్స్" అన్నారు. "ఈ సినిమా మాది అనుకుని పని చేసిన టీమ్‌కి థ్యాంక్స్" అన్నారు మురళీ కిషోర్. "గీతా ఆర్ట్స్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చిన బన్నీ వాసుగారికి థ్యాంక్స్" అన్నారు కిరణ్ అబ్బవరం.



● కశ్మీరా, కిరణ్ అబ్బవరం

# నా కల తీరుతోంది



**- సంతోష్ శోభన్**

"నాన్న (శోభన్) దర్శకత్వంలో ప్రభాస్ అన్న నటించిన 'వర్షం' సినిమా 2004లో సంక్రాంతికి విడుదలై హిట్ అయింది. నా సినిమాని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసుకోవాలనేది నా కల.. 'కల్యాణం కమనీయం' చిత్రంతో అది తీరుతోంది" అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– "ఈ సంక్రాంతికి బిగ్ స్టార్స్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. నేను కూడా 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు' చిత్రాలు చూస్తాను. నా సినిమా కాబట్టి 'కళ్యాణం కమనీయం' నాకు మరింత స్పెషల్. పెళ్లైన ఓ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగింది? అనేది 'కల్యాణం కమనీయం' కథ. యూవీ క్రియేషన్స్‌లో మూడు చిత్రాలు చేశాను.. మరో ముప్పై చేసేందుకైనా సిద్ధం. నా లైఫ్‌లో పేరున్న దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీలాంటి వారితో సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను" అన్నారు.

సాక్షి
# బిజినెస్
బుధవారం
11-1-2023

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 632 | 187 |
| 60,115 | 17,914 |

**విదేశీ సూచీలు** (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 10,681 | ▲ | 45 |
| డోజోన్స్ | 33,566 | ▲ | 48 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,694 | ▲ | 30 |
| డాక్స్ | 14,775 | ▽ | 18 |
| షాంఘై | 3,170 | ▽ | 7 |
| నికాయ్ | 26,176 | ▲ | 202 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## బులియన్ (రూ.లలో)

**ముంబై**

| | |
|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | |
| 55,974 | ▽285 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | |
| 55,750 | ▽284 |
| వెండి (కిలో) | |
| 67,629 | ▽1,162 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒక్కటి | 81.53 | 83.20 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒక్కటి | 98.56 | 101.94 |
| € | యూరో | ఒక్కటి | 86.86 | 89.96 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒక్కటి | 61.47 | 63.48 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒక్కటి | 55.72 | 58.13 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒక్కటి | 60.86 | 62.85 |
| SAR | సౌదీ రియాల్ | ఖామస్టక్ | 20.81 | 22.49 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఖామస్టక్ | 21.37 | 23.17 |
| ¥ | చైనా యువాన్ | ఖామస్టక్ | 10.95 | 12.97 |

## లాట్ మొబైల్స్ మెగా ఆఫర్స్



హైదరాబాద్: నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ పర్వదినాలను పురస్కరించుకుని ప్రముఖ లాట్ మొబైల్స్ మెగా ఆఫర్స్‌ను ప్రకటించింది. సంస్థ డైరెక్టర్ ఎం.అఖిల్, బ్రాండ్ అంబాసిడర్ రష్మిక మందాన ఈ ఆఫర్లను ఆవిష్కరించారు. ప్రతి స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై గిజ్మోర్ బ్లేజ్ ప్రో స్మార్ట్ కాలింగ్ వాచ్, టోరెటో స్మార్ట్ బ్లూమ్-3 స్మార్ట్ వాచ్, స్మార్ట్ బ్లూటూత్ నెక్ బాండ్ లభించనున్నట్లు ఈ సందర్భంగా విడుదలైన ప్రకటనలో అఖిల్ తెలిపారు. 32 అంగుళాల స్మార్ట్ టీవీ ధరపై 40 అంగుళాల టీవీ ఆఫర్ కూడా ఉందని పేర్కొన్నారు. రూ.8999కే స్మార్ట్ టీవీ, రూ16,500కే లాప్ టాప్స్ ఆఫర్ అమల్లో ఉందన్నారు. స్మార్ట్ మొబైల్స్ కొనుగోలుపై రూ.10,000 వరకూ క్యాష్ బ్యాక్, జీరో వడ్డీ, వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు, 70 శాతం వరకూ అష్యూర్డ్ పే బ్యాక్, టీవీ, ఏసీ, రిఫ్రిజిరేటర్‌లకు 6 నెలల ఉచిత సర్వీస్, పలు ఆఫర్లను అందుబాటులో ఉంచినట్లు అఖిల్ వివరించారు.

## బీఎండబ్ల్యూ కొత్త కారు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ బీఎండబ్ల్యూ ఇండియా.. కొత్త 3 సిరీస్ గ్రాన్ లిమజిన్ మోడల్‌ను భారత్‌లో ప్రవేశపెట్టింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.57.9 లక్షల నుంచి ప్రారంభం. 2 లీటర్ ఫోర్ సిలిండర్ ఇంజన్‌తో డీజిల్, పెట్రోల్ వేరియంట్లలో లభిస్తుంది. పెట్రోల్ వేరియంట్ గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 6.2 సెకన్లలో, డీజిల్ వేరియంట్ 7.6 సెకన్లలో అందుకుంటుంది. దేశీయంగా ఈ కారును తయారు చేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 11-1-2023 | |
|---|---|
| విశాఖ | 565-00 |
| చిత్తూరు | 568-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 556-00 |
| విజయవాడ | 556-00 |
| రిటైల్ ధర (డజను) | 78.00 |
| **10-1-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 556-00 |
| వరంగల్ | 558-00 |
| రిటైల్ ధర | 6.10 |

## బీవోబీ రుణ రేటు పెంపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) నిధుల సమీకరణ వ్యయ ఆధారిత (ఎంసీఎల్‌ఆర్) రుణ రేటును 35 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెంచింది. దీనితో ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధానమైన రుణ రేట్లు మరింత పెరగనున్నాయి. కొత్త రేటు జనవరి 12వ తేదీ నుంచి అమలవుతుంది. బ్యాంక్ తాజా నిర్ణయంతో ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 7.50 శాతం నుంచి 7.85 శాతానికి చేరింది. నెల, మూడు, ఆరు, ఏడాది రేట్లు వరుసగా 8.15 శాతం, 8.25 శాతం, 8.35 శాతం, 8.50 శాతాలకు పెరిగాయి. పలు వాహన, వ్యక్తిగత, గృహ రుణాలకు ఏడాది రుణ రేటు అనుసంధానమై ఉండే సంగతి తెలిసిందే. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లు సోమవారం రుణ రేటను 25 బేసిస్ పాయింట్లు పెంచిన సంగతి తెలిసిందే.

**ఐఓబీ డిపాజిట్ల రేట్లు అప్**

కాగా, చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న ప్రభుత్వ రంగం ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబీ)రిటైల్ డిపాజిట్ రేటును తక్షణం అమల్లోకి వచ్చే విధంగా 45 బేసిస్ పాయింట్లు పెంచింది. దీని ప్రకారం 444 రోజుల కాలానికి డిపాజిట్లపై 7.75 శాతం రేటు అమలవుతుంది. ఫారిన్ కరెన్సీ డిపాజిట్ రేటును కూడా మంగళవారం నుంచి బ్యాంక్ 1% పెంచింది. దీనితో ఈ రేటు 5 శాతానికి చేరింది.

## కార్లయిల్ చేతికి వీఎల్‌సీసీ

### మెజారిటీ వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం కార్లయిల్.. సౌందర్యం, చర్మసంరక్షణ కంపెనీ వీఎల్‌సీసీలో మెజారిటీ వాటాను సొంతం చేసుకుంది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. 1989లో వందన, ముకేశ్ లూత్రా ఏర్పాటు చేసిన వీఎల్‌సీసీ స్కిన్‌కేర్, బ్యూటీ, వెల్‌నెస్ విభాగాలలో కార్యకలాపాలు విస్తరించింది. బ్రాండెడ్ స్కిర్ కేర్ ప్రొడక్టులతోపాటు ప్రత్యేకించిన బ్యూటీ, వెల్‌నెస్ సర్వీసులను అందిస్తోంది. కాగా.. సంబంధిత వర్గాల సమాచారం మేరకు డీల్ విలువ 30 కోట్ల డాలర్లు (రూ.2,453 కోట్లు)గా తెలుస్తోంది. భారత్‌పై కార్లయిల్ విశ్వాసానికి తాజా పెట్టుబడులు నిదర్శనమని సంయుక్త ప్రకటనలో కార్లయిల్, వీఎల్‌సీసీ పేర్కొన్నాయి.

# మళ్లీ మార్కెట్ల పతనం

- సెన్సెక్స్ 632 పాయింట్లు డౌన్
- ఇంట్రాడేలో 60,000 దిగువకు
- 187 పాయింట్లు పడిన నిఫ్టీ
- 18,000 దిగువన ముగింపు



ముంబై: షార్ట్ కవరింగ్‌తో ముందురోజు ర్యాలీ చేసిన దేశీ స్టాక్ మార్కెట్లు తిరిగి పతన బాట పట్టాయి. సెన్సెక్స్ 632 పాయింట్లు కోల్పోయి 60,115 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 809 పాయింట్లవరకూ జారి 59,938కు చేరింది. ఇక నిఫ్టీ సైతం 187 పాయింట్లు పడిపోయి 17,914 వద్ద స్థిరపడింది. వెరసి సాంకేతికంగా కీలకమైన 18,000 స్థాయిని కోల్పోయింది. బ్యాంకింగ్ కౌంటర్లతోపాటు ఇతర బ్లూచిప్స్‌లో ఊపందుకున్న అమ్మకాలు మార్కెట్లను దెబ్బతీశాయి. అయితే డాలరుతో మారకంలో వరుసగా రెండో రోజు దేశీ కరెన్సీ పుంజుకోవడం గమనార్హం! యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమీ పావెల్ ప్రసంగించనున్న నేపథ్యంలో మార్కెట్లలో తాజా అమ్మకాలు నమోదైనట్లు మెహతా ఈక్విటీస్ రీసెర్చ్ విశ్లేషకులు ప్రశాంత్ తాప్సీ పేర్కొన్నారు. గత వారం చివర్లో వరుసగా మూడు రోజులు దేశీ స్టాక్ మార్కెట్లు క్షీణపథంలో సాగిన విషయం విదితమే.

**విదేశీ ఎఫెక్ట్**

నేటి(10న) ట్రేడింగ్‌లో యూరోపియన్ మార్కెట్లు నేలచూపులకే పరిమితంకావడం, అంతకుముందు యూఎస్, ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియడంతో సెంటిమెంటు బలహీనపడినట్లు కొటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ రిటైల్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ పేర్కొన్నారు. దేశీ ఇన్వెస్టర్లు విదేశీ అంశాలకు ప్రభావితమైనట్లు తెలియజేశారు. సెన్సెక్స్ దిగ్గజాలలో ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎన్‌టీపీసీ, ఐటీసీ, ఆర్‌ఐఎల్, టెక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్ ప్రధానంగా నష్టపోయాయి. అయితే టాటా మోటార్స్, పవర్ గ్రిడ్, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎంఅండ్‌ఎం బలపడ్డాయి. ముందురోజు అక్టోబర్-డిసెంబర్(క్యూ3) ఫలితాలు ప్రకటించిన టీసీఎస్ 1 శాతం వెనకడుగు వేసింది.

**చిన్న షేర్లు డీలా**

బీఎస్‌ఈలో టెలికం, సర్వీసులు, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, టెక్నాలజీ, కమోడిటీస్, రియల్టీ రంగాలు 1.6-0.7 శాతం మధ్య క్షీణించాయి. మరోవైపు మెటల్, హెల్త్‌కేర్, ఆటో, ఆయిల్- గ్యాస్ స్వల్పంగా బలపడ్డాయి. మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 0.5 శాతం స్థాయిలో డీలా పడ్డాయి. ట్రేడైన షేర్లలో 2189 నష్టపోగా.. 1329 లాభపడ్డాయి. సోమవారం రూ. 203 కోట్ల విలువైన షేర్లను విక్రయించిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) మరో రూ. 2,109 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. దేశీ ఫండ్స్(డీఐఐలు) మాత్రం రూ. 1,807 కోట్లను ఇన్వెస్ట్ చేశాయి.

**స్టాక్ హైలైట్స్**

- ఈ ఏడాది తొలి అర్ధభాగంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు ప్రకటించిన ష్నీడర్ ఎలక్ట్రిక్ ఇన్‌ఫ్రా షేరు 14 శాతం దూసుకెళ్లి ఏడేళ్ల గరిష్టం రూ. 203కు చేరింది.
- క్యూ3లో జేఎల్‌ఆర్ హోల్‌సేల్ అమ్మకాలు ఊపందుకోవడంతో టాటా మోటార్స్ షేరుకి డిమాండ్ పెరిగింది. పతన మార్కెట్లోనూ 6 శాతం జంప్‌చేసి రూ. 413 వద్ద ముగిసింది.
- సెర్బియన్ సంస్థ నోవెలిక్‌లో 54 శాతం వాటా కొనుగోలు వార్తలతో సోనా కామ్‌స్టార్ షేరు 6 శాతం జంప్‌చేసి రూ. 448 వద్ద ముగిసింది.

## రెండో రోజూ రూపీ దూకుడు

**61 పైసలు అప్ • 81.74 వద్ద ముగింపు**

డాలరుతో మారకంలో వరుసగా రెండో రోజు దేశీ కరెన్సీ దూకుడు ప్రదర్శించింది. గత రెండు నెలల్లోలేని విధంగా 61 పైసలు జంప్‌చేసి 81.74 వద్ద ముగిసింది. బాండ్ల విభాగం నుంచి పెట్టుబడులు లభించనున్న అంచనాలు రూపాయికి బలాన్నిచ్చినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 82.20 వద్ద హుషారుగా ప్రారంభమైంది. సోమవారం ముగింపు 82.35 కాగా ఒకదశలో 81.72 వరకూ ఎగసింది.

# దేశవ్యాప్తంగా ఫ్రాంక్లిన్ ఈవీ

- రూ.50 కోట్లతో కంపెనీ విస్తరణ
- డిసెంబర్‌కల్లా 200 షోరూంలు



కోరోతో నవీన్, రంజిత్ (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ కంపెనీ ఫ్రాంక్లిన్ ఈవీ దేశవ్యాప్తంగా డిసెంబర్‌కల్లా 200 షోరూంలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కంపెనీ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, వైజాగ్, విజయవాడ తదితర 30 నగరాల్లో 54 షోరూంలను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోనే 14 షోరూంలు ఉన్నాయి. 2021లో అమ్మకాలను ప్రారంభించి రెండేళ్లలోనే 6,000 పైచిలుకు కస్టమర్లకు చేరువయ్యామని ఫ్రాంక్లిన్ ఈవీ ఫౌండర్ డాక్టర్ శశిధర్ కుమార్ మంగళవారమిక్కడ తెలిపారు.

**నెలకు 3,000 యూనిట్లు..**

కొత్తగా ఫ్రాంచైజీ కోసం 30 మంది ఔత్సాహికులతో చర్చలు జరుగుతున్నాయని కో-ఫౌండర్ రంజిత్ కుమార్ తెలిపారు. 'నేపాల్, బంగ్లాదేశ్, ఆఫ్రికాకు ఎగుమతులు చేస్తున్నాం. ఇతర దేశాల్లో అడుగు పెడతాం. 2023 చివరికల్లా నెలకు 3,000 యూనిట్ల అమ్మకాల స్థాయికి చేరాలన్నది లక్ష్యం. ఇందుకు రూ.50 కోట్లతో విస్తరణ చేపడుతున్నాం. కంపెనీలో పెట్టుబడికి ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఉన్నారు. హైదరాబాద్‌లో ప్లాంటు ఉంది' అని చెప్పారు.

**తొలి డ్యూయల్ బ్యాటరీ..**

కోరో మోడల్‌కు డిమాండ్ బాగుందని కో-ఫౌండర్ నవీన్ కుమార్ తెలిపారు. 'దక్షిణాదిన రిమూవబుల్ డ్యూయల్ బ్యాటరీతో తయారైన తొలి మోడల్ ఇదే. ఒకసారి చార్జింగ్‌తో 200 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. పవర్ ప్లస్, నిక్స్ డీలక్స్ మోడళ్లు సైతం మార్కెట్లో ఉన్నాయి. ఏప్రిల్‌కల్లా మరో 2 స్కూటర్లను ప్రవేశపెడతాం. కస్టమర్ల ఇంటి వద్దే సర్వీస్ అందిస్తున్నాం. 2.1-3 కిలోవాట్ లిథియం అయాన్, లిథియం ఫాస్ఫేట్ రిమూవబుల్ బ్యాటరీలను పొందుపరిచాం. వీటికి ఐక్యాట్-ఏఐఎస్ 156, బీఐఎస్, సీఈ, ఐఎస్‌వో, ఆర్‌వోహెచ్‌ఎస్ ధ్రువీకరణ ఉంది. ధర రూ.75 వేల నుంచి ప్రారంభం' అని చెప్పారు.

## ఐపీవోకు సైయంట్ డీఎల్‌ఎం




- రూ. 740 కోట్లు సమీకరణ
- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్ తయారీ సేవల (ఈఎంఎస్) సంస్థ సైయంట్ డీఎల్‌ఎం పబ్లిక్ ఇష్యూకు (ఐపీవో) వస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రాస్పెక్టస్ ముసాయిదాను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి దాఖలు చేసింది. దీని ప్రకారం ఐపీవో ద్వారా రూ. 740 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఈ నిధులను మూలధనం, రుణాల చెల్లింపు, ఇతర సంస్థల కొనుగోలు తదితర అవసరాల కోసం వినియోగించుకోనుంది. ఈ ఇష్యూలో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) మార్గంలో షేర్ల విక్రయం ఉండదు. పూర్తిగా కొత్త షేర్లను జారీ చేయనున్నారు. ప్రీ-ఐపీవో ప్లేస్‌మెంట్ రౌండులో రూ. 148 కోట్ల వరకు విలువ చేసే షేర్లను జారీ చేసే అవకాశం ఉంది. ఐటీ ఇంజనీరింగ్ సేవల సంస్థ సైయంట్‌కు ఇది అనుబంధ సంస్థగా ఉంది. దీనికి హైదరాబాద్, బెంగళూరు, మైసూర్‌లో తయారీ ప్లాంట్లు ఉన్నాయి.

## ఐటీ హార్డ్‌వేర్ కోసం పీఎల్‌ఐ స్కీము

### కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వెల్లడి

హైదరాబాద్: మొబైల్ ఫోన్ల విభాగం తరహాలోనే ఐటీ సర్వర్, ఐటీ హార్డ్‌వేర్‌కు కూడా ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్‌ఐ) పథకాన్ని త్వరలో ప్రవేశపెట్టబోతున్నట్లు కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. అలాగే ఐటీ పీఎల్‌ఐలో దేశీయంగా డిజైన్ చేసిన మేథో సంపత్తిని తమ ఉత్పత్తుల్లో వినియోగించే తయారీదారులకు అదనంగా ప్రోత్సాహకాలు కూడా ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు.

వీఎల్‌ఎస్‌ఐ డిజైన్ కాన్ఫరెన్స్ 2023లో వర్చువల్‌గా పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. కొత్త తరం యాప్స్‌ను తయారు చేసే దిశగా ఐపీ, సాధనాలు, డివైజ్‌లను రూపొందించే స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేసేందుకు 200 మిలియన్ డాలర్ల ఫ్యూచర్ డిజైన్ ప్రోగ్రామ్‌ను కేంద్రం ప్రకటించిందని మంత్రి వివరించారు. గ్లోబల్ డిజిటలైజేషన్‌లో కొత్త ఆవిష్కరణలకు సెమీకండక్టర్ల తోడ్పాటు అనే అంశంపై అయిదు రోజులపాటు ఈ సదస్సు జరగనుంది.

**భవిత**

• ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# జాబ్ పాయింట్

### తెలంగాణ పురపాలక శాఖలో 78 అకౌంటెంట్ పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ).. జూనియర్, సీనియర్ అకౌంటెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 78
» **పోస్టుల వివరాలు:** అకౌంట్స్ ఆఫీసర్ (యూఎల్‌బీ)-01, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్(యూఎల్‌బీ)-13, సీనియర్ అకౌంటెంట్(యూఎల్‌బీ)-64.
» **అర్హత:** బీకాం ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ఏవో పోస్టులకు రూ.45,960 నుంచి రూ.1,24,150, జేఏవో పోస్టులకు రూ.42,300 నుంచి రూ.1,15,270, ఎస్‌ఏ పోస్టులకు రూ.32,810 నుంచి రూ.96,890 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్) పేపర్-1, పేపర్-2, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 20.01.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2023
» **పరీక్ష తేది:** ఆగస్ట్ 2023.
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

### తెలంగాణ కళాశాల, సాంకేతిక విద్యలో 71 లైబ్రేరియన్ పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ).. లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 71
» **పోస్టుల వివరాలు:** లైబ్రేరియన్(కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్)-40, లైబ్రేరియన్ (కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్)-31.

**అర్హత:**

» **లైబ్రేరియన్(కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్):** 50% మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేట్(లైబ్రరీ సైన్స్)డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **లైబ్రేరియన్(కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్):** మాస్టర్స్ డిగ్రీ(లైబ్రరీ సైన్స్/ ఇన్ఫర్మేషన్ సైన్స్/డాక్యుమెంటేషన్ సైన్స్)తోపాటు జాతీయ స్థాయి పరీక్షలో అర్హత సాధించి ఉండాలి. లేదా మాస్టర్స్ డిగ్రీతోపాటు నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)/స్లెట్/సెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు లైబ్రేరియన్‌కు(ఇంటర్ విద్య) రూ.54,220 నుంచి రూ.1,33,630, లైబ్రేరియన్(సాంకేతిక విద్య)-లెవల్-9ఎ రూ.56,100, లెవల్-10 రూ.57,700.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్) పేపర్-1, పేపర్-2, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.01.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.02.2023
» **పరీక్షతేది:** మే/జూన్/2023
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

### తెలంగాణ జిల్లా కోర్టుల్లో 77 ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 77
» **జిల్లాల వారీగా ఖాళీలు:** భద్రాద్రి కొత్తగూడెం-05, కోర్టు ఆఫ్ ద ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి ఫర్ సీబీఐ కేసెస్, హైదరాబాద్-01, సిటీ సివిల్ కోర్టు, హైదరాబాద్-11, జోగులాంబ గద్వాల-03, జగిత్యాల-05, జయశంకర్ భూపాలపల్లి-04, కామారెడ్డి-02, కొమరం భీమ్ ఆసిఫాబాద్-01, మంచిర్యాల-04, మేడ్చల్-మల్కాజగిరి-07, మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు, హైదరాబాద్-01, ములుగు-01, నాగర్ కర్నూల్-03, నారాయణపేట-03, పెద్దపల్లి-02, రాజన్న సిరిసిల్ల-02, రంగారెడ్డి-10, సిద్దిపేట-04, సూర్యాపేట-03, వికారాబాద్-02, వనపర్తి-01, యాదాద్రి భువనగిరి-02.
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణతతోపాటు స్థానిక భాషలు తెలిసి ఉండాలి. నిర్ణీత విద్య, సాంకేతిక అర్హతల కంటే ఎక్కువ అర్హత ఉన్న అభ్యర్థులు, ధ్రువపత్రాల పరిశీలన సమయంలో సంబంధిత పత్రాలను అందజేయాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.24,280 నుంచి రూ.72,850 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** సీబీటీ/ఓఎమ్మార్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్షా విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)/ఓఎమ్మార్ పరీక్షలో 100 ప్రశ్నలుంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగంలో 60, జనరల్ ఇంగ్లిష్ విభాగంలో 40 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 11.01.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** మార్చి 2023
» **వెబ్‌సైట్:** tshc.gov.in

# ఒక్క పరీక్షతో.. 54 వర్సిటీల్లో ప్రవేశం

» సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలకు సీయూఈటీ-యూజీ
» మే 21 నుంచి 31 వరకు సీయూఈటీ-యూజీ పరీక్షలు
» రెండు స్లాట్లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష
» ఏప్రిల్ మొదటి వారంలో నోటిఫికేషన్!

**ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీల్లో డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకుంటే.. సీయూఈటీ యూజీ(సెంట్రల్ యూనివర్సిటీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్)లో అర్హత సాధించాలి. గత ఏడాది నుంచి ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఒకే ఒక్క పరీక్షతో 54 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందొచ్చు. 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి మే 21 నుంచి 31 వరకు సీయూఈటీ యూజీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. సీయూఈటీ-యూజీతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, ప్రవేశ ప్రక్రియ గురించి తెలుసుకుందాం..**


సీయూఈటీ-యూజీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో ప్రతిభ ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న 54 సెంట్రల్ యూని వర్సిటీల్లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశానికి సీయూఈటీ-యూజీ స్కోర్ ప్రామాణికం. కేంద్రీయ విశ్వవిద్యాలయాల తోపాటు టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్), ఎన్‌ఐటీ యూనివర్సిటీ, బీఎంఎల్ ముంజాల్ యూని వర్సిటీ తదితర మరో 50కు పైగా డీమ్డ్, ప్రైవేట్ వర్సిటీలు కూడా సీయూఈ టీ-యూజీ స్కోర్ ఆధారంగానే గతేడాది ప్రవేశాలు కల్పించాయి.

**50 శాతం మార్కులు తప్పనిసరి!**

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు, 2023 ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సీయూఈటీ యూజీకి దరఖాస్తు చేసుకోవచ్చు. సీయూఈటీ-యూజీకి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత సరిపోతుందని ఎన్‌టీఏ వర్గాలు పేర్కొన్నాయి. కానీ.. పలు సెంట్రల్ యూనివర్సిటీలు మాత్రం ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులు తప్పనిసరి అంటున్నాయి. కాబట్టి విద్యార్థులు ముందుగానే ఆయా వర్సిటీల ప్రవేశ అర్హతల నిబంధనలపై స్పష్టత ఏర్పరచుకోవాలి.

**గత ఏడాది 44 వర్సిటీలు**

సీయూఈటీ-యూజీ స్కోర్ ఆధారంగాగతేడాది 44 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు కల్పించారు. యూజీసీ తాజా గణాంకాల ప్రకారం-సెంట్రల్ యూనివర్సిటీల సంఖ్య 54కు పెరిగింది. అంటే.. ఈ ఏడాది విద్యార్థులకు మరిన్ని సీట్లు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఏపీలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, సాంస్క్రిట్ యూనివర్సిటీ, తెలంగాణలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లు ఉన్నాయి.




**రెండు స్లాట్లు.. మూడు సెక్షన్లు**

- గతేడాది సీయూఈటీ-యూజీ పరీక్షను రెండు స్లాట్లలో, మూడు విభాగాలుగా నిర్వహించారు. మొదటి స్లాట్ 3:15 గంటలు; రెండో స్లాట్ 3:45 గంటల వ్యవధిలో జరిగింది. 2023కి సంబంధించి కూడా ఇదే విధానంలో పరీక్ష ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**స్లాట్-1 పరీక్ష విధానం**

- స్లాట్-1లో సెక్షన్-1ఎ(లాంగ్వేజెస్), సెక్షన్-2 (డొమైన్ సంబంధిత సబ్జెక్టులు)లలో 50 ప్రశ్నలకుగాను 40 ప్రశ్నలకు సమాధానం గుర్తించాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు 5 మార్కులు కేటాయిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక విధానంలోనే ఉంటాయి.
- సెక్షన్-3 జనరల్ టెస్ట్‌లో 75 ప్రశ్నలకు గాను 60 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ప్రతి ప్రశ్నకు 5 మార్కులు కేటాయించారు. నెగెటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు.

**స్లాట్-2 పరీక్ష విధానం**

- రెండో స్లాట్‌లో సెక్షన్-1బి(లాంగ్వేజెస్)కి సంబంధించి.. సెక్షన్1ఎలో ఎంచుకున్న భాష కాకుండా వేరే భాషను ఎంచుకోవాల్సి ఉంటుంది.
- రెండో స్లాట్‌లో లాంగ్వేజెస్ విభాగాలు (సెక్షన్-1ఎ, 1బి), డొమైన్ సంబంధిత సబ్జెక్ట్ విభాగం (సెక్షన్-2) మాత్రమే ఉంటాయి. స్లాట్-1లో పేర్కొన్న సెక్షన్-3(జనరల్ టెస్ట్) స్లాట్-2లో ఉండదు. రెండు స్లాట్స్‌లోనూ డొమైన్ సంబంధిత సబ్జెక్ట్ విషయంలో అభ్యర్థులు డిగ్రీలో తాము చేరదల చుకున్న కోర్సుకు సంబంధించిన సబ్జెక్ట్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది.

**ఆసక్తికి ప్రాధాన్యం**

- అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ స్లాట్‌కు, ఏ విభాగాలకు హాజరవ్వాలనుకుంటున్నారో తెలియజేయాల్సి ఉంటుంది.
- తాము డిగ్రీలో చేరదలచుకున్న కోర్సు ఆధారంగా డొమైన్ స్పెసిఫిక్ సబ్జెక్ట్‌ను ఎంచుకోవచ్చు.
- డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌లు 27 అందుబాటులో ఉన్నాయి. మొదటి స్లాట్‌లో గరిష్ఠంగా రెండు, రెండో స్లాట్‌లో గరిష్ఠంగా నాలుగు డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌లకు హాజరయ్యే అవకాశముంది.

**గరిష్ఠంగా 9 టెస్ట్‌లు**

- అభ్యర్థులు తమ ఆసక్తి మేరకు గరిష్ఠంగా తొమ్మిది టెస్ట్‌లకు హాజరవ్వచ్చు.
- సెక్షన్-1ఎ, 1బి లాంగ్వేజ్ టెస్ట్‌ల నుంచి రెండు లాంగ్వేజ్‌లు, సెక్షన్-2లో గరిష్ఠంగా ఆరు డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌లు, సెక్షన్-3 జనరల్ టెస్ట్.
- సెక్షన్-1ఎ,1బిలు కలిపి గరిష్ఠంగా మూడు లాంగ్వేజ్‌లు, సెక్షన్-2(డొమైన్ సబ్జెక్ట్) నుంచి గరిష్ఠంగా 5 డొమైన్ సబ్జెక్ట్‌లు, సెక్షన్-3 జనరల్ టెస్ట్.
- అభ్యర్థులు ఈ రెండు విధానాల్లో ఆసక్తి ఉన్న విధానాన్ని దరఖాస్తు సమయంలో పేర్కొంటే.. దాని మేరకు పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు.
- స్లాట్-1 పరీక్షలో సెక్షన్-1ఎ నుంచి గరిష్ఠంగా ఒక లాంగ్వేజ్ టెస్ట్, సెక్షన్-2 (డొమైన్ సంబంధిత సబ్జెక్ట్)లో గరిష్ఠంగా రెండు సబ్జెక్ట్‌లు, సెక్షన్-3 జనరల్ టెస్ట్‌కు మాత్రమే అవకాశం ఉంటుంది. ఒక్కో విభాగానికి 45 నిమిషాలు చొప్పున గరిష్ఠంగా 195 నిమిషాలు(3:15 గంటలు) సమయం అందుబాటులో ఉంటుంది.
- స్లాట్-2లో సెక్షన్-1ఎ, బి నుంచి ఒక లాంగ్వేజ్, సెక్షన్-2లో గరిష్ఠంగా నాలుగు డొమైన్ సంబంధిత సబ్జెక్ట్ టెస్ట్‌లు లేదా.. సెక్షన్-1ఎ,బి నుంచి రెండు లాంగ్వేజెస్, సెక్షన్-2 నుంచి మూడు డొమైన్ సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు. అంటే..స్లాట్-2లో అభ్యర్థుల ఆసక్తి మేరకు గరిష్ఠంగా అయిదు టెస్ట్‌లకు హాజరవ్వచ్చు.

**సెక్షన్-1ఎ లాంగ్వేజ్‌లు**

- ఇంగ్లిష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాళం, మరాఠి, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ.
- **సెక్షన్-1బి లాంగ్వేజ్‌లు:** అరబిక్, బోడో, చైనీస్, డోంగ్రి, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్, కాశ్మీరీ, కొంకణి, మైథిలి, మణిపురి, నేపాలి, పర్షియన్, సంథాలి, సింధి, స్పానిష్, టిబెటిన్, సంస్కృతం.

**డొమైన్ సబ్జెక్ట్‌లు**

- మొత్తం 27 డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌లలో పరీక్ష నిర్వహిస్తారు. అవి.. • అకౌంటెన్సీ/బుక్ కీపింగ్ • బయాలజీ/బయలాజికల్ స్టడీస్/ బయోటెక్నాలజీ/బయో కెమిస్ట్రీ • బిజినెస్ స్టడీస్ • కెమిస్ట్రీ • కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్ • ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్ • ఇంజనీరింగ్ గ్రాఫిక్స్ • ఎంట్రప్రెన్యూర్‌షిప్ • జాగ్రఫీ/జియాలజీ • హిస్టరీ • హోమ్ సైన్స్ • నాలెడ్జ్ ట్రెడిషన్ అండ్ ప్రాక్టీసెస్ ఆఫ్ ఇండియా • లీగల్ స్టడీస్ • ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ • మ్యాథమెటిక్స్ • ఫిజికల్ ఎడ్యుకేషన్/ఎన్‌సీసీ/యోగా • ఫిజిక్స్ • పొలిటికల్ సైన్స్• సైకాలజీ • సోషియాలజీ • టీచింగ్ ఆప్టిట్యూడ్ • అగ్రికల్చర్ • మాస్ మీడియా/ మాస్ కమ్యూనికేషన్ • ఆంత్రోపాలజీ • ఫైన్ ఆర్ట్స్/విజువల్ ఆర్ట్స్ • పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ • సంస్కృతం.

**ఈ అంశాలపై ప్రశ్నలు**

- సెక్షన్-1ఎ, 1బి లాంగ్వేజ్‌లలో రీడింగ్ కాంప్రహెన్షన్, సంబంధిత లాంగ్వేజ్‌లో లిటరరీ ఆప్టిట్యూడ్, వొకాబ్యులరీలలో నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి.
- సెక్షన్-2లోని డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌ల విషయంలో ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పుస్తకాల ఆధారంగా ఆయా సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- సెక్షన్-3 జనరల్ టెస్ట్‌లో.. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ నైపుణ్యాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి.




TALK TO TOYOTA FOR ENQUIRIES & FEEDBACK CONTACT TOLL FREE NO. 1800-309-0001 DIRECT NO.: +91-80-4585-9000
UNMATCHED WARRANTY* 3 years / 100000 kms *Conditions apply
TOYOTA TRUST

**TELANGANA:** Hyderabad: Harsha Toyota (Kondapur, LB Nagar, Quthbullapur), Ph: 040-44374437; Fortune Toyota (Tolichowki), Ph: 7799817000; Mody Toyota (Karkhana), Ph: 8096012222; Karimnagar: Kakatiya Toyota (Godavarikhani Bypass Road), Ph: 7032200007; Mahbubnagar: Harsha Toyota (Palakonda Village), Ph: 040-44374437; Nalgonda: Harsha Toyota (Narketpally), Ph: 040-44374437; Nizampet: Harsha Toyota (Nizampet), Ph: 040-44374437; Warangal: Kakatiya Toyota (Khammam Bypass Road), Ph: 7032200007. **ANDHRA PRADESH:** Anantapur: Harsha Toyota (Loluru Cross), Ph: 8008516633; Guntur: Lakshmi Toyota (Auto Nagar), Ph: 7331100607; Kadapa: Harsha Toyota (Chinnachowk Village), Ph: 9160481037; Kakinada: Pruthvi Toyota (Pithapuram), Ph: 9996665420; Kurnool: Harsha Toyota (Mamidalapadu), Ph: 8008301876; Nellore: Harsha Toyota (Kakutur Village), Ph: 9704567165; Ongole: Lakshmi Toyota (Throvagunta Center), Ph: 7331100717; Tirupati: Harsha Toyota (Renigunta), Ph: 9652255019; Vijayawada: Lakshmi Toyota (Prasadam Padu), Ph: 7331100579; Visakhapatnam: Mody Toyota (MVP Colony), Ph: 8688311102; Rajahmundry: Pruthvi Toyota (Gandhipuram), Ph: 9996665420.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.